ఈనాడు
విజయవాడ 23-12-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 133
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


MARUTI SUZUKI ARENA
VICTORIS
GOT IT ALL
SCAN AND CONNECT TO
A SHOWROOM NEAR YOU
E-BOOK TODAY AT
WWW.MARUTISUZUKI.COM
CONTACT US AT 1800-102-1800
Applicable T&C available at your nearest dealership. Creative visualization. Car colour may vary due to printing on paper. Images used are for illustration purposes only. Features may vary by model/conditions.
VICTORIS




ఈనాడు



విజయవాడ 23-12-2025 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 133 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



₹2,434 కోట్లు మూలుగుతున్నాయ్!

- రాష్ట్రంలో మనుగడలో లేని బ్యాంకు ఖాతాలు కోటిపైనే
- వాటిలో భారీగా పేరుకుపోయిన నగదు నిల్వలు
- ఖాతాదారులకు అందించేందుకు ఆర్‌బీఐ కసరత్తు

ఈనాడు, ఒంగోలు: వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన మనుగడలో లేని బ్యాంకు ఖాతాల్లో రూ. వంద కోట్లకు పైగా సొమ్ములున్నాయి.. జిల్లా అధికారులు ఆ నగదును తీసుకుంటే.. స్థానిక అవసరాలకు వినియోగించుకోవచ్చని ఇటీవల కలెక్టర్ల సదస్సులో ఆర్థిక శాఖ అధికారులు.. సీఎం చంద్రబాబుకు నివేదించారు. వాటిని తీసుకొని, మీ జిల్లాల్లో వినియోగించుకోండని సీఎం కలెక్టర్లకు సూచించారు. ఈ తరహా మనుగడలో లేని ప్రజల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోనూ భారీగా నగదు నిల్వలు మూలుగుతున్నాయి. ఏదైనా బ్యాంకు ఖాతాలో రెండేళ్ల పాటు లావాదేవీలు చేయకుంటే, అది స్తంభిస్తుంది. ఈ-కేవైసీ చేస్తే.. బ్యాంకు స్థాయిలోనే దాన్ని పునరుద్ధరిస్తారు. పదేళ్ల పాటు పట్టించుకోకుంటే బ్యాంకు అధికారులు ఆ ఖాతాలో ఉన్న మొత్తాన్ని రిజర్వు బ్యాంకులోని డిపాజిటర్స్ ఎడ్యుకేషన్, ఎవేర్‌నెస్ ఫండ్ (డెఫ్)కు జమ చేస్తారు. ఇలా బ్యాంకు ఖాతాలు, బీమా పరిహారం, పింఛన్లు, పండ్లు.. ఇతరత్రా క్లెయిమ్ చేయని నగదు దేశవ్యాప్తంగా రూ.1.84 లక్షల కోట్లు ఆర్‌బీఐ వద్ద పేరుకుపోయాయి.

ఆర్బీఐ ప్రత్యేక కార్యాచరణ

డెఫ్‌కు జమైన ప్రజల డబ్బును వారికి అప్పగించాలని ఆర్బీఐ ప్రత్యేక కార్యాచరణ ప్రకటించడంతో బ్యాంకులు.. అలాంటి ఖాతాలను గుర్తించి, ఖాతాదారులకు సమాచారం ఇస్తున్నాయి. మనుగడలో లేనివి (అన్‌ఆపరేటివ్), ఖాతాదారు చనిపోవడంతో కుటుంబ సభ్యులు పట్టించుకోనివి (అన్ క్లెయిమ్డ్) కేటగిరీలకు చెందిన వాటి పాస్‌పుస్తకాలు, ఇతర వివరాలు లేకున్నా.. ఆర్బీఐ వైట్‌సైట్‌లో తెలుసుకోవచ్చని (మిగతా 3లో)



రాష్ట్రంలో ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి వినియోగంలో లేని ఖాతాల్లో నగదు వివరాలు

	ఖాతాల సంఖ్య	నగదు (రూ.కోట్లలో)
వ్యక్తిగతమైనవి	1,19,43,648	1,917.27
సంఘాలకు చెందినవి	3,50,468	369.61
ప్రభుత్వానివి	1,20,330	147.51
మొత్తం	1,24,14,446	2,434.39

ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు మే 12 నుంచి

ముందుగానే ఉమ్మడి పరీక్షల షెడ్యూల్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి

ఈనాడు, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం ఇంజినీరింగ్ ప్రవేశాలకు సంబంధించి ఈఏపీసెట్‌ను మే 12 నుంచి నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి కార్యదర్శి తిరుపతిరావు తెలిపారు. రోజుకు రెండు చొప్పున 10 విడతల్లో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను ఈసారి ముందుగానే విడుదల చేశారు. ప్రవేశ పరీక్షలు, కౌన్సెలింగ్‌ను త్వరగా (మిగతా 3లో)



భారత్‌కు వీసా సేవల్ని నిలిపివేసిన బంగ్లా

కారు బాంబు పేలుడులో.. రష్యా కీలక జనరల్ మృతి

లోపలి పేజీలో

క్రైస్తవుల భద్రత, గౌరవానికి

భంగం కలగనివ్వం

- అందరి కోసం పనిచేసే ప్రభుత్వం మాది
- 24వ తేదీ సాయంత్రంలోగా పాస్టర్ల పెండింగ్ వేతనాలు జమ
- ఇందుకోసం రూ.51 కోట్లు
- అసంపూర్తిగా ఉన్న క్రిస్టియన్ భవన్ నిర్మాణం పూర్తి చేస్తాం
- సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు – అమరావతి



సెమీ క్రిస్మస్ వేడుకల్లో బిషప్ గోరంట్ల జాన్వేష్‌కు కేక్ తినిపిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

క్రైస్తవుల భద్రత, గౌరవానికీ ఎట్టిపరిస్థితుల్లోనూ భంగం కలగనివ్వబోమని సీఎం చంద్రబాబు స్పష్టంచేశారు. ప్రతి మతాన్నీ గౌరవిస్తామని, కూటమి ప్రభుత్వం అందరి కోసం పనిచేస్తుందన్నారు. క్రైస్తవుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని వెల్లడించారు. పేదరికం లేని సమాజం చూడాలని నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకుసాగుతున్నామని, అందరి ఆదాయం, ఆరోగ్యం, ఆనందం కోసం పనిచేస్తున్నామని పేర్కొన్నారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని కేక్ కట్ చేశారు. క్యాండిల్ వెలిగించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

జీసస్ సందేశం అందరికీ మార్గనిర్దేశనం

'ప్రపంచంలోనే అతిపెద్ద పండుగ క్రిస్మస్. ఏసుక్రీస్తు జన్మించిన రోజు మనందరికీ పండుగ రోజు. ప్రపంచానికి ప్రేమ, (మిగతా 3లో)

అమరావతిలో ఆధునిక సాంస్కృతిక కేంద్రం

నేడు సీఎం క్వాంటమ్ టాక్

నకిలీ మద్యానికి చెక్ పెట్టేలా 'లిన్' 2లో

❝ ఆ పార్టీ వాళ్ల పేర్లు చెప్పడం కూడా ఇష్టం లేదు. అదొక రౌడీల సమూహం అనిపిస్తుంటుంది నాకు. వారి విధానాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుంటే వారితో గొడవ పెట్టుకునేందుకూ సిద్ధమే. రాజ్యాంగ పరిధిలో సిద్ధాంతపరంగా పోరాటం చేస్తాం. కాదు, కూడదు అంటే చొక్కా మడిచి ముందుకు వస్తాం.

– పరోక్షంగా వైకాపాను ఉద్దేశించి పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు



భయం వద్దు.. మళ్లీ ఆ పాలన రాదు

- నా గొంతులో ప్రాణం ఉండగా రాష్ట్ర సమగ్రతను దెబ్బతీయనివ్వను
- ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతమయ్యే వరకూ కూటమి
- ఆ పాలనకు మన పాలనకు తేడా ఉండాలి
- రాష్ట్రంలో శాంతిభద్రతలు ముఖ్యం
- భయపడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ప్రజలు కానీ.. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇతర అధికారులు కానీ ఎవరూ భయపడాల్సిన పని లేదని, మళ్లీ వాళ్లు (వైకాపా) అధికారంలోకి రారని, అలాంటి పరిస్థితులు రాబోవని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు రాష్ట్ర సమగ్రతకు భంగం రానీయబోనని, ఇందుకు ఎన్ని ఎత్తులైనా వేస్తానని వెల్లడించారు. పాత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. అధికారులు ఎవరి బెదిరింపులకూ భయపడకుండా శాంతిభద్రతలను కాపాడాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు (మిగతా 11లో)

గోవిందా.. 50 కిలోల బంగారం మాయం!

తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి వారి విమాన గోపురం పనుల్లో మాయాజాలం

30 విగ్రహాలు ధ్వంసం

వైకాపా పాలనలో మరో కుంభకోణంపై విజిలెన్స్ విచారణ



విమాన గోపుర పనులు చేస్తున్నప్పటి చిత్రం

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుమల కొండపైనే కాదు.. కొండ కిందా వైకాపా హయాంలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఒక వైపు తిరుమలలో పరకామణిలో చోరీ, కల్తీ నెయ్యి, వస్త్రాల కొనుగోళ్లలో అవినీతి అంశాలపై విచారణ జరుగుతుండగా.. తాజాగా తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి వారి విమాన గోపురం పనుల్లో 50 కిలోల బంగారం మాయమైందనే ఆరోపణలపై విజిలెన్స్ విభాగం లోతుగా విచారణ జరుపుతోంది. 30 విగ్రహాలు ధ్వంసమైన విషయం కూడా తెరపైకి వచ్చింది.

బంగారు తాపడం పనుల పేరుతో..


తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. వైకాపా హయాంలో 2022-23 మధ్యకాలంలో ఈ ఆలయ విమాన గోపురానికి (మిగతా 3లో)

వచ్చే నెల 8 నుంచి విజయవాడలో

ఆవకాయ్-అమరావతి సాంస్కృతిక ఉత్సవాలు

తెలుగు సినిమా, సాహిత్యం, కళల వైభవం చాటి చెప్పేలా కార్యక్రమాలు

మంత్రి దుర్గేష్



ఉత్సవాల లోగో

తెలుగు సినిమా, సాహిత్యం, కళల వైభవాన్ని చాటిచెప్పేలా విజయవాడ వేదికగా జనవరి 8 నుంచి 10 వరకు మూడు రోజులపాటు ఆవకాయ్-అమరావతి సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పర్యాటకశాఖ, టీమ్‌వర్క్ ఆర్ట్స్ సంయుక్తంగా కృష్ణా నది ఒడ్డున పున్నమి ఘాట్, భవానీ ఐలాండ్‌లో ఉత్సవాలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు. సచివాలయంలో (మిగతా 3లో)

లోపలి పేజీల్లో

దాచుకోవచ్చు.. అవసరంలో వాడుకోవచ్చు

రాష్ట్రంలో బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టులు

1,000 మెగావాట్ల సామర్థ్యం

ఏడు ప్రాంతాల్లో ఏర్పాటు

అధికారులు చెప్పారు.. నేను ఆమోదించా.. తర్వాత ఏం జరిగిందో గుర్తులేదు

సిట్ విచారణలో చెవిరెడ్డి


విజయవాడ జైల్లో 4 గంటల పాటు విచారణ

క్షయ వ్యాధికి త్వరలో భారత్ బయోటెక్ టీకా

2026 ప్రారంభంలో మూడో దశ పరీక్షలు

బయోఫ్యాబ్రి నుంచి సాంకేతిక పరిజ్ఞానం బదిలీ

ఇదీ సంగతి!



ఎలాగూ మీరు తిప్పిపంపేదే కదా.. ఆ మాత్రం దానికి మీదాకా తీసుకురావడం ఎందుకని 'డిస్కస్' అని నేనే రాసి వెనక్కిచ్చేశా సార్!

విదేశాలకు వెళ్లే విద్యార్థుల్లో

ఏపీ టాప్



- ప్రవాసంలో విద్యపై భారతీయుల ఖర్చు రూ.6.2 లక్షల కోట్లు

నీతి ఆయోగ్ వెల్లడి

ఈనాడు – దిల్లీ

విదేశాల్లో చదివే భారతీయ విద్యార్థుల్లో ఆంధ్రప్రదేశ్ వాసులు అత్యధికంగా ఉన్నట్లు నీతి ఆయోగ్ తెలిపింది. 'ఇంటర్నేషనలైజేషన్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా' (దేశంలో ఉన్నతవిద్య అంతర్జాతీయాకరణ) పేరుతో సోమవారం ఒక నివేదిక విడుదల చేసింది. 2016లో 46,818 మేర ఉన్న ఏపీ విద్యార్థుల సంఖ్య 2018 నాటికి 62,771కి పెరిగినట్లు వెల్లడించింది. కొవిడ్ కారణంగా 2020లో మాత్రం 35,614కి తగ్గినట్లు తెలిపింది. అయినా ఇప్పటికీ ఏపీ విద్యార్థులే తొలిస్థానంలో ఉన్నట్లు పేర్కొంది. తర్వాతి స్థానాల్లో పంజాబ్, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, దిల్లీ, కర్ణాటక, కేరళ, యూపీలున్నట్లు తెలిపింది. 2024 లెక్కల ప్రకారం మొత్తంగా 13.35 లక్షల మంది విదేశాల్లో చదువుతున్నారు. ఇందులో 8.5 లక్షలమంది అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియాల్లోనే ఉన్నారు. 2016-24 మధ్య 8.84% వృద్ధి నమోదైనట్లు తెలిపింది. విదేశాల్లో చదువుల కోసం భారతీయ విద్యార్థులు రూ.6.2 లక్షల కోట్లు ఖర్చుచేస్తున్నారని, ఇది మన జీడీపీలో 2%కి సమానమని వివరించింది.

వచ్చేది ఒకరు.. వెళ్లేది 28 మంది

మన వాణిజ్య లోటులో 75 శాతానికి కారణం భారత విద్యార్థులు విదేశీ చదువుల కోసం చేస్తున్న ఖర్చులేనని నివేదిక వెల్లడించింది. మనదేశంలో చదువుకోవడానికి విదేశాల నుంచి సగటున ఒక విద్యార్థి (మిగతా 3లో)



రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా పశు సంవర్ధక శాఖ కార్యదర్శి కొన సాగుతారని ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. అలాగే జిల్లా పశుగణాభివృద్ధి సంఘాలకు కూడా పర్సన్ ఇన్‌ఛార్జులు ఛైర్మన్లుగా నియమించేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎల్‌డీఏ సీఈఓను ఆదేశించింది.

అమరావతిలో ఆధునిక సాంస్కృతిక కేంద్రం

- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- రూ.103.96 కోట్లతో క్వాంటమ్ భవనం
- రూ.443 కోట్లతో 8,500 క్యూసెక్కుల పంపింగ్ స్టేషన్
- సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో పలు నిర్ణయాలు



సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి నారాయణ, సీఎస్ విజయానంద్, ఉన్నతాధికారులు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో ఆధునిక సాంస్కృతిక కేంద్రం (కల్చరల్ సెంటర్) నిర్మాణానికి అనువైన స్థలాన్ని వెంటనే గుర్తించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సీఆర్డీఏ 56వ అథారిటీ సమావేశం ముఖ్యమంత్రి అధ్యక్షతన సోమవారం జరిగింది. "అమరావతిలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు ఇప్పటికే ఒక వేదికను నిర్మించి ఉంటే బాగుండేది. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టేలా కల్చరల్ సెంటర్ నిర్మించాలి. దానికి ఏ పేరు బాగుంటుందో ఆలోచించండి" అని సీఎం స్పష్టంచేశారు. అమరావతిలోని క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణం నిర్దేశిత గడువులోగా పూర్తి కావాలన్నారు. "రాజధాని రైతుల సమస్యల్ని జాప్యం లేకుండా పరిష్కరించాలి. వారికి స్థలాలు కేటాయించిన లేఅవుట్లలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలి. రాజధాని పరిధిలోని అటవీ ప్రాంతాలను అభివృద్ధి చేయాలి. అటవీ సంపద, నదీ అభిముఖ ప్రాంతం, కొండలు వంటివి అమరావతికి ప్రకృతి శోభను తెస్తాయి. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికుల్ని ఆకట్టుకునేలా రాజధానిలో రకరకాల పూల మొక్కలు నాటాలి. పార్కులు అభివృద్ధి చేయాలి. రాజధానికి వచ్చే వారి కోసం అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో హోటళ్ల నిర్మించాలి" అని సీఎం సూచించారు. సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్ని మంత్రి నారాయణ విలేకరులకు వివరించారు. ఆ వివరాలు..

క్వాంటమ్ భవనానికి టెండర్ ఖరారు

అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీలో 2 ఎకరాల్లో రూ.103.96 కోట్లతో క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ భవన నిర్మాణానికి ఎల్1గా నిలిచిన బిడ్డర్‌కు టెండరు ఖరారు. ఈ భవనం నిర్మిత ప్రాంతం సుమారు 43 వేల చదరపు అడుగులు. క్వాంటమ్ వ్యాలీలో డిజైన్ చేసిన వాటిలో మరో రెండు భవనాల నిర్మాణం ప్రారంభించాలని సీఎం ఆదేశం. ◆ అఖిల భారత సర్వీసుల అధికారుల కోసం నిర్మిస్తున్న బంగళాల్లో రూ.109.52 కోట్లతో అదనపు సదుపాయాల కల్పన.

◆ రాజధానికి రూ.7,500 కోట్ల రుణంలో నాబార్డ్ ఇప్పటికే విడుదల చేసిన రూ.1,502 కోట్ల లోంచి రూ.100 కోట్లు సీఆర్డీఏ, ఏడీసీ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులు, ఆఫీసు ఖర్చుల నిమిత్తం వాడుకునేందుకు అనుమతి.

ఆయుష్ ఆసుపత్రికి 23 ఎకరాలు

రాజధానిలో కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో రూ.750 కోట్లతో ఆసుపత్రి నిర్మాణానికి శాఖమూరు గ్రామం వద్ద 23.127 ఎకరాల కేటాయింపు. ఏటా ఒక రూపాయి లీజు చెల్లించే ప్రాతిపదికన 60 సంవత్సరాలకు కేటాయింపు.

◆ సదరన్ హోటల్స్, ఓబెరాయ్ అసోసియేట్స్‌కు హోటళ్ల నిర్మాణానికి 2, 4 ఎకరాలు చొప్పున గతంలో స్థలాలు కేటాయించారు. అక్కడ కొన్ని సమస్యలు తలెత్తడంతో వాటికి వేరే చోట భూమి కేటాయిస్తూ నిర్ణయం.

◆ ఉండవల్లి వద్ద 8,500 క్యూసెక్కుల సామర్థ్యంతో పంపింగ్ స్టేషన్‌ను రూ.443.76 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు ఆమోదం.

◆ కృష్ణాయపాలెం, వెంకటపాలెం, ఉండవల్లి, పెనుమాక రైతులకు స్థలాలు కేటాయించిన ఎల్పీఎస్ జోన్లు 8, 11లలో రూ.1,358 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధికి అనుమతి. ◆ జరీబు, జరీబేతర భూముల అంశాన్ని తేల్చేందుకు జలవనరులు, వ్యవసాయం, ఉద్యాన తదితర శాఖల అధికారులతో రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం. 2014 డిసెంబరు 8న అసెంబ్లీలో సీఎం రాజధాని ప్రకటన చేసేనాటికి ఉన్న ఉపగ్రహ చిత్రాల ఆధారంగా జరీబు, జరీబేతర భూముల సమస్యకు పరిష్కారం.

నేడు సీఎం క్వాంటమ్ టాక్

- వేల మంది టెక్ విద్యార్థులతో వర్చువల్‌గా కార్యక్రమం
- క్యూబిట్, వైసర్ సంస్థల భాగస్వామ్యం

ఈనాడు, అమరావతి: అమరావతిని క్వాంటమ్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య మానవ వనరుల్ని తయారుచేసేందుకు క్వాంటమ్ ప్రోగ్రామ్ చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. 'క్వాంటమ్ టాక్' పేరిట మంగళవారం నిర్వహించ తలపెట్టిన దేశంలోనే అతిపెద్ద విద్యా సదస్సులో వేల మంది టెక్ విద్యార్థులనుద్దేశించి సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రసంగించనున్నారు. రాష్ట్రంలో క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధికి సంబంధించి దీర్ఘకాలిక రోడ్ మ్యాప్‌ను సీఎం వివరించనున్నారు. భవిష్యత్తు లక్ష్యాల గురించి దిశానిర్దేశం చేయనున్నారు. క్వాంటమ్ ప్రోగ్రామ్‌లో పాల్గొనేందుకు 10 రోజుల వ్యవధిలో 50 వేల మందికి పైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో 51 శాతం మంది మహిళలే ఉండటం గమనార్హం. ఈ కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన 3 వేల మందికి తదుపరి స్థాయి శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపిక చేసిన 100 మంది విద్యార్థులకు ఐబీఎం, టీసీఎస్, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు సీఎస్ఐఆర్, సీడాక్, నేషనల్ క్వాంటమ్ మిషన్‌లలో ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించనున్నారు. వచ్చే మూడేళ్లలో ఏపీ నుంచి లక్ష మంది క్వాంటమ్ నిపుణుల్ని తయారు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న క్వాంటమ్ ప్రోగ్రామ్‌కు సహకరించేందుకు క్యూబిట్, వైసర్ సంస్థలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ సదస్సులో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి అభయ్ కరాండికర్, ఐఐటీ చెన్నై డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి, వైసర్ డైరెక్టర్ ప్రాచీ పఖారియా పాల్గొననున్నారు.

28న అయోధ్యకు వెళ్లనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 28న అయోధ్య వెళుతున్నారు. 28న ఉదయం 9.10కి బేగంపేట విమానాశ్రయం నుంచి ఆయన అయోధ్యకు బయల్దేరుతారు. ఉదయం 11.20కి అయోధ్యలోని రామజన్మభూమి కాంప్లెక్స్‌కు చేరుకుంటారు. ఉదయం 11.20 నుంచి 2.30 మధ్య రామమందిరంలో శ్రీరాముడిని దర్శించుకుంటారు. అనంతరం అయోధ్య నుంచి నేరుగా విజయవాడ విమానాశ్రయానికి, అక్కడి నుంచి ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

మూడు ప్రాంతాల్లో డీ-ఎడిక్షన్ సెంటర్లు

- సీఎం చంద్రబాబు ఆదేశం
- తరచూ తాగునీటి పరీక్షలు నిర్వహించాలని సూచన

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల (డ్రగ్స్)ను నియంత్రించాలని, మూడు ప్రాంతాల్లో డీ-ఎడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణలో కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై సీఎం సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "గంజాయి కట్టడిపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలి. మూడు రీజియన్లలో చేపట్టే అవగాహన కార్యక్రమాల్లో నేనూ పాల్గొంటా. గంజాయి నివారణ, డ్రగ్స్ కట్టడికి ప్రభుత్వ చర్యలు ఫలితాలిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో అందరినీ భాగస్వాములను చేయాలి. వీధి దీపాలు, తాగునీటి సరఫరాలో ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదు. సరఫరా చేసే నీటికి సంబంధించి తరచూ పరీక్షలు నిర్వహించాలి. ఆ వివరాలు ప్రజలకు తెలియజేయాలి. ఎక్కడైనా నీరు కలుషితమైతే వెంటనే అక్కడి వారిని అప్రమత్తం చేయాలి. ప్రభుత్వ వసతిగృహాల్లో తాగునీరు, పారిశుద్ధ్యంపై అలక్ష్యం ఉండకూడదు. ఆర్వో ప్లాంట్లు లేని వసతిగృహాల్లో త్వరితగతిన వాటిని ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు.. సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా సేవలు అందించే విధానంలో మార్పులు చేయాలి. ప్రజలకు సంతృప్తికరంగా సేవలు అందించాలి. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి. క్షేత్రస్థాయి సిబ్బంది తప్పనిసరిగా కార్యాలయాలకు రావాల్సిందే. దస్త్రాల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలను ఆర్టీజీఎస్‌కు ఎప్పటికప్పుడు అందించాలి" అని పేర్కొన్నారు. సమీక్షలో సీఎస్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడల్లో ఏపీ విద్యార్థులకు పతకాలు

ఈనాడు, అమరావతి: రాజస్థాన్‌లోని జోధ్‌పుర్‌లో జరిగిన సెపక్ తక్రా జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ పాఠశాలల విద్యార్థులు అండర్-17 బాలికల విభాగంలో రజతం, అండర్-19లో కాంస్య పతకం సాధించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన కరాటే పోటీలో అండర్-14 బాలికల విభాగంలో రెండు కాంస్య పతకాలు, అండర్-14 బాలుర విభాగంలో ఒక రజతం, మరో కాంస్య పతకాన్ని దక్కించుకున్నట్లు పాఠశాల క్రీడల కార్యదర్శి భానుమూర్తి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు.

నకిలీ మద్యానికి చెక్ పెట్టేలా 'లిన్'

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నకిలీ మద్యానికి, ఇతర అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రతి మద్యం సీసాకు ప్రత్యేక లిన్ (లిక్కర్ ఐడెంటిఫికేషన్ నంబర్) తీసుకురావాలని, సామాన్య ప్రజలు సైతం గుర్తించగలిగేలా అది ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. లిన్‌లో బ్రాండ్, బ్యాచ్, లైన్, తయారైన తేదీ, సమయం సహా పూర్తి వివరాలు కనిపించాలని స్పష్టం చేశారు. దీని ద్వారా ప్రస్తుతం అనుసరిస్తున్న హీల్‌లోని లోపాలు సరిచేయవచ్చని పేర్కొన్నారు. సచివాలయంలో సోమవారం ఎక్సైజ్ శాఖపై ఆయన సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జియో ట్యాగింగ్ ద్వారా మద్యం సరఫరాలో పూర్తి పారదర్శకత వస్తుందని చెప్పారు. బెల్ట్‌షాపులపై కఠిన చర్యలు తీసుకుని కట్టడి చేయాలన్నారు. ప్రస్తుతం గ్రామీణ, దూర ప్రాంతాల్లో లైసెన్సు దుకాణాలు లేకపోవడం వల్ల బెల్ట్ షాపుల సమస్య నెలకొందని అధికారులు చెప్పగా, హరియాణాలో అనుసరిస్తున్న సబ్‌లీజు విధానాన్ని అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. మద్యం వినియోగం అనంతరం బాటిల్ తిరిగిస్తే డీఆర్ఎస్ (డిపాజిట్ రిటర్న్ స్కీమ్) కింద నగదు చెల్లించే అంశాన్ని పరిశీలించాలన్నారు. 'మద్యం విధానాన్ని వ్యాపారంలా చూడొద్దు. ఆరోగ్యకరమైన వృద్ధి సాధించాలి. ఆదాయమే లక్ష్యంగా విధానాలు ఉండకూడదు. లాటరీ ద్వారా దుకాణాల కేటాయింపు, దరఖాస్తు రుసుము, లిన్, రిటైలర్ మార్జిన్ పెంపు తదితర అంశాలపై మరింత కసరత్తు చేయాలి. బార్‌లకు ఏఆర్ఈటీ (అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకం) మినహాయింపు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలి' అని సీఎం సూచించారు.

రూ.7,041 కోట్ల మేర ఎక్సైజ్ ఆదాయం

గతేడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది అక్టోబరు వరకూ రూ.8,000 కోట్లు ఎక్సైజ్ ఆదాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. రూ.7,041 కోట్లు వచ్చాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఐఎంఎఫ్ఎల్ 19.08 శాతం, బీర్ విక్రయాలు 94.93 శాతం పెరిగాయని, డిసెంబరు 18 నుంచి వచ్చే ఏడాది మార్చి నాటికి రూ.8,422 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసినట్లు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 3 శాతం పెరుగుదల ఉంటుందని పేర్కొన్నారు. అధికారులు చెప్పిన ఇతర అంశాలివి.

◆ అంతర్జాతీయ బ్రాండ్‌లు తీసుకురావటం, నాణ్యమైన మద్యాన్ని అందుబాటు ధరకు అందివ్వడంతో ఐఎంఎఫ్ఎల్, బీరు విక్రయాల్లో ఏపీ దక్షిణాది రాష్ట్రాల్లో అత్యధిక వృద్ధి కనబరచింది.

◆ తెలంగాణ కన్నా ఏపీలో తలసరి మద్యం వినియోగం తక్కువగా ఉంది. తెలంగాణలో తలసరి 4.74 లీటర్ల మద్యాన్ని వినియోగిస్తుంటే ఏపీలో తలసరి వినియోగం 2.77 లీటర్లు.

◆ మద్యం విక్రయాల్లో డిజిటల్ చెల్లింపులు 34.9 శాతానికి పెరిగాయి. కొన్ని జిల్లాల్లో 40-47 శాతం వరకూ డిజిటల్ లావాదేవీలు నమోదవుతున్నాయి.

ఉపాధి హామీలో సవరణలు వెనక్కి తీసుకోవాలి

- సీఎంకు సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ వినతి



రామకృష్ణ ఆధ్వర్యంలో సీఎంను కలిసిన ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడం సమంజసం కాదని, దీనిపై కేంద్రంతో మాట్లాడి పాత పేరునే కొనసాగించేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబును సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. సచివాలయంలో సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జాతీయ సమితి సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావుతో కలిసి సీఎంను రామకృష్ణ కలిశారు. పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. 'ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకానికి కేంద్రం 90% నిధులు ఇస్తుండగా, ఆ వాటాను 60 శాతానికి తగ్గించుకుంది. 40% నిధులను రాష్ట్రం భరించాలంటే ఏపీ సహా పలు రాష్ట్రాలపై ఆర్థిక భారం పడుతుంది. పని దినాలను వంద నుంచి 125 రోజులకు పెంచుతామని కేంద్రం చెబుతున్నా, వాస్తవానికి ఒక్కో కుటుంబానికి సగటున 50 పని దినాలు కూడా కల్పించడం లేద'ని వివరించారు. ఇప్పటిదాకా హక్కుగా ఉన్న ఈ చట్టాన్ని మార్చడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కష్టంగా మారుతుందని, వెంటనే సవరణలను వెనక్కి తీసుకునేలా కేంద్రంతో మాట్లాడాలని సీఎంను రామకృష్ణ కోరారు.

వైకుంఠద్వార దర్శనంలో సామాన్యులకే ప్రాధాన్యం

- తొలి మూడు రోజులు డిప్, తర్వాత నేరుగా వచ్చే వారికి అనుమతి
- ఏఐ టెక్నాలజీతో క్యూలైన్ల పరిశీలన: మంత్రి ఆనం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. చిత్రంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, అనిత తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో ఈనెల 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి వైకుంఠద్వార దర్శనాల్లో 90 శాతం సమయం సామాన్య భక్తులకే కేటాయించినట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వైకుంఠద్వార దర్శనాలపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంమంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల సబ్ కమిటీ సమీక్ష సమావేశం సోమవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో జరిగింది. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, దేవాదాయ శాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. మంత్రి ఆనం మాట్లాడుతూ.. ఈనెల 30న వైకుంఠ ఏకాదశి రోజున 20 గంటలు, 31, జనవరి 1న ద్వాదశి, త్రయోదశి సందర్భంగా 19 గంటల చొప్పున సామాన్య భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు సర్వదర్శనం క్యూలైన్ ద్వారా వచ్చే భక్తులందరూ వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకోవచ్చన్నారు. ఏఐ టెక్నాలజీతో క్యూలైన్ల పర్యవేక్షణ, భక్తుల సంఖ్య, వేచి ఉండే సమయాన్ని అంచనా వేయనున్నట్లు చెప్పారు.

ఏపీఐసీడీసీకి స్వయం ప్రతిపత్తి

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐసీడీసీ)కు స్వయం ప్రతిపత్తి హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాని పాలనా వ్యవహారాలను పరిశ్రమలు, వాణిజ్య శాఖ పర్యవేక్షిస్తుందని తెలిపింది. రాష్ట్రంలో చెన్నై-బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ పరిధిలోని కృష్ణపట్నం, ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్‌ల అభివృద్ధిని ఏపీఐసీడీసీ పర్యవేక్షిస్తుందని తెలిపింది.

గ్రహం అనుగ్రహం

23–12–2025 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్య మాసం, శుక్లపక్షం

తదియ: ఉ. 10-27 తదుపరి చవితి
శ్రవణ: తె. 5-41 తదుపరి ధనిష్ఠ
వర్జ్యం: ఉ. 8-49 నుంచి 10-30 వరకు
అమృత ఘడియలు: సా. 6-50 నుంచి 8-30 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-41 నుంచి 9-25 వరకు తిరిగి రా. 10-40 నుంచి 11-32 వరకు
రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6.30; సూర్యాస్తమయం: సా.5.27

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	8.2	29.3
హైదరాబాద్	13.2	28.8
విజయనగరం	15.0	27.0
అనంతపురం	16.0	29.2
కర్నూలు	16.3	30.0
కడప	17.0	27.0
శ్రీకాకుళం	17.0	27.0
రాజమహేంద్రవరం	18.0	33.5
విశాఖపట్నం	18.2	27.2
గుంటూరు	19.0	29.0
విజయవాడ	19.0	29.3
నరసాపురం	19.6	30.0
ఒంగోలు	20.3	29.9
నెల్లూరు	22.0	29.0
తాడేపల్లిగూడెం	24.0	29.0





సోమవారం విజయవాడలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ★ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు, ప్రజలు

క్రైస్తవుల భద్రత, గౌరవానికి భంగం కలగనివ్వం

(మొదటి పేజీ తరువాయి)

శాంతి, సేవ అనే శాశ్వత విలువల్ని అందించిన ఏసుప్రభు సందేశం ఎప్పటికీ మార్గనిర్దేశం. క్రీస్తు బోధనలు, ఆయన చూపిన బాట మనందరికీ చిరస్థాయిగా రక్షణగా ఉంటుంది. పశువుల పాకలో పుట్టి గొర్రెల కాపరిగా పెరిగిన ప్రజారక్షకుడు ఏసు. నమ్మిన సిద్ధాంతం కోసం బలిదానానికి కూడా సిద్ధపడిన జీసస్ గొప్పతనం నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తిని పొందాలి. శాంతి మార్గాన్ని అనుసరించి, ప్రేమతత్వాన్ని పెంచాలని బైబిల్ చెప్తోంది' అని చంద్రబాబు అన్నారు.

క్రమశిక్షణ, సేవ, నాలెడ్జ్ అందించిన మిషనరీ విద్యాసంస్థలు

'సమాజ సేవలో క్రైస్తవ సంస్థలు కీలకంగా ఉంటాయి. క్రైస్తవం అంటే మనకు గుర్తొచ్చేది సేవ. పాఠశాలలు, కాలేజీలు, ఆసుపత్రులను ప్రభుత్వాలు పెట్టలేని రోజుల్లోనే క్రిస్టియన్ సంస్థలు వాటిని ఏర్పాటు చేశాయి. ఏపీలో దశాబ్దాలుగా విద్యా రంగంలో క్రైస్తవ సంస్థలు ఎంతో సేవ చేస్తున్నాయి. లక్షల మంది జీవితాల్లో మార్పులు తెచ్చాయి. క్రమశిక్షణ, సేవ, నాలెడ్జ్ అందించే కేంద్రాలు మిషనరీ పాఠశాలలు. గుంటూరు ఏసీ కాలేజీ, ఆంధ్రా లయోలా కాలేజీలు ఎంతోమంది స్ఫూర్తిదాతలను తయారు చేశాయి. ఎన్టీఆర్ కూడా ఏసీ కాలేజీలోనే విద్యనభ్యసించారు. అవి పెద్ద నాయకులను జాతికి అందించాయి' అని ముఖ్యమంత్రి తెలిపారు.

వైకాపా చేసిన విధ్వంసం నా జీవితంలో చూడలేదు...

'2019-24 మధ్య వైకాపా ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది. నేను 4వ సారి సీఎం అయ్యాను. లోతులకు వెళ్లిన కొద్దీ లోపాలు కనబడుతున్నాయి. గత ప్రభుత్వం చేసిన విధ్వంసం నా జీవితంలో చూడలేదు. అయినా మనో సంకల్పంతో ముందుకెళ్తున్నా.. దానికి మీరు సహకరిస్తున్నారు. గత 18 నెలల్లో ఇటుకా ఇటుకా పేర్చుకుంటూ నిలదొక్కున్నాం. గణనీయమైన అభివృద్ధి సాధించాం. వైకాపా ప్రభుత్వ హయాంలో గాడి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి పట్టాలెక్కించాం' అని ఆయన అన్నారు.

■ 'రాష్ట్రంలో 2014-19 మధ్య 977 చర్చిల నిర్మాణానికి రూ.77 కోట్లు అందించాం. వైకాపా ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు. 2014-19 మధ్య 377 పూర్తయ్యాయి. మిగతా వాటికి నిధులు విడుదల చేసి పూర్తి చేస్తాం. గుంటూరు క్రిస్టియన్ భవన్ కోసం రూ.10 కోట్లు ఖర్చు చేశాం. గత ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా పనులు నిలిపేసింది. ఈ భవనాన్ని కూడా త్వరలోనే పూర్తి చేస్తాం' అని అన్నారు.

■ 'జెరూసలేం వెళ్లే క్రైస్తవులకు ఆర్థిక సాయం అందిస్తున్నాం. క్రైస్తవుల ఉపాధి, ఆర్థిక సాధికారత విషయంలోనూ ముందుకెళ్తున్నాం. 2025-26 లో రూ.20 కోట్లు కేటాయించి 2 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాం. సీఈడీఎం కింద ఆధునీకరణకు రూ.5 కోట్లు కేటాయించాం.

■ గ్రూప్స్, డీఎస్సీ, నీట్, ఇతర పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నాం' అని చంద్రబాబు వివరించారు.

■ క్రిస్మస్ హైటీ కార్యక్రమ నిర్వహణకు వైకాపా ప్రభుత్వం జిల్లాకు రూ.30 వేలు మాత్రమే ఇస్తే... ఇప్పుడు కూటమి ప్రభుత్వం జిల్లాకు రూ.2 లక్షల చొప్పున విడుదల చేసిందని మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. అది కూటమి ప్రభుత్వానికి క్రైస్తవుల పట్ల ఉండే చిత్తశుద్ధి అని అన్నారు. ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, రాము, యార్లగడ్డ వెంకట్రావు, తంగిరాల సౌమ్య తదితరులు మాట్లాడారు. బిషప్ గోరంట్ల జాన్వేష్, పాస్టర్లు జాన్ వెస్లీ, శామ్యూల్, డేనియల్, జేసు రత్నంకుమార్, తదితరులు పాల్గొని ఏసుక్రీస్తు బోధనలను వినిపించారు.

గౌరవ వేతనం ప్రారంభించింది మేమే..

'ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం తరఫున క్రిస్మస్ పండుగను మొదటి సారి నిర్వహించింది తెదేపా ప్రభుత్వమే. మత సామరస్యాన్ని కాపాడాం. క్రైస్తవుల్లో కూడా ఎక్కువ పేదరికం ఉంది. సూపర్ సిక్స్ పథకాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలనూ అందించి అన్ని వర్గాలను ఆదుకుంటున్నాం. పాస్టర్లకు గౌరవ వేతనం ప్రారంభించింది మేమే. 44,812 మంది క్రైస్తవులకు రూ.22 కోట్ల సాయం అందించాం. 8,427 మంది పాస్టర్లకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం అందిస్తున్నాం. పెండింగ్ బకాయిలు రూ.51 కోట్లను ఈ నెల 24వ తేదీ సాయంత్రంలోపు పాస్టర్ల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాం' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



ఏసు ప్రభువు జననం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరిస్తున్న పాస్టర్

విదేశాలకు వెళ్లే విద్యార్థుల్లో ఏపీ టాప్

(మొదటి పేజీ తరువాయి)

వస్తుంటే 28 మంది భారతీయ విద్యార్థులు బయటకు వెళ్లిపోతున్నట్లు తెలిపింది. 2011 నుంచి ఇప్పటివరకూ 16 లక్షలమంది భారతీయ పౌరసత్వాన్ని వదులుకున్నారు. వీరిలో అత్యధిక భాగం.. ఉన్నత విద్యకోసం విదేశాలకు వెళ్లినవారేనన్నది అంచనా. ఈ పరిస్థితులను మార్చాలని, విదేశీ విద్యార్థులు పెద్దఎత్తున భారతీయ విశ్వవిద్యాలయాల్లో చదివేలా ఆకర్షించాలని నీతి ఆయోగ్ పేర్కొంది. దేశంలో చదివే అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను 2047 నాటికి 7.89 లక్షలకు తీసుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించింది. అప్పటికి దేశీయ విద్యార్థుల్లో ఒక శాతానికి సమానంగా విదేశీ విద్యార్థులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. దేశంలో 2012-13 నుంచి 2021-22 మధ్యకాలంలో విదేశీ విద్యార్థుల సంఖ్య ఒక్క పంజాబ్‌లోనే 300% పెరిగినట్లు ఈ నివేదిక వెల్లడించింది. ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్‌లూ ఇందులో బలమైన వృద్ధినే నమోదు చేసినట్లు తెలిపింది.

టాప్-10ను కోల్పోయిన బెంగాల్, తెలంగాణ

పశ్చిమబెంగాల్, తెలంగాణలు టాప్-10 స్థానాన్ని కోల్పోయినట్లు నివేదిక వెల్లడించింది. కోల్‌కతాలో, హైదరాబాద్‌లో పెద్దసంఖ్యలో ఉన్నత విద్యాసంస్థలు ఉన్నప్పటికీ ఈ రెండు రాష్ట్రాలు విదేశీ విద్యార్థుల్ని ఆకట్టుకోవడంలో వెనుకబడినట్లు వెల్లడించింది. ఇకమీదట విదేశీ విద్యార్థులను ఆకర్షించడానికి విధానపరంగా 22 మార్పులు చేపట్టాలని సిఫార్సు చేసింది. 24 రాష్ట్రాల్లో ఉన్న 160 ఉన్నత విద్యాసంస్థలు, 16 దేశాల్లో 30 విద్యాసంస్థలపై ఆన్‌లైన్‌ద్వారా 100 ప్రశ్నలతో సర్వే నిర్వహించి నీతి ఆయోగ్ దీనిని రూపొందించింది.

భారతీయ విద్యార్థులు అత్యధిక సంఖ్యలో ఉన్న దేశాలు (2024నాటి లెక్కల ప్రకారం)

దేశం	విద్యార్థుల సంఖ్య
కెనడా	4,27,000
అమెరికా	3,37,630
బ్రిటన్	1,85,000
ఆస్ట్రేలియా	1,22,202
జర్మనీ	42,997
యూఏఈ	25,000
రష్యా	24,940
కిర్గిస్థాన్	16,500
జార్జియా	16,093
ఫిలిప్పీన్స్	9,665

రాష్ట్రాలవారీగా విదేశాల్లో చదివే విద్యార్థుల సంఖ్య (2020లో)

రాష్ట్రం	సంఖ్య
ఆంధ్రప్రదేశ్	35,614
పంజాబ్	33,412
మహారాష్ట్ర	29,079
గుజరాత్	23,156
దిల్లీ	18,482
తమిళనాడు	15,564
కేరళ	15,277
కర్ణాటక	13,699

భారత్‌లో చదువుకు అత్యధిక సంఖ్యలో వస్తున్న విద్యార్థులు (2021-22)

దేశం	విద్యార్థుల సంఖ్య
నేపాల్	13,126
అఫ్గానిస్థాన్	3,151
అమెరికా	2,893
బంగ్లాదేశ్	2,606
యూఏఈ	2,287
భూటాన్	1,567
నైజీరియా	1,387
టాంజానియా	1,264
జింబాబ్వే	1,058
సూడాన్	982

ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు మే 12 నుంచి

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేసి, సకాలంలో తరగతులు ప్రారంభించేందుకు షెడ్యూల్‌ను ప్రకటించారు.

ప్రవేశ పరీక్ష	పరీక్షల తేదీలు
ఈఏపీసెట్ (ఇంజినీరింగ్)	మే 12, 13, 14, 15, 18
ఈఏపీసెట్ (వ్యవసాయ, ఫార్మసీ)	మే 19, 20
ఏపీఈసెట్	ఏప్రిల్ 23
ఏపీఐసెట్	ఏప్రిల్ 28
ఏపీ పీజీఈసెట్	ఏప్రిల్ 29, 30, మే2, 6
లాసెట్	మే 4
ఎడ్‌సెట్	మే 4
పీజీసెట్	మే 5, 8, 9, 10, 11

₹2,434 కోట్లు మూలుగుతున్నాయ్!

(మొదటి పేజీ తరువాయి)

బ్యాంకర్లు సూచిస్తున్నారు. ఒంగోలు సంతపేట ఎస్బీఐలో ఒకరు రూ.4 లక్షలు ఖాతాలో వదిలేయడంతో ఆ డబ్బును వడ్డీతో సహా ఇటీవల అందించారు. రేపల్లెకు చెందిన చనిపోయిన ఓ వ్యక్తి ఖాతాలో రూ.10 లక్షలు ఉండిపోగా, వాటిని ఆయన వారసులకు అందజేశారు. ఒంగోలు జిల్లా విద్యాశాఖకు చెందిన రూ.40 లక్షలు అప్పగించారు. ఆర్బీఐ సూచన మేరకు అక్టోబరు నుంచి మనుగడలో లేని ఖాతాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ప్రకాశం జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్ పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు ఈ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుందన్నారు.

మనుగడలో లేనివి కోటికిపైగా ఖాతాలు: రాష్ట్రంలో మనుగడలోని లేని బ్యాంకు ఖాతాల సంఖ్య కోటి దాటేసింది. పాతికేళ్ల క్రితం నాటి ఫోన్ నంబర్లు మారిపోవడం, బ్యాంకు ఖాతాల్లో చిరునామాలు స్పష్టంగా పేర్కొనకపోవడంతో ఆయా ఖాతాదారులను గుర్తించడం సమస్యగా మారింది. జిల్లాల్లోని ప్రభుత్వ శాఖల్లో కూడా ఇదే మాదిరి.. అధికారి మారినప్పుడల్లా కొత్త ఖాతాలు తెరవడం, పాత వాటిని విస్మరించడంతో రాష్ట్రం మొత్తం మీద ఇలాంటివి లక్షకు పైగా ఉన్నాయి. ఇలా వదిలేసిన ప్రభుత్వ ఖాతాల్లో ఒక్క ఎస్బీఐలోనే రూ.64 కోట్ల మేర నగదు నిల్వలు ఉన్నాయి.

పెద్ద మొత్తంలో విశాఖ జిల్లాలో: అత్యధికంగా విశాఖపట్నం జిల్లా పరిధిలో మనుగడలో లేని ఖాతాల్లో రూ.195.65 కోట్లు, తరువాత గుంటూరు జిల్లాలో రూ.149.47 కోట్లు ఉన్నట్లు గుర్తించారు. పదకొండు జిల్లాల్లో ఒక్కోచోట రూ.వంద కోట్లకు పైగా బ్యాంకుల్లో వదిలేశారు. అట్టడుగున పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.28 కోట్ల మేర ఉన్నాయి. యూబీఐ పరిధిలో రాష్ట్రం మొత్తం మీద 47 లక్షల మనుగడ లేని ఖాతాల్లో రూ.654.78 కోట్ల నగదు నిల్వలున్నాయి. తరువాత ఎస్బీఐలో 23 లక్షల ఖాతాల్లో రూ.620 కోట్లున్నాయి. జిల్లా కేంద్ర సహకార శాఖ బ్యాంకుల్లోని నాలుగు లక్షల ఖాతాల్లో రూ.58 కోట్లు ఉన్నాయి.



ప్రేరణే ఆలంబన కావద్దు

జీవితానికి ప్రేరణ ఒక్కటే ఆలంబనకారాదు. ఉత్సాహంగా ఉన్నప్పుడు అది బాగుందని అనిపిస్తుంది. అయితే దీని ప్రభావం స్వల్పకాలమే. ఈ కారణంగానే చాలా మంది వ్యాయామం, ఆహారనియమాలు, కొత్త పనులను ప్రేరణతో చేపట్టినా పూర్తి చేయలేకపోతారు. కాబట్టి శాశ్వత ఇంధనంలాంటి క్రమబద్ధమైన చర్యలే మిమ్మల్ని విజేతలుగా నిలుపుతాయి. ప్రేరణ లేనప్పుడూ మిమ్మల్ని ముందుకు తీసుకువెళ్తాయి.

– ఆర్నాల్డ్ స్వార్జ్‌నెగర్, హాలీవుడ్ నటుడు



పోటీల ప్రారంభ కార్యక్రమంలో పట్టాభిరామ్, అంకమ్మ చౌదరి, గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్, పీవీ సింధు, రవినాయుడు తదితరులు

పదేళ్ల తర్వాత రాష్ట్రంలో 'బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్'

- దేశానికి క్రీడా శిక్షకులను అందించే స్థాయికి ఏపీ
- అమరావతిలో అన్ని క్రీడాంశాలతో 'స్పోర్ట్స్ యూనివర్సిటీ'
- పోటీల ప్రారంభ వేడుకల్లో నేతల వెల్లడి

ఈనాడు, అమరావతి: దేశానికి క్రీడా శిక్షకులను అందించే స్థాయికి రాష్ట్రం ఎదగనుందని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) ఛైర్మన్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అమరావతిలో నిర్మించనున్న స్పోర్ట్స్ సిటీలో క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ఆటలతో పాటు అనుబంధ విభాగాల్లోనూ అంతర్జాతీయ స్థాయి శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ పోలినేని అంకమ్మచౌదరి ఆధ్వర్యంలో 78వ యోనెక్స్-సన్‌రైజ్ ఇంటర్ స్టేట్- జోనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్, 87వ సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, శాప్ ఛైర్మన్ రవినాయుడు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌లతో కలిసి సోమవారం ఈ పోటీలను నేతలు ప్రారంభించారు. తెదేపా ప్రభుత్వ హయాంలో 2015లో జరిగిన బ్యాడ్మింటన్ జాతీయ ఛాంపియన్‌షిప్ తర్వాత మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో విజయవాడ కేంద్రంగా ఈ పోటీలు జరుగుతున్నట్లు గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో హైదరాబాద్ స్థాయిలో రాష్ట్రానికి క్రీడా మౌలిక వసతులు రానున్నాయని గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. శాప్ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలోనూ క్రీడా వికాస కేంద్రాలు నెలకొల్పి, వాటిలో బ్యాడ్మింటన్ కోర్టులు నిర్మిస్తామని రవినాయుడు తెలిపారు. కార్యక్రమంలో శాప్ ఎండీ భరణి, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు.

చాన్నాళ్ల తర్వాత విజయవాడలో ఆడా: పీవీ సింధు

'చాలా ఏళ్ల తర్వాత విజయవాడలో బ్యాడ్మింటన్ టోర్నీ ఆడాను. చిన్నప్పుడు నాన్నతో కలిసి వచ్చి ప్రాక్టీస్ చేసిన రోజులు గుర్తుకొచ్చాయి. చాలా ఆనందంగా ఉంది' అని పీవీ సింధు గుర్తు చేసుకొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ 'గతంతో పోల్చుకుంటే రాష్ట్రంలో బ్యాడ్మింటన్‌లో మౌలిక వసతులు పెరిగాయి. విజయవాడలో మరిన్ని కోర్టులు నిర్మించాలి. క్రీడలు, క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా మద్దతుగా ఉన్నారు. క్రీడారంగం అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఏపీ బ్యాడ్మింటన్ జట్టుకు మద్దతునివ్వడానికి ఆడాను. వారికి మంచి విజయాన్ని అందించాను. పతకాలు వస్తే.. వారికి ఉద్యోగాలు వస్తాయి. జీవితానికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. క్రీడల్లో రాణిస్తే గుర్తింపు వస్తుంది. ప్రభుత్వం, ప్రజల మద్దతు ఉంటుంది' అని సింధు పేర్కొన్నారు. 'జనవరి నుంచి మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్, ఇండోనేసియా ఓపెన్ టోర్నీలు వరుసగా ఉన్నాయి. 2026లో ఏషియన్ క్రీడలు ఉన్నాయి. ఈసారి వరల్డ్ ఛాంపియన్‌షిప్ పోటీలు మన దేశంలోనే జరగనున్నాయి. వీటికి సిద్ధమవుతున్నా. గాయాలు కాకుండా జాగ్రత్త పడుతున్నా' అని ఆమె వివరించారు.

గోవిందా.. 50 కిలోల బంగారం మాయం!

(మొదటి పేజీ తరువాయి)

బంగారు తాపడం పనులు చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) వంద కిలోల బంగారం కేటాయించింది. ఇందులో భాగంగా తొమ్మిది పొరల (9 లేయర్లు)తో తాపడం చేయాల్సి ఉండగా, రెండు పొరలతో సరిపెట్టి దాదాపు సగం బంగారాన్ని మాయం చేసినట్లు ఆరోపణలున్నాయి. విమాన గోపురంపై 30 విగ్రహాలు ధ్వంసం చేసి, ఆపై బంగారు తాపడం పనులు చేసినట్లు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. ఈ అంశాన్ని బయటకు రాకుండా నాటి తితిదే ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఈవోగా ఉన్న ధర్మారెడ్డి జాగ్రత్త పడినట్లు సమాచారం. విమాన గోపురం పనులకు అసలు కాంట్రాక్టర్‌ను కాదని సబ్ లీజు కింద వేరే ఇద్దరికి పనులు అప్పజెప్పినట్లు దేవస్థానానికి ఫిర్యాదులు అందాయి. ప్రస్తుతం ఈ అంశాలన్నింటిపై దేవస్థానం విజిలెన్స్ విభాగం విచారణ చేపట్టింది. అప్పటి ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరించడంలో నిమగ్నమైంది. దీంతోపాటు బంగారు తాపడం పనులు చేసిన కార్మికులను కూడా విచారించి, ఎన్ని విగ్రహాలు ధ్వంసం చేశారు? బంగారం ఎంత వాడారు? అనే అంశంపై ఆరా తీస్తోంది.

అధికారులు చెప్పారు.. నేను ఆమోదించా.. తర్వాత ఏం జరిగిందో గుర్తులేదు

- సిట్ విచారణలో చెవిరెడ్డి
- నెయ్యి టెండర్ల నిబంధనలు ఎందుకు సడలించారు?
- ఎవరి ఒత్తిళ్లు, ప్రయోజనాలకు ఆ సవరణలు?
- తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా కేసులో వైకాపా నేతను ప్రశ్నించిన అధికారులు
- విజయవాడ జైల్లో 4 గంటల పాటు విచారణ

ఈనాడు, అమరావతి: తిరుమలకు నెయ్యి సరఫరా టెండర్ నిబంధనల్లో కీలక షరతులను తొలగిస్తూ, మరికొన్నింటిని మార్చేస్తూ సాంకేతిక కమిటీ సిఫార్సులు చేస్తే.. వాటిని మీరెలా ఆమోదించారంటూ వైకాపా నేత, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డిని కల్తీ నెయ్యి సరఫరా కేసులో సిట్ ప్రశ్నించింది. మద్యం కుంభకోణం కేసులో అరెస్టై ప్రస్తుతం విజయవాడ జైల్లో రిమాండ్‌లో ఉన్న చెవిరెడ్డిని కోర్టు అనుమతితో సోమవారం సుదీర్ఘంగా 4 గంటల పాటు విచారించింది. చెవిరెడ్డి అప్పట్లో తితిదే బోర్డు కొనుగోళ్ల కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు. ఎవరి ఒత్తిళ్ల మేరకు కొనుగోళ్ల కమిటీ సిఫార్సులను ఆమోదించారు? ఇదంతా ముందస్తు కుట్రలో భాగంగానే జరిగిందా అనే కోణంలో ఆరా తీసినట్లు సమాచారం. అయితే సిట్ ప్రశ్నల్లో ఏ ఒక్కదానికీ చెవిరెడ్డి సరైన జవాబివ్వలేదని తెలిసింది. 'అధికారులు చెప్పారు. నేను ఆమోదించా. ప్రతిదీ ఉమ్మడి నిర్ణయమే. అంతకు మించి అప్పుడేం జరిగిందో గుర్తులేదు. ఇప్పటికే ఐదారేళ్లు దాటిపోయింది. వాటిపై ఇప్పుడు అడిగితే ఎలా?' అంటూ తిరిగి సిట్ అధికారులనే ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ కేసులో తితిదే కొనుగోళ్ల కమిటీలో ఉన్న మరికొందరిని సిట్ విచారించనున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలివి.



చెవిరెడ్డికి సిట్ ప్రశ్నావళి

■ తితిదేకు నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొనే సంస్థలకు (జాతీయ డెయిరీలు) మూడేళ్లుగా డెయిరీ నిర్వహిస్తున్న అనుభవం ఉండాలన్న నిబంధనను ఏడాదికి తగ్గించడాన్ని మీరెలా ఆమోదించారు?

■ సంబంధిత డెయిరీ అంతకుముందు ఏడాదిలో రోజుకు కనీసం 4 లక్షల లీటర్ల ఆవుపాలు సేకరించి ఉండాలని, దీనికి ఆధారంగా ప్రొక్యూర్‌మెంట్ రికార్డులు, ఎఫ్ఎస్ఎస్ఏఐకి సమర్పించిన రిటర్న్‌లు జత చేయాలనే నిబంధన ఉండేది. దాంతోపాటు ఆయా సంస్థలు మార్కెట్ అవసరాల కంటే అదనంగా రోజుకు 8 టన్నుల నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండాలన్న నిబంధనను ఎత్తేస్తూ చేసిన సిఫార్సులను మీరు ఎందుకు గుర్తించలేదు?

■ అసలు పాలు సేకరించకుండా, వెన్న తయారు చేయకుండా నెయ్యి ఉత్పత్తి ఎలా సాధ్యమవుతుందన్న ఆలోచన మీకు రాలేదా?

■ ఆయా సంస్థల వార్షిక టర్నోవర్ మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఒక్క ఏడాదన్నా రూ.250 కోట్లు ఉండాలన్న నిబంధన తీసేసి, రూ.150 కోట్లు ఉంటే చాలని, మూడేళ్ల పాటు రోజుకు 12 టన్నుల వెన్న సేకరణ, ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉండాలన్న నిబంధననూ తొలగించి.. ఏడాదిపాటు రోజుకు 8 టన్నుల వెన్న సేకరణ, ఉత్పత్తి సామర్థ్యం ఉంటే చాలని చేసిన సిఫార్సులను మీరెలా ఆమోదించారు?

■ అప్పటివరకూ ఏ ఇబ్బందీ లేకుండా సాగుతున్న నిబంధనలు మార్చాల్సిన అవసరం ఏమొచ్చింది? ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు? కొనుగోళ్ల కమిటీ సభ్యుడిగా ఎందుకు అభ్యంతరం చెప్పలేదు? నిబంధనలన్నీ సడలించడం వల్లే భోలేబాబా, వైష్ణవి డెయిరీ వంటి సంస్థలకు అవకాశం కలిగింది కదా?

నిండు గర్భిణిపై కన్నవారి దాష్టీకం

పరువు హత్య కేసులో ముగ్గురి అరెస్టు

హుబ్బళ్లి, న్యూస్‌టుడే: దళిత యువకుణ్ని వివాహం చేసుకుందన్న కక్షతో గర్భిణిగా ఉన్న కుమార్తెను తండ్రి మరో ఇద్దరి సాయంతో కలిసి దారుణంగా హత్య చేశాడు. కర్ణాటకలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన ప్రకారం.. హుబ్బళ్లి గ్రామీణం ఇనాం వీరాపుర గ్రామానికి చెందిన మాన్య (19), వివేకానంద డిగ్రీ చదువుతున్నప్పుడే ప్రేమించుకున్నారు. అబ్బాయి దళిత సామాజిక వర్గానికి చెందిన వాడు కావడంతో లింగాయత సముదాయానికి చెందిన అమ్మాయి తండ్రి ప్రకాశ్ గౌడ పాటిల్ వారి వివాహానికి నిరాకరించాడు. తనను వివాహం చేసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని వివేకానందను మాన్య బెదిరించడంతో జూన్ 19న ఇద్దరూ ఆలయానికి వెళ్లి వివాహం చేసుకున్నారు. అనంతరం పోలీసులను ఆశ్రయించడంతో యువతి కుటుంబ సభ్యులను పిలిపించి రాజీ చేయించారు. హావేరిలో ఇద్దరూ కాపురం పెట్టగా.. మాన్య గర్భం దాల్చడంతో భర్తతో కలిసి ఇటీవలే ఊరికి వచ్చింది. దీన్ని గుర్తించిన ప్రకాశ్.. తన బంధువులు వీరనగౌడ మహాదేవ గౌడ పాటిల్, అరుణ్ గౌడ పాటిల్‌లతో కలిసి వెళ్లి దంపతులు, వివేకానంద తల్లిదండ్రులపై ఆదివారం సాయంత్రం పైపులతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మాన్య చికిత్స పొందుతూ మరణించగా మిగిలిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను సోమవారం అరెస్టు చేశారు.

వచ్చే నెల 8 నుంచి విజయవాడలో ఆవకాయ్-అమరావతి సాంస్కృతిక ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ఆమ్రపాలితో కలిసి మంత్రి విలేకరులతో మాట్లాడారు. 'తెలుగు సాహిత్యం, కళలు, సినిమాలకు జాతీయ స్థాయిలో లభిస్తున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని అమరావతి ప్రాంతాన్ని సమకాలీన సాంస్కృతిక రాజధానిగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఉత్సవాలు నిర్వహించనున్నాం. స్థానిక కళాకారులకు, కళాభిమానులకు గొప్ప వేదికగా ఉత్సవాలు నిలవనున్నాయి. కళా, సాంస్కృతిక రంగాలకు కూటమి ప్రభుత్వం పునరుజ్జీవం కల్పించింది' అని మంత్రి దుర్గేష్ అన్నారు.

సినీ పరిశ్రమ సమస్యలపై త్వరలో సమావేశం

తెలుగు సినీ పరిశ్రమ సమస్యలపై సినిమాటోగ్రఫీ, హోంశాఖల ఆధ్వర్యంలో త్వరలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నాం. రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందాలి. ఇక్కడే షూటింగ్‌లు జరగాలి. ఇందుకోసం అన్ని విధాలా తగిన ఏర్పాట్లు చేసి నిర్మాతలకు సహకారం అందిస్తాం. సినిమాలను ప్రోత్సహించేందుకే టికెట్ల ధరల పెంపునకు అనుమతులిస్తున్నాం. నంది అవార్డుల ప్రదానం, నంది నాటకోత్సవాలను ఉగాదికి నిర్వహించాలని యోచిస్తున్నాం. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. ముఖ్యమంత్రి కూడా ఉత్సవాల నిర్వహణకు సుముఖంగా ఉన్నారు' అని మంత్రి దుర్గేష్ తెలిపారు. 'ప్రతి నెలా ఏదో ఒక భారీ ఉత్సవం రాష్ట్రంలో నిర్వహించేలా వార్షిక క్యాలెండర్ తయారు చేశాం. వచ్చే జనవరిలో విశాఖ, అరకు, గండికోట, కోనసీమ, ఫ్లెమింగో ఉత్సవాలు నిర్వహించనున్నాం. ఇందుకోసం రూ.40-50 కోట్ల వరకు ఖర్చు చేయనున్నాం. ఆవకాయ్-అమరావతి సాంస్కృతిక ఉత్సవాలకు రూ.5 కోట్లు కేటాయిస్తున్నాం' అని పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. సమావేశంలో పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ఆమ్రపాలి, టీమ్ వర్క్ ఆర్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ కె.రాయ్ మాట్లాడారు.

– ఈనాడు, అమరావతి

కేసీఆర్ విజ్ఞతకే వదిలేస్తున్నాం

'భాగస్వామ్య సదస్సులో జరిగిన ఒప్పందాలు కచ్చితంగా అమలయ్యేలా ప్రత్యేక వ్యవస్థ పని చేస్తోంది. సీఎం ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఈ విషయంలో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ చేసిన ఆరోపణలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం. కేసీఆర్ హయాంలో తెలంగాణలో పెట్టుబడులకు సంబంధించి జరిగిన ఒప్పందాలు కార్యరూపం దాల్చకపోవచ్చు. మిగతా రాష్ట్రాల్లోనూ అలానే ఉంటుందని భావించి ఉండొచ్చు' అని మంత్రి దుర్గేష్ అన్నారు.



సచివాలయంలో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్. చిత్రంలో ఫెస్టివల్ వైస్ ప్రెసిడెంట్ శ్యామ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఏపీ టూరిజం కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలి

తిరుమలలో పలు సేవలు రద్దు



తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 16 నుంచి ధనుర్మాస సేవలు ప్రారంభించారు. ఇందులో భాగంగా జనవరి 14 వరకు తిరుప్పావై సేవ కొనసాగనుంది. అప్పటి వరకు తోమల, అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహిస్తున్నందున భక్తులను అనుమతించడం లేదు. వీటికి సిఫార్సు లేఖలు స్వీకరించడం లేదు. వైకుంఠ ద్వార దర్శనాల కారణంగా ఈనెల 29 నుంచి జనవరి 1 వరకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను రద్దు చేశారు. ఈ సేవలను జనవరి 2 నుంచి 8 వరకు ఏకాంతంగా నిర్వహించనున్నట్లు తితిదే ఓ ప్రకటనలో తెలిపింది.


ఈనాడు

పొరుగున పొంచి ఉన్న పెనుముప్పు

ఉవ్వెత్తున ఎగసిపడిన విద్యార్థి ఉద్యమ జ్వాలల ధాటికి షేక్ హసీనా నిరుడు తన పదవిని కోల్పోయి భారత్‌ను ఆశ్రయించినప్పటి నుంచీ ఇండో-బంగ్లా సంబంధాలు పెళుసుబారాయి. ఇటీవల అక్కడ చోటుచేసుకున్న పరిణామాలతో అవి ఉప్పునిప్పులా మారుతున్నాయి. హసీనాను గద్దెదింపిన నిరసనల్లో క్రియాశీలక పాత్ర పోషించిన షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యతో బంగ్లాదేశ్ మళ్ళీ అగ్నిగుండమైంది. ఆగ్రహావేశాలతో రగిలిపోయిన విధ్వంసక మూకలు, ఇండియాకు అనుకూలంగా పనిచేస్తున్నాయంటూ రెండు పత్రికా కార్యాలయాలకు నిప్పుపెట్టాయి. మన రాయబార కార్యాలయాల దగ్గరా వీరంగాలేశాయి. దైవదూషణ చేశాడంటూ దీపూ చంద్రదాస్ అనే యువకుణ్ని పొట్టనపెట్టుకున్నాయి. దీనికి ఖండనగా దిల్లీలోని తమ హైకమిషన్‌లోకి చొరబాటు యత్నం జరిగిందన్న దుష్ప్రచారం బంగ్లాదేశ్‌లో జోరుగా సాగింది. ఇవన్నీ భారత్‌పై అక్కడ అకారణంగా ప్రబలుతున్న అసహనానికి నిదర్శనాలే! ప్రస్తుత ఉద్రిక్తతల ముసుగులో ఫిబ్రవరిలో జరగాల్సిన ఎన్నికలను బంగ్లాలోని ప్రతీప శక్తులు వాయిదా వేయించి, తమ ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. అదే జరిగితే బంగ్లా మరింతగా అనిశ్చితిలోకి జారిపోయి ఇండియాకు పక్కలో బల్లెంలా తయారవుతుంది.

హసీనా సర్కారు పతనమైన తరవాత బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా మహమ్మద్ యూనస్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆ దేశంలో మత ఛాందస బృందాలు మళ్ళీ బలం పుంజుకున్నాయి. హాదీని కాల్చినవారు ఇండియాకు పారిపోయి ఉంటారని అవే శక్తులు విషం కక్కుతున్నాయి. ఈశాన్య భారతాన్ని రావణకాష్ఠం చేస్తామనే ప్రేలాపనలకూ దిగుతున్నాయి. గ్రేటర్ బంగ్లాదేశ్ పేరిట భారత్‌లోని పలు భూభాగాలు తమవేనంటూ ఇష్టమొచ్చినట్లుగా పేట్రేగుతున్నాయి. ఆ మూర్ఖ మూకల ఆగడాలను గుడ్లప్పగించి చూస్తున్న యూనస్- బంగ్లా వాస్తవ ప్రగతిని పక్కనపెట్టి పాక్‌కు చేరువయ్యేందుకు ఆరాటపడుతున్నారు. అదే అదనుగా బంగ్లాదేశ్ ద్వారా ఇండియాను కల్లోలపరచేందుకు లష్కరే తొయిబా ఎత్తులు వేస్తోంది. తమవాళ్లు ఇప్పటికే ఆ పనిలో నిమగ్నమయ్యారని బహిరంగ ప్రకటనలూ గుప్పిస్తోంది. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం పాతాళంలోకి చేరుతున్నకొద్దీ ఇండియాపై కుట్రలు మరింత పదునుతేలతాయన్నది వాస్తవం. కాబట్టి పొరుగు దేశ స్థితిగతులను గమనిస్తూ ఇండియా సదా అప్రమత్తంగా ఉండాల్సిందే!

బంగ్లాదేశ్ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల వెనక దాదాపు నాలుగు వేల మంది భారత సైనికుల ప్రాణత్యాగాలున్నాయి. ఆ మహోన్నత చరిత్రకు మకిలి పట్టించే కుతంత్రాలు బంగ్లాలో ఏడాదిన్నరగా తీవ్రమయ్యాయి. ఇండియాకు తామెప్పుడూ కృతజ్ఞతగా ఉంటామన్న 'బంగబంధు' ముజిబుర్ రెహమాన్ ఆనవాళ్లనూ చెరిపేసే దుర్మార్గాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. భారత్‌పై ద్వేషంతో ఊగిపోతున్న బంగ్లాలో మౌలిక వసతుల కల్పన, సైనిక సహకారం మాటున చైనా తన పట్టును విస్తరిస్తోంది. ఈ అరాచక పరిస్థితులన్నింటి మధ్యలోనే లక్షల మంది బంగ్లాదేశీయులను ఊచకోత కోసిన పాకిస్థాన్‌ను కీర్తిస్తూ, పాక్ 'జాతిపిత' జిన్నాను ఆరాధించే ఆత్మవినాశకర ధోరణులూ ఢాకాలో పెల్లుబుకుతున్నాయి. ఇంకోపక్క ఆ దేశం నుంచి అడ్డూ ఆపూ లేని అక్రమ వలసలు భారతావనిలో తీవ్ర రాజకీయ, సామాజిక సమస్యలకు కారణమవుతున్నాయి. మనతో నాలుగు వేల కిలోమీటర్లకు పైగా సరిహద్దు కలిగిన బంగ్లాలోని పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకుని నిఘా యంత్రాంగాన్ని ఇండియా పటిష్ఠపరచాలి. సరిహద్దు భద్రతా సిబ్బంది ఖాళీలను సత్వరం భర్తీ చేసి ఈశాన్య భారతాన్ని శత్రు దుర్భేద్యం చేసుకోవాలి.




పేదరికం ప్రకృతి సహజంగా వచ్చింది కాదు, మనం నిర్మించుకున్న సంస్థలు, చేసుకున్న చట్టాలే దానికి కారణమవుతున్నాయి. మనం చేజేతులా చేస్తున్న పాపం అది.

– చార్లెస్ డార్విన్

వామన నీతి

శరీరాకృతి పరంగా వామనుడు చిన్నవాడు అయినప్పటికీ గొప్ప బలం, సంకల్పం, సామర్థ్యం ఉన్న ఘనుడు. 'ఇంతింతై వటుడింతై...' అని పోతనామాత్యుడు భాగవతంలో చెప్పినట్లు ముల్లోకాలను మూడంగలతో చుట్టబెట్టాడు.

శ్రీమహావిష్ణువు దశావతారాల్లో వామనావతారం అయిదోది. సురమాత అదితి భర్త కశ్యపుడి ఉపదేశానుసారం పయోభక్షణ వ్రతమాచరించి వామనుడికి జన్మనిచ్చింది. శంఖ, చక్రాలతో చతుర్భుజుడిగా పుట్టిన వామనుడు తన దివ్యరూపాన్ని త్యజించి వటుని రూపంలో బాలుడయ్యాడు. అప్పటికీ అతడి మోములో వర్చస్సు, కళ్లల్లో కాంతి ఏమాత్రం తగ్గనిదై చూపరులను కట్టిపడేసింది. ఎవరీ బాలుడు? త్రిమూర్తుల్లో ఒకరా? సూర్యుడా? లేదా అగ్నియా? అంటూ చర్చోపచర్చలు సాగాయి. వామనుడు ఈ అవతారం ఎత్తడానికి వెనుక పెద్ద కథే ఉంది. దేవతలు, రాక్షసుల మధ్య జరిగిన యుద్ధంలో బలిచక్రవర్తి.. ఇంద్రుడి చేతిలో ఓడిపోతాడు. చావుతప్పి కన్ను లొట్టబోయిన చందాన రాక్షస గురువు శుక్రాచార్యుడి అనుగ్రహంతో బతికి బయటపడతాడు. ఆయన ఉపదేశానుసారం విశ్వజిత్‌యాగం చేసి స్వర్ణ రథం, శక్తిమంతమైన ఆయుధాలు పొందగలుగుతాడు. బలి గర్వంతో కన్నూమిన్నూ కానరాక దేవేంద్రుడిపై యుద్ధానికి రాక్షస జాతిని ఏకతాటిపైకి తెస్తాడు. అసురులంతా కలిసి అమరావతి రాజ్యంపై దండయాత్ర చేయగా దేవతలు భయంతో చెట్టుకొకరు పుట్టకొకరుగా పరుగులు తీస్తారు. చివరికి ఇంద్రుడి సింహాసనానికే ఎసరుపెడతాడు. ఈ క్రమంలో బలి మదమణిచేందుకు విష్ణువు వామనావతారం ధరిస్తాడు. బలి చక్రవర్తి దానశీలి. ప్రహ్లాదుడి మనవడు. బలి దాతృత్వం ఎంత గొప్పదంటే ఇచ్చిన మాటకోసం ఏం చేయడానికైనా సంకోచించడు. వామనుడు మూడడుగుల నేల కావాలని యాచించగా సంతోషంగా అంగీకరిస్తాడు. వామనుడు తన రూపాన్ని పెంచుకుంటూ పోయి మొదటి అడుగుతో నేలను, రెండో అడుగుతో నింగిని కొలిచాడు. మూడో అడుగు ఎక్కడ వేయాలని అడగ్గా తన తల చూపించాడు. వామనుడు బలిచక్రవర్తి నెత్తిపై అమాంతం మూడో అడుగు వేసి పాతాళానికి తొక్కేశాడు. ఈ ఉదంతం నుంచి మనుషులు రెండు విషయాలు నేర్చుకోవాలి. మొదటిది దానగుణం. రెండోది ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం. వచ్చినవాడు స్వయంగా విష్ణువేనని తెలిసి కూడా బలి వెనుకంజ వేయలేదు. నిర్భీతిగా తల వంచాడు. పాతాళానికి అణగదొక్కుతాడని తెలిసినా మాట మార్చలేదు. బలిచక్రవర్తి చందాన ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేవారే చరిత్రలో నిలిచిపోతారు.



అంతర్యామి

అయితే కాలానుగుణంగా మంచి గుణాలకూ కొన్ని షరతులు వర్తిస్తాయి. ఈరోజుల్లో అడిగిన వారికి అడిగినట్లు దానం చేస్తూ పోయే పరిస్థితి లేదు. బంధువులే కావచ్చు, స్నేహితులే కావచ్చు, కష్టాల్లో ఉన్నారులే పాపం... అనుకుంటే ఆనక మనం ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంది. అందుకని ముందూ వెనుకా చూసి ఇవ్వాలి. తిరిగివ్వకపోయినా పర్వాలేదనుకున్నప్పుడే అప్పు ఇవ్వాలి. మనకి తీర్చగల శక్తి ఉన్నప్పుడే అప్పు తీసుకోవాలి. లేకపోతే ఏదోరకంగా 'బలి' అవుతాం కాబట్టి డబ్బు విషయాల్లో వామన నీతిని మరవద్దు.

– చెన్నాప్రగడ శర్మ

దేశవాళీ జాతులతోనే 'పాడి' ప్రవర్ధమానం!

పాడి పశువులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాలు. వేల ఏళ్లుగా మన సాగు భూమి సారవంతంగా ఉండటానికి ప్రధాన కారణం- పశు ఆధారిత సేంద్రియ వ్యవసాయ విధానమే. అయితే, పశువుల్లో ఉత్పాదక శక్తి తగినంతగా పెరగక పోవడంతో పాడి పరిశ్రమ భారంగా మారుతోంది. పశుపోషణను లాభదాయకంగా మార్చడానికి ఉత్పాదకతను పెంచే చర్యలను అనుసరించాలి.

ప్రపంచ పశు సంపదలో భారత దేశానిదే అగ్రస్థానం. 20వ కేంద్ర గణన ప్రకారం ప్రపంచంలోని గోజాతి పశువుల్లో దాదాపు ఇరవై శాతం (రెండో స్థానం), గేదె జాతి పశువుల్లో అరవై శాతం (మొదటి స్థానం) మన దేశంలోనే ఉన్నాయి. జాతీయ ఆదాయంలో అయిదుశాతం, వ్యవసాయ రాబడిలో 26 శాతం పశు ఆధారిత రంగాల నుంచే వస్తోంది. దాదాపు ఎనిమిది కోట్ల రైతులకు పాడి పరిశ్రమ నేరుగా ఉపాధి కల్పిస్తోంది. పశు పోషణతో లక్షల కుటుంబాలు ఎంతో కొంత ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ మహిళా సాధికారతకు పశు పోషణ ఎంతో తోడ్పడుతోంది. అయితే, నింగిని తాకుతున్న దాణా ధరలు, పెరిగిన నిర్వహణ ఖర్చులు, పోషకాలతో కూడిన మేత కొరత, పచ్చిక బయళ్ల క్షీణత, కృత్రిమ గర్భధారణ సేవల లేమి, వైద్య సేవలు అందకపోవడం వంటి సమస్యలతో పాడి పరిశ్రమను ఆర్థిక నష్టాలు చుట్టుముడుతున్నాయి.



మంద వృద్ధికి మార్గమిది...

పాల ఉత్పత్తిలో అగ్రస్థానానికి చేరుకున్నా, మిగతా దేశాలతో పోలిస్తే మన పశువుల్లో ఉత్పాదక శక్తి తక్కువగానే ఉంది. పశుపోషణ గ్రామీణ ఆదాయ వనరు కాబట్టి మెరుగైన ఉత్పాదక శక్తి కలిగిన పశు సంతతిని అభివృద్ధి చేసుకోవాల్సి ఉంది. ఇందుకోసం దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలి. పాల ఉత్పాదక శక్తి మనం ఎంచుకునే పశు జాతిని బట్టి ఆధారపడి ఉంటుంది. రైతులు పశువులను ఎంపిక చేసుకునే క్రమంలో వారి భౌగోళిక, వాతావరణ స్థితిగతులకు అనువైన గోవు/ గేదె జాతిని ఎంపిక చేసుకుని పోషణ చేపట్టాలి. అప్పుడే పాడి పరిశ్రమ ద్వారా ఆశించిన ఫలితాలు సాధించవచ్చు. నాటు పశువులు ఉన్న రైతులు నిరాశ పడాల్సిన అవసరం లేదు. తక్కువ ఉత్పాదక శక్తి కలిగిన పశువు నుంచి ఉత్తమ సంతతిని అభివృద్ధి చేసేందుకు కృత్రిమ గర్భధారణ పరిజ్ఞానాన్ని అనుసరించవచ్చు. మన రైతులు జీవ సాంకేతిక పరిజ్ఞాన ఫలాలను అందిపుచ్చుకోవాలి. మంచి పాలసార, మేలు జాతి లక్షణాలు కలిగిన ఆబోతుల వీర్యం ద్వారా అధిక ఉత్పాదక శక్తి ఉన్న ఉత్తమ దూడలను పొందవచ్చు. తద్వారా గర్భకోశ వ్యాధులనూ నివారించవచ్చు.

ఇటీవలి కాలంలో లింగ నిర్ధారిత వీర్య, పిండ మార్పిడి జీవ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. దీనిద్వారా ఎక్కువ సంఖ్యలో ఆడ దూడల సంతతిని అభివృద్ధి చేసుకుని మందను వేగంగా పెంచుకోవచ్చు. అయితే, జన్యుపరంగా మెరుగైన జాతుల గోవులు, గేదెలు ఉన్నంత మాత్రాన అధిక పాల దిగుబడి సాధించవచ్చన్న అభిప్రాయమూ పూర్తిగా సరైంది కాదు. మెరుగైన యాజమాన్య పద్ధతులు, నిర్వహణ, పోషణ వంటి విషయాలే కీలకపాత్ర పోషిస్తాయన్న సంగతిని గుర్తుంచుకోవాలి. ప్రస్తుతం వ్యవసాయ అనుకూల భూమిలో 5శాతంలోనే పశుగ్రాసాలు సాగవుతున్నాయి. పచ్చిక బయళ్ల సాంద్రత క్షీణించిపోవడంతో పశు పోషణకు కావాల్సిన ఆహారంలో దాదాపు 50శాతం పంట అవశేషాలు, వ్యర్థాలతోనే అందుతోంది. నాణ్యమైన పశుగ్రాసాల కొరతే పశుపోషణలో ముఖ్యమైన అవరోధం. ఇటీవలి కాలంలో అధిక దిగుబడిని ఇచ్చే నేపియర్ రకం గ్రాసాలు అందుబాటులోకి వచ్చాయి. తక్కువ విస్తీర్ణంలో సాగుచేసినా, ఎక్కువ సంఖ్యలో పశుపోషణ చేపట్టే వెసులుబాటు ఇలాంటి గ్రాసాలతో కలుగుతుంది. పాడి పశువుల్లో ఉత్పాదక శక్తి ఆశించిన స్థాయిలో లేకపోవడానికి మరో ముఖ్యమైన కారణం సాంక్రమిక వ్యాధులే. తగిన జాగ్రత్తలతో కూడిన నిర్వహణతో ఈ సమస్యను అధిగమించాలి.

ఉత్పాదకత పెరగాలంటే...

నాణ్యమైన, మెరుగైన పాల దిగుబడినిచ్చే దేశవాళీ జాతుల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలి. మన దేశవాళీ పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువ. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే గుణం ఉంది. తక్కువ నాణ్యతగల పంట వ్యర్థాల వినియోగంతోనూ సానుకూల ఫలితాలు రాబట్టవచ్చు. వీటివల్ల పోషణ, నిర్వహణ సులభమవుతుంది. సంకరజాతి ఆవులతో పోలిస్తే దేశవాళీ గోవుల్లో జీవితకాల ఉత్పాదక శక్తి ఎక్కువ. కృత్రిమ గర్భధారణ, పిండ మార్పిడి, లింగ నిర్ధారిత వీర్య ప్రక్రియ వంటి జీవ సాంకేతిక సౌకర్యాలను ఉపయోగించుకోవడం ద్వారా నాటు పశువుల నుంచి సైతం మేలైన సంతతిని పొందవచ్చు. పాడి పశువుల జీవితకాల ఉత్పాదక శక్తి వాటి పునరుత్పత్తి సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. పునరుత్పత్తి లేనిదే పాల ఉత్పత్తి సాధ్యం కాదు. అందుకని, పునరుత్పత్తిని ప్రభావితం చేసే వివిధ అంశాలపై రైతులు అవగాహన పెంచుకోవాలి. నాణ్యమైన పశుగ్రాసాల పెంపకంతోపాటు, వాటిని సరైన మోతాదులో అందించడం ద్వారా దాణా ఖర్చులు తగ్గించుకోవచ్చు. పశువులకు వచ్చే వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి. సమయానుకూలంగా వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించడం ద్వారా పశువులను పలురకాల జబ్బుల నుంచి కాపాడవచ్చు. తద్వారా నష్టాల బారిన పడకుండా చూసుకోవచ్చు. రైతులు సరైన పశుజాతుల ఎంపిక, పోషణ, నిర్వహణలో మెలకువలను గ్రహించాలి. అన్నింటికీమించి పశుపోషణపై ఆసక్తి, అభిరుచిని పెంచుకుంటేనే, పాడి పరిశ్రమను లాభసాటిగా తీర్చిదిద్దుకోవచ్చు.





డాక్టర్ యం.ముత్తారావు
ప్రధాన శాస్త్రవేత్త, పశు పరిశోధన స్థానం హెడ్,
శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, లాం, గుంటూరు




తోలుబొమ్మలాటే జీవితం

తొమ్మిదిన్నర పదుల వయసులో రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకున్న ఆమెను చూసి యావద్దేశం అబ్బురపడింది. చేనేత చీరలో నిరాడంబరంగా వచ్చిన ఆమె పేరు భీమవ్వ దొడ్డబాళప్ప శిళ్లెక్యాతర. రాష్ట్రం కర్ణాటక. నమ్ముకున్న కళ... తోలుబొమ్మలాట.

తోలు బొమ్మలతో పురాణ కథలు చెప్పే అద్భుత కళలో ఉద్దండురాలైన భీమవ్వ పదో ఇరవయ్యో కాదు ఏకంగా ఎనభై ఏళ్లపాటు కళాసాధన చేశారు. కన్నడంలో ఆ కళను 'తొగలు గొంబెయాట' అంటారు. అందులో తోలు బొమ్మలను చేతులతో ఎలా ఆడిస్తారంటే- తెరమీద పడే వాటి కదలికల నీడలే హావభావాలతో మురిపించే కథ చెబుతాయి. ఆ కదలికలకు అనుగుణంగా నేపథ్యంలో సంగీతమూ వినిపిస్తుంది. ఆధునికత మోజులో పల్లె కళలన్నీ అనాదరణకు గురవుతున్నా భీమవ్వ చిన్నబుచ్చుకోలేదు. కళను వీడలేదు. ఎప్పటిలాగే ఊళ్లమ్మట తిరుగుతూ ప్రదర్శనలివ్వడమే కాక, ఎందరికో ఆ కళలో శిక్షణ కూడా ఇచ్చారు. భీమవ్వ 1929లో కర్ణాటకలోని కొప్పళ జిల్లా మోరనాల గ్రామంలో జన్మించారు. తరతరాలుగా ఆ కుటుంబానికి వారసత్వంగా అందిన తోలుబొమ్మలాటను చిన్నతనానే నేర్చేసుకున్న ఆమె పెళ్లయ్యాక భర్తతో కలిసి గ్రామాల్లో ప్రదర్శిస్తూ జీవితం గడిపేవారు. భీమవ్వ చదువుకోలేదు. ఎలాంటి ఆస్తులూ లేవు. కానీ కళపై అపారమైన ఆసక్తి ఉంది. పట్టుదలతో బొమ్మలు చెక్కి వాటికి రంగులు వేయడం, కథలు అల్లుకోవడం భీమవ్వకు పుట్టుకతో వచ్చిన విద్య. ఆమె కథ చెప్పే తీరు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసేది. 14 ఏళ్ల వయసునుంచే ప్రదర్శన ప్రారంభించిన భీమవ్వ తొమ్మిది పదులు నిండేదాకా తన పనిని కొనసాగిస్తూనే ఉన్నారు. రామాయణ, భారత కథలే కాక గ్రామీణుల కష్టసుఖాలూ ఆమె కథల్లో వస్తువులయ్యాయి.

భీమవ్వ కళా ప్రదర్శనలు దేశంలోనూ అదీ కర్ణాటకలోని మారుమూల పల్లెలకే పరిమితం అనుకుంటే పొరపాటే. ఆమె బృందం అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ, ఇరాన్, స్విట్జర్లాండ్ వంటి దేశాల్లో పర్యటించి తోలుబొమ్మలాట ప్రదర్శనలు ఇచ్చింది. పలు సందర్భాల్లో స్టాండింగ్ ఒవేషన్ అందుకుంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నెన్నో ఒడుదొడుకులు. టీవీలూ సినిమాలూ వచ్చి పల్లె కళలకు ప్రజలను దూరం చేశాయి. అయినా ఎక్కడా, ఎప్పుడూ ఆమె నిరుత్సాహ పడలేదు. ప్రభుత్వ సాయాన్ని అర్థించలేదు. ప్రేక్షకులు నలుగురు ఉన్నా చాలు, అదే అంకిత భావంతో ప్రదర్శన ఇచ్చేవారు. వచ్చిన ఆదాయంతోనే సరిపెట్టుకునేవారు తప్ప కాలంతో పాటు మారాలనుకోలేదు. కళను పక్కనపెట్టి కాస్త డబ్బు వచ్చే మరే పని అయినా చేసుకుందామనుకోలేదు. అలా చేస్తే ఆ కళ అంతటితో అంతమవుతుంది. ముందుతరాల వారికి దాని ఆనవాళ్లు కూడా ఉండవు. ఆ పరిస్థితి రానివ్వకూడదనుకున్న భీమవ్వ ఆసక్తి ఉన్నవారికి నేర్పిస్తూ కళను బతికిస్తూ వచ్చారు. అందుకే ఆమె కృషిని గౌరవిస్తూ భారత ప్రభుత్వం ఈ ఏడాది 'పద్మశ్రీ'తో సత్కరించింది.

– వై. ఈరన్న



అణువిద్యుత్తుపై ఆశలు

విద్యుదుత్పత్తి కోసం బొగ్గును విపరీతంగా మండించడం వల్ల పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతోంది. అందుకే ప్రభుత్వాలు సౌర, పవన, జల విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులపై దృష్టిసారిస్తున్నాయి. మరోవైపు, రోజురోజుకూ ఎక్కువవుతున్న కరెంటు డిమాండ్‌ను అందుకునేందుకు అణు విద్యుత్తుకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ క్రమంలో 1965లో 25.54 టెరావాట్ అవర్స్‌గా ఉన్న అణు విద్యుదుత్పత్తి... 1980-2000 మధ్యలో దాదాపు మూడున్నర రెట్ల వృద్ధిని నమోదు చేసింది. ఆయా సంవత్సరాల్లో ప్రపంచవ్యాప్తంగా ఎంత అణువిద్యుత్ ఉత్పత్తి అయ్యిందంటే... (టెరావాట్ అవర్లలో)

1970	78.87
1980	712
1990	2,000
2000	2,540
2010	2,726
2020	2,648
2024	2,764

(ఆధారం: ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్-స్టాటిస్టికల్ రివ్యూ ఆఫ్ ద వరల్డ్ - 2025)

ఆర్‌బీఐ... స్వతంత్రత ఎంత?

ప్రతి దేశంలో కేంద్ర బ్యాంకులు స్వతంత్రంగా పనిచేయాలని ఆర్థిక శాస్త్రవేత్తలు వాదిస్తుంటారు. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ కేంద్ర బ్యాంకుల యాజమాన్యాలు వందశాతం ఆయా దేశ ప్రభుత్వాల అధీనంలోనే ఉంటున్నాయి. భారత రిజర్వు బ్యాంకు(ఆర్‌బీఐ) ఇందుకు మినహాయింపేమీ కాదు. ఇటీవలి కాలంలో కొన్ని బ్యాంకులు సమస్యల్లో చిక్కుకోవడం... ఆర్‌బీఐ నియంత్రణ, పర్యవేక్షణపై ఆందోళన, సందేహాలను కలిగిస్తున్నాయి.

అమెరికా, కెనడా, బ్రిటన్, నార్వే, స్వీడన్, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కేంద్ర బ్యాంకులు, ఐరోపా సెంట్రల్ బ్యాంకు ఎక్కువ స్వతంత్రతను కలిగి ఉన్నాయి. ఇండియా, దక్షిణ కొరియా, బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికా దేశాల కేంద్ర బ్యాంకులు మధ్య స్థాయిలో స్వతంత్రతను పొందుతున్నాయి. చైనా, అర్జెంటీనా, రష్యా వంటి దేశాల కేంద్రబ్యాంకులేమో స్వతంత్రత పరంగా అతి బలహీనమైనవి. ఆర్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా, బంగ్లాదేశ్ బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ బ్రెజిల్, బ్యాంక్ ఆఫ్ రష్యా వంటి వాటి యాజమాన్యం పూర్తిగా ప్రభుత్వాల చేతిలోనే ఉంటోంది. బ్యాంక్ ఆఫ్ జపాన్‌లో సుమారు 55శాతం జపాన్ ప్రభుత్వానికి, 45శాతం పబ్లిక్ షేర్లు ఉండగా, ప్రైవేట్ వాటాదారులకు విధాన నిర్ణయాల్లో ఎలాంటి నియంత్రణ అధికారం లేదు. స్విస్ నేషనల్ బ్యాంక్‌లో రాష్ట్రాలు, రాష్ట్రాల బ్యాంకులు, పబ్లిక్ వాటాదారుల యాజమాన్యం ఉన్నా, షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టెడ్ అయినా, విధాన నిర్ణయాల్లో ఎస్ఎన్‌బీ పూర్తిగా స్వతంత్రంగా వ్యవహరిస్తుంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ సిస్టమ్ పైకి ప్రైవేట్ సంస్థలా కనిపించినా వాస్తవానికి అది ప్రభుత్వ సంస్థే.

పర్యవేక్షణపై ఆందోళన

జాతీయీకరణ తరవాత ఆర్‌బీఐ పూర్తిగా భారత ప్రభుత్వ యాజమాన్యంలోకి వచ్చింది. ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. పూర్తికాల అధికారిక డైరెక్టర్లుగా గవర్నర్, గరిష్ఠంగా నలుగురు డిప్యూటీ గవర్నర్లు ఉంటారు. నాన్-ఆఫీషియల్ డైరెక్టర్లుగా వివిధ రంగాల నుంచి ప్రభుత్వం నామినేట్ చేసిన 10 మంది, ఇద్దరు ప్రభుత్వ అధికారులు, నాలుగు స్థానిక బోర్డుల నుంచి ఒక్కొక్కరు చొప్పున నలుగురు ఉంటారు. ఎకనామిక్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్ (ఈసీఎఫ్) అనేది ఆర్‌బీఐ ఎంత మూలధనాన్ని రిస్క్ బఫర్లుగా నిల్వ ఉంచాలి, ఎంత మిగులును ప్రభుత్వానికి బదిలీ చేయవచ్చనేది నిర్ణయించే నియమావళి. 2019లో బిమల్ జలాన్ కమిటీ దీన్ని సవరించి ఆర్‌బీఐ మూలధనాన్ని రెండు భాగాలుగా విభజించి కనీస పరిమితులను నిర్ణయించింది. 2025లో ఈసీఎఫ్‌ను పునఃసమీక్షించి, మౌలిక విధానాన్ని కొనసాగిస్తూ... దేశ, ప్రపంచ ఆర్థిక పరిస్థితుల ఆధారంగా బఫర్లను ఏటా సర్దుబాటు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఈసీఎఫ్ ద్వారా ప్రభుత్వం ఆర్‌బీఐని అధిక డివిడెండ్ల కోసం ఒత్తిడి చేస్తోందన్న విమర్శలు ఉన్నప్పటికీ, ఇప్పుడు ఒక పారదర్శకమైన విధి విధానాల నియమావళి ఉందన్నది వాస్తవం.



ప్రభుత్వానికి 2019 తరవాత అధిక డివిడెండ్లు బదిలీ చేస్తున్నా, 2025 నాటికి నిల్వల పరంగా ప్రపంచవ్యాప్తంగా మొదటి పది కేంద్ర బ్యాంకుల్లో ఆర్‌బీఐ ఎనిమిదో స్థానంలో ఉంది. రిజర్వు బ్యాంకు ద్రవ్య విధాన కమిటీ(ఎంపీసీ)లో ఆర్‌బీఐ నుంచి ముగ్గురు, కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేసిన ముగ్గురు సభ్యులు ఉంటారు. దీనికి గవర్నర్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. 2016కు ముందు ద్రవ్యవిధానంపై ఆర్‌బీఐ గవర్నర్ తుది నిర్ణయాలు తీసుకునేవారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ఎంపీసీని ఏర్పాటు చేసి ఓటింగ్‌ను ప్రవేశపెట్టారు. ద్రవ్యోల్బణాన్ని లక్ష్యస్థాయిలో నియంత్రించేందుకు పాలసీ రేటు (రెపోరేటు) నిర్ణయించడం ఎంపీసీ ప్రధాన బాధ్యత. బ్యాంకు వ్యవహారాలపై సమగ్ర పర్యవేక్షణ, దిశానిర్దేశం చేయడమే ఆర్‌బీఐ కేంద్ర బోర్డు ప్రధాన బాధ్యతలు.

జోక్యం తగ్గాలి...

సమస్యల పరిష్కారం కోసం బ్యాంకుల్లో ప్రభుత్వ పెట్టుబడిని బ్యాంక్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ(బీఐసీ)కి బదిలీ చేసి, బ్యాంకుల బోర్డులకు పూర్తి అధికారాలు కట్టబెట్టి, వాటిలో ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించాలని నాయక్ కమిటీ (2014) సూచించింది. ఆ సూచన ఇప్పటికీ అమలులోకి రాలేదు. సరళీకృత ఆర్థిక సంస్కరణల పుణ్యమా అని రాజకీయ కార్పొరేట్ రంగాల మధ్య ఉన్న పలుచని తెర తొలగిపోయింది. కార్పొరేట్లు రాజకీయ నాయకులపై ఒత్తిడి తీసుకొచ్చి బ్యాంకు రుణాలను తిరిగి చెల్లించకుండా శిక్షల నుంచి తప్పించుకుంటున్నారు. కొందరు విదేశాలకు కూడా పారిపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎస్‌బీల పాలనా వ్యవహారంలో జోక్యాన్ని తగ్గించి, బీఐసీని ఏర్పాటు చెయ్యాలి. ఆర్‌బీఐ కేంద్ర బోర్డులో నాన్-అఫీషియల్ డైరెక్టర్ల నియామకానికి బీఐసీ తరహా వ్యవస్థ చాలా అవసరం. ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం చర్చల ద్వారా ఇలాంటి అంశాలను సమష్టిగా పరిష్కరిస్తాయని ఆశిద్దాం.



డాక్టర్ బి.యన్.వి.పార్థసారథి
మాజీ వైస్ ప్రెసిడెంట్,
బ్యాంక్ ఆఫ్ బహ్రెయిన్ అండ్ కువైట్

షెల్స్.. ఎలా?

హాయ్ నేస్తాలూ..! బీచ్‌లు, నదుల దగ్గరికి వెళితే నీళ్లలో ఎంచక్కా ఆడుకుంటాం. ఇసుకతో గూళ్లు కూడా కట్టుకుంటాం కదా! అక్కడ దొరికే షెల్స్‌ని ఆడుకోవడానికి ఇంటికి తెచ్చేసుకుంటాం. 'ఇంతకీ ఆ షెల్స్(నత్తగుల్లలు, గవ్వలు) ఎలా తయారవుతాయి? ఎవరు చేస్తారు?' అని ఎప్పుడైనా ఆలోచించారా!

మనకు ఉండటానికి ఇళ్లు ఉన్నాయి కాబట్టి వాటిలో ఉంటున్నాం. అలాగే అన్ని జీవులకు ఉండటానికి ఏదో ఒక నివాసం కావాలి కదా! అలా నీటి వనరుల దగ్గర నత్తలు, క్లామ్స్, అయిస్టర్స్ వంటి చిన్నచిన్న జీవులు ఉంటాయి. అవి ఈ షెల్స్ లోపల ఉంటాయన్నమాట. ముందు అనుకున్నట్లు వాటిని ఎవరూ తయారు చేయరు! సాధారణంగా నీటిలో కాల్షియం ఉంటుంది. దాన్ని నత్తలు, క్లామ్స్, అయిస్టర్స్ శరీరంలోకి పీల్చుకుంటాయి. ఆ తరవాత వాటి ప్రత్యేక గ్రంథుల ద్వారా ఒక రకమైన ద్రవాన్ని విడుదల చేస్తాయి. అది క్రమంగా గట్టి పదార్థంగా మారుతుంది. తరవాత మెల్లగా పొరలుపొరలుగా తయారవుతుంది. ఇదంతా సరేగానీ మరి ఆకారాలేంటి.. వింతగా ఉంటాయి' అంటారా? నత్తగుల్లలు, గవ్వల లోపల ఉన్న జీవి శరీరాకృతి మారుతున్నకొద్దీ.. వాటి ఆకారం కూడా దానికి తగ్గట్టుగా మారుతూ వస్తుంది. అలాగే వాటికి రకరకాల రంగులు ఉంటాయి కదా! నీళ్లలో ఉండే ఖనిజాలు, షెల్స్‌లోని జీవులు వదిలే ద్రవాల వల్లే ఒక్కో షెల్ రంగు ఒక్కోలా ఉంటుంది. ఇదంతా జరగడానికి కొన్నిసార్లు నెలలు, సంవత్సరాల సమయం పడుతుంది. అందులోని జీవి బతికి ఉన్నన్ని రోజులు షెల్స్ నీటి లోపలే ఉంటాయి. జీవి చనిపోయిన తరవాత.. దానిలోంచి బయటికి వచ్చేస్తుంది. అప్పుడు.. నత్తగుల్లలు, గవ్వలు నీటి ప్రవాహంలో ఒడ్డుకు చేరతాయి. వాటినే తీసుకుని మనం ఆడుకుంటాం. ఒక్కో షెల్ ఒక్కో జీవి నివాసం అన్నమాట. నేస్తాలూ మీకు ఈ విశేషాలు నచ్చాయా? ఈసారి మీరు బీచ్‌కి వెళ్లినప్పుడు.. 'అన్ని షెల్స్ మధ్య తేడాలున్నాయా? లేదంటే ఒకేలా ఉన్నాయా?' అనే విషయం గమనించండి. సరేనా!



హాయ్! బుజ్జీ

పదాలేవి?

ఇక్కడ కొన్ని పదాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటి పదం చివరి అక్షరాలతోనే రెండోది ప్రారంభమవుతుంది. ఓసారి ప్రయత్నించండి.

1. NA □□ AL
2. GUI □□ NTIST
3. FOC □□ E
4. DEFI □□ GATIVE
5. INVE □□ ATE

జవాబు: 1.NAME, MEAL 2.GUIDE, DENTIST 3.FOCUS, USE 4.DEFINE, NEGATIVE 5.INVEST, STATE

ఈనాడు స్పోర్ట్స్ లీగ్.. సంరంభం



కానూరులోని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ పబ్లిక్ పాఠశాల మైదానంలో సోమవారం టాస్ వేసి 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్' పోటీలు ప్రారంభించి బ్యాటింగ్ చేస్తున్న కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు. చిత్రంలో కె.కిరణ్ (చలపతి ఇన్‌స్టిట్యూషన్స్ డీన్), ఆర్.శైలజ (గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ విజయవాడ బ్రాంచ్ మేనేజర్), 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్.కె.కిశోర్‌కుమార్, శశికళ (కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ పబ్లిక్ పాఠశాల కన్వీనర్) తదితరులు.

- విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే

ఆస్తి వివాదాల సమస్యలే అధికం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 94 ఫిర్యాదులు వచ్చాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు డీసీపీ ఎస్.వి.డి.ప్రసాద్ బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. వీటిల్లో అత్యధికంగా భూ, ఆస్తి, నగదు లావాదేవీల వివాదాలు 48 వచ్చాయి. దొంగతనాలు 9, మోసాలు 8, కుటుంబ కలహాలపై 6, కొట్లాటలు 5, మహిళా సంబంధ నేరాలు 3, ఇతర ఫిర్యాదులు 15 చొప్పున వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపి.. సత్వరమే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.

వెన్నంటే స్ఫూర్తి.. విజయాలే కీర్తి



విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్న అరుణ

ఎవరు ఏ స్థాయిలో ఉన్నా.. వారి ఎదుగుదలలో గురువులది కీలకపాత్ర. అందరూ బోధన చేస్తుంటారు.. కొందరు మాత్రం విద్యార్థుల్లో ఉన్న ఆసక్తిని గుర్తించి వారిని ప్రోత్సహిస్తూ తమ ప్రత్యేకత చాటుకుంటారు. ఆ కోవకే చెందుతారు సైన్స్ ఉపాధ్యాయిని నాదెళ్ల అరుణ. తాను ఎక్కడ పనిచేసినా ప్రయోగ ప్రదర్శనలో విద్యార్థులకు బహుమతులు అందుకోవాల్సిందే. తిరువూరు పాఠశాలలో 2002లో ఉద్యోగ జీవితం ప్రారంభించి విద్యార్థులను జిల్లా స్థాయి బహుమతులు అందుకునేలా తీర్చిదిద్దారు. ఆ తరవాత ఉయ్యూరు మండలం కాటూరు జడ్పీ హెచ్‌ఎస్‌కు మారినా దానిని కొనసాగించారు. అనంతరం మొవ్వ మండలం కాజ వచ్చారు. 2020లో నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో ఏకంగా జాతీయ స్థాయి బహుమతి అందుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దారు. ఆ తరవాత గూడూరు మండలం మల్లవోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తుండగా వరుసగా రెండేళ్లు నేషనల్ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో బహుమతులు అందుకున్నారు. విప్రో సంస్థ జీవ వైవిధ్యంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిభ చాటారు. ప్రస్తుతం ఆమె తరకటూరు జడ్పీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహమే ఆమెకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం అందుకునేలా చేసింది.

జాతీయ స్థాయిలో..

మూడుసార్లు జాతీయ స్థాయికి అర్హత సాధించడంతో పాటు ఒకసారి జాతీయ స్థాయిలో తృతీయ బహుమతి దక్కించుకోవడం విశేషం. అలా బహుమతి కింద వచ్చిన రూ.50వేలను ఆమె పాఠశాలలోని కిచెన్‌షెడ్డు నిర్మాణానికి అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. రెండుసార్లు ఉమ్మడి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి రూ.20వేల నగదు బహుమతి అందుకున్నారు.

– న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)

సేవల మెరుగుకు.. మూడంచెల ప్రణాళిక

ఈనాడు, అమరావతి



దుర్గగుడిలో భక్తుల సేవల మెరుగుకు ప్రక్షాళన చర్యలు ఆరంభమయ్యాయి. సేవల్లో సంతృప్తిస్థాయి ఆధారంగా.. ఇటీవల రాష్ట్రంలో ఏడు ప్రధాన ఆలయాలపై ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో దుర్గగుడి చివరి స్థానానికి పరిమితమైంది. దీంతో ఆలయ అధికారులు అంతర్మథనంలో పడ్డారు. ప్రస్తుతం, మూడు నెలలు, ఏడాదిలో ఎలాంటి మార్పులు చేయాలనే లక్ష్యంతో.. పక్కాగా మూడంచెల ప్రణాళిక రూపొందించారు.

తాగునీళ్లు, సౌకర్యాలు..

❖ తాగునీటిని బాటిళ్ల రూపంలో అందించాలి. ✪ ఆలయ పరిసరాల్లో.. 15 తాగునీటి పాయింట్ల ఏర్పాటు. మరుగుదొడ్లు కొత్తవి కట్టాలి. ఘాట్‌రోడ్డుపై ట్రాఫిక్ రద్దీ తగ్గించేలా.. వయోవృద్ధులు, వీఐపీలను కింద నుంచి దర్శనాలకు తీసుకెళ్లేందుకు వాహనాల ఏర్పాటు. ✦ తాగునీటి ప్లాంట్‌ను కొత్తగా నిర్మించాలి. భక్తులు కూర్చునేందుకు.. వందకు పైగా బెంచీల ఏర్పాటు.

దర్శనాలపై ప్రత్యేక దృష్టి..

❖ సెక్యూరిటీ సిబ్బందితో క్యూలైన్ల క్రమబద్ధీకరణ. గంటకోసారి క్యూలైన్ల శుభ్రత. తాగునీరు, మజ్జిగ క్యూలైన్లలో అందజేయడం. ✪ క్యూలైన్లు దర్శనాలకు మరింత అనువుగా ఉండేలా మార్పులు. ఫ్యాన్లు, కూలర్ల ఏర్పాటు. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణుల కోసం.. నూతనంగా లిఫ్ట్‌ల ఏర్పాటు. ✦ మహామండపం ఏడో అంతస్తులో భక్తులు వేచి ఉండేందుకు సౌకర్యాల కల్పన.

భక్తుల అభిప్రాయ సేకరణ..

ఐవీఆర్ఎస్ ద్వారా భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాల సేకరణ మేరకు ప్రభుత్వం ర్యాంకులను విడుదల చేసింది.

అంశం	సంతృప్త శాతం
తాగునీరు, వసతులు	59.9
పారిశుద్ధ్యం నిర్వహణ	62.4
దర్శనాలు	67.9
ప్రసాదం (రుచి, శుచి)	75.7

ప్రసాదాల నాణ్యతపై ..



❖ ఉదయం నుంచి రాత్రి వరకూ ఉచిత ప్రసాదాల పంపిణీ. అన్న ప్రసాదం ఎక్కువ మందికి అందించాలి. లడ్డూ, పులిహోర, చక్కెర పొంగలి.. నాణ్యతను చూసేందుకు ప్రత్యేక కమిటీ. అన్నదాన భవనంలో.. బెంచీకి ఇద్దరు పర్యవేక్షకులను నియమించి.. అభిప్రాయ సేకరణ. ✪ ఉదయం వేళ అల్పాహారం ఏర్పాటు. వారాంతాలు, పర్వదినాల్లో క్యూలైన్లలో భక్తులకు ఉచిత లడ్డూ. రాత్రి వేళ కూడా అన్నప్రసాదం ✦ ఏడాదిలో.. నూతన అన్నదానం, ప్రసాదాల తయారీ భవనాలు అందుబాటులోకి తేవాలి.

పారిశుద్ధ్య నిర్వహణపై..



❖ తడి, పొడి చెత్త బుట్టలు వేర్వేరుగా పెట్టి.. పారిశుద్ధ్య కార్మికులను పెంచారు. ✪ సూపర్‌వైజర్లను పెంచి.. పారిశుద్ధ్య నిర్వహణ నిరంతర పర్యవేక్షణ. చెత్త నిర్వహణపై భక్తులకు అవగాహన పెంచడం. ✦ భవన నిర్మాణాలు పూర్తిచేయాలి. నిర్మాణ సామగ్రి తొలగించేయాలి.

అంశాలు.. ❖ ప్రస్తుతం.. ✪ మూడు నెలల్లో.. ✦ ఏడాదిలో..



పీవీ సింధుకు ఘన స్వాగతం



క్రీడాకారిణి విన్యాసం భళా..

నగరంలో బ్యాడ్మింటన్ సందడి

విజయవాడ క్రీడలు: దేశంలోని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులతో విజయవాడ కళకళలాడుతోంది. నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో 'బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2025' పోటీలు సోమవారం నుంచి ఘనంగా ఆరంభమయ్యాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు.. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు నగరానికి చేరుకున్నారు. పి.వి.సింధు, కిడాంబి శ్రీకాంత్.. సహా అంతర్జాతీయస్థాయి క్రీడాకారులు చాలామంది.. ఈ పోటీల్లో తొలిరోజు సందడి చేశారు. 22 నుంచి ఆరంభమైన పోటీలు.. ఈనెల 28 వరకూ కొనసాగనున్నాయి.



హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు



పోటీలను ఆసక్తిగా తిలకిస్తూ..

సేవలకు గుర్తు.. ఊర్మిళానగర్ కాలనీ

భవానీపురం, న్యూస్‌టుడే

పదవిలో ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులు, ఉద్యోగంలో ఉన్న సమయంలో అధికారులు చేసే మంచి పనులను ప్రజలు గుర్తు పెట్టుకుంటారు. అలా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్‌గా పని చేసిన మహిళా ఉద్యోగిని పేరుతో భవానీపురంలో ఊర్మిళా సుబ్బారావునగర్ ఏర్పాటైంది. ప్రస్తుతం విజయవాడ బస్టాండ్ ఉంటున్న ప్రాంతం గతంలో భాస్కరరావుపేట.. 1986లో అప్పటి ప్రభుత్వం బస్టాండ్ నిర్మాణం చేపట్టేందుకు అక్కడ నివాసముంటున్న వారిని అధికారులు ఖాళీ చేయించారు. వారికి ప్రత్యామ్నాయంగా భవానీపురం ప్రాంతంలో 27 ఎకరాలు కొనుగోలు చేశారు. ఆమె ఆధ్వర్యంలోనే 864 మందికి స్థలాలు కేటాయించారు. అనంతరం వారికి మౌలిక వసతులు కల్పించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నారు. దీనికి కృతజ్ఞతగా అక్కడ నివాసముంటున్న ప్రజలు కమిషనర్ ఊర్మిళ, ఆమె భర్త సుబ్బారావు పేరు కలిసి వచ్చేలా ఊర్మిళా సుబ్బారావు నగర్ అని పెట్టుకున్నారు. అలాగే కాలనీలో ప్రధాన రహదారులకు చలసాని వెంకటరత్నం వీధి, భగత్‌సింగ్‌రోడ్డు, గురజాడ అప్పారావు వీధి, రాజీవ్‌శర్మ రోడ్డు, అంబేడ్కర్ రోడ్డు, సిద్ధం కృష్ణారెడ్డి వీధి అని మరికొందరి పేర్లతో పిలుస్తున్నారు. ప్రస్తుతం ఆ కాలనీలో రెండు వేల కుటుంబాలకు పైగా ప్రజలు నివాసం ఉంటున్నారు. ఎకరం పైగా విస్తీర్ణంలో నగర పాలక సంస్థ ఉద్యానం ఏర్పాటు చేసింది.



దొరకునా ఇటువంటి సేవ...

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సేవకు దేవస్థాన వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని ఈవో శీనానాయక్ అన్నారు. సేవకుల పేరు, వివరాలు, ఫోన్ నంబరు https///durgamalleswaraswamy.comలోనమోదు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న సేవకులు మొబైల్ నంబరుకు వరుస క్రమంలో అమ్మవారి సేవ కేటాయింపు సందేశం పంపిస్తారు. అన్నప్రసాద వితరణ, మంచినీరు అందించడం, ఆన్‌లైన్ సేవల గురించి వివరించడం, ప్రధాన ఆలయం, ఉపాలయాల్లో భక్తుల రద్దీ నియంత్రించడం, భక్తుల నుంచి సౌకర్యాలపై అభిప్రాయ సేకరణ వంటి పనుల్లో సేవకులు భాగస్వాములు కావచ్చు. గుర్తింపు కార్డు, భోజనం, దూరప్రాంతాల వారికి ఉచిత వసతి కల్పిస్తారు. వివరాలకు 94400 11717ను సంప్రదించాలి.



సేవకు వచ్చిన బృంద సభ్యులు

వ్యవసాయ సమస్యలకు పరిష్కారం పొందండిలా..!

'ఈనాడు' ఆధ్వర్యంలో డీఏవోతో ఫోన్‌ఇన్ నేడు

ఈనాడు మీ తోడు



జిల్లాలో రబీ సీజను ఆరంభమైంది. ఇందుకు సరిపడా యూరియా, ఎరువులను అందుబాటులో ఉంచామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఎరువుల నిల్వలు, వీటి పంపిణీలో, రబీ పంటలకు సంబంధించి రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి (డీఏవో) డి.ఎం.ఎఫ్.విజయకుమారితో ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. అన్నదాతలు తమ సమస్యలను నేరుగా తెలియజేయవచ్చు. ఆమె సమాధానాలు ఇస్తారు. రైతులు చేయాల్సిందల్లా నిర్ణీత సమయంలో ఈ కింది నంబర్‌కు ఫోన్ చేయడమే.

- న్యూస్‌టుడే, ఎన్టీఆర్ కలెక్టరేట్

83310 56859 | 23.12.25 మంగళవారం | 11–12 గంటల వరకు

తొమ్మిదేళ్ల నిర్మాణం.. కోడిగుడ్డు మేడ వైభవం



కోడిగుడ్డు పేరు చెబితే ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో ఒక మేడ ఆ ప్రాంత ప్రజలకు గుర్తుకొస్తోంది. బ్రిటీష్ కాలంలో మైలవరం ప్రాంతం జమీందారులైన సూరానేని వంశీయుల పాలనలో ఉండేది. ఆంధ్రాభోజా రెండో రాజాగా పేరుగాంచిన రాజా సూరానేని వేంకట పాపయ్యారావు బహద్దూర్ జమీందార్ పాలించేవారు. అప్పట్లో వారి నివాసాల కోసం మూడెకరాల విస్తీర్ణంలోని స్థలంలో సుమారు అరెకరంలో దీన్ని నిర్మించారు. 1906లో కట్టడం ప్రారంభించి తొమ్మిదేళ్లలో పూర్తిచేశారు. సున్నంతో పాటు కోడిగుడ్డు సొనను కలిపి నిర్మించడంతో కోడిగుడ్డు మేడగా నానుడికెక్కింది.

పరిసరాల పరిశీలనకు.. మరో వైపు అందులో వాడిన ఇనుప కమ్మీలను ఇంగ్లండ్ నుంచి తెప్పించారు. మేడ పైభాగంలో ముందర, కోడిగుడ్డు ఆకారంలో రెండు బురుజులు నిర్మించారు. అక్కడకెళ్లేందుకు మెట్లు ఏర్పాటు చేశారు. పరిసరాల పరిశీలనకు వాటిని ఉపయోగించేవారని తెలిసింది. జమీందారుల వారసుల నుంచి 1970 ప్రాంతంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు కుటుంబీకులు రూ.25 వేలకు దీన్ని కొనుగోలు చేశారు. వారి నుంచి ప్రవాసాంధ్రుడు లకిరెడ్డి హనిమిరెడ్డి 1992లో కొనుగోలు చేసి, పూర్తిస్థాయిలో ఆధునికీకరించి, మరో రెండు బురుజులు అదనంగా నిర్మించి మేడను నివాసానికి ఉపయోగిస్తున్నారు. ప్రముఖ నటుడు సాయికుమార్ తనయుడు ఆది నటించిన సుకుమారుడు చిత్రాన్ని సగానికి పైగా ఈ భవనంలోనే చిత్రీకరించారు.

– మైలవరం, న్యూస్‌టుడే

పెట్టుబడుల సదస్సులో 100 ఎంవోయూలు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

ఎన్టీఆర్ కలెక్టరేట్: ఇటీవల విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో జిల్లాకు సంబంధించి 100 ఎంవోయూలు కుదిరినట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. వీటికి అనుగుణంగా పెట్టుబడిదారులకు అవసరమైన సహాయ, సహకారాలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పీ-4 కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. గృహాలు, నివేశన స్థలాలు, పింఛన్లు, ఉపాధి కల్పన, రెవెన్యూ శాఖ సంబంధిత సేవలకు పీజీఆర్ఎస్‌లో 229 అర్జీలు అందినట్టు తెలిపారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం, వేసవి తాగునీటి కార్యాచరణ, దస్త్రాల పరిష్కారం, వసతి గృహాల్లో ముస్తాబు కార్యక్రమం అమలు, సౌర విద్యుత్తు పథకాల అమలు, పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలు, కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలు, వ్యవసాయ సీజన్లకు ప్రణాళిక తదితరాలపై దిశానిర్దేశం చేసినట్టు వివరించారు. ఎం.ఎస్.ఎం.ఇ.ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని, నూతన పారిశ్రామిక యూనిట్లతో పాటు, ప్రస్తుత యూనిట్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

అసౌకర్యాలు తొలగు.. నూతన సొబగు

జిల్లాకు రూ.4.49 కోట్ల పీఎంశ్రీ నిధులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

పీఎంశ్రీ పథకానికి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ హంగులు సమకూరుతున్నాయి. విద్యాలయాలు అందంగా... ఆకర్షణీయంగా మారుతున్నాయి. పథకం కింద ఇప్పటికే రెండు విడతల్లో నిధులు కేటాయించారు. కొన్నిచోట్ల పనులు జరుగుతుండగా.. కొన్ని బడుల్లో పూర్తి అయ్యాయి.



జగ్గయ్యపేట: నిర్మించిన గ్రంథాలయ భవనం

జిల్లాలో 29 పాఠశాలలు ఎంపికయ్యాయి. మొదటి విడతలో 17, రెండో విడతలో 12 గుర్తించారు.

66/87

✦ ఆయా పాఠశాలల్లో 87 పనులు చేయాలి. ఇప్పటికే 66 పూర్తయ్యాయి. ✦ మూడు రసాయన శాస్త్రం ప్రయోగశాలలను రూ.39.72 లక్షలతో జగ్గయ్యపేట ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, పెండ్యాల, తాడేపల్లి జడ్పీహెచ్ఎస్‌ల్లో నిర్మించారు. ✦ 17 క్రీడా మైదానాల అభివృద్ధికి రూ.71.75 లక్షలు మంజూరు కాగా.. జగ్గయ్యపేట ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, చందర్లపాడు, మూలపాడు జడ్పీహెచ్ఎస్, సత్యనారాయణపురం ఏపీఎంసీహెచ్ పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. ✦ గ్రంథాలయాల గదులకు రూ.78.56 లక్షలు ఇవ్వగా.. పెండ్యాల, మైలవరం జడ్పీహెచ్ఎస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ కృష్ణారావుపాలెంలో అందుబాటులోకి వచ్చాయి. ✦ కిచెన్ గార్డెన్స్‌కు రూ.20.32 లక్షలు మంజూరు కాగా.. జగ్గయ్యపేట, తిరువూరు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, తిరువూరు ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. ✦ ఇంకుడు గుంతలు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జగ్గయ్యపేట, చందర్లపాడు ఉన్నత పాఠశాలల్లో తవ్వారు. ✦ రూ.6.50 లక్షలతో 13 పాఠశాలల్లో ర్యాంప్ హ్యాండ్ రెయిల్స్ నిర్మించాలి. 11 చోట్ల కట్టారు. ✦ రూ.31.46 లక్షలతో 2 కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఒకటి, రూ.58.92 లక్షలతో 3 గ్రంథాలయాలకు గదులు నిర్మించాల్సి ఉండగా రెండు, రూ.39.28 లక్షలతో 2 బయాలజీ ల్యాబ్‌లు నిర్మించాల్సి ఉండగా ఒకటి, రెండు రసాయన శాస్త్రం ప్రయోగశాలలకు రూ.39.28 లక్షలు ఇవ్వగా.. ఒకటి పూర్తి చేసినట్లు సమగ్ర శిక్ష ఏఎంఓ ఎస్.అశోక్‌బాబు తెలిపారు.

పిల్లల విక్రయాల ముఠా మూలాలపై శోధన

ఈనాడు - అమరావతి: గల్లీ నుంచి ఢిల్లీ వరకు విస్తరించిన పిల్లల విక్రయ ముఠా మూలాలు వెలికి తీసేందుకు సీపీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కేసులు నమోదైన మహిళా స్టేషన్, నున్న, భవానీపురం, కొత్తపేట స్టేషన్లు, టాస్క్‌ఫోర్స్ విభాగం అధికారులు, సిబ్బందితో నాలుగు బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. ప్రత్యేక బృందాలు అడ్మిన్ డీసీపీ సరిత ఆధ్వర్యంలో పనిచేస్తున్నాయి. ఈ కేసులో ఇప్పటికే 12 మంది నిందితులు అరెస్టయ్యారు. నిందితుల.. బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించి లావాదేవీలను వడపోస్తున్నారు. ఈ ముఠాతో ఇంకా ఎవరితో సంబంధాలు ఉన్నాయనే కోణంలో కాల్ డేటాను చూస్తున్నారు. ముంబయికి చెందిన కవిత, నూరి, సతీష్‌లతోపాటు ఆగ్రాలో ఉన్న మరికొందరిని కూడా అరెస్టు చేసేందుకు త్వరలో వెళ్లనున్నట్లు తెలిసింది. నగరంలో నమోదైన నాలుగు కేసుల్లో పలువురికి ప్రమేయం ఉండడంతో వీరిపై దశలవారీగా ఆయా స్టేషన్ల నుంచి పీటీ వారెంట్లు వేయనున్నారు. అనంతరం నిందితులను కస్టడీకి తీసుకుని విచారించనున్నారు.

వాహనంలో లోడు.. ప్రమాదం చూడు..



రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అనేక సూచనలు చేస్తున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ట్రాలీ ఆటోలో పెద్ద ఎత్తున సామాన్లను తీసుకెళ్లే సమయంలో ఏమాత్రం తాడు తెగినా వెనుక వచ్చే వారి మీద పడి ప్రమాదాలకు గురవుతారు.

-ఈనాడు, అమరావతి

ఎండీఎంఏ కేసులో తేజ అరెస్టు!

బెంగళూరు ముఠాతో లింకులపై విచారణ..

ఈనాడు, అమరావతి: ఎండీఎంఏ కేసులో బెంగళూరు కాంటాక్టును ఇచ్చిన తేజను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు.. అరెస్టు సందర్భంగా మాచవరం స్టేషన్ నుంచి ఆదివారం పరారైన నిందితుడు రాజేష్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. విజయనగరం జిల్లాకు చెందిన తేజను సోమవారం ఉదయం అరెస్టు చేసి విజయవాడకు తీసుకొచ్చారు. రాజేష్‌కు బెంగళూరులో ఎండీఎంఏ సరఫరా చేసే వ్యక్తిని ఇతను పరిచయం చేశాడు. ఈ నేపథ్యంలో తేజను పోలీసులు విచారిస్తున్నారు. బెంగళూరు లింకులపై ఆరా తీస్తున్నారు. అరెస్టు అయిన నిందితులు వెంకట జగదీష్ కుమార్, అఖిలేష్‌లను సోమవారం కోర్టులో హాజరుపరిచారు. వీరికి న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితులను నెల్లూరులోని కేంద్ర కారాగారానికి తరలించారు. ★ **దొరకని రాజేష్ ఆచూకీ:** నెల్లూరు జిల్లా.. బుచ్చిరెడ్డిపాలేనికి చెందిన రాజేష్‌ను ఆదివారం డ్రగ్స్ తీసుకుంటుండగా పోలీసులు హోటల్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారు ఉపయోగించిన కారుతో సహా నిందితులను మాచవరం స్టేషన్‌కు తరలించారు. కారును స్టేషన్ వద్ద నిలిపే సమయంలో.. కారు తాళాలను పోలీసులు నిందితుడికి ఇచ్చి పార్క్ చేయమన్నారు. ఇదే అదనుగా నిందితుడు కారులో పరారయ్యాడు. ఆ సమయంలో అక్కడ ఉన్న పోలీసు సిబ్బంది కారును ఆపేందుకు ప్రయత్నించినా ఆగకుండా దూసుకెళ్లాడు. నిందితుడిని పట్టుకునేందుకు నాలుగు బృందాలు హైదరాబాద్, విశాఖపట్నం, నెల్లూరు, బెంగళూరు, తదితర ప్రాంతాల్లో వెతుకుతున్నాయి. హోటల్‌లో రాజేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకునే సమయంలో.. తమను వదిలిస్తే రూ.10 లక్షలు ఇస్తానని ఆశచూపించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. అయినా అదుపులోకి తీసుకున్నారు. ★ ఒక బృందం బుచ్చిరెడ్డిపాలెం వెళ్లింది. అక్కడ రాజేష్ ఇంటి వద్ద విచారించారు. ఇంట్లో తల్లి తీవ్ర అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. ఓ సహాయకురాలి ఆసరాతో నెట్టుకొస్తోంది. తండ్రికి ఊళ్లోనే దుస్తుల దుకాణం ఉంది. ఊళ్లో అతని జాడ దొరకలేదు. హైదరాబాద్‌లో ఓసారి గంజాయి తాగుతూ రాజేష్ పోలీసులకు దొరికినట్లు తెలిసింది. జగదీష్ కుమార్, అఖిలేష్‌లతో స్థానికంగా ఎవరితో సంబంధాలు ఉన్నాయనే కోణంలో విచారిస్తున్నారు. నిందితుల ఆర్థిక లావాదేవీలు, సంబంధాలను పరిశీలిస్తున్నారు.

సీపీ ఆగ్రహం

అదుపులోకి తీసుకున్న తర్వాత స్టేషన్ నుంచి నిందితుడు పారిపోవడంపై సీపీ రాజశేఖర్‌బాబు.. మాచవరం పోలీసులను మందలించారు. నిందితుడిని వెంటనే పట్టుకోవాలని, లేకుంటే చర్యలు తీసుకోనున్నట్లు టెలికాన్ఫరెన్స్‌లో సీఐ ప్రకాశ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇంత నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరించారని నిలదీసినట్లు సమాచారం. రాజేష్ పరారైన సమయంలో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్‌ను బదిలీ చేసినట్లు తెలిసింది.

జల్‌జీవన్‌లో అతిక్రమణలు

అనుమతులు ఓ చోట... పనులు మరోచోట

నిధుల లేమితో జల్ జీవన్ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందాన ఉంటే... కొందరు అధికారులు, గుత్తేదారులు కలిసి వచ్చిన నిధులు స్వాహా చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. పైపులు వేసేందుకు ఓ ప్రాంతంలో అనుమతులు తీసుకుని.. అవసరం లేని చోట పనులు చేసి బిల్లులు చేసుకుంటున్నారని సోమవారం ఆ శాఖ అధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. - ఈనాడు, అమరావతి

● గొల్లపూడి పంచాయతీ నల్లకుంటలో రూ.23 లక్షల విలువైన పనులకు పాలన అనుమతులు వచ్చాయి. 160 ఎంఎం పైపులు కిలోమీటరు మేర నిర్మించాలి. గుత్తేదారులు మాత్రం అక్కడ నుంచి 6 కిలోమీటర్ల దూరంలోని సాయిపురం కాలనీలో అవసరం లేనిచోట పైపులు వేశారు. అక్కడైనా ప్రజల అవసరాలు తీరతాయి కదా అనుకుంటే ఇక్కడ అసలు తాగునీరు సరఫరా పైపులే లేవు. నిరుపయోగ ప్రాంతంలో పైపులైన్ వేసి చేతులు దులుపుకొన్నారు. ● నిబంధనల ప్రకారం ఒక చోట పనులు చేసేందుకు అనుమతులు వస్తే అక్కడే చేయాలి..లేదంటే ఉన్నతాధికారుల ద్వారా నేమ్ ఆఫ్ ది వర్క్ మార్చుకోవాలి. తర్వాత పనులు చేయాలి. తప్పనిసరిగా ట్యాప్ కనెక్షన్ ఇవ్వాలి అనుమతులే లేనిచోట, ట్యాప్ కనెక్షన్ ఇవ్వకుండానే అడ్డగోలుగా బిల్లు చేసుకున్నారు. ● ఈవ్యవహారంలో మైలవరం, విజయవాడ గ్రామీణ పరిధిలోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పాత్ర ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆలోచన బాగుంది.. ఇసుక చేరింది..




విజయవాడ-సీతానగరం మధ్య కృష్ణానది రైల్వే వంతెనపై చిన్నపాటి సిమెంట్ పనులు జరుగుతున్నాయి. ఇసుకను బస్తాల్లో కట్టి కింద ఇద్దరు మనుషులు ఆ తాడు లాక్కుని దూరంగా వెళ్తూ ఇసుకను వంతెన పైకి చేరుస్తున్నారిలా.. బాగుంది కదూ ఆలోచన.
-ఈనాడు, అమరావతి.

ఆర్టీసీలో అభిప్రాయాల సేకరణ

విజయవాడ బస్ స్టేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ మన మిత్ర- వాట్సాప్ పరిపాలన స్టిక్కర్లను పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ ఆర్టీసీ బస్సుల్లో అధికారులు సోమవారం అతికించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు, ప్రయాణికులు అభిప్రాయం తెలుసుకునేందుకు ప్రత్యేక క్యూఆర్ కోడ్‌తో కూడిన స్టిక్కర్లను అతికించినట్లు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఆపరేషన్స్ సాయి చరణ్ తేజ తెలిపారు. ఈ క్యూఆర్ కోడ్‌ల ద్వారా సంబంధిత ప్రయాణికుడు రాకపోకలు సాగించాల్సిన సర్వీసు, రెండు ప్రాంతాల మధ్య బస్సు ఎంత దూరంలో ఉంది లైవ్ ట్రాక్ ద్వారా తెలుసుకోవచ్చని, అందులోనే టికెట్లు కూడా బుకింగ్ చేసుకునే సదుపాయం ఉందని పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు



బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధుకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు అన్నారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను కుటుంబ సభ్యులతో కలిసి ఆమె సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో మంచి క్రీడాకారులు తయారు చేయడానికి ప్రభుత్వం స్టేడియాల నిర్మాణం చేస్తుందన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా క్రీడాకారులకు ఆత్మవిశ్వాసంతోపాటు భరోసా లభిస్తుందన్నారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సామర్థ్యాలు పెంచేలా.. ఉన్నతి సాధించేలా..

న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి



తుమ్మలపాలెం: పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను నమోదు చేస్తున్న మోహనరావు

జిల్లాలో ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ ఆన్‌లైన్ సర్వే పూర్తి అయింది. అంగలూరు డైట్ అధ్యాపకుల పర్యవేక్షణలో క్లస్టర్ ఉపాధ్యాయులు, డైట్ విద్యార్థులు, సీఆర్పీలు ఈ సర్వేను నిర్వహించారు.

నిర్వహణ ఇలా.. జిల్లాలో 20 మండలాల పరిధిలోని 69 క్లస్టర్ పాఠశాలల పరిధిలోని 752 ప్రాథమిక పాఠశాలల్లో 34,228 మంది విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇందుకోసం 69 మంది సీఆర్పీలు, 40 మంది క్లస్టర్ ఉపాధ్యాయులు, 72 మంది డైట్ విద్యార్థులు వారికి కేటాయించిన మండలాల పరిధిలోని పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి అయిదో తరగతి వరకు చదువుతున్న వారి సామర్థ్యాలను అంచనా వేశారు. విద్యార్థులను తెలుగు, ఆంగ్లం, గణితంలో మౌలిక ప్రశ్నలు అడిగి వారి వివరాలు నమోదు చేశారు. సర్వే పారదర్శకంగా ఉండేందుకు సంబంధిత ఉపాధ్యాయులను కాకుండా డైట్ విద్యార్థులు, క్లస్టర్ ఉపాధ్యాయులు, సీఆర్పీలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లస్టర్ అధ్యాపకులకు ఒక్కొక్కరికి మూడు నుంచి నాలుగు మండలాల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. తర్వాత విద్యా శాఖ ఉన్నతాధికారులు సామర్థ్యాలను అంచనా వేసి వంద రోజుల విద్యా ప్రణాళిక అమలు చేస్తారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మెరుగైన సామర్థ్యాలను అంచనా వేస్తారు.

పర్యవేక్షించాం..

దీని కోసం నియమించిన సిబ్బంది సర్వేను పక్కాగా చేశారు. సర్వర్ నెమ్మదించడంతో కొంత ఇబ్బంది కలిగింది. ప్రతిరోజు సర్వే తీరును అంచనా వేస్తు పర్యవేక్షించాం. ఇది ఆన్‌లైన్ సర్వే కాబట్టి ఆయా వివరాలు ఉన్నతాధికారుల లాగిన్‌కు వెళ్తాయి.
- డాక్టరు కె.మోహనరావు, డైట్ అధ్యాపకుడు, ఎఫ్ఎల్ఎన్ సర్వే జిల్లా సమన్వయకర్త

మెప్మా.. డ్వాక్రా సంఘాలకు అండగా కేశినేని ఫౌండేషన్



మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్, వేదికపై రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు తదితరులు

పటమట, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లాలోని మెప్మా, డ్వాక్రా సంఘాలకు కేశినేని ఫౌండేషన్ అండగా నిలుస్తుందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెప్మా, ఎస్.హెచ్.జి. మహిళలకు చెదలు - బొద్దింకలు - దోమల నివారణపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ శివనాథ్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త మంతెన సత్యనారాయణరాజు హాజరయ్యారు. శివనాథ్ మాట్లాడుతూ.. కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డి. సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 1 నుంచి దాదాపు 400 మంది మహిళలకు వివిధ స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. శిక్షణ ఇప్పించడంతో పాటు అవసరమైన యూనిట్లు ప్రారంభించేందుకు ప్రభుత్వం సహకారం అందిస్తామని చెప్పారు. వారు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. సతీష్ బాబు, మంతెన మాట్లాడుతూ.. ఎంపీ శివనాథ్ తన సొంత నిధులతో కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎన్.ఐ.ఆర్.డి. సహకారంతో ఎస్.హెచ్.జి. మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఎన్.ఐ.ఆర్.డి. అధికారులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నగర కార్యవర్గం ఏకగ్రీవం



చలసాని, నజీరుద్దీన్‌లకు నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి ప్రసాద్

గాంధీనగర్, న్యూస్‌టుడే : ఏపీ ఎన్జీవో అసోసియేషన్ విజయవాడ నగర శాఖ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. సోమవారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో హోంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. మొత్తం 21 పోస్టులకు గాను ఒక్కో పోస్టుకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలైంది. అధ్యక్షుడిగా చలసాని సి.వి.ఆర్.ప్రసాద్ ఎన్నికయ్యారు. సహాధ్యక్షులుగా పి.రాజశేఖర్, కార్యదర్శిగా ఎస్.కె.నజీరుద్దీన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సి.హెచ్.మధుసూదనరావు, కోశాధికారిగా డి.ఎస్.ఎన్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఖాసిం సాహెబ్, ఎం.శ్రీనివాసరావు, టి.విద్యాసాగర్, జి.ఎన్.వి.రత్న కుమార్ ఎంపికయ్యారు. మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా బి.విజయశ్రీ, సంయుక్త కార్యదర్శులుగా బి.నాగమల్లేశ్వరరావు, కె.శివశంకర్, జి.అనిల్ కుమార్, ఎస్.భాస్కరనాయుడు, ఎస్.కె.మహబూబ్ బాషా, బి.శ్వేత, డీఈసీ సభ్యులుగా ఎం.రాంబాబు, జి.మురళి, జి.శ్రీనివాసరావు, ఎం.శిధర్, వి.దుర్గాప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వి.వి.ప్రసాద్ వెల్లడించారు. సహాయ ఎన్నికల అధికారిగా జి.రామకృష్ణ, పర్యవేక్షకులుగా బి.సతీష్‌కుమార్‌లు వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.సత్యనారాయణరెడ్డి, పి.రమేష్, మాజీ నాయకులు జి.నారాయణరావు, కంకి సత్యనారాయణ, టి.రాజారావు, ఎం.డి.ఇక్బాల్, కోనేరు రవి తదితరులు అభినందనలు తెలిపారు.

జగన్ ఉడత ఊపులకు.. ఎవరైనా భయపడతారా?

ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

ఈనాడు, అమరావతి: 'జగన్ బెదిరిస్తే.. ఎవరు భయపడతారు.? ఇలాంటి ఉడత ఊపులకు భయపడే రోజులు పోయాయి. వైద్య కళాశాలల పీపీపీ విధానం సూపర్‌హిట్ అవుతుంది. లీజుకు తీసుకునే వాళ్లను అరెస్టు చేస్తామంటూ బెదిరిస్తే.. భయపడే వాళ్లు లేరు.' అంటూ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. విజయవాడలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. వైకాపా అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి సత్యకుమార్ యాదవ్ చాలా స్పష్టంగా పీపీపీ ప్రయోజనాల గురించి వివరించారన్నారు. 'ప్రజలకు దీనివల్ల ఎలాంటి భారం పడదు. గతంలో కంటే మరింత మెరుగ్గా వైద్య విద్య ఉంటుంది. జగన్ ప్రభుత్వ హయాంలో పెట్టిన రుసుముల కంటే.. తగ్గించే ఫీజులు వసూలు చేయాలనే నిబంధనలున్నాయి. కళాశాలలను నడిపే బాధ్యత మాత్రమే ప్రైవేటుకు ఇస్తున్నాం, యజమాని ప్రభుత్వమేనని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు.' అంటూ రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. వైద్య కళాశాలల పీపీపీ పథకం ప్రజలకు ఎంతో ఉపయోగం కాబట్టి, లాభాపేక్ష లేకుండా.. ప్రజా సేవ చేద్దామనే ఆలోచన ఉన్న వాళ్లంతా ముందుకొస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానం కూడా ఇదేనని స్పష్టం చేశారు.

జగన్ మాటలు ఎవరూ నమ్మరు..

ప్రభుత్వం యోగాకు పెట్టిన వ్యయాన్ని నాలుగు రెట్లు పెంచి జగన్ చెబుతున్నారు. 'రుషికొండ ప్యాలెస్‌కు ఖర్చు చేసిన దాన్ని మాత్రం సగానికి సగం తగ్గించి చెబుతున్నారు. ఆయన మాటలను జనం నమ్ముతారా?. ఆ లెక్కలు తెలియని వాళ్లెవరు. అందుకే.. జగన్ మాటలు విని.. నవ్వి ఊరుకోవడమే. హోదా లేని ప్రతిపక్షం కాబట్టి.. ఇలా మాట్లాడాల్సిన అవసరం ఆయనకు ఉంది. ప్రజలు విజ్ఞులు కాబట్టి.. నవ్వుకుంటున్నారు.' అని రఘురామ ఎద్దేవా చేశారు.

మళ్లీ కూటమిదే అధికారం

ఎన్నికల ముందు జగన్.. వై నాట్ 175 అన్నారని, ఇప్పుడు కూడా నేను వచ్చేస్తానని అంటున్నారంటే.. ఏమవుతుందో అర్థం చేసుకోవచ్చంటూ రఘురామ అన్నారు. మళ్లీ తెదేపా, భాజపా, జనసేన కూటమే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. వైకాపా అధికారంలోకి వచ్చేది లేదని ఆయన స్పష్టం చేశారు.


విద్యాప్రమాణాల పెంపునకు కార్యాచరణ



మాట్లాడుతున్న డీఈఓ చంద్రకళ

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను క్రమశిక్షణతో అమలు చేయాలని డీఈఓ ఎల్. చంద్రకళ సూచించారు. సోమవారం స్థానిక మాంటిస్సోరి కళాశాల ఆడిటోరియంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికపై జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ ప్రణాళికలో భాగంగా ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేస్తూ... విద్యార్థుల అభ్యాసన స్థాయిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి మౌలిక నైపుణ్యాల వృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, వెనుకపడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. విద్యార్థులు పరీక్షల్లో సాధించిన మార్కులను నిర్ణీత గడువులోపు అప్‌లోడ్ చేయాలని, రోజూ బోధన, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల అభ్యాసన ఫలితాలపై పర్యవేక్షణ కొనసాగాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండి, బోధనా ప్రక్రియను నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు.

హిందువుల ఐక్యతతో ధర్మరక్షణ



సమ్మేళనంలో ప్రసంగిస్తున్న కృష్ణమూర్తి స్వామీజీ

గని ఆత్కూరు (కంచికచర్ల), న్యూస్‌టుడే : కులాలకు అతీతంగా హిందువులు ఐక్యంగా ఉన్నప్పుడే ధర్మరక్షణ సాధ్యమవుతుందని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి అన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల వేడుకల్లో భాగంగా గని ఆత్కూరు వద్ద సోమవారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రపంచ దేశాల్లో భారతదేశం గంగా జలమంత పవిత్రమైనదని ఆయన అన్నారు. ప్రపంచానికి నాగరికత తెలియని రోజుల్లోనే మన దేశంలో నాగరికత ఉందని చెప్పారు. ఈ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ హిందువే అని.. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. భారతదేశ గమనంలో ఆర్ఎస్ఎస్ పోషించిన పాత్రను విజయవాడ మహానగర్ ప్రచారక్ హనుమంత్ వివరించారు. దేశ రక్షణకు, ధర్మ పరిరక్షణకు ఆర్ఎస్ఎస్ కృతనిశ్చయంతో ఉందని అన్నారు. మంత్ర స్వరూప్ దాస్ స్వామిజీ, కృష్ణ మూర్తి స్వామిజీ హిందూ ధర్మ విశిష్టత, గత వైభవం, భవిష్యత్తులో ధర్మ రక్షణకు పాటించాల్సిన విధానాలను వివరించారు. సమావేశానికి ముందు హిందూ సంఘాల ఆధ్వర్యంలో పరిటాల నుంచి భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.

విధుల్లో నిర్లక్ష్యం.. సిబ్బందికి షోకాజ్ నోటీసులు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరులోని ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలలో వైద్య సిబ్బంది నిర్లక్ష్య వైఖరిపై చర్యలు తీసుకున్నట్లు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి మాధవి తెలిపారు. ఆసుపత్రిని ఆమె సోమవారం సందర్శించి పలువురు సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ఈ నెల 20న స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైకాపా నాయకులు రక్తదాన శిబిరం పేరుతో జరిపిన బలప్రదర్శన ఘటనకు సంబంధించి, ఆ రోజు విధుల్లో నిర్లక్ష్యం చూపిన అంశాలను గుర్తించి వైద్య సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. దీనికి బాధ్యులైన సిబ్బందిని గుర్తించి తక్షణమే వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఇకపై ఎటువంటి రాజకీయ కార్యకలాపాలు జరపకూడదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎన్టీఆర్ వర్సిటీ జట్టు



జట్టుతో రిజిస్ట్రార్ రాధికరెడ్డి, డైరెక్టర్లు సూర్యప్రభ, సుధ, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి త్రిమూర్తి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు జరిగే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే డాక్టర్ ఎన్టీఆర్ వర్సిటీ జట్టును విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి సోమవారం వెల్లడించారు. ఎంపికైన జట్టు సభ్యులను ఉప కులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ వి.రాధికరెడ్డి, డైరెక్టర్లు ఎంఎల్ సూర్య ప్రభ, కె.సుధ అభినందించారు. జట్టులో ఎస్.తిరుమల వీర రాఘవరావు, బి.హేమ విజయకృష్ణ సాయి ప్రదీప్, ఎం.శ్రీకర్ ప్రసాద్, ఎండీ అహ్మద్ హుస్సేన్, డి.వెంకట సాయి కమల్‌నాథ్, ఆర్.జాకబ్ రాజు, బి.రంజిత్‌కుమార్, ఎ.వెంకటమణి జయంత్, డి.భరత్ భూషణం, డి.క్రాంతిరుద్ర, సూరజ్‌యాదవ్, జి.ప్రథామ్ రతన్ స్థానం సాధించారు. జట్టుకు మేనేజరుగా జె.సిల్వీబాబు (పీడీ, నారాయణ వైద్య కళాశాల, నెల్లూరు), కోచ్‌గా టి.గురునాథం (పీడీ, ఎన్ఆర్ఐ వైద్య కళాశాల, చినకాకాని) నియమితులయ్యారు.

క్లస్టర్ ప్రతిపాదిత విధానాన్ని విరమించుకోవాలి



మాట్లాడుతున్న ఫ్యాప్టో ఛైర్మన్ సాయిశ్రీనివాస్




హాజరైన ఉపాధ్యాయులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : సమగ్ర శిక్షా పీఏబీలో ఆమోదించిన 4034 స్కూల్ కాంప్లెక్స్‌ల్లో రాష్ట్ర ప్రభుత్వం సృష్టించిన పోస్టులను ఏ, బీ క్లస్టర్ ప్రతిపాదిత విధానాన్ని విరమించుకోవాలని.. లేని పక్షంలో అందరినీ విలీనం అయిన క్లస్టర్‌లోనే కొనసాగించాలని ఫ్యాప్టో ఛైర్మన్ సాయ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొన్ని జిల్లాల్లో ఖాళీగా ఉన్న సీఆర్ఎంటీ పోస్టుల్లో 100మీటర్ల దూరం ఉన్న వారిని మ్యాపింగ్ చేసే ప్రక్రియను విరమించి.. ఖాళీగా ఉన్న పోస్టుల్లో నూతన నియామకాలు చేపట్టాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా తక్షణమే వేతనాలు పెంచాలని, జీవో 65 ప్రకారం స్కూల్ అసిస్టెంట్ బేసిక్ వేతనం రూ.44,570 అమలు చేయాలని కోరారు. కేవలం ఒకరి పరిధిలోనే సీఆర్ఎంటీలకు నిర్దిష్టమైన జాబ్ ఛార్ట్ ఇప్పించాలని, విద్యాశాఖలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని, డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలని, ఫేషియల్ అటెండెన్స్ సీఎంఆర్‌టీల పరిధిలోని అన్ని పాఠశాలలల్లో వేసేలా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇతర ఉద్యోగులు మాదిరిగా పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, పదవీ విరమణ వయసు 62ఏళ్లకు పెంచాలని, అనారోగ్యంతో చనిపోతే రూ.10లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఆర్ఎం టీచర్స్ యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు యు.సాయికుమార్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సంఘం అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి, వి.నారాయణమూర్తి, ఇ.రామ్‌జీ ప్రసాద్, ఎం.కాశి, ఎ.పోలినాయుడు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం కేసులో జైలు

విజయవాడ(గాంధీనగర్): ఉద్యోగాలు ఇప్పిస్తామని, డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో నిందితులకు న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నం, చోడవరం గ్రామానికి చెందిన రెడ్డి గౌతమ్(45), ఇల్లంటి లోచిని(34) దంపతులు విజయవాడ పటమటలో నివసించే వారు. రాజకీయ నాయకులతో వారు దిగిన ఫోటోలు చూపించి.. వివిధ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రజలను నమ్మించేవారు. ఈ విధంగా 2020, సెప్టెంబరు 12వ తేదీన సత్యనారాయపురానికి చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి రెండు దఫాలుగా రూ.4 లక్షలు వసూలు చేశారు. తర్వాత అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చారు. వారు ఉద్యోగంలో చేరేందుకు వెళ్లగా.. అది నకిలీదని తేలింది. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు.. సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.జి.వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి భార్యాభర్తలను అరెస్టు చేశారు. విచారణలో వారిపై నేరం రుజువుకావడంతో నిందితులకు రెండు కేసుల్లో.. ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.8వేల జరిమానా విధిస్తూ విజయవాడ మూడో అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎస్.కె.రహనా తీర్పు చెప్పారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ఎం.డి.సిద్దిక్ అహ్మద్ వాదించారు. సీఎంఎస్ సీఐ జగదీశ్వరరావు, సత్యనారాయణపురం సీఐ లక్ష్మీనారాయణ, అప్పటి ఎస్సై సత్యనారాయణ పర్యవేక్షణలో పది మంది సాక్షులను విచారించారు.

గిరిజన తండాల్లో ఫ్లోరైడ్ నీటి పీడ



కలెక్టర్ లక్ష్మీశకు సమస్య వివరిస్తున్న నాయకులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఎ.కొండూరు మండలంలోని గిరిజన తండాల్లోని బంజారాలు ఫ్లోరైడ్ నీటిబారిన పడి అతి చిన్న వయసులోనే మూత్రపిండ వ్యాధులకు గురై చనిపోతున్నారని అఖిల భారత బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రి నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశను సోమవారం కలిసి, వినతి పత్రం అందజేశారు. చక్రి మాట్లాడుతూ.. దీప్లానగర్ తండా, చైతన్యనగర్ తండా, రేవగుడితండా తదితర ప్రాంతాల్లో తాము పర్యటించి సమస్యలను తెలుసుకున్నట్టు చెప్పారు. ఎ.కొండూరులో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ సంక్రాంతికల్లా కృష్ణా జలాలను కుళాయిల ద్వారా అందించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు జటావత్ బాలాజీ నాయక్, జ్యోతిలాల్ నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ దొర స్వామి నాయక్, ఉపాధ్యక్షులు శ్రీనివాస నాయక్, ఎస్.నాయక్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్థులతో చర్చిస్తున్న డీపీవో లావణ్య కుమారి

కలెక్టరేట్‌కు చేరిన పాత రేపూడి పంచాయతీ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఎ.కొండూరు మండలం పాత రేపూడిని ప్రత్యేక పంచాయతీ చేయాలని ఆ గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో జాప్యాన్ని సహించేది లేదని, తక్షణమే ప్రక్రియను చేపట్టేలా చూడాలని నగరంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం పట్టుబట్టారు. గ్రామస్థులతో డీపీఎం పి.లావణ్య కుమారి సంప్రదింపులు జరిపారు. ప్రజలు ఆందోళనకు దిగాలని సిద్ధమవడంతో.. పోలీసులు రంగప్రవేశం చేసి వారిని శాంతింపచేశారు. గ్రామస్థులు కటారి కోటేశ్వరరావు తదితరులు కలెక్టర్ జి.లక్ష్మీశతో చర్చించి న్యాయం చేయాలని కోరారు.

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

పీజీ హాస్టల్‌లో మాదకద్రవ్యాలు.. ఐదుగురి అరెస్టు

హైదరాబాద్ (రాయదుర్గం), న్యూస్‌టుడే: గచ్చిబౌలి అంజయ్య నగర్‌లోని ఓ పీజీ హాస్టల్‌లో డ్రగ్స్ దందా వెలుగు చూసింది. రాజేంద్రనగర్ ఎస్వోటీ, రాయదుర్గం పోలీసులు తనిఖీలు చేపట్టి ఐదుగురిని అరెస్టు చేశారు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా పెద్దపారిపూడికి చెందిన కంభం వంశీ, చీరాల వాసి మదగాని బాలప్రకాశ్, విజయవాడ నివాసి అలీమ్, అనంతపురానికి చెందిన కార్తిక్‌లు.. బెంగళూరు నుంచి మాదకద్రవ్యాలు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. అంజయ్య నగర్‌లోని పీజీ హాస్టల్‌లో వంశీ, బాలప్రకాశ్‌లు మకాం వేసి మాదకద్రవ్యాల అమ్మకాలు సాగిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో సోమవారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. వంశీ, బాలప్రకాశ్‌తో పాటు డ్రగ్స్ కొనుగోలు చేసిన గచ్చిబౌలికి చెందిన మణికంఠ మచ్చు అలియాస్ మణితేజ, మూసాపేటకు చెందిన చామకూరి రోహిత్ గౌడ్, నార్సింగి నివాసి ఎం.తరుణ్‌లను అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.1.50 లక్షల విలువైన 12 గ్రాముల ఎండీఎంఏ, 8 గ్రాముల ఓజీ కుష్ (గంజాయి మాదిరి) స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరులో ఉండే ఓ నైజీరియన్ నుంచి అలీమ్ డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నాడని, తొలుత కార్తిక్, బాలప్రకాశ్, వంశీల ద్వారా విజయవాడకు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకొస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలీమ్, కార్తిక్, నైజీరియన్ పరారీలో ఉన్నారు.

ఏఐడబ్ల్యూజేఏ నూతన కమిటీ ఎన్నిక



కార్యవర్గ సభ్యులకు నాయకుల సన్మానం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఆలిండియా వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏఐడబ్ల్యూజేఏ) రాష్ట్ర నూతన కమిటీని సోమవారం రైల్వేస్టేషన్ సమీపంలోని ఓబీసీ సంఘం కార్యాలయంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పి.సత్యనారాయణరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.కిరణ్‌కుమార్, అధ్యక్షుడిగా ఎం.సుబ్రహ్మణ్య శాస్త్రి, ఉపాధ్యక్షులుగా మేడా కృష్ణ, దుర్గాసి రవి, ప్రధాన కార్యదర్శిగా ఎల్.స్వామినాథన్ ఎన్నికయ్యారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఐక్యంగా కృషి చేయాలని అధ్యక్షుడు పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు జర్నలిస్టులకు ప్రతి నెలా గౌరవవేతనం లభించేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సభ్యులు వేణు, అప్పాజీ, ఖాసిం, శ్రీనివాస్, పవన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

◆ తాతకుంట్ల కమ్మటూరు ఏరియాలో చెత్త పేరుకుందని స్థానికులు సమస్యను 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈవో గోపాలకృష్ణ స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించారు. ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

◆ తిరువూరు 13వ వార్డులోని డ్రెయిన్లలో మట్టి, బురద పేరుకుందని స్థానికుడు అశోక్ కుమార్ సమస్యను 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మున్సిపల్ శానిటరీ అధికారి స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

? కుంటముక్కల పంచాయతీ కార్యాలయం సమీపంలోని బోరు మరమ్మతులకు గురైంది. తక్షణమే నీటి సరఫరా పునరుద్ధరించాలి. **- నవీన్ గ్రామస్థుడు** ✔ సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయిస్తాం. **- మురళీ పంచాయతీ కార్యదర్శి** – న్యూస్‌టుడే, జి.కొండూరు

? కొండపల్లి కోటయ్య నగర్‌లో కొన్ని నెలలుగా కోతుల సమస్య తీవ్రంగా ఉంది. **- సాంబశివరావు, దుర్గారావు, స్థానికులు** ✔ ఆయా ప్రాంతాల్లో పరిశీలన చేసి చర్యలు తీసుకుంటాం. **- వెంకటరత్నం, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్, చిట్టిబాబు, ఛైర్మన్**

? కొండపల్లి 18వ డివిజన్‌లో విద్యుత్తు స్తంభాలు లేవు. **- వెంకటేశ్వరరావు** ✔ ఆ వార్డులో ఎన్ని స్తంభాలు అవసరమో ఇప్పటికే సిబ్బంది గుర్తించారు. త్వరలో ఏర్పాటు చేయిస్తాం. **- చిట్టిబాబు, ఛైర్మన్** – న్యూస్‌టుడే, కొండపల్లి

మెట్ట పంటలకు నష్టపరిహారం చెల్లించండి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విజయవాడ గ్రామీణ మండలం కొత్తూరు తాడేపల్లిలోని పొలాలకు కొన్నేళ్లుగా తారకరామ ఎత్తిపోతల పథకం కింద సాగునీరు అందిస్తున్నారు. మెట్ట కింద మొక్కజొన్న సాగు చేసుకుంటున్నాం. కానీ జలవనరుల శాఖ అధికారులు కౌలు రైతులకు మాగాణి పంటలకు నీరు అందిస్తున్నారని, ఆ గ్రామ రైతు ప్రముఖురాలు అలిగినేని శ్రీపద్మ విజయవాడలోని కలెక్టరేట్‌లో సోమవారం అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జలవనరుల శాఖ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కారణంగా మెట్ట పంట ఆదాయాన్ని కోల్పోతున్నాం. ఈ క్రమంలో తమకు జరిగిన నష్టాన్ని జల వనరుల శాఖ ద్వారా భర్తీ చేసేలా చూడాలని ఆమె రాత పూర్వకంగా విన్నవించారు.

అయ్యప్ప స్వామి పడిపూజ

జగ్గయ్యపేట గ్రామీణం: స్థానిక విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య, మున్సిపల్ మాజీ ఛైర్మన్ బద్రినారాయణ సోదరుల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు


మెటీరియల్ అందుకున్న విద్యార్థులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను దాత వైభవ్ జ్యువెలర్స్ అధినేత కేవీ.నాగేశ్వరరావు సహకారంతో స్థానిక సెయింట్ థెరిస్సా పాఠశాల విద్యార్థులకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, బాగా చదివి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సరిత, యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.చంటిబాబు, ఎ.మురళీకృష్ణ, బి.విజయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవ తప్పిదం..అవగాహనతోనే దూరం

గుంటుపల్లి, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

చిన్న చిన్న కారణాలతోనే రహదారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎక్కువ శాతం మానవ తప్పిదాలతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. విజయవాడ పోలీసు కమిషనరేట్ పరిధిలో కొందరు ప్రాణాలు కోల్పోతుండగా మరెందరో క్షతగాత్రులు అవుతున్నారు. రోడ్డు ప్రమాదాలు వ్యక్తిగత నిర్లక్ష్యంతోనే చోటు చేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. వీటిని నివారించాలంటే 'డిఫెన్స్ డ్రైవింగ్' మేలని ట్రాఫిక్ పోలీసులు వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నారు. వాహనం నడపడంలో మెలకువలు కాదు.. నా వల్ల ఇతరులకు ప్రమాదం జరగకుడదు. ఎవరి వల్ల నేను ప్రమాదానికి గురి కాకూడదు. ఇదే ఆలోచనలతో వాహనం నడపాలి. ఎదుటి వాహనం ఎంత వేగంతో వస్తోంది అన్నది గమనించాలి. ముందు వెళ్తున్న వాహనానికి ఎంత దూరంలో వెళ్లాలి అన్నది అంచనా ఉండాలి. ఈ విషయాన్ని పరిగణనలోనికి తీసుకొని వాహనం నడపడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు సూచిస్తున్నారు.


వాహన చోదకులతో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్, పక్కన ఎస్సై లక్ష్మణ్

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ద్విచక్ర వాహనదారులు ఐఎస్ఐ మార్కు ఉన్న శిరస్త్రాణం ధరించాలి. కారు, భారీ వాహనాలు నడిపేవారు తప్పకుండా సీటు బెల్ట్ పెట్టుకోవాలి. కాలనీ, గ్రామాలు, సర్వీసు రోడ్లల నుంచి జాతీయ రహదారిపైకి వచ్చేటప్పుడు నెమ్మదిగా రావాలి. ముందు వాహనం ఆగితే పక్క నుంచి వెళ్లకుండా ఆగాలి. యూటర్న్ తీసుకునే సమయంలో ఇండికేటర్లు ఉపయోగించాలి. రోడ్డుపై ఎడమ వైపు నుంచి డ్రైవింగ్ చేయడం మేలు. దీంతో వేగంగా వెళ్లే వాహనాలు కుడి వైపు నుంచి వెళ్తాయి. రహదారిపై ఉండే లైన్లు వేగ నిరోధకాలు, వేగ నియంత్రణ సూచనలు అనుసరించాలి. చరవాణిలో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదు.

భూసేకరణలో అంకెల గారడీ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : భూసేకరణలో అధికారుల అంకెల గారడీ ఓ మహిళకు సంకటంగా మారింది. దీంతో బ్యాంకు రుణం పొందలేక పోతోంది. జి.కొండూరు మండలం కవులూరు గ్రామానికి చెందిన ఆలూరి వెంకట దుర్గాలక్ష్మికి 2.82 ఎకరాల భూమి ఉండేది. ఈ నేపథ్యంలో తారకరామ కాల్వ కోసం 1.73 ఎకరాలను సేకరించారు. దీంతో 1.09 ఎకరాల భూమి మిగిలింది. ఆమె బ్యాంకు రుణం కోసం దరఖాస్తు చేస్తే 53 సెంట్లు మాత్రమే ఉన్నట్టు తేలింది. మిగతా భూమి ఏమైపోయిందో తేల్చాలని విజయవాడలోని కలెక్టరేట్‌లో సోమవారం వినతి పత్రం సమర్పించింది.

అభివృద్ధి చెందుతున్న గొల్లపూడి


కార్యక్రమంలో శాసన సభ్యులు వెంకట్రావు, వసంత కృష్ణప్రసాద్

గొల్లపూడి, న్యూస్‌టుడే : గొల్లపూడిలో ఏర్పాటు చేసిన అలంకార్ స్వీట్స్, బేకరీని గన్నవరం, మైలవరం శాసన సభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, వసంత కృష్ణప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న గొల్లపూడి ప్రాంతంలో అలంకార్ బేకరీని ప్రారంభించడం సంతోషంగా ఉందని చెప్పారు. దుకాణ యాజమాన్యానికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్రా వాసు, మాజీ ఎంపీపీ జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చిలుకు ఉత్సవం


పెనుగొలనులో రంగనాయక స్వామి


తిరువూరు వేంకటా చలస్వామి గుడిలో గోపికా వేషధారణతో మహిళలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ధనుర్మాసం సందర్భంగా తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లోని వైష్ణవాలయాల్లో సోమవారం చిలుకు ఉత్సవం నిర్వహించారు. మహిళలు గోపికల వేషధారణతో కుండలోని పెరుగును కవ్వంతో చిలుకుతూ సందడి చేశారు. అర్చకులు, భక్తులు గోదాదేవి తిరుప్పావై పాశురాలు పఠించి, భజనలతో ఆండాళ్ రంగనాయకుల మూలవిరాట్‌ను పూజించారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఎ.కొండూరు, తిరువూరు, గంపలగూడెం మండలాల్లోని శివాలయాల్లో సోమవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తరించారు. కొత్తపల్లి, పెనుగొలను, మేడూరు, కంభంపాడు, తిరువూరులోని శివాలయాల్లో శివనామస్మరణ చేశారు.

రైతు అవగాహన సదస్సు నేడు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేట శాఖ ఆధ్వర్యంలో స్థానిక సంస్థ కార్యాలయం నందు రైతు అవగాహన సదస్సు జరుగుతుందని క్లబ్ అధ్యక్షురాలు రాయల అరుణకుమారి, కార్యదర్శి తుమ్మూరు జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'పథకం పేరు మార్పు తగదు'



విస్సన్నపేటలో సీపీఎం శ్రేణుల నిరసన

విస్సన్నపేట, న్యూస్‌టుడే : వికసిత్ భారత్ జీ రామ్ జీ చట్టం ఉపసంహరించుకోవాలని విస్సన్నపేటలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదలకు వరమని, కానీ ఈ పథకాన్ని పక్కదోవ పట్టిస్తూ గాంధీ పేరును తొలగించి వీబీ- జీ రాం జీ అని తీసుకురావడం దుర్మార్గమన్నారు. మేకల జ్ఞానరత్నం, గద్దల రామకృష్ణ, చిట్టిబాబు, కొండ, ఆకుల శ్రీనివాసరావు, అప్పారావు, గంజినబోయిన రాము తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా రాకపోకలు నిర్వహించండి


క్రషర్ యజమానులకు నోటీసు అందిస్తున్న ట్రాఫిక్ ఎస్సైలు

ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, న్యూస్‌టుడే : కంకర లోడుతో వెళ్లే లారీలు ప్రమాదాలకు కారణంగా మారాయి అంటూ 'ఈనాడు'లో ఈ నెల 19న ప్రచురితమైన 'హద్దులు లేని వేగం.. ప్రమాదాలు అధికం' కథనానికి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఎస్సైలు కృష్ణ, లక్ష్మణరావు ఇబ్రహీంపట్నం, కంచికచర్ల ప్రాంతాల్లోని క్రషర్ యజమానులకు నోటీసులు అందించారు. లారీల్లో అధిక లోడు వేయకుండా నిబంధనల ప్రకారం రవాణా చేసుకోవాలని సూచించారు. దీంతో పాటు పశ్చిమ బైపాస్‌లోనే రాకపోకలు సాగించాలన్నారు. రహదారులపై ఎక్కడా కంకర పడకుండా చూడాలని కోరారు.

ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో రక్షణ చర్యలు అవసరం


ఎంపీడీవోకి అర్జీ అందిస్తూ..

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కొండపర్వ అడ్డరోడ్డు నుంచి విస్సన్నపేట వరకు ఉన్న ప్రధాన రహదారిలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, అనేక మంది గాయపడటంతో పాటు ప్రాణాలు కోల్పోతున్నారని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానికులు ఫిర్యాదు చేశారు. సామాజిక కార్యకర్త బొట్ల శివ సత్యనారాయణ, గ్రామస్థులు రామానుజన్ సందీప్, అక్కిరెడ్డి ఉమామహేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో చేకు చిన్న రాట్నాలుకు వినతి పత్రం ఇచ్చారు. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి


చంద్రగూడెం హైస్కూల్లో బహుమతులు చూపుతున్న విద్యార్థులు


కొండపల్లిలో గణిత నమూనాలు ప్రదర్శిస్తూ..

దేశ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని సోమవారం తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని పలు పాఠశాలల్లో గణిత ప్రదర్శన, విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. తొలుత రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **- న్యూస్‌టుడే, బృందం**


తిరువూరులో..


జి.కొండూరు వివేకానంద పాఠశాలలో..


కాచవరంలో చిత్రపటాలు చూపుతున్న చిన్నారులు

తుప్పుపడుతున్నాయ్..!



వైకాపా హయాంలో నివేశన స్థలాలు కేటాయించి ఏర్పాటు చేసిన కాలనీల్లో సగానికి పైగా ప్లాట్లు నేటికీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అనర్హులకూ ప్లాట్లు దక్కడం, పేదరికంతో నిర్మించుకోక పోవడం వంటి ఇబ్బందులతో కొంత వరకు ఖాళీగానే ఉన్నాయి. మరికొందరు ఆక్రమణలకు వెరసి పునాదులు వేసి వదిలేశారు. దాంతో పిల్లర్ల చువ్వలు తుప్పుపడుతుండటంతో, స్థానిక పూరగుట్ట కాలనీలోని కొందరు వాటికి ఖాళీ ప్లాస్టిక్ డబ్బాలను తొడిగారు. వర్షాలకు తడవకుండా, తుప్పు నుంచి కాపాడుకోవడానికే ఈ ఆలోచన చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

ఎవరు చెప్పినా.. వినేదే లేదు



వరి పొలాల్లో వ్యర్థాలను కాల్చొద్దని, ఎవరెంత చెప్పినా క్షేత్ర స్థాయిలో మార్పు కనిపించడం లేదు. ఒకప్పుడు ధాన్యం నూర్పుగా వచ్చే వరిగడ్డి ఏపుగా ఉండటంతో నిల్వ చేయడానికి తేలికగా ఉండేది. క్రమేపీ నూర్పిళ్లకు యాంత్రీకరణ పెరగడంతో గడ్డి కాస్తా ముక్కలవుతోందని, దాన్ని సేకరించడానికి ఖర్చవుతోందని ఎక్కడికక్కడే తగలబెడుతున్నారు. అది పర్యావరణానికి ప్రమాదంతో పాటు నేలపైనా ప్రభావం చూపుతుందని, కాల్చొద్దంటూ విజ్ఞప్తులు వస్తున్నాయి. అయినా చాలా గ్రామాల్లో ఇప్పటికీ మిగిలిన గడ్డిని తగలబెడుతూనే ఉన్నారు. మండలంలోని చంద్రగూడెంలో పలువురు రైతుల పొలాల్లో కాల్చగా మిగిలిన మసే కనిపిస్తోంది. **- న్యూస్‌టుడే, మైలవరం**

వినియోగంలో లేవు.. అవస్థలు తీరవు



ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని గ్రామాల కూడళ్ల వద్ద పశువులతో పాటు వాహనాల అపసవ్య దిశ రాకపోకలను నివారించేందుకు 'క్యాటిల్ పాస్ వే'లను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. జాతీయ రహదారుల సంస్థ ఇబ్రహీంపట్నం, మూలపాడు, కేతనకొండ వద్ద వీటిని నిర్మించింది. ఈ క్రమంలో అనుసంధాన రోడ్ల నిర్వహణ లేకపోవడంతో ముళ్ల పొదలు చెత్త చెదారాలతో నిండి రాకపోకలు అనుకూలంగా లేవు. గ్రామ కూడళ్ల వద్ద అపసవ్య దిశ రాకపోకలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్న తరుణంలో 'క్యాటిల్ పాస్ వే'ల అనుసంధాన రోడ్లను అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**

బోధనోపకరణాల పాత్ర కీలకం


బహుమతులు సాధించిన వారితో దాత హనిమిరెడ్డి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఫణికుమార్ తదితరులు

మైలవరం, న్యూస్‌టుడే : బోధనలో బోధనోపకరణాల పాత్ర కీలకమని స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి ఎం.దేవానంద్ కుమార్ పేర్కొన్నారు. కళాశాలలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించిన కార్యశాల సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా బోధనోపకరణాల పాత్రను పలువురు వివరించారు. వివిధ అంశాల్లో ప్రతిభ చాటిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల దాత హనిమిరెడ్డి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఫణికుమార్, అధ్యాపకులు రాముడు, టి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాల సాధనకు నూతన కమిటీ కృషి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఉద్యోగుల సంక్షేమం, ఐక్యత, సమాన అవకాశాల సాధనలో ఎస్సీ, ఎస్టీ సంఘం కీలక పాత్ర పోషించాలని ముఖ్య ఇంజినీరు శివరామాంజనేయులు అన్నారు. ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్టీటీపీఎస్ నూతన కమిటీ సభ్యులను సోమవారం ఆయన పరిచయం చేసుకున్నారు. సమావేశ మందిరానికి వచ్చిన కమిటీ సభ్యులతో ఆయన మాట్లాడారు. సంస్థ అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. సీఈని కలిసిన వారిలో సంఘ కేంద్ర కమిటీ సభ్యులు కల్యాణ్ కుమార్, సోమశేఖర్, నూతన అధ్యక్షుడు మణిబాబు, కార్యదర్శి కృష్ణారావు, సుదీప్‌చంద్, పుష్ప తదితరులు ఉన్నారు.

ఇంటింటా పోలియో చుక్కల పంపిణీ

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో 4,150 మంది చిన్నారులకు చుక్కల మందు వేశారు. మిగిలిన వారికి సోమవారం అంగన్‌వాడీ కార్యకర్త మణిచందన, ఆశా కార్యకర్త సునీత ఇంటింటా తిరిగి చుక్కలు వేశారని పీహెచ్‌సీ వైద్యురాలు తెలిపారు.

తెదేపా ఫ్లెక్సీలు చింపేశారని ఫిర్యాదు

కొణిజెర్ల(గంపలగూడెం): మండలంలోని కొణిజెర్లలో వైకాపా వర్గీయులు ఆదివారం రాత్రి తెదేపా ఫ్లెక్సీలను చింపేశారని పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందింది. జగన్ జన్మదినం సందర్భంగా వైకాపా నిర్వహించిన ప్రదర్శనలో అత్యుత్సాహం ప్రదర్శించి ప్రధాన రహదారిలో గాజు సీసాలు ధ్వంసం చేసి పెంకులు విసిరేశారని, ఆపైన రోడ్డు పక్కనున్న నాలుగు తెదేపా ఫ్లెక్సీలను చింపేశారని తెదేపా గ్రామ అధ్యక్షుడు వాసిరెడ్డి అనిల్ కుమార్ గంపలగూడెం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైకాపా అల్లరి మూకలు రెచ్చగొట్టే విధంగా అనుచిత నినాదాలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

దాడి సంఘటనలో ఇద్దరిపై కేసు

దుందిరాలపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని దుందిరాలపాడులో గ్రామ పంచాయతీ విభజనపై ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు నిర్వహించిన గ్రామ సభలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఎంపీడీవో సరస్వతి ఆదేశాలతో ఆదివారం గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేయగా అధికార పార్టీ వర్గీయులు విభజనకు అనుకూల, ప్రతికూల వర్గాలుగా ఏర్పడి ఘర్షణకు దిగారు. ఈ సంఘటనలో మోదుగు మురళీ, వరప్రసాద్, దారెల్లి వినోద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జెర్రిపోతుల సురేష్, నరేష్‌పై సోమవారం ఎస్సై అనిల్ కేసు నమోదు చేశారు.

అపార్టుమెంట్లలో వరుస చోరీలు

నందిగామ, న్యూస్‌టుడే : స్థానిక శ్రీ రామలింగేశ్వర నగర్‌లోని మూడు అపార్టుమెంట్లలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు చోరీలు చేశారు. స్థానిక శ్రీ సాయి అయ్యప్ప దేవాలయానికి సమీపంలోని నల్లాని టవర్స్‌లో ద్విచక్ర వాహనం చోరీ చేసి.. అది స్టార్ట్ కాకపోగా కొంత దూరం నెట్టుకుంటూ వెళ్లి వదిలేశారు. తేజ, మరో అపార్ట్‌మెంట్‌లో నాలుగు గ్యాస్ సిలిండర్లు ఎత్తుకెళ్లారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


మైలవరం : విద్యార్థులతో రంగారావు

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి పుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.రంగారావు తెలిపారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన కృష్ణా విశ్వవిద్యాలయ అంతర కళాశాలల పోటీల్లో ప్రతిభ చాటిన బీబీఏ మొదటి ఏడాది విద్యార్థులు తరుణ్ కుమార్, జోయి ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 23 నుంచి కాలికట్‌లో జరగనున్న పోటీల్లో వీరు ఆడతారన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్..

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని కంభంపాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని డి.లక్ష్మీదుర్గ రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో తిరువూరు డివిజన్ నుంచి ఆమె పాల్గొన్నారు. వచ్చే నెలలో జరిగే రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయినుల త్రోబాల్ పోటీల్లో జిల్లా జట్టుకు లక్ష్మీదుర్గ ప్రాతినిధ్యం వహిస్తారని మండల క్రీడల సమన్వయాధికారి బి.గోపి సోమవారం తెలిపారు.

అభినందనలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ఎ.కొండూరు మండలానికి ఎనిమిది మంది ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు మండల క్రీడల సమన్వయాధికారి బి.గోపి సోమవారం తెలిపారు. మైలవరంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు బి.గోపి, ఎం.రాజారావు, డి.బుజ్జిబాబు, ఎం.శ్రీను, శివకృష్ణప్రసాద్, వంశీ, జమలయ్య, మహారాష్ట్రరావు ప్రతిభ చాటి వచ్చే నెలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వీరిని మండలంలోని విద్యా శాఖ అధికారులు, డివిజన్‌లోని ఉపాధ్యాయులు అభినందించారు.


క్రికెట్ పోటీలకు ఎంపికైన ఎ.కొండూరు మండల ఉపాధ్యాయులు

నిధులు దుర్వినియోగంపై విచారణ చేయాలని వినతి


ఎంపీడీవో శ్రీనివాసరావుకు ఫిర్యాదు అందిస్తున్న రాణి, జ్యోతి

రేపూడి(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని రేపూడి గ్రామ పంచాయతీలో వైకాపా సర్పంచి వజ్రాల సత్యవేణి నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు గ్రామ వార్డు సభ్యులు కొప్పుల రాణి, గద్దల జ్యోతి ఎంపీడీవో బి.శ్రీనివాసరావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. గత మూడేళ్లలో ప్రభుత్వం గ్రామ పంచాయతీకి మంజూరు చేసిన నిధులు, ఆ సొమ్ము దేనికెంత ఖర్చు చేశారో? విచారణ జరిపించాలని ఎంపీడీవోను కోరారు.

యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షురాలుగా భవాని



యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షురాలుగా రెడ్డిగూడెం మండలానికి చెందిన పి.భవాని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు యూటీఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ప్రకాష్ సోమవారం తెలిపారు. తిరువూరులో ఆదివారం జరిగిన యూటీఎఫ్ నాల్గవ కౌన్సిల్ సమావేశంలో ఆమె ఎన్నికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా మండల శాఖ తరఫున ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

దొంగలొస్తున్నారు.. జాగ్రత్త!

మైలవరం, న్యూస్‌టుడే

సంక్రాంతి వస్తుందంటే గుర్తుకు వచ్చేది పల్లెల్లో కోడి పందేలే. వీటి కోసం పందెం రాయుళ్లు రెండు నెలల ముందు నుంచే కోళ్లను పెంచి సిద్ధం చేసే పనిలో నిమగ్నమవుతారు. అటువంటి వారికి కోళ్ల దొంగలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. పెంచుకున్న వాటిని అర్ధరాత్రి వేళ దొంగిలిస్తున్నారు. ఇటీవల మైలవరం చుట్టు పక్కల రెండు సంఘటనలు చోటు చేసుకోగా వారిని అడ్డుకోవడంలో పెంపకందారులు సఫలమవడంతో దొంగతనాల వ్యవహారం బయటకొస్తోంది.


ఎక్కువ ధర చెల్లించి..


గ్రామాల్లో పెరుగుతున్న కోళ్లు

మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో సంక్రాంతి మూడ్రోజులు పెద్ద ఎత్తున కోడి పందేలు సాగుతుంటాయి. ఈ ఏడాది పందేలు అధికంగా సాగుతాయని భావిస్తున్న గ్రామాల్లో అమ్మకాలకు కొందరు పందెం రాయుళ్లు పెంపకం ఆరంభించారు. బరిల్లో పందెం వేసే పుంజుల ఖరీదు రూ.30 వేల నుంచి రూ.2 లక్షల వరకు ధర పలుకుతోంది. ఆ స్థాయిలో వాటిని మేపుతున్నారు. పందెంలో అవి చనిపోతే వాటిని కొనుగోలు చేసేందుకు ఎక్కువ మొత్తం ధర చెల్లిస్తారు. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా పండగ సమీపించే కొద్దీ కోళ్ల దొంగలు సిద్ధమైపోతున్నారు. పగటి వేళ అమ్మకాల పేరిట వివిధ వేషధారణల్లో తిరిగే మహిళలు ఆరా తీస్తే, రాత్రి వేళల్లో పురుషులు చోరీలకు పాల్పడుతున్నారు. గతంలో అటువంటి ముఠాను మైలవరం ప్రాంతంలో పోలీసులు పట్టుకున్నారు.

యువ బృంద స్ఫూర్తికి క్రీడలు దోహదం

కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య

న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు

యువత చెడు అలవాట్ల బారిన పడకుండా క్రీడలు దోహదపడతాయని కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. కానూరులోని కేపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో జరుగుతున్న 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్-2025' ప్రారంభోత్సవానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ.. 'ఈనాడు' యాజమాన్యం ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల ఇతరులతో సత్సంబంధాలు ఏర్పడతాయని, నాయకత్వ లక్షణాలు, టీమ్ స్పిరిట్ అలవడతాయని తెలిపారు. గెలుపు ఓటములను ప్రధానంగా తీసుకోకుండా క్రీడా స్ఫూర్తితో తలపడాలని సూచించారు. స్కూల్ కరస్పాండెంట్ వీరపనేని శశికళ మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు చదువులో బాగా రాణించవచ్చని అన్నారు. జిల్లా స్థాయి ప్రాయోజకులు జీజీయు విజయవాడ శాఖ మేనేజర్ ఆర్.శైలజ, ప్రాంతీయ స్థాయి ప్రాయోజకులు చలపతి ఇన్‌స్టిట్యూషన్స్ డీన్ డాక్టర్ కె.కిరణ్, రాష్ట్ర స్థాయి ప్రాయోజకులు ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, విజయవాడ అకాడమిక్ డైరెక్టర్ ఎ.రాంబాబు మాట్లాడుతూ.. విద్యార్థులు ఆటలతో పాటు చదువులో కూడా రాణించాలని సూచించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం చదువుతో పాటు క్రీడలు అవసరమని అన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమ అధ్యక్షత వహించిన 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్.కె.కిశోర్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ ఏడాది 15వ ఎడిషన్ నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులను ఎస్పీ పరిచయం చేసుకొని టాస్ వేసి పోటీలు ప్రారంభించారు. సోమవారం జరిగిన మ్యాచ్‌ల వివరాలు ఇలా ఉన్నాయి.



జూనియర్ విభాగంలో విజేతగా నిలిచిన ఎస్‌ఆర్‌ఆర్ జట్టు

● జూనియర్ విభాగంలో ఎస్‌ఆర్‌ఆర్ జూనియర్ కళాశాల జట్టు 36 పరుగుల ఆధిక్యంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన పాలిటెక్నిక్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకొంది. బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌ఆర్‌ఆర్ జట్టు నిర్ణీత పది ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 92 పరుగులు చేసింది. జె.సాయిరామ్ చరణ్ 26 బంతుల్లో ఒక సిక్సర్, 2 బౌండరీలతో 33 పరుగులు చేశాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన పాలిటెక్నిక్ జట్టు నిర్ణీత పది ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి కేవలం 56 పరుగులకే పరిమితమైంది. జె.సాయిరామ్ చరణ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్



జె.సాయిరామ్ చరణ్



సీనియర్స్ విభాగంలో విజేతగా నిలిచిన కేబీఎన్ కళాశాల జట్టు

● సీనియర్స్ విభాగంలో కేబీఎన్ కళాశాల జట్టు 8 వికెట్ల తేడాతో ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన కేబీఎన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకొంది. బ్యాటింగ్‌కు దిగిన ధనేకుల కళాశాల జట్టు నిర్ణీత పది ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 81 పరుగులు చేసింది. సాయి గణేష్ 37 పరుగులతో క్రీజ్‌లో నిలిచాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన కేబీఎన్ జట్టు 8.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. వి.మహేంద్ర 27 బంతుల్లో 6 సిక్సర్లు, 3 బౌండరీలతో 57 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్



వి.మహేంద్ర

నేటి మ్యాచ్‌ల వివరాలు		
ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల X పీవీపీ ఇంజినీరింగ్ కళాశాల	ఎస్‌డీఎంఎస్ న్యాయ కళాశాల X వాసవి ఇంజినీరింగ్ కళాశాల	ప్రభుత్వ దంత కళాశాల X నిమ్రా ఇంజినీరింగ్ కళాశాల
మొదటి మ్యాచ్	రెండో మ్యాచ్	మూడో మ్యాచ్

సైబర్ భద్రతపై సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలి



ల్యాబ్ ప్రారంభ కార్యక్రమంలో శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు

కానూరు, న్యూస్‌టుడే: సైబర్ నేరాలు పెరుగుతున్న ఈ తరుణంలో సైబర్ భద్రతపై యువత నైపుణ్యాలు పెంపొందించుకోవాలని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం కృష్ణా జిల్లా కానూరు సిద్ధార్థ డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయంలో కేవీరావు సైబర్ సెక్యూరిటీ డిజిటల్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రయోగశాల సైబర్ నేరాలను నియంత్రించడంలో దోహద పడుతుందని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నప్పటికీ నేరాలు, డీప్ ఫేక్ కూడా పెరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో సైబర్ ఫోరెన్సిక్ కేంద్రం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సిద్ధార్థ విద్యాసంస్థలు నెలకొల్పి 50 ఏళ్లు కావటం సంతోషంగా ఉందన్నారు. ల్యాబ్ ఏర్పాటుకు కాకినాడ సీ పోర్ట్ ప్రైవేటు లిమిటెడ్ సీఎండీ కేవీరావు రూ.1.36 కోట్లు ఇవ్వటం అభినందనీయమన్నారు. నేటి రాజకీయాలు దిగజారిపోయాయని, మంచి భవిష్యత్తు నిమిత్తం యువత రాజకీయాల్లోకి రావాలని సూచించారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ అందరూ సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవాలన్న ఉద్దేశంతో కేవీరావు అద్భుతమైన ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా కేవీరావును వారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగుల క్ష్మణ రావు, ఉప కులపతి పి.వెంకటేశ్వరరావు, ఏవీ రత్నప్రసాద్, సీవీరావు, సీహెచ్ రాజేశ్వరరావు, రవిచంద్ పాల్గొన్నారు.

జనవరిలో కల్యాణ ఉత్సవాలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై నటరాజస్వామి ఆలయ ప్రాంగణంలో 2026 జనవరి 2 నుంచి 4 వరకు ఆరుద్రోత్సవ కల్యాణ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ● జనవరి 2న ఉదయం 8 గంటలకు శివకామ సుందరి సమేత నటరాజస్వామి వార్ల ఉత్సవ మూర్తులకు మంగళ స్నానాలు, వధూవరులుగా అలంకరణ. ● సాయంత్రం 4 గంటలకు అంకురార్పణ, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ కార్యక్రమాలను రుత్విక్కులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ● 3న ఉదయం 8 నుంచి 11, సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు మండప పూజలు, మూల మంత్ర హవనాలు రాత్రి 6 గంటలకు రాజగోపురం కిందిభాగంలో శివకామ సుందరి సమేత నటరాజస్వామి వార్ల దివ్య లీలా కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహిస్తారని తెలిపారు. ● రాత్రి 10 నుంచి 11 గంటల వరకు నటరాజస్వామి వార్లకు ఆరుద్రోత్సవం(అభిషేకం, అన్నాభిషేకం), 4న ఉదయం 4 గంటలకు భక్తులకు ఉత్తర ద్వారా దర్శనం, 10 గంటలకు పూర్ణాహుతి, ధ్వజావరోహణం, సాయంత్రం 4.30 గంటలకు ఉత్సవ మూర్తులకు నగరోత్సవంతో కల్యాణ ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే ఎన్జీవో సంఘం లక్ష్యం



ప్రదర్శనలో పాల్గొన్న విద్యాసాగర్, ఉద్యోగులు తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ఉద్యోగుల సంక్షేమం లక్ష్యంగా ఏపీ ఎన్జీవో సంఘం పనిచేస్తుందని, సమస్యల పరిష్కారంలో వెనకడుగు వేయబోమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ పేర్కొన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ విజయవాడ నగర శాఖ నూతన కార్యవర్గ ఎన్నికల సమావేశం గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ర్యాలీలో ఉద్యోగులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘం అలుపెరగని పోరాటాలు ఎన్నో చేసిందని గుర్తు చేశారు. డిమాండ్ల సాధనకు ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన ప్రతి పోరాటంలోనూ విజయవాడ శాఖ ముఖ్యపాత్ర పోషించి విజయాలు సాధించిందన్నారు. నగర శాఖలో సేవలందించిన ఎంతో మంది అగ్ర నాయకులుగా ఎదిగారని, ఉద్యోగులకు వారు అందించిన సేవలే అంకిత భావం దీనికి కారణమన్నారు. గత ప్రభుత్వంలో అపరిష్కృతంగా ఉన్న ఎన్నో సమస్యలను ప్రస్తుత ప్రభుత్వం దశల వారీగా పరిష్కరించేందుకు ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. ప్రధానంగా ఆర్థిక సమస్యలు, వైద్య సేవల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించే దిశగా ప్రభుత్వం వేగంగా స్పందిస్తున్నారు. 12వ పీఆర్సీ ఏర్పాటు, డీఏ బకాయిల విడుదల, ఉద్యోగ ఉపాధ్యాయ పింఛనర్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల నోషనల్ ఇంక్రిమెంట్లు, పింఛనర్లకు అడిషనల్ క్వాంటం పునరుద్ధరణ వంటి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టామని వివరించారు. వీటిపై ప్రభుత్వం నుంచి త్వరలో సానుకూల స్పందన వస్తుందని విద్యాసాగర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎనిమిది దాటితే బస్సు ఆపరంతే..



వారధి వద్ద రోడ్డు మధ్యలో నిలిపిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: 'చెయ్యి ఎత్తండి.. బస్సు ఎక్కండి' అనేది ఏపీఎస్ఆర్టీసీ నినాదం. ప్రస్తుతం ఈ నినాదానికి కొందరు వాహన చోదకులు తూట్లు పొడుస్తున్నారని కొందరు ప్రయాణికులు వాపోతున్నారు. ● వారధి వద్ద రాత్రి 8 గంటలు దాటిన తర్వాత ప్రయాణికులు ఉన్న గుంటూరు వైపు వెళ్లే బస్సులు చాలా వరకు ఆపడం లేదు. రాత్రి సమయంలో గంటల తరబడి బస్సుల కోసం వేచి ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ● ఆర్టీసీ బస్సుల కోసం రాత్రి సమయంలో నిలిచి ఉండే జాగా లేకుండా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు విచ్చలవిడిగా వారధి వద్ద జాతీయ రహదారిని ఆక్రమించి నిలుపుతున్నా విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ● సమయానికి వెళ్లాలని ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తే అధిక ధరలతో ప్రయాణించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ● దూర ప్రాంత ప్రయాణికులు ఉన్నా సంబంధిత సర్వీసులు వచ్చినా, బస్సులు ఖాళీగా వెళ్తున్నా ఇక్కడ ఆపడం లేదని, కొందరు ఆపినా గుంటూరు వరకు ఎక్కించుకోవడం లేదని ప్రయాణికురాలు ఆర్ఎస్ వేద ఆవేదన వ్యక్తం చేశారు.

ఫిర్యాదులు చేయవచ్చు..

ఈ విషయమై డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఆపరేషన్స్ సాయి చరణ్ తేజను అడుగగా.. ప్రయాణికులు నిర్ణీత బస్‌స్టాప్‌లో ఉంటే కచ్చితంగా బస్సులు ఆపాలి. సమస్య ఎదురైతే బస్సు సర్వీసు నంబరు, సమయం వివరాలతో సంబంధిత బస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఎంబీబీఎస్ యాజమాన్య సీట్లకు ఐచ్ఛికాలు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత (2025-26) విద్యాసంవత్సరానికి రాష్ట్రంలోని పలు వైద్య కళాశాలల్లో మూడో విడత కౌన్సెలింగ్ అనంతరం భర్తీకాని ఎంబీబీఎస్ యాజమాన్య సీట్లకు 'స్ట్రే' వేకెన్సీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించింది. అర్హత కలిగిన నీట్ యూజీ రాసిన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి 26వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోగా ఐచ్ఛికాలు ఇవ్వాల్సి ఉంటుంది. పుత్తూరులోని అన్నాగౌరీ వైద్య కళాశాలలో 5, కడప ఫాతిమా మెడికల్ సైన్సెస్‌లో 5, ఇబ్రహీంపట్నం నిమ్రా వైద్య కళాశాలలో 4.. మొత్తం 14 ఎన్నారై 'సి' కేటగిరీ సీట్లు అందుబాటులో ఉంచారు.

పవన్ కల్యాణ్ ఫొటో మార్ఫింగ్

'ఎక్స్'లో దుష్ప్రచారం

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోను మార్ఫింగ్ చేసి.. దాని సాయంతో 'ఎక్స్'లో దుష్ప్రచారం చేస్తున్న సోషల్ మీడియా హ్యాండ్లర్‌పై విజయవాడ సైబర్ క్రైం పోలీసులు ఈ నెల 20న కేసు నమోదు చేశారు. జనసేన పార్టీ విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు పొదిలి దుర్గారావు.. సామాజిక మాధ్యమాల్లో కూటమి ప్రభుత్వ పాలనపై వచ్చే కామెంట్లను పరిశీలిస్తూ ఉంటారు. ఈ నెల 20న 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా చూస్తున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి.. 'సుధీర్ హోలిక్ 1'లో పవన్ కల్యాణ్ ఫొటోను మార్ఫింగ్ చేసి పోస్టింగ్ పెట్టినట్లు గుర్తించారు. సదరు ఫొటో పవన్ కల్యాణ్ అభిమానులను తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. దీనిపై దుర్గారావు.. సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉద్ధృతం



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: సహకార శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని పలువురు నాయకులు హెచ్చరించారు. తమ డిమాండ్ల సాధనలో భాగంగా ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు సోమవారం మచిలీపట్నంలోని కేడీసీసీ బ్యాంకు ఎదుట నిరసన చేపట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ 2019 తరువాత సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఐదేళ్లకోసారి వేతన సవరణ చేయాల్సి ఉండగా ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. 2019, 2024కు సంబంధించి వేతన సవరణ చేయాలని, అప్పటివరకు మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. జీవో నంబరు 36 తక్షణం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న 62 ఏళ్లకు పదవీ విరమణ సహకార ఉద్యోగులకు వర్తింపజేయలని కోరారు. ప్రతి ఉద్యోగికీ రూ.20లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ చేయించాలని, తమ డిమాండ్లు పరిష్కరించకుంటే దశలవారీగా ఉద్యమం ఉద్ధృతం చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా, రాష్ట్ర నాయకులు జీఎన్వీ రామారావు, ఎల్వీ చక్రవర్తి, టీపీఎస్ హనుమంతరావు, బొల్లినేని రఘురామ్, జె.రామాంజనేయులు, కొండల్ల శర్మ, నరసింహారావు, ఎన్.శ్రీనివాసరావు, సీహెచ్ రవికుమార్, తోట కృష్ణారావు, వైవీవీ రామారావు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. వామపక్ష నాయకులు బూర సుబ్రహ్మణ్యం, లింగం ఫిలిప్ తదితరులు సంఘీభావం ప్రకటించారు.

'కొత్త బైపాస్ అలైన్‌మెంట్ అవసరం లేదు'



కలెక్టరేట్ ఆవరణలో రైతులు, గ్రామస్థులతో మాజీ మంత్రి వడ్డే

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విజయవాడ-హైదరాబాద్ 65వ నంబరు జాతీయ రహదారిలో పరిటాల నుంచి ఇబ్రహీంపట్నం వరకు కృష్ణా నదికి దగ్గరగా కొత్త బైపాస్ నిర్మాణ ప్రతిపాదన అక్కర్లేదని రైతులు, గ్రామస్థులు సూచిస్తున్నారు. అక్కడి వాస్తవికతను పరిశీలించి, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని జాతీయ రహదారుల సంస్థ అధికారులను కోరుతూ.. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు నేతృత్వంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశకు సోమవారం వినతి పత్రం అందజేశారు. వడ్డే మాట్లాడుతూ.. బైపాస్ రోడ్డు కార్యరూపం దాల్చితే.. ఇది కృష్ణా నదికి దగ్గరగా ఉంటుంది. కృష్ణాకు వరదలు వచ్చినప్పుడు మునేరు, కట్టలేరు వాగులు, పరిటాల, కంచికచర్ల చెరువుల నుంచి వచ్చే ఏనుగుగడ్డ వాగు, నక్క వాగు కారణంగా ఉప్పొంగుతాయని చెప్పారు. మున్నలూరు, కునికెనపాడు, చెవిటికల్లు, బత్తినపాడు, ఘని ఆత్కూరు, కొత్తపేట, దాములూరు, చిలుకూరు, కొటికలపూడి, ఫెర్రీ (పాత ఇబ్రహీంపట్నం)కు భారీ నష్టం వాటిల్లుతుందన్నారు. నక్కలంపేట నుంచి ఇబ్రహీంపట్నం వరకు జాతీయ రహదారికి ఆనుకుని ఖాళీ/వ్యవసాయ భూములు ఉన్నాయి. భూసేకరణ ఖర్చు తక్కుగానే ఉంటుందని, పరిశీలించాలని సూచించారు.

వైకుంఠపురం బ్యారేజీతోనే ఎత్తిపోతలకు నీళ్లు

కృష్ణా నది గుంటూరు జిల్లా వైపునే ప్రవహిస్తూ.. ప్రకాశం బ్యారేజీకి చేరుతోంది. ఎన్టీఆర్ జిల్లాలోని కృష్ణా నది వెంబడి ఉన్న వేదాద్రి-కంచెల, జూపూడి ఎత్తిపోతలకు నీరందడం లేదని మాజీ మంత్రి వడ్డే పేర్కొన్నారు. ఇటీవల దాములూరు-వైకుంఠపురం బ్యారేజీ నిర్మాణాన్ని ప్రతిపాదించారు. మునేరు, వైరా, పాలేరు వాగుల నుంచి వచ్చే నీటిని ఆపి వైకుంఠపురం వద్ద ఎత్తిపోసి, నాగార్జునసాగర్ కుడి కాల్వకు అనుసంధానించడానికి పథకాన్ని రూపొందించి టెండర్లు పిలిచారు. ఏ కారణం వల్లనో పనులు ప్రారంభం కాలేదు. వైకుంఠపురం బ్యారేజీ సాకారమైతే ఎన్టీఆర్ జిల్లాలో ఎత్తిపోతల పథకాలు పని చేస్తాయన్నారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి అమలు చేసేలా చూడాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

సహ్యాద్రి సిందూర.. దిగుబడి భళిరా!

● హెక్టారుకు 55 క్వింటాళ్ల ఉత్పత్తి ● మధుమేహులకు ఎక్కువ ప్రయోజనం

శివమొగ్గ, న్యూస్‌టుడే: రైతన్నలకు ఓ కొత్త వరివంగడం లాభాల రుచిచూపించబోతోంది. కర్ణాటకలోని శివమొగ్గలో విస్తరించిన శివప్ప నాయక వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయంలో 'సహ్యాద్రి సిందూర' రకం వంగడాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. సన్నగా, తేలికపాటి ఎరుపు వర్ణంలో ఉండే ఈ బియ్యంతో వండే అన్నం మధుమేహ సమస్యలు ఎదుర్కొనే వారికి ప్రయోజనకారి. హెక్టారుకు 55 క్వింటాళ్ల దిగుబడి ఇస్తుంది. ప్రయోగాత్మకంగా సహ్యాద్రి సిందూరను ఎక్కువ మంది రైతులకు చేర్చే లక్ష్యంతో ఎక్కువ వంగడాలను సిద్ధం చేస్తున్నామని కర్ణాటక వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి తెలిపారు. సహ్యాద్రి సిందూర ఎర్రగా ఉన్నప్పటికీ సోనా మసూరి తరహాలో సన్నగా ఉంటుంది. ఐదేళ్లలో విడుదల చేసిన జ్యోతి, బిళియ రకం వంగడాల జన్యువులు ఉపయోగించి, పలు ప్రయోగాల అనంతరం దీన్ని రూపొందించామని విశ్వవిద్యాలయంలో వరి పరిశోధన విభాగం డైరెక్టర్ డాక్టర్ దుశ్యంత్ కుమార్ తెలిపారు. ప్రతికూల పరిస్థితులు లేకపోతే 120 రోజుల్లోనే 55 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని వివరించారు. ప్రొటీన్, ఐరన్, జింక్, విటమిన్లు, యాంటీ ఆక్సైడ్లు ఎక్కువగా ఉంటాయి.

☛ సాధారణ వరి సాగుకు అనువైన అన్ని నేలల్లోనూ సహ్యాద్రి రకం వరి పండించవచ్చని నిపుణులు చెబుతున్నారు. శివమొగ్గలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతానికి విత్తన వరి అందుబాటులో ఉండగా.. భవిష్యత్తులో వాణిజ్య అవసరాలకూ సాగును ప్రోత్సహించనున్నారు.



పాలు పోసుకున్న వడ్ల గింజలు



సహ్యాద్రి సిందూర బియ్యం

పెరటి కోళ్లలో వ్యాధులు.. నివారణ చర్యలు

చల్లపల్లి, న్యూస్‌టుడే

పెరటిలో పెంచే కోళ్లలో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలను ఘంటసాల కేవీకే శాస్త్రవేత్తలు నవీన్, సుధారాణి, యశ్వంత్‌కుమార్ వివరించారు.

కొక్కెర తెగులు: ఈ వ్యాధి సూక్ష్మాతి సూక్ష్మజీవుల వల్ల ముఖ్యంగా వేసవి కాలంలో ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన కోడి వేసిన రెట్ట ఆకుపచ్చ రంగులో నీళ్లలాగా ఉండి వాసన వస్తుంది. ముక్కు నుంచి నీరు కారుతుంది. తల ఒకవైపు వాల్చడం, వణకడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి సోకక ముందే ఈ నెలలో టీకాలు వేయిస్తే మంచి ఫలితం ఉంటుంది. తొలుత వారం లోపు కోడి పిల్లలకు టీకా మందు కళ్లు లేదా ముక్కులో చుక్కలుగా వేయాలి. ఆ తరువాత 8 నుంచి 10 వారాల మధ్య వేయించాలి. తదుపరి ఏటా వేయిస్తే వ్యాధిని పూర్తిగా నివారించవచ్చు. టీకా మందు ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా ఇస్తారు. వ్యాధి సోకిన కోడికి టెట్రా సైక్లిన్ పౌడర్ చిటికెడు అర టీకప్పు నీళ్లలో కలిపి రోజుకి మూడు సార్లు ఐదురోజులు ఇవ్వాలి.



వ్యాధి సోకిన కోడిని పరిశీలిస్తున్న పోషకులు

తెల్లపారుడు: ఇది సూక్ష్మక్రిముల ద్వారా ముఖ్యంగా చిన్న కోడి పిల్లల్లో వ్యాప్తి చెందే అంటు వ్యాధి. ఇది సోకితే నలతగా ఉండి ముడుచుకుని కూర్చుంటాయి. రెట్ట నీళ్లగా ఉండి, తెలుపు లేదా లేత పసుపు రంగులో ఉంటుంది. వ్యాధి సోకిన కోళ్లకు సల్ఫా లేదా టెట్రాసైక్లిన్ అనే మందును చిటికెడు చొప్పున ఒక టీగ్లాసు నీళ్లలో కలిపి రోజుకు రెండుసార్లు చొప్పున ఇవ్వాలి.

మినుములో తెగుళ్లు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: మినుములో ఆశించే తెగుళ్లు.. వాటి నివారణ చర్యలను ఏవో శ్రీదేవి ఇలా వివరించారు. మినుములో కలుపు సమస్య ఎక్కువ. నివారణకు పంట విత్తిన వెంటనే మిథాలిన్ 30శాతం ద్రావణం ఎకరాకు 1.5 లీటర్లు లేదా అల్లాకోర్ 50 శాతం గానీ పిచికారీచేయాలి. విత్తిన 20-25 రోజుల మధ్య ఊద, చిప్పర, గరిక లాంటి గడ్డిజాతి కలుపు మొక్కల నిర్మూలనకు ఫెనాక్సాపాప్ ఇథైల్ 9శాతం ద్రావణం ఎకరాకు 250 మి.లీ, ఇథైల్ 5శాతంను ఎకరాకు 400 మి.లీ చొప్పున ఏదో ఒకటి 200మి.లీ లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మారుగా మచ్చల పురుగు: మొగ్గ, పూత, పిందె దశల్లో ఆశించి ఎక్కువ నష్టం కలగజేస్తుంది. క్లోరోపైరిఫాస్ 20ఈసీ 2.5మి.లి లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



కాండం ఈగ: ఇది.. మొక్క చిన్న దశలో కాండంలో చేరి తినడం ద్వారా మొక్క ఎండి పోతుంది. నివారణకు ఎసిటేట్ 1గ్రాము లేక డొమినికన్ 2మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆకు మచ్చ తెగులు: ఇది సోకిన ఆకుల మీద గుండ్రని గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. దీంతో ఆకులు ఎండి రాలిపోతాయి. నివారణకు లీటరు నీటికి 2.5గ్రా మాంకోజెబ్ లేదా 3గ్రా కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2.0గ్రా హెక్సాకోనజోల్ మందులను మార్చి మార్చి పిచికారీ చేయాలి.

ఎండు తెగులు: ఇది భూమిలో ఉన్న శిలీంధ్రం ద్వారా వృద్ధి చెందుతుంది. ఆశించిన మొక్కలు వడలి, ఎండిపోతాయి. విత్తన శుద్ధి సమయంలో కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్ గానీ మాంకోజబ్ పట్టించి విత్తుకోవాలి.

మొవ్వ కుళ్లు: తామర పురుగుల ద్వారా వ్యాపిస్తుంది. ఆకులు గిడసబారి ఎండిపోతాయి. ఫిప్రోనిల్ 2మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

ప్రశ్న: వంగ తోటలో ఎరువులు, నీటి యాజమాన్యం గురించి వివరించండి?

- బి.రంగయ్య, రైతు, రుద్రవరం

సమాధానం: ఆఖరి దుక్కిలో ఎకరానికి 8-10 టన్నుల పశువుల ఎరువు వేసి బాగా కలియదున్నాలి. దీంతో పాటు 24 కిలోల చొప్పున భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. 40 కిలోల నత్రజనిని మూడు సమభాగాలు చేసి 30, 60, 75వ రోజు పైపాటుగా వేయాలి. సంకర జాతి రకాలకు ఈ ఎరువుల మోతాదు 50 శాతం అధికంగా వేయాలి. ఎరువులు వేసిన వెంటనే నీరు అందించాలి. వంగ మొక్కలు నాటే ముందు లేదా నాటాక నీరు పెట్టాలి. పంట నాటిన 70 రోజులు వరకు తేమ అవసరం. భూమిలో తేమను బట్టి శీతాకాలంలో 7-10 రోజులకోసారి, వేసవిలో 4-5 రోజులకు ఒకసారి, వర్షాకాలంలో అవసరాన్ని బట్టి నీరు అందించాలి. పంట దిగుబడి ఎకరానికి 8 నుంచి 14 టన్నుల వరకు వస్తుంది. -వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కేవీకే, ఘంటసాల

- న్యూస్‌టుడే, ఘంటసాల

వసుంధర

vasundhara@eenadu.in

అనుమానంతో కెమెరాలు పెట్టాడు!

నా మీద అనుమానంతో నా భర్త నా ప్రతి కదలికనూ గమనిస్తారు. ఇప్పుడా పరిస్థితి పద్నాలుగేళ్ల నా కూతురుకీ వచ్చింది. నిత్యం తనని సూటిపోటి మాటలతో వేధిస్తున్నాడు. ఈ మధ్య ఇల్లంతా కెమెరాలు పెట్టించాడు. నరకంలా ఉంది. ఎదురు తిరిగితే రక్తం వచ్చేలా కొడతాడు. ఇన్నాళ్లూ పెళ్లికావలసిన పిల్ల ఉందని ఓపిక పట్టాను. ఇక ఉండలేను. బయటకు వెళ్తే నాకు, బిడ్డకి దక్కే హక్కులు, రక్షణ ఏంటి?

– ఓ సోదరి

ఇన్నాళ్లు మీరు చూపిన సహనాన్ని అతడు మీ బలహీనతగా భావించి ఉండొచ్చు. మీ భర్తది మానసిక సమస్య. అలానే వదిలేస్తే ఏమైనా చేస్తారు. పరువు పేరుతో ప్రాణాలు తీసే రోజులివి. మీ అమ్మాయి భవిష్యత్తు కోసమైనా మీరు బయటకి రండి. అతడి మీద కేసులు వేయడం కంటే ముందు మిమ్మల్నీ, పాపని కాపాడుకోవడం ముఖ్యం. మీరు భరిస్తూ ఉంటే తను ఏమైనా చేసుకోవచ్చు. తల్లిని కొడుతోన్న తండ్రిని చూసి పెళ్లి మీద నమ్మకాన్ని పోగొట్టుకోవచ్చు. మీరు మీ భర్త మీద గృహహింస చట్టం కింద కేసు పెట్టొచ్చు. విడాకులు కావాలంటే క్రూరత్వాన్ని కారణంగా చూపించి హిందూ వివాహచట్టంలోని సెక్షన్ 13(1)కింద డివోర్స్ తీసుకోవచ్చు. మీరు ఇచ్చిన కట్నకానుకలూ వెనక్కి ఇవ్వమనీ అడగొచ్చు. మీ పాపకు, మీకు... నెలసరి పోషణ, భవిష్యత్తులో అమ్మాయి చదువుకీ, పెళ్లికీ అయ్యే ఖర్చు, ఇన్నాళ్లూ మీరు అనుభవించిన మానసిక, శారీరక హింసలకు ఒకే మొత్తంగా కూడా డబ్బుని కోరవచ్చు. అలానే గృహహింస చట్టం కింద మీకూ అమ్మాయికీ పోషణ ఖర్చు, మీకు రక్షణ, ఇంట్లో ఉండే హక్కులు, శాశ్వత పరిహారం అన్నీ కలిపి కూడా పొందవచ్చు.. ముందుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. వాళ్లు పిలిచి కౌన్సెలింగ్ చేస్తారు. మారక పోతే క్రిమినల్ కేసులు బుక్ చేస్తారు. తొందరగా నిర్ణయం తీసుకోండి.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది



గొప్ప సినిమా అంటే బలమైన కథ, అద్భుతంగా నటించిన నటీనటులు, మనసును కదిలించే సంగీతం ఇవి మాత్రమే కాదు... ఓ చక్కటి కథను తెరపై అందంగా చూపించే ఆర్ట్ డిపార్ట్‌మెంట్ గురించీ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. దర్శకుడి దృష్టి కోణాన్ని అత్యంత సహజంగా ఆవిష్కరిస్తూ సమాంతర ప్రపంచాన్ని సృష్టించాలి. ఇందులో అమ్మాయిల సంఖ్య తక్కువ. హాలీవుడ్ స్థాయిలో రాణించిన వాళ్లు మరీ అరుదు. కానీ, ఇందుకు భిన్నంగా మన ఆశ్రిత కామత్ హాలీవుడ్ ప్రాజెక్టులైన అవతార్ 2, 3 భాగాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేశారు.

పండోరా ప్రపంచాన్ని సృష్టించారు!

ఆశ్రిత స్వస్థలం పశ్చిమబెంగాల్. కానీ, ఆమె చెన్నైలో పెరిగారు. తల్లిదండ్రులకు ఏకైక సంతానం. చిన్నప్పుడు వాళ్ల ఇంట్లో కనీసం కేబుల్ టీవీ కనెక్షన్ కూడా ఉండేది కాదట. దాంతో ఒంటరితనం నుంచి బయటపడటానికి తనదైన ఊహా ప్రపంచాన్ని నిర్మించుకున్నారు. తల్లి గ్రాఫిక్ డిజైనర్ కావడంతో ఆవిడ పనిచేస్తున్నప్పుడు ఆశ్రిత శ్రద్ధగా గమనించేవారట. రంగులూ, డిజైన్లపై ఇష్టం అప్పుడే మొదలైంది అంటారామె. దీనికి తోడు తాను చదివిన విద్యాసంస్థలు సృజనను ప్రోత్సహించడంతో తన ఆలోచనలన్నీ ఇటే సాగాయి. చెన్నైలోని కొన్నాళ్లు, తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని రిషీ వ్యాలీ పాఠశాలలో మరికొంత కాలం ఆశ్రిత చదువు సాగింది. ఇక్కడి ఫిల్మ్ క్లబ్‌లో చేరినప్పుడు.. ఇది తనని ఎక్కడికి తీసుకెళ్తుందో ఊహించలేదంటారు ఆశ్రిత.

సినిమాపై ప్రేమ...

స్కూలు చదువు పూర్తయ్యాక ఆశ్రిత ముంబయిలోని సెయింట్ జేవియర్స్ కాలేజీలో సోషియాలజీ చదివారు. సినిమాలంటే ఉన్న ఇష్టంతో అందులో కెరియర్‌ని ఎంచుకోవాలనుకున్నారు. కానీ, ఏం చేయాలన్నదానిపై అప్పట్లో ఆమెకు స్పష్టత లేదు. ఆ సమయంలో ఓ యాడ్ ఫిల్మ్ ప్రొడక్షన్ సంస్థలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం వచ్చింది. చిత్ర నిర్మాణంలో వివిధ క్రాఫ్ట్‌లు ఎలా పనిచేస్తాయో అప్పుడే ఆమె తెలుసుకున్నారు. అందులోనూ ఆర్ట్ యూనిట్ తనని ఎక్కువగా ఆకర్షించింది. 'ఫిల్మ్ సెట్‌పై అదే నా మొదటి అనుభవం. ఏం చేయాలో, ఎలా చేయాలో అన్నీ సెట్‌లోనే నేర్చుకున్నా. దక్షిణాదిన పెరగడం వల్ల హిందీ అంతగా రాకపోవడంతో అనేక సవాళ్లు ఎదుర్కొన్నా' అంటారు ఆశ్రిత.

బాలీవుడ్ నుంచి హాలీవుడ్ దాకా

'వెస్ట్ ఈజ్ వెస్ట్', 'జిందగీ న మిలేగీ దోబారా' వంటి సినిమాలతో నా కెరియర్ మొదలైంది. ఆరాధన సేథ్, సుజానె కాప్లాన్ మెర్వాంజీ లాంటి శక్తిమంతమైన మహిళలతో పని చేయడంతో ఎన్నో నేర్చుకున్నా. తర్వాతే ప్రొడక్షన్ డిజైనర్‌గా స్థిరపడాలన్న నిర్ణయానికి వచ్చా' అంటారామె. మరిన్ని నైపుణ్యాలు నేర్చుకోవడానికి అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ (ఏఎఫ్ఐ)లో ప్రొడక్షన్ డిజైనింగ్ కోర్సులో చేరారు. అక్కడే పలు హాలీవుడ్ చిత్రాల నిర్మాణాన్ని దగ్గరుండి పరిశీలించే అవకాశం వచ్చింది. ఇది తనకు ఎంతో నేర్పింది అంటారు ఆశ్రిత. 'ఇది ఇంటెన్సివ్ కోర్సు కావడంతో నిద్రలేని రాత్రులెన్నో గడిపా. టెక్నికల్ క్లాస్ వర్క్... శారీరకంగా ఎంతో శ్రమ. మేం డిజైన్ చేసిన ప్రతి సెట్‌నూ మేమే నిర్మించాలి. ఇలా రెండేళ్ల పాటు ఇండస్ట్రీలో లీడింగ్ ప్రొఫెషనల్స్ నుంచి చాలా విషయాలను నేర్చుకున్నా' అని చెబుతారామె.



సహజంగా చూపిస్తూ...

తక్కువ సమయంలోనే రకరకాల ప్రపంచాలను అన్వేషించి సెట్ వేయడంలో ఆశ్రిత దిట్ట. ఎన్నో అంచనాలతో విడుదలైన జేమ్స్ కామెరూన్ 'అవతార్' 2, 3 సీక్వెల్స్‌లో ఆర్ట్ డైరెక్టర్‌గా తనదైన ముద్ర వేశారు ఆశ్రిత. పండోరా ప్రపంచాన్ని ఎంతో అద్భుతంగా సృష్టించారు. అవతార్ రెండో భాగంలో ఆర్గానిక్స్ విభాగానికి పనిచేశారామె. ఇందులో భాగంగా మొక్కలు, సముద్ర జీవులు.... అన్నింటినీ సహజంగా కనిపించేలా చేశారు. మూడో భాగమైన అవతార్(ఫైర్ అండ్ యాష్)లో ఆవరణ వ్యవస్థల సృష్టితో తనదైన ముద్ర వేశారు. పదేళ్ల పాటు కామెరూన్‌తో పనిచేశారు. 'ప్రతి సినిమా ఒక కొత్త ప్రయాణం. కొత్త కథ, కొత్త టీమ్, కొత్త ప్రపంచం కొద్ది సమయంలో ఎన్నో లోకాల్లో జీవించే అవకాశం... ఈ వృత్తి ఇస్తుంది' అంటారామె.



ఎదగడానికో పావుగంట!

కెరియర్‌లో నెట్‌వర్కింగ్‌కి ఎంత ప్రాధాన్యం ఉంటుందో తెలిసిందే కదా! అలాగని లింక్డిన్‌లో సీనియర్లు, ఏదైనా అధికారిక వేడుకలప్పుడు పెద్దలు, ఇతర సంస్థల వాళ్లతో పరిచయాలు పెంచుకోవడమే అనుకుంటున్నారేమో! సంస్థలోనూ కావాలి. అప్పుడే ఎదిగే సమయమైనా, కష్టకాలమైనా అండగా నిలబడేవాళ్లు దొరుకుతారు. అది సాధ్యం కావాలంటే రోజూ పావుగంట కేటాయించాలి మరి!

సాధారణంగా ఉన్నతంగా ఎదగడానికి ప్రతిభ, కష్టపడే మనస్తత్వం లాంటివి ప్రధానం అనుకుంటాం కదా! కానీ కెరియర్ నిపుణులేం అంటారో తెలుసా? మనల్ని నమ్మేవాళ్లు, ఆదరువుగా నిలిచేవాళ్లు చుట్టూ ఉండాలంటారు. అది నిరంతర నెట్‌వర్కింగ్‌తోనే సాధ్యమవుతుంది. అందుకు గంటలకొద్దీ సమయాన్ని వెచ్చించాల్సిన పనిలేదట. పావుగంట చాలు... దాన్నీ 5 నిమిషాల చొప్పున విభజించుకోవాలి.

తొలి అయిదు నిమిషాలు... థాంక్స్ లేదా మెచ్చుకోలు కోసం. ముందురోజు మీ పనిలో ఎవరైనా సాయం చేశారా? పోనీ విలువైన సలహా ఇచ్చారా? నిజాయతీగా థాంక్స్ చెప్పేయండి. ఆ సాయం, సలహా ఎంత సాయపడ్డాయో వివరించండి. విలువనిస్తున్నారు, గుర్తుంచుకున్నారన్న భావన ఎదుటివారిలో కలుగుతుంది. మీకు మంచి నేస్తాలనీ ఇస్తుంది. ఇక రెండోది... మీ టీమ్ వాళ్లో, పోనీ స్నేహితులో... పనిలో ఇబ్బందుల గురించి చెబుతారు కదా? వాళ్లని పలకరించండి. సమస్య తీరిందా? పని ఎంతవరకూ వచ్చిందని కనుక్కోండి. చిన్న మాటే... మీ మీద వాళ్లకి ఎక్కడలేని నమ్మకాన్ని తెచ్చిపెడుతుంది. చివరగా... సాయం కావాలేమో చూడండి. మీరే స్వయంగా పని పూర్తిచేసి చేతిలో పెట్టక్కర్లేదు. సాయం చేసే వ్యక్తులు, వెబ్‌సైట్లు, సమాచారం... ఇలా ఏది అందించినా చాలు. ఎదుటివాళ్లు అడిగిన సందేహాలను తీర్చడమూ ఇందులో భాగమే!

ఆఫీసులోకి వెళ్లాక ఓ పట్టాన కదలరు అమ్మాయిలు. కేవలం పావుగంటే... బిజీ షెడ్యూల్‌ని పక్కనపెట్టి చుట్టూ ఉన్నవాళ్లని పలకరించండి. మీకూ కాస్త సేదతీరినట్లు ఉంటుంది. ఆఫీసులో అనుబంధాలూ ఏర్పడతాయి. అవకాశాలు, కలిసి పనిచేయడం, అవసరమైనప్పుడు మీకు అండగా నిలవడం వంటి సాయాలెన్నో దొరుకుతాయి. ఈ 5-5-5 రూల్ పాటిస్తారుగా మరి?

ఏ పాత్రనైనా మహిళలు మొదటిసారి పోషించడం గొప్ప విషయమే! కానీ, ఆ ప్రయాణం అంత సులభం కాదు. గతంలో ఆ పనిచేసిన వాళ్లతో పోలిక వస్తుంది. ఆఫీసులో, బయటా వేసే ప్రతి అడుగుపైనా సునిశిత పరిశీలన ఉంటుంది. అలాగని అన్నింటా 100 శాతం విజయం సాధించాలనుకోవద్దు. పొరపాట్లు చేసినా తొందరగా నేర్చుకుంటూ ముందుకు వెళ్లండి.

- దీపా పురుషోత్తమన్, వ్యవస్థాపకురాలు, రి.రైట్



బంధం దృఢమవ్వాలంటే!

ఒకే ఇంట్లో ఉన్నారన్న మాటేగానీ ఈరోజుల్లో పిల్లలతో తల్లిదండ్రులు ఎంత సమయం గడుపుతున్నారు? ఒకవేళ గడిపినా, అది మీ మధ్య బంధాన్ని పెంచేలా ఉంటోందా? ఇవన్నీ గమనించుకోవాలి. మీ సమాధానం 'లేదు' అయితే... ఇలా చేయండి.



- వీలైతే రోజూ స్కూల్, కాలేజీ విశేషాలేంటో పిల్లల్ని అడిగి తెలుసుకోండి. వాళ్లు చెప్పింది జాగ్రత్తగా వినండి, మధ్యలో టాపిక్‌ని డైవర్ట్ చేయొద్దు. మీదైన భాష్యం చెప్పేందుకూ ప్రయత్నించకండి. అమ్మానాన్న చెప్పేది వింటారని వాళ్లకి నమ్మకం కుదిరితే, కష్ట సమయాల్లో మీరున్నారనే ధైర్యం కలుగుతుంది.
- రోజులో మీకు ఎదురైన అనుభవాలనూ వాళ్లతో పంచుకోండి. మీరు కలిసిన ముఖ్యమైన వ్యక్తులు, ఆఫీసులో ఎదురైన సవాళ్లు, వాటిని పరిష్కరించిన తీరూ ఇవన్నీ పంచుకోండి.
- కొన్నిసార్లు మీరూ సరదాగా కబుర్లు చెప్పండి. అలాంటప్పుడు కచ్చితంగా ఇదే జవాబు అన్నట్లుగా ఉండే ప్రశ్నలు కాకుండా, ఓపెన్ ఎండెడ్ ప్రశ్నలు వేయండి. దానివల్ల భిన్న కోణాల్లో ఆలోచిస్తారు. కాలక్షేపంలా కాకుండా, ఒకరికొకరు బాగా అర్థమవుతారు.
- ఇంటికి సంబంధించిన చిన్న చిన్న విషయాల్లో పిల్లల అభిప్రాయానికీ చోటివ్వండి. సెలవు రోజు ఎక్కడికి వెళ్లాలనుకుంటున్నారు, బ్రేక్‌ఫాస్ట్-లంచ్‌లో ఏం తినాలనుకుంటున్నారు... ఇలాంటివి అడగండి.
- రోజులో అందరూ ఒక పూటైనా కలిసి తినడానికి ప్రయత్నించండి. ఆ సమయంలో టీవీలూ, ఫోన్లూ కట్టిపెట్టండి.

గెలుపు మంత్ర - 2025

ఈ ఏడాది నా విజయం!



కొద్దిరోజుల్లో 2025కి వీడ్కోలు చెబుతాం. మరో ఏడాదిని స్వాగతిస్తాం. ఎన్ని అడ్డంకులొచ్చినా ఈ ఏడాది నేను ఇది సాధించాల్సిందే అంటూ ఎన్ని తీర్మానాలు చేసుకునుంటాం? కానీ చాలావరకూ ఓ వారం పదిరోజులకే అన్నీ పాతబడి పోతాయి. కానీ కొందరుంటారు. పట్టుదల, సంకల్పంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారు. మీదీ అదే కోవా? వ్యాయామం, కొత్త స్కిల్స్ నేర్చుకోవడం, పొదుపు, స్టార్టప్... ఇలా ఏదైనా కావొచ్చు. ఈ ఏడాది మీరు ఏదైనా సాధించినా, మీలో మార్పు తెచ్చుకోగలిగినా... మాతో పంచుకోండి. అందుకోసం మీరు పడిన శ్రమ, అనుసరించిన ప్రణాళికల గురించి చెప్పండి. మరో ఏడాదిలోకి అడుగుపెడుతోన్న సమయంలో మరికొందరికి అవి స్ఫూర్తిగా నిలుస్తాయి. ఇంకేం... మా మెయిల్(vasundhara @eenadu.in), వాట్సాప్(9154091911)లకు 'ఈ ఏడాది నా విజయం' అని శీర్షిక పెట్టి, రాసేయండి మరి.

వృత్తిగత ఒత్తిళ్లు అనారోగ్యానికి కారణం అయ్యాయి. వాటిని అధిగమించడానికి ఫిట్‌నెస్‌ను తన దినచర్యలో భాగం చేసుకున్నారు కవితా చంద్. అదే ఇప్పుడు ఆమెకు దేశవ్యాప్తంగా పేరు తెచ్చి పెడుతోంది. తాజాగా అంటార్కిటికా ఖండంలోని అతి ఎత్తైన విన్సన్ శిఖరాన్ని అధిరోహించారీమె. ఇది 'నా విజయంలో ఓ భాగం మాత్రమే... ఇంకా చేయాల్సింది చాలా ఉంది' అంటోన్న కవిత గురించి తెలియాలంటే...

ప్రతి అడుగూ విజయం వైపే..!





కవిత పుట్టి పెరిగింది ఉత్తరాఖండ్‌లోని అల్మోరా. చదువయ్యాక ముంబయిలో మీడియా ప్రతినిధిగా వృత్తిగత జీవితం ప్రారంభించారు. వ్యాపారవేత్త దీపక్ చంద్‌ను పెళ్లి చేసుకున్నారు. పెళ్లి, పిల్లలు, కెరియర్‌తో సమయం తెలియకుండా గడిపేవారట. 'ఈ జీవనశైలి ఒత్తిడీ, ఆందోళనలకు కారణమైంది. అందుకే ఉద్యోగం మానేయాలి అనుకున్నా. ఆరోగ్యంవైపు దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నా. అలా 2017లో ఫిట్‌నెస్ నా జీవితంలో భాగమైంది. కొన్ని నెలల తర్వాత అథ్లెట్‌గా ప్రయత్నించాలనుకున్నా. శిక్షణలో చేరిపోయా. దిల్లీ, ముంబయిల్లో జరిగిన అనేక పోటీల్లో పతకాలూ గెలుచుకున్నా. ఈ క్రమంలోనే పర్వతారోహణ గురించి తెలిసింది. ప్రయత్నించాలని నా శక్తిసామర్థ్యాలకు సానపెట్టడం మొదలుపెట్టా' అనే కవిత 2024 నుంచి పర్వతారోహణలోనూ పాల్గొనడం మొదలుపెట్టారు. ప్రపంచంలోనే ఎత్తైన ఏడు పర్వతాల్ని అధిరోహించడమే లక్ష్యంగా అడుగులు వేశారు. అదే సంవత్సరం యూరప్‌లోని మౌంట్ ఎల్బ్రస్‌ను అధిరోహించారు.

ప్రయాణం సాగిందిలా...

డిసెంబరు 3న లక్ష్య సాధనలో రెండో మైలురాయిని చేరుకోవడానికి తన ప్రయాణం మొదలైంది. అంటార్కిటికా చేరుకున్నారు కవిత. 'తొమ్మిది రోజులు... దట్టమైన పొగమంచు, చలిగాలులు తీవ్రంగా ఉన్న వాతావరణంలో మా ప్రయాణం మొదలైంది. మా బృందానికి అవసరమయ్యే సామాన్లను తీసుకువెళ్లడం కష్టమైన సందర్భాలూ చాలానే. అయినా అకుంఠిత దీక్షతో ముందడుగు వేశాం. విన్సన్ పర్వతాన్ని అధిరోహించాం. అప్పుడు కలిగిన సంతోషం మాటల్లో చెప్పలేను' అంటారు కవిత. అథ్లెట్‌గా వరల్డ్ మారథాన్ మేజర్స్ సిక్స్ స్టార్ ఛాలెంజ్‌లో ఇప్పటికే మూడు మారథాన్లను గెలిచారీమె. ఆమె అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని కోరుకుందామా మరి!



టెన్నిస్ బ్రేస్‌లెట్... చిత్రమైన కథ!





అమ్మాయిల ఫ్యాషన్లు రోజురోజుకీ మారిపోతుంటాయి. కొత్తకొత్తవి పుట్టుకొస్తుంటాయి. కానీ కొన్ని ఆభరణాల కథలు చిత్రంగా ఉంటాయి. ఈ టెన్నిస్ బ్రేస్‌లెట్‌దీ అలాంటిదే. మణికట్టుకి చుట్టూ వజ్రాలు, సీజెడ్స్, స్వరోవ్‌స్కీ, పచ్చలు, నీలాలు, కెంపులు... వంటి స్టోన్స్ ఉండేలా డిజైన్ చేస్తోన్న ఈ బ్రేస్‌లెట్ ఫ్యాషన్ ఈనాటిది కాదు. యాభై ఏళ్ల క్రితమే ట్రెండయ్యింది. అదెలా అంటే...

ప్రముఖ టెన్నిస్ ఛాంపియన్ క్రిస్ ఎవర్ట్... వజ్రాలతో డిజైన్ చేసిన చెయిన్‌లా ఉన్న బ్రేస్‌లెట్‌ను ధరించేది. అయితే 1978లో ఒకసారి ఆట మధ్యలో బ్రేస్‌లెట్ ముక్క విరిగి పడిపోయింది. తనకెంతో ఇష్టమైన ఆ బ్రేస్‌లెట్ ముక్కకోసం విరామం అడిగి మరీ దాన్ని వెతికిందట. అప్పటి నుంచి ఈ డిజైన్ టెన్నిస్ బ్రేస్‌లెట్‌గా ప్రాచుర్యంలోకి రావడమే కాదు, ట్రెండ్‌గా మారింది. క్రీడాకారిణుల ఫ్యాషన్‌గా మార్కెట్లోకి వచ్చింది. దీన్నే ఎటర్నల్ బ్రేస్‌లెట్‌గానూ పిలుస్తున్నారు. అంతేకాదు, తన టెన్నిస్ బ్రేస్‌లెట్లకు మోనికా రిచ్ కోసన్ అనే డిజైనర్‌ను సంప్రదించడంతో వీళ్లిద్దరూ కలిసి అనేక డిజైన్లు ఆవిష్కరించారట. అలా ఆ టెన్నిస్ స్టార్ జ్యూయెలరీలోనూ తనదైన ముద్ర వేసింది. ముఖ్యంగా హాలీవుడ్ సెలెబ్రిటీలూ వీటిని ధరించడం ప్రారంభించారు. అప్పట్లో ప్రిన్సెస్ డయానా కూడా దీన్ని ఇష్టంగా ధరించేవారట. మేఘన్ మార్కెల్ కూడా ఈ బ్రేస్‌లెట్‌తో కనిపించడంతో మరోసారి ఇది ట్రెండింగ్‌లోకి వచ్చేసింది. పైగా ఇప్పుడు దీన్ని కేవలం విలువైన రత్నాలతోనే కాదు, సెమీ ప్రెషియస్ రాళ్లతోనూ; ఎల్లో గోల్డ్, వైట్‌గోల్డ్, ప్లాటినం, సిల్వర్... ఇలా రకరకాల లోహాలతోనూ విభిన్న డిజైన్లలోనూ చేయిస్తున్నారు. బర్త్‌స్టోన్‌తోనూ చేయించుకుంటున్నారు. మీకూ నచ్చితే కోరిన డిజైన్‌లో ఆర్డరిచ్చేయండి మరి!

బంగారం - వెండి




22న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,38,740	1,24,400	2,14,825
విజయవాడ	1,33,900	1,24,000	2,14,800
ప్రొద్దుటూరు	1,35,400	1,24,570	2,08,000
రాజమహేంద్రవరం	1,35,280	1,24,000	2,31,000
విశాఖపట్నం	1,34,700	1,24,000	2,10,000
తమిళనాడు	-----	1,25,700	2,31,000

రంగవల్లిక

22 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకూ





కె. శ్రీదేవి
ఏలూరు






వరలక్ష్మి చాగలేటి
నెల్లూరు

15 చుక్కలు
8 వచ్చేవరకూ
మధ్య చుక్క

33 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకూ





పి. అనురాధ
మర్పల్లి

మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా:
వసుంధర, ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా,
తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in

ఛాంపియన్

హుషారుగా భారత్

రాత్రి 7 నుంచి

శ్రీలంకతో అమ్మాయిల రెండో టీ20 నేడు

2 టీ20 క్రికెట్లో 150 వికెట్ల మైలురాయిని అందుకోవడానికి దీప్తి శర్మకు కావాల్సిన వికెట్లు.

5 శ్రీలంకతో ఆడిన 27 టీ20ల్లో భారత్ అయిదు మాత్రమే ఓడిపోయింది. 21 నెగ్గింది. ఒక మ్యాచ్‌లో ఫలితం రాలేదు.

ఈనాడు, విశాఖపట్నం: జోరుమీదున్న భారత మహిళల జట్టు మరో పోరుకు సిద్ధమైంది. మంగళవారం జరిగే రెండో టీ20లో శ్రీలంకను ఢీకొంటుంది. అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా విశాఖలో జరిగిన తొలి టీ20లో భారత్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే శ్రీలంకను 121/6కు కట్టడి చేసినప్పటికీ భారత జట్టు ఫీల్డింగ్, ముఖ్యంగా క్యాచింగ్ మెరుగు పడాల్సివుంది. తొలి మ్యాచ్‌లో జట్టు అయిదు క్యాచ్‌లు చేజార్చింది. "మేం మా ఫీల్డింగ్ మెరుగుపర్చుకోవడంపై దృష్టి పెట్టాం. పదే పదే ఎందుకు క్యాచ్‌లు చేజారుస్తున్నామో అర్థం కావట్లేదు. వచ్చే మ్యాచ్‌లో మెరుగ్గా ఫీల్డింగ్ చేస్తాం" అని తొలి టీ20 అనంతరం హర్మన్‌ప్రీత్ వ్యాఖ్యానించింది. ప్రపంచ కప్ తర్వాత భారత జట్టుకు ఆరు వారాల విరామం లభించింది. విరామం వచ్చిన నేపథ్యంలో క్రికెటర్లు ఫీల్డింగ్‌లో లయను అందుకోవడానికి కాస్త సమయం పట్టవచ్చు. ఫీల్డింగ్‌లో ఇబ్బందులున్నా.. రెండో మ్యాచ్‌లోనూ భారత జట్టు తిరుగులేని ఫేవరెట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రపంచకప్ ఫామ్‌ను కొనసాగించిన జెమీమా రోడ్రిగ్స్.. తొలి టీ20లోనూ అదరగొట్టింది. ఆమె అదే జోరును కొనసాగించాలని జట్టు ఆశిస్తోంది. ఓపెనర్ షెఫాలి వర్మకు ఈ సిరీస్ ఎంతో ముఖ్యమైంది. తన ఆటకు సరిపోయే ఈ ఫార్మాట్లో ఆమె నిలకడను అందుకోవాల్సివుంది. ఇంకా స్మృతి మంధన, హర్మన్‌ప్రీత్, దీప్తి శర్మలతో భారత జట్టు బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. బంతితో మరోసారి లంకను దెబ్బతీయడానికి భారత్ సిద్ధమవుతోంది. గత మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన 20 ఏళ్ల ఎడమచేతి వాటం స్పిన్నర్ వైష్ణవి శర్మ ఆకట్టుకుంది. వికెట్లు పడగొట్టకున్నా.. కేవలం 16 పరుగులే ఇచ్చింది. ఒక్క బౌండరీ కూడా ఇవ్వలేదు. దీప్తి శర్మ, శ్రీచరణిలతో ఆమె స్పిన్ భారాన్ని పంచుకోనుంది. అరుంధతి రెడ్డి, అమన్‌జ్యోత్ కౌర్ పేస్ బాధ్యతలు చూసుకుటారు. ఈ మ్యాచ్‌కు భారత తుది జట్టులో మార్పులు జరిగే అవకాశం లేదు. రెట్టించిన ఉత్సాహంతో ఉన్న ఆ జట్టును అడ్డుకోవడం చమరి ఆటపట్టు నేతృత్వంలోని శ్రీలంకకు సవాలే. లంకతో ఆడిన గత పది టీ20ల్లో భారత్ ఎనిమిది గెలవడం విశేషం.

పిచ్.. వాతావరణం

పిచ్ స్పిన్నర్లకు అనుకూలం. బ్యాటర్లకూ అవకాశముంటుంది. మ్యాచ్‌లో మంచు కీలక పాత్ర పోషించనుంది. టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవచ్చు.



మెరిసిన సింధు

- సెమీఫైనల్లో ఏపీ
- అంతర్ రాష్ట్ర సీనియర్ జాతీయ బ్యాడ్మింటన్



శ్రీకాంత్



సింధు

ఈనాడు - అమరావతి

స్టార్ షట్లర్ పి.వి.సింధు రాణించడంతో అంతర్ రాష్ట్ర, అంతర్ జోనల్ సీనియర్ జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో సోమవారం ఆరంభమైన ఈ పోటీల్లో క్వార్టర్స్‌లో ఆంధ్రప్రదేశ్ 3-0తో ఉత్తరాఖండ్‌ను చిత్తు చేసింది. తొలి సింగిల్స్‌లో సింధు 21-8, 21-11తో స్నేహ రజావర్‌పై గెలవగా.. మరో సింగిల్స్‌లో సూర్యచరిష్మ తమిరి 21-18, 21-15తో అనుష్క జుయాల్‌ను ఓడించింది. మహిళల డబుల్స్‌లో సింధు-సెల్వం కవిప్రియ జోడీ 21-11, 21-17తో ఏంజెల్ పునేరా-అన్వ బిష్త్ జంటపై గెలిచి విజయాన్ని పూర్తి చేసింది. పురుషుల టీమ్ విభాగం క్వార్టర్స్‌లో ఆంధ్రప్రదేశ్ 0-2తో తమిళనాడు చేతిలో ఓడింది. సింగిల్స్‌లో స్టార్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ 25-27, 15-21తో సంజీవి చేతిలో కంగుతిన్నాడు. రెండో సింగిల్స్‌లో షేక్ నుమైర్ 21-17, 14-21, 19-21తో శంకర్ ముత్తుస్వామి చేతిలో ఓడాడు. ఏపీతో పాటు అసోం, ఉత్తరాఖండ్, గుజరాత్, కర్ణాటక, హరియాణా, తమిళనాడు, ఝార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిశా, రైల్వేస్, పీఎస్‌పీబీ టోర్నీలో బరిలోకి దిగాయి. ఇదే వేదికలో గురువారం నుంచి జాతీయ సీనియర్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. పీవీ సింధు, శ్రీకాంత్, ఉన్నతి హుడా, ఆయుష్‌శెట్టి, సమీర్‌వర్మ పోటీ పడనున్నారు.

బాజ్‌బాల్‌కు బీటలు

బాజ్‌బాల్.. ఏడాది ముందు వరకు ఈ మాట క్రికెట్లో చర్చనీయాంశంగా ఉండేది. టెస్టుల్లో ఇంగ్లాండ్ ప్రవేశపెట్టిన ఈ శైలి సంచలనంగా మారి.. మిగతా జట్లూ దాన్ని అనుసరించాల్సిన పరిస్థితి కనిపించింది. ఆ శైలితో ప్రత్యర్థి జట్లను బెదరగొడుతూ, నిలకడగా విజయాలు సాధిస్తూ.. టెస్టు క్రికెట్‌ను ఆకర్షణీయంగా మార్చిన ఘనత ఇంగ్లాండ్ సొంతం. కానీ విజయాలు సాధిస్తున్నపుడు అంతా బాగున్నట్లే అనిపిస్తుంది. ఏం చేసినా చెల్లుతుంది. ఫలితాలు తిరగబడితేనే కష్టమవుతుంది. ఇంగ్లాండ్ ఇప్పుడు ఈ ఇబ్బందినే ఎదుర్కొంటోంది.

యాషెస్‌లో మరో రెండు మ్యాచ్‌లుండగానే 0-3తో చిత్తయిన ఇంగ్లాండ్.. బాజ్‌బాల్‌ను పూర్తిగా పక్కన పెట్టేసి తన ఉనికిని చాటుకోవడానికి పోరాడే పరిస్థితి తలెత్తింది.

ఈనాడు క్రీడావిభాగం

2022లో బ్రెండన్ మెక్‌కలమ్ ఇంగ్లాండ్ కోచ్‌గా నియమితుడయ్యాక, అప్పుడే టెస్టు కెప్టెన్ అయిన బెన్ స్టోక్స్‌తో కలిసి 'బాజ్‌బాల్'కు శ్రీకారం చుట్టాడు. 'బాజ్' అన్నది మెక్‌కలమ్ ముద్దుపేరు. టెస్టులంటే నెమ్మదిగా ఆడడం, ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడం చూస్తుంటాం. అలా కాకుండా దూకుడుగా బ్యాటింగ్ చేయడం.. పరుగులు కట్టడి చేయడం కంటే వికెట్లు తీయడానికే ప్రయత్నించడం.. డ్రా కోసం కాకుండా విజయం కోసమే ఆడడం.. సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడం.. ఇలా సరికొత్త శైలితో టెస్టులు ఆడడం మొదలుపెట్టింది ఇంగ్లాండ్. దానికే 'బాజ్‌బాల్'గా నామకరణం చేశారు. ఇలా ఆడుతూనే వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో 250 పైచిలుకు లక్ష్యాలను ఛేదించేసింది ఇంగ్లిష్ జట్టు. ముఖ్యంగా 2022లో భారత జట్టు ఇంగ్లాండ్ పర్యటనలో ఏకంగా 378 పరుగుల లక్ష్యాన్ని 3 వికెట్లే కోల్పోయి అలవోకగా ఛేదించేయడంతో స్టోక్స్ సేన పేరు ప్రపంచ క్రికెట్లో మార్మోగింది. ఆ గెలుపు ఇంగ్లాండ్‌కు టెస్టు సిరీస్ ఓటమిని తప్పించింది. 5-6 మధ్య రన్‌రేట్‌తో పరుగులు చేయడం.. నాలుగో ఇన్నింగ్స్‌లో దూకుడుగా ఆడి లక్ష్యాలను ఛేదించడం.. టెస్టు మ్యాచ్ తొలి రోజు ఇన్నింగ్స్ పూర్తి కాకముందే డిక్లేర్ చేయడం ద్వారా టెస్టు క్రికెట్లో ప్రకంపనలు రేపింది ఇంగ్లాండ్. కొన్నిసార్లు ప్రతికూల ఫలితాలు వచ్చినా ఆ జట్టు ఆ శైలిని విడిచిపెట్టలేదు. బాజ్‌బాల్ విషయంలో తగ్గేదే లేదని కెప్టెన్, కోచ్ నొక్కి వక్కాణిస్తూ వచ్చారు. అయితే ఎక్కువ శాతం విజయాలు వస్తున్నపుడు ఎవరేమన్నా పట్టించుకోవాల్సిన అవసరం లేకపోయింది. కానీ ఫలితాలు తిరగబడ్డాకే ఇంగ్లాండ్ పరిస్థితి తీవ్ర ఇబ్బందికరంగా మారింది.

భారత్ కొట్టిన దెబ్బతో..: గత ఏడాది పాకిస్థాన్ పర్యటనలో టెస్టు సిరీస్ ఓడిపోవడం ఇంగ్లాండ్‌కు పెద్ద షాక్. సిరీస్‌ను విజయంతో మొదలుపెట్టి కూడా తర్వాత వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిపోవడంతో ఇంగ్లిష్ జట్టుపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇక ఈ ఏడాది భారత్‌తో సిరీస్‌లో ఇంగ్లాండ్ ఆటతీరు మరింతగా విమర్శల పాలైంది. బాజ్‌బాల్ పేరుతో అతి దూకుడుకు పోయి ఆ జట్టు దెబ్బ తింది. సిరీస్ 2-2తో సమమైంది కానీ.. ఈ సిరీస్‌లో భారత్‌దే పైచేయి. చివరి టెస్టులో 374 పరుగుల లక్ష్యం ముందుండగా.. ఒక దశలో 332/5తో ఉన్న ఇంగ్లాండ్, 35 పరుగుల తేడాలో 5 వికెట్లు కోల్పోయి మ్యాచ్ ఓడిపోయింది. సిరీస్ గెలిచే అవకాశాన్ని కోల్పోయింది. దీంతో ఇంగ్లిష్ జట్టు అనుసరించే 'బాజ్‌బాల్' శైలిపై మాజీలు భగ్గుమన్నారు. దూకుడుగా ఆడేందుకు పిచ్‌లను బ్యాటింగ్‌కు అనుకూలంగా మార్చేయడంపైనా విమర్శలొచ్చాయి. ఆ సిరీస్‌లో ఇంగ్లాండ్ ఆట చూశాక.. ఆస్ట్రేలియాలో జరిగే యాషెస్‌లో ఆ జట్టు చిత్తు కావడం ఖాయమని ముందే అంచనాలు ఏర్పడ్డాయి. దీనికి తోడు సరైన సన్నాహకం లేకుండా యాషెస్‌లో బరిలోకి దిగింది స్టోక్స్ సేన. ఫలితమే.. మూడు వరుస ఓటములతో సిరీస్ పరాభవం. తొలి టెస్టును మెరుగ్గానే ఆరంభించిన ఇంగ్లాండ్.. మూడు ఇన్నింగ్స్‌ల వరకు పోటీలోనే ఉంది. కానీ నాలుగో ఇన్నింగ్స్‌లో హెడ్ విధ్వంసానికి కుదేలై ఓటమి చవిచూసిన స్టోక్స్ సేన.. తర్వాత కోలుకోలేకపోయింది. నిజానికి హేజిల్‌వుడ్ సిరీస్ మొత్తానికి దూరం కావడం, తొలి రెండు టెస్టుల్లో కమిన్స్ ఆడకపోవడం, మూడో మ్యాచ్‌కు స్మిత్ అందుబాటులో లేకుండా పోవడం ఇంగ్లాండ్‌కు కలిసొచ్చే విషయాలే. కానీ వీటిని ఆ జట్టు అనుకూలంగా మలుచుకోలేకపోయింది. ఆస్ట్రేలియా అంత బలంగా లేకపోయినా.. ఆ జట్టును ఢీకొని నిలవలేకపోయింది. ఎప్పుడూ ఆత్మవిశ్వాసంతో మాట్లాడే స్టోక్స్ జావగారిపోయాడు. విమర్శకులకు బదులివ్వలేక మెక్‌కలమ్ సతమతం అవుతున్నాడు. ఈ సిరీస్‌లో అసలు 'బాజ్‌బాల్' ఛాయలే కనిపించడం లేదు. వరుస ఓటములు ఎదురవుతుంటే.. జట్టు ఆత్మవిశ్వాసం సన్నగిల్లిపోతుంటే.. ఇక దూకుడుగా ఎలా ఆడేది? ఈ సిరీస్ అనంతరం స్టోక్స్ కెప్టెన్‌గా, మెక్‌లకమ్ కోచ్‌గా కొనసాగడమే కష్టమంటున్నారు. కాబట్టి 'బాజ్‌బాల్' ఇక అటకెక్కినట్లే!



స్టోక్స్

మహిళా క్రికెటర్ల మ్యాచ్ ఫీజులు భారీగా పెంపు

దిల్లీ: దేశవాళీ క్రికెట్లో మహిళా క్రికెటర్లు, మ్యాచ్ అధికారుల మ్యాచ్ ఫీజులను బీసీసీఐ రెట్టింపుకన్నా ఎక్కువ పెంచింది. దీంతో క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్న అమ్మాయిల ఆర్థిక స్థిరత్వం పెరగనుంది. భారత్ తొలిసారి మహిళల వన్డే ప్రపంచ కప్ గెలిచిన నేపథ్యంలో బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. పెంపుదలను బోర్డు అపెక్స్ కౌన్సిల్ ధ్రువీకరించింది. సవరించిన చెల్లింపు విధానం ప్రకారం.. సీనియర్ మహిళల దేశవాళీ వన్డే టోర్నమెంట్, బహుళ రోజుల టోర్నీల్లో తుది జట్టులో ఉన్న ప్లేయర్లకు రోజుకు రూ.50 వేలు చెల్లిస్తారు. ఇంతకుముందు ఈ ఫీజు రూ.20 వేలు మాత్రమే. రిజర్వ్‌లు రూ.25 వేలు పొందుతారు. జాతీయ టీ20 టోర్నీల్లో తుది జట్టులో ఉన్న వాళ్లకు రోజుకు రూ.25 వేలు ఇస్తారు. రిజర్వ్‌లకు రూ.12,500 లభిస్తాయి. అన్ని ఫార్మాట్లలో ఆడే అగ్రశ్రేణి మహిళా క్రికెటర్లు సీజన్‌లో రూ.12 నుంచి రూ.14 లక్షల వరకు సంపాదించవచ్చు. ఇక అండర్-23, అండర్-19లో ఆడే అమ్మాయిలకు రోజుకు రూ.25 వేలు చెల్లిస్తారు. రిజర్వ్‌లు రూ.12,500 పొందుతారు. మరోవైపు దేశవాళీ అంపైర్లు, రిఫరీల ఆదాయం కూడా బాగా పెరగనుంది. వాళ్లు రోజుకు రూ.40 వేలు అందుకుంటారు. అదే నాకౌట్ మ్యాచ్‌లకైతే ఫీజు.. మ్యాచ్ ప్రాధాన్యతను బట్టి రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఉంటుంది. అంటే ఓ అంపైర్ రంజీ ట్రోఫీ లీగ్‌కు మ్యాచ్‌కు రూ.1.60 లక్షలు, నాకౌట్ మ్యాచ్‌కు రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆర్జిస్తారు.

అప్పుడు రిటైర్ అవ్వాలనుకున్నా..



రోహిత్

దిల్లీ: గత వన్డే ప్రపంచకప్ (2023) ఫైనల్ అనంతరం రిటైర్ కావాలని అనుకున్నానని టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. రోహిత్ నేతృత్వంలో వరుసగా 9 మ్యాచ్‌లు నెగ్గి ఫైనల్ చేరిన భారత్.. టైటిల్ పోరులో ఆస్ట్రేలియా చేతిలో ఓడిన సంగతి తెలిసిందే. "2023 ప్రపంచకప్ ఫైనల్ తర్వాత ఎంతో వేదనకు గురయ్యా. ఇంకెంతమాత్రం క్రికెట్ ఆడకూడదనుకున్నా. ఎందుకంటే క్రికెట్ నా నుంచి అంతా తీసుకుందని, నా దగ్గర ఏమీ మిగలలేదని అనిపించింది" అని ఓ కార్యక్రమంలో రోహిత్ వ్యాఖ్యానించాడు. ఆ తర్వాత నెమ్మదిగా శక్తిని కూడదీసుకున్నానని చెప్పాడు. "ఆ ఓటమి జట్టులో అందరినీ తీవ్ర నిరాశకు గురిచేసింది. ఆ ఫలితాన్ని ఎవ్వరూ నమ్మలేకపోయారు. వ్యక్తిగతంగా నాకది చాలా క్లిష్టసమయం. ఎందుకంటే 2022లో కెప్టెన్సీ బాధ్యతలు అందుకున్నప్పటి నుంచి ప్రపంచకప్ కోసం ఎంతో శ్రమించా" అని రోహిత్ అన్నాడు. రోహిత్ ఇప్పటికే టెస్టు, టీ20 క్రికెట్ నుంచి రిటైరైన సంగతి తెలిసిందే. వన్డే ఫార్మాట్లో మాత్రమే అతడు.. 2027 ప్రపంచకప్‌లో ఆడాలనుకుంటున్నాడు.



డఫీ

87/0.. 138కి ఆలౌట్

విజృంభించిన డఫీ

కివీస్‌తో మూడో టెస్టులో విండీస్ చిత్తు

మౌంట్ మాంగనుయ్: వెస్టిండీస్‌తో మూడు టెస్టుల సిరీస్‌ను ఆతిథ్య న్యూజిలాండ్ 2-0తో కైవసం చేసుకుంది. మూడో టెస్టులో 323 పరుగుల భారీ తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. 462 పరుగుల ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 43/0తో అయిదో రోజు, సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కరీబియన్ జట్టు 138కే కుప్పకూలింది. పేసర్ జాకబ్ డఫీ (5/42), అజాజ్ పటేల్ (3/23) ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. ఒక దశలో 87/0తో మెరుగైన స్థితిలోనే కనిపించిన విండీస్.. కేవలం 51 పరుగుల తేడాతో పది వికెట్లు చేజార్చుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 575/8 వద్ద డిక్లేర్ చేయగా.. వెస్టిండీస్ 420 పరుగులు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌ను కివీస్ 306/2 వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ద్విశతకం, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన డెవోన్ కాన్వేకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', సిరీస్‌లో 23 వికెట్లు తీసిన జాకబ్ డఫీకి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి. ఈ సిరీస్‌లో తొలి టెస్టు డ్రా కాగా.. రెండు, మూడో టెస్టుల్లో కివీస్ గెలిచింది.

న్యూజిలాండ్ @ 2: ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో న్యూజిలాండ్ రెండో స్థానానికి చేరుకుంది. వెస్టిండీస్‌పై సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకోవడంతో దక్షిణాఫ్రికా (75)ను మూడో స్థానానికి నెట్టి కివీస్ (77.78 శాతం) రెండో ర్యాంకు సాధించింది. భారత్ (48.15) ఆరో స్థానంలో కొనసాగుతోంది. ఆస్ట్రేలియా (100) అగ్రస్థానంలో ఉండగా.. శ్రీలంక (66.67), పాకిస్థాన్ (50), ఇంగ్లాండ్ (27.08), బంగ్లాదేశ్ (16.67), వెస్టిండీస్ (4.17) వరుసగా 4, 5, 7, 8, 9 స్థానాల్లో కొనసాగుతున్నాయి.




శుభ్‌మన్ గిల్

బరిలో శుభ్‌మన్, అభిషేక్, అర్ష్‌దీప్

విజయ్ హజారే ట్రోఫీ

చండీగఢ్: విజయ్ హజారే ట్రోఫీలో పంజాబ్ తరఫున స్టార్ ప్లేయర్లు శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, అర్ష్‌దీప్ సింగ్ ఆడబోతున్నారు. ప్రపంచకప్, న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లతో ఆడే భారత జట్టులో చోటు కోల్పోయిన శుభ్‌మన్ గిల్.. విజయ్ హజారే వన్డే టోర్నీలో ఎలా ఆడతాడో చూడాలి. అంతర్జాతీయ సిరీస్‌లు లేనప్పుడు భారత కాంట్రాక్ట్ ఆటగాళ్లు దేశవాళీ టోర్నీల్లో ఆడాలన్న బీసీసీఐ నిబంధన నేపథ్యంలో స్టార్లంతా విజయ్ హజారే బాట పట్టారు. అభిషేక్ టీ20ల్లో మాత్రమే ఆడుతున్నందున అతడు ఈ టోర్నీలో ఎక్కువ మ్యాచ్‌ల్లో బరిలో దిగే అవకాశం ఉంది. విజయ్ హజారే ట్రోఫీలో గ్రూప్-సిలో ముంబయి, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లతో పంజాబ్ ఆడనుంది.

అగ్రస్థానంలో స్పెయిన్



స్పెయిన్ ఆటగాడు లామీన్ యమాల్

జ్యూరిచ్: 2025 ఫుట్‌బాల్ సీజన్‌ను స్పెయిన్ నంబర్‌వన్ ర్యాంకుతో ముగించింది. ఫిఫా సోమవారం వెల్లడించిన జాబితాలో స్పెయిన్ అగ్రస్థానంలో నిలవగా.. అర్జెంటీనా, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, బ్రెజిల్, పోర్చుగల్, నెదర్లాండ్స్, బెల్జియం, జర్మనీ, క్రొయేషియా వరుసగా తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి. వచ్చే ఏడాది జరిగే ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో గ్రూప్-హెచ్‌లో ఉన్న స్పెయిన్.. ఉరుగ్వే, సౌదీ అరేబియా, కేప్ వర్డీతో తలపడనుంది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ 142వ స్థానంలో కొనసాగుతోంది.

క్రికెట్‌కు గౌతమ్ వీడ్కోలు



కృష్ణప్ప గౌతమ్

బెంగళూరు: ఆల్‌రౌండర్ కృష్ణప్ప గౌతమ్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. భారత్ తరఫున 2021లో శ్రీలంకపై ఏకైక వన్డే ఆడిన 37 ఏళ్ల గౌతమ్.. కర్ణాటకకు 59 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించాడు. 1419 పరుగులు చేసి.. 224 వికెట్లు పడగొట్టాడు. 92 టీ20ల్లో 734 పరుగులు సాధించి, 74 వికెట్లు తీశాడు. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్, ముంబయి ఇండియన్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్‌కు ఆడాడు. 2021లో సీఎస్కే ఈ ఆల్‌రౌండర్‌ను ఏకంగా రూ.9.25 కోట్లు పెట్టి కొనుక్కుంది. అప్పటికి అతడు అంతర్జాతీయ అరంగేట్రం చేయలేదు. 2024లో లఖ్‌నవూ తరఫున సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై చివరి మ్యాచ్ ఆడాడు.

ఫైనల్లో అల్పైన్ × త్రివేణి



ప్రజ్ఞానంద, కరువానా

ముంబయి: గ్లోబల్ చెస్ లీగ్‌లో ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. అల్పైన్ ఎస్‌జీ పైపర్స్‌తో త్రివేణి కాంటినెంటల్ కింగ్స్ తలపడనుంది. సోమవారం తన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అల్పైన్ 6-11తో అలస్కాన్ నైట్స్ చేతిలో ఓడినా.. రెండో స్థానంలో నిలవడం ద్వారా ముందంజ వేసింది. లీగ్ దశను రెండో స్థానంతో ముగించాలంటే ఆఖరి మ్యాచ్‌లో అలస్కాన్ నైట్స్‌పై గెలవాలి లేదా కనీసం 6 గేమ్ పాయింట్లు అయినా సాధించాలి. చివరి మ్యాచ్‌లో ఓడిన అల్పైన్ (84) ఆరు గేమ్ పాయింట్లు సొంతం చేసుకోవడంతో గ్యాంజెస్ గ్రాండ్‌మాస్టర్స్ (83)ను వెనక్కి నెట్టి ముందంజ వేసింది. త్రివేణి కాంటినెంటల్ ఇప్పటికే ఫైనల్‌కు అర్హత సాధించింది. అల్పైన్ పైపర్స్‌లో ప్రజ్ఞానంద, కరువానా, అనీష్ గిరి, హో ఇఫాన్, నినో, లియోన్ మెండోకా.. త్రివేణి కాంటినెంటల్ జట్టులో విదిత్ గుజరాతి, అలీరెజా, వీయ్ యీ, జినెర్ జుహు, అలెగ్జాండ్రా కొస్తెనుక్, మార్క్ ఆండ్రియా ఆడుతున్నారు.

తోలుపై విశ్వ రూపం





కురుక్షేత్రంలో యుద్ధ రంగం.. రథంపై ఎగురుతున్న కపిధ్వజంపై శంఖనాదం చేస్తూ హనుమ.. సంశయంతో చూస్తున్న అర్జునుడు.. అతడిని కార్యోన్ముఖుణ్ని చేయడానికి విశ్వరూపం చూపిస్తున్న కృష్ణభగవానుడు. ఇన్ని విశేషాలను అత్యంత స్పష్టంగా లెదర్ (తోలు)పైకి తీసుకొచ్చాడు కండే హరినాథ్. సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన హరి.. తిరుపతిలోని ఎస్వీ శిల్ప కళాశాలలో కలంకారీ కోర్సులో శిక్షణ పొందుతున్నాడు. లెదర్ పప్పెటరీ కళపై ఆసక్తితో శ్రీకృష్ణుడి గీతోపదేశంపై అతడు తయారు చేసిన ఈ చిత్రానికి 2024కి గాను జాతీయ హ్యాండీ క్రాఫ్ట్ అవార్డు లభించింది. ఈ నెల 9న దిల్లీలో కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్ చేతుల మీదుగా అవార్డునూ అందుకున్నాడు. హరి తల్లిదండ్రులు, ఇద్దరు తాతలు కూడా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో లెదర్ పప్పెట్ చిత్రాలకు అవార్డులు తీసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వెంకట్‌రెడ్డి తెలిపారు. - ఈనాడు, తిరుపతి

అమ్మకు అండగా ఆర్డీవో

- బతికుండగానే తల్లి మృతి చెందినట్లు తప్పుడు ధ్రువీకరణ
- ఆమె ఆస్తిని విక్రయించిన కుమారుడు
- రిజిస్ట్రేషన్ రద్దు చేయించిన లక్ష్మీ ప్రసన్న

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కన్న తల్లి బతికున్నా మృతి చెందినట్లు తప్పుడు ధ్రువీకరణపత్రాలతో ఆమె పేరు మీద ఉన్న వ్యవసాయ భూమిని కుమారుడు ఇతరులకు విక్రయించేశారు. దీనిపై ఆర్డీవో విచారణ జరిపి ఆ తల్లికి న్యాయం చేశారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం కొమ్మవరం గ్రామానికి చెందిన విప్పల రమాదేవి(83)కి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. వారెవరూ పట్టించుకోకపోవడంతో గుంటూరులోని వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. ఆమెకు భర్త ద్వారా 1995లో స్వగ్రామంలోనే సర్వే నం.155/1లో 1.96 ఎకరాల వ్యవసాయ భూమి సంక్రమించింది. తద్వారా రెవెన్యూ అధికారులు వెబ్‌ల్యాండ్‌లో ఆమె పేరిట నమోదు చేశారు. ఆ తర్వాత రమాదేవి కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి భూమిని అక్రమంగా పొందాలన్న ఉద్దేశంతో రెవెన్యూ సిబ్బందితో కలిసి పథకం వేశారు. తల్లి మృతి చెందినట్లు మరణధ్రువీకరణ పత్రం సృష్టించారు. తల్లి పేరిట ఉన్న భూమిని తన పేరు మీద మార్చుకున్నారు. అనంతరం ఆ భూమిని 2024లో సోము చిననాగిరెడ్డి అనే వ్యక్తికి విక్రయించారు. దీనిపై బాధితురాలు రమాదేవి ఇటీవల ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్నకు ఫిర్యాదు చేశారు. ఇరుపార్టీలకు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టగా ఇరువురూ వాస్తవాన్ని అంగీకరించడంతో విక్రయ దస్తావేజును రద్దు చేయాలని దర్శి సబ్ రిజిస్ట్రార్‌కు ఆర్డీవో ఉత్తర్వులు జారీ చేశారు. దీంతోపాటు వెబ్‌ల్యాండ్‌లో రమాదేవి పేరు తిరిగి నమోదు చేయాలని కూడా ఆదేశించారు. సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం సంరక్షణ నిమిత్తం ప్రతి నెలా రూ.15 వేలను కుమారుడు తల్లికి చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భూమి అక్రమ విక్రయానికి సంబంధించి అప్పట్లో సహకరించిన తహసీల్దార్, వీఆర్వోలపై చర్యలతోపాటు రమాదేవి బతికి ఉండగానే మరణించినట్లు ధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేసిన రెవెన్యూ అధికారులపై చర్యల నిమిత్తం కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఆర్డీవో లక్ష్మీప్రసన్న తెలిపారు. రమాదేవికి వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ సువార్త, కమిటీ సభ్యులు అండగా నిలిచారు.



వృద్ధురాలు రమాదేవికి తీర్పు కాపీని అందజేస్తున్న ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న



జనసేన 'పదవి-బాధ్యత' కార్యక్రమంలో వేదికపై పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నాయకులు

భయం వద్దు.. మళ్లీ ఆ పాలన రాదు

(మొదటి పేజీ తరువాయి)

అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. మంచి పోలీసు అధికారులకు ప్రజలు అండగా నిలవాలన్నారు. జనసేన పార్టీలో ఉంటూ ప్రభుత్వ పదవులు పొందిన వారు బాధ్యతాయుతంగా ఉండాలని వివరించారు. ఎలాంటి తప్పుడు సెటిల్‌మెంట్లు చేసినా ఊరుకునేది లేదని స్పష్టంచేశారు. ప్రతి ఒక్కరూ తమ పదవి ద్వారా ప్రజలకు అంతో ఇంతో మంచి చేయాలని కోరారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో సోమవారం 'పదవి-బాధ్యత' అనే కార్యక్రమం నిర్వహించారు. జనసేన పార్టీలో ఉంటూ ప్రభుత్వం ద్వారా పదవులు పొందిన నాయకులందరితో పవన్ కల్యాణ్ సమావేశమై మాట్లాడారు. ఆయన మాట్లాడిన ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

అప్పటి వరకు కూటమి బలమే కోరుకుంటా..

'నేను 10, 15 ఏళ్లు కూటమి పాలన ఉండాలని తరచూ చెప్పేది మనం, మన పార్టీ తగ్గాలని, ఎవరినో బలోపేతం చేయాలని కాదు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే పరిస్థితుల్లో అందరం ఒకరితో ఒకరు కొట్టుకుంటూ ఉంటే అరాచకమే రాజ్యం ఏలుతుంది. అలాంటి పరిస్థితి అంటే నాకు భయం. ముందు ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసిన తర్వాత అందరూ ఒకస్థాయికి వచ్చిన తర్వాత అప్పుడు వేరే ఆలోచన చేద్దాం. అప్పటి వరకు కూటమి బలంగా ఉండాలని కోరుకుంటున్నా. ఒక మాజీ ముఖ్యమంత్రి.. తాము మళ్లీ అధికారంలోకి వచ్చి చంపేస్తామని, పోలీసు అధికారులకు తామంటే ఏమిటో చూపిస్తామని అనడం, కాంట్రాక్టర్లను బెదిరించడం వంటివి చేస్తున్నారంటే తప్పుడు సంకేతాలు వెళ్తాయి. పెట్టుబడులకు, పర్యాటకానికి కూడా ఇబ్బందే. ఎవరూ భయపడకండి, మళ్లీ ఆ పాలన రాదు' అని పవన్ కల్యాణ్ అన్నారు.



పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నాయకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పవన్ కల్యాణ్

పనితీరు గుర్తించే 3,459 పదవులు ఇచ్చాం

'కూటమి ప్రభుత్వంలో 3,459 మంది జనసేన నాయకులకు నామినేటెడ్ పదవులు ఇచ్చాం. మరికొందరిని త్వరలో నామినేట్ చేస్తాం. మొదటి నుంచి క్షేత్రస్థాయిలో పోరాటాలు చేసినవారికీ, పార్టీ కోసం కష్టపడిన వారికి ఎలాంటి సిఫార్సులు లేకుండా పదవులు ఇచ్చాం. ఓడిపోయినా పార్టీ కోసం నిలబడ్డవారిని గుర్తించాం. ఎమ్మెల్యేలు 21 మంది, ఇద్దరు ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్సీలు, ఇన్ని కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు ఉన్నారంటే పవన్ కల్యాణ్ ఒక్కరే కారణం కాదు. మనందరి భావజాలం, పోరాట పటిమ. ఏ పార్టీకైనా సమున్నత సిద్ధాంతం ఉండాలి. అందుకే 7 సిద్ధాంతాలను ఎంతో లోతుగా ఆలోచించి ప్రకటించాం. కులాల కోసం నేను పార్టీ పెట్టలేదు. జనసేన పార్టీ ఎదిగేకొద్దీ విస్తరించే పార్టీ. ఎందరినో కలుపుకొని వెళ్లే పార్టీ. జాతీయ దృక్పథం ఉన్న ప్రాంతీయ పార్టీ మనది. పార్టీ కన్నా సగటు ప్రజలే నాకు ముఖ్యం. ప్రజలు ఏదీ చెప్పరు. వారి కోపాన్ని ఎన్నికల్లోనే చూపిస్తారు. మన నాయకులు ఎవరూ భూపంచాయితీలు, సెటిల్‌మెంట్లు చేయొద్దు. అధికారాన్ని దుర్వినియోగం చేయకండి. నేను అధికారాన్ని దుర్వినియోగం చేయను. మీరు చేస్తే చూస్తూ ఊరుకోను' అని హెచ్చరించారు.

రాత్రికి రాత్రి కాంగ్రెస్ వైకాపా అయిపోయినట్లు కాదు..

'పార్టీ నిర్మాణం అంత సులభం కాదు. జనసేనకు బూత్ కమిటీలు, గ్రామ కమిటీలు లేవంటారు. రాత్రికి రాత్రి కాంగ్రెస్ పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీగా మారిపోయినట్లుగా జనసేనకు కుదరదు. వాళ్ల తండ్రులు సీఎంలు కాబట్టి వాళ్లకు అన్నీ చెల్లుతాయి. పిఠాపురం నియోజకవర్గంలో 53 గ్రామాల్లో 51 గ్రామాలకు కమిటీలను పారదర్శకంగా నియమించాం. అన్ని నియోజకవర్గాల్లో ఇలాగే చేయాలి. త్వరలో పార్టీ సభ్యత్వాల కార్యక్రమం చేపట్టబోతున్నాం. జనసేన కండువా వేసుకుంటే సభ్యత్వం ఉన్నట్లు కాదు. పార్టీ సభ్యత్వం ఉన్న వాళ్లకే పదవులు వస్తాయి. కూటమిలో భవిష్యత్తులో కొన్ని సర్దుబాట్లు ఉంటాయి. ఇబ్బందులు ఉంటాయి. ముందుగానే సంసిద్ధం అవ్వండి. పార్టీ నాయకులు కూటమి నాయకులను కలుపుకుని వెళ్లేలా ఉండాలి' అని పేర్కొన్నారు.

పోలవరానికి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలి

త్యాగాలు చేసిన వారికి గుర్తింపు ఉండాలి. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారకుడైన పొట్టి శ్రీరాములు పేరు పోలవరం వంటి ప్రాజెక్టుకు పెట్టాలని భావిస్తున్నా. పిల్లల్లో కులాల భావన పెంచి పోషించకూడదు. ఎస్సీ, బీసీ స్కూళ్లు, ఎస్సీ, బీసీ సంక్షేమం అని ఎందుకు అనడం? అందరికీ ఒకే స్కూళ్లు ఉండాలి' అని పవన్ కల్యాణ్ కోరారు. కొందరు తెలంగాణ దేవుడు, ఆంధ్ర దేవుడు అని విమర్శలు చేస్తున్నారని, ఇదేం పద్ధతని ప్రశ్నిస్తూ, ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్చలకు జనసేన నాయకులు వెళ్లొద్దని సూచించారు.

జెన్ జడ్ థీమ్‌తో ఆవిర్భావ దినోత్సవం..

'వచ్చే మార్చి 14న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం జన్ జడ్ థీమ్‌తో జరపాలని భావిస్తున్నాం. భవిష్యత్తు తరాలను ఉత్తేజపరిచేలా, పార్టీ విజన్, ఆశయాలు వారికి చేరేలా ఈ కార్యక్రమం ఉంటుంది' అని పవన్ కల్యాణ్ చెప్పారు.

ఎంత బాధ్యతగా ఉన్నామనేదే ముఖ్యం

ఎమ్మెల్సీ, పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు

'మనం ఏ పదవిలో ఉన్నాం అనే దగ్గరే ఆగిపోకూడదు. మనకు అప్పగించిన పదవిని ఎంత బాధ్యతగా నిర్వహించామన్నది ముఖ్యం. 3,500 మంది సభ్యులను ఒకచోట సమావేశపరచి ఇచ్చిన బాధ్యతల పట్ల దిశానిర్దేశం చేయడం గొప్ప విషయం. పవన్ కల్యాణ్ వంటి నాయకుడికే అది సాధ్యం అవుతుంది. గత ప్రభుత్వంలో ఏ పనికైనా 'నాకేంటి?' అనే పద్ధతి ఉండేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేదు. జనసేన పార్టీలో మాకేంటి కాదు.. నీకేం కావాలి అనే ఆలోచన మాత్రమే ఉంటుంది. ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన దానికంటే.. పార్టీలో కార్యకర్తగా పనిచేయడం నాకు సంతృప్తి అనిపిస్తుంది. నాకు అప్పగించిన బాధ్యతకు కట్టుబడి శాసన మండలిలో ప్రజా సమస్యల గురించి మాట్లాడటంలో తృప్తి ఉంది. భయం అనే మాట ఎరుగని పవన్ బాటలో నడవడం గౌరవంగా భావిస్తా'



'పదవి-బాధ్యత' కార్యక్రమానికి హాజరైన జనసేన పార్టీ నాయకులు

పోరాటాల నుంచి పనులు చేయించే స్థాయికి వచ్చాం

జనసేన సభలో మంత్రి కందుల దుర్గేష్



ఈనాడు-అమరావతి: 'రాష్ట్ర శ్రేయస్సు, ప్రజలకు న్యాయం చేయడం కోసం పవన్ కల్యాణ్ తనను తాను తగ్గించుకున్నారు. రాష్ట్ర ప్రజల కోసం 21 సీట్లకు పరిమితం అయ్యారు. అందుకే జనసేనకు ఇన్ని పదవులు వచ్చాయి. మనమంతా ఇక్కడ కూర్చుని మాట్లాడుకోగలుగుతున్నాం. మనం పోరాడే స్థాయి నుంచి అధికారులకు చెప్పి పనులు చేయించే స్థాయికి వచ్చాం. దీని వెనుక పవన్ కల్యాణ్ కష్టం ఉంది.' అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ప్రతి ఒక్కరూ పదవిని హోదాగా కాకుండా బాధ్యతగా స్వీకరించాలని చెప్పారు. మంగళగిరిలో జనసేన 'పదవి-బాధ్యత' కార్యక్రమంలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు.

దూరదృష్టితోనే కూటమి

- ఎంతో దూరదృష్టితో జనసేన అధినేత కూటమి కట్టారు. నరకాసుర వధలో కీలక పాత్ర పోషించారు. రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయాలి.
  - కొణతాల రామకృష్ణ, అనకాపల్లి ఎమ్మెల్యే
- పవన్‌కల్యాణ్ పార్టీకి బ్రాండ్. దిల్లీలో కూడా మన పార్టీని పవన్ జీ పార్టీ అని పిలుస్తారు. తక్కువ కాలంలోనే పార్లమెంట్‌లో ఎక్కువసార్లు మాట్లాడగలిగాను.
  - కాకినాడ లోక్‌సభ సభ్యులు ఉదయ శ్రీనివాస్
- కూటమి ధర్మాన్ని పాటిస్తూ పార్టీ ప్రతిష్ఠ కూడా పెంచుదాం. అధినేత స్ఫూర్తితోనే వైకాపా ప్రభుత్వంపై ఐదేళ్లు పోరాడగలిగాం.
  - నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్
- పదవి చిన్నదయినా మన ప్రవర్తన పార్టీ గౌరవం పెంచేలా ఉండాలి. మనవల్ల పదిమందికి ఉపయోగం జరగాలి. జనసేన కండువానే మనకున్న అతిపెద్ద అర్హత. పార్టీకి జీవితకాలం జవాబుదారీగా ఉంటా.
  - తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్
- పదవులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి. మన బాధ్యతలు మనం తెలుసుకుంటే అధికార యంత్రాంగం అదే సహకరిస్తుంది. బాధ్యతలు, మార్గదర్శకాలు తెలుసుకుని వ్యవహరించాలి.
  - రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
- ప్రభుత్వంలో ఉండి కూడా 2017లో పవన్ కల్యాణ్ చేనేత సత్యాగ్రహం సభకు వచ్చి అండగా నిలిచారు. తనకు తాను చేనేతకు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించుకున్నారు. ఈ పదవులను మనం బాధ్యతగా నిర్వహిద్దాం.
  - వైద్య మౌలిక సౌకర్యాల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్
- సామాన్య కార్యకర్తగా ఉన్న నన్ను గుర్తించి ఈ స్థాయి పదవి ఇచ్చారు. పార్టీకి మాట రానివ్వకుండా చూస్తా. నాయకుడు నాపై పెట్టిన బాధ్యతను నిర్వర్తిస్తా.
  - శ్రీకాళహస్తీశ్వర ఆలయ ఛైర్మన్ కొట్టే సాయిప్రసాద్
- ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఇంతవరకు వచ్చా. పవన్ కల్యాణ్ చేస్తున్న అభివృద్ధిని గ్రామ స్థాయిలో ప్రజలు గొప్పగా చెబుతున్నారు.
  - శ్రీశైలం ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ రేఖాగౌడ్

క్షయ వ్యాధికి త్వరలో భారత్ బయోటెక్ టీకా

- 2026 ప్రారంభంలో మూడో దశ పరీక్షలు
- బయోఫ్యాబ్రి నుంచి సాంకేతిక పరిజ్ఞానం బదిలీ



ఈనాడు బిజినెస్ బ్యూరో, హైదరాబాద్: ఏటా 10 లక్షల మంది మరణానికి కారణమవుతున్న క్షయ వ్యాధి నుంచి రక్షణ కల్పించే టీకాను భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (బీబీఐఎల్) అందించనుంది. 'ఎంటీబీవ్యాక్' అనే ఈ టీకాను మనదేశంలో ఉత్పత్తి చేయడానికి సన్నద్ధమవుతోంది. ఇందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్ బయోటెక్‌కు, బయోఫ్యాబ్రి అనే అంతర్జాతీయ టీకాల కంపెనీ బదిలీ చేయడాన్ని ప్రారంభించింది. 'ఎంటీబీవ్యాక్' టీకాను అభివృద్ధి చేసే విషయంలో భారత్ బయోటెక్, గత మూడేళ్లుగా బయోఫ్యాబ్రితో కలిసి పని చేస్తోంది. ఇప్పటికే మనదేశంలో రెండు దశల క్లినికల్ పరీక్షలు పూర్తిచేశారు. టీకా భద్రమైనదని, సమర్థత కలిగి ఉందని నిర్ధారణ కావడంతో, మూడో దశ పరీక్షలు చేపట్టటానికి భారత్ బయోటెక్ సన్నాహాలు చేస్తోంది. 2026 ప్రారంభంలో మూడో దశ క్లినికల్ పరీక్షలు మొదలయ్యే అవకాశం ఉంది. క్షయ వ్యాధి టీకాల విభాగంలో 'సజీవమైన అటెన్యుయేటెడ్ మైకోబాక్టీరియం' టీకా ఇదొక్కటే కావడం ప్రత్యేకత. వ్యాధికారక యాంటీజెనిక్ లక్ష్యాలను పూర్తిగా చేరుకున్న టీకా కూడా ఇదే. అప్పుడే పుట్టిన బిడ్డలతో పాటు, పెద్ద వాళ్లలో సైతం పనిచేసేలా దీన్ని అభివృద్ధి చేశారు. మనదేశంతో పాటు క్షయ వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న ఆఫ్రికా, ఆగ్నేయ ఆసియాలోని దాదాపు 70 దేశాలకు ఈ టీకా సరఫరా చేస్తామని వివరించింది.

■ ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ మంది ప్రజలకు టీకా అందించడానికి భారత్ బయోటెక్‌తో కుదుర్చుకున్న ఒప్పందం వీలుకల్పిస్తుందని, బయోఫ్యాబ్రి సీఈఓ ఎస్టెబాన్ రోడ్రిగ్జ్ వివరించారు. 'ఆవిష్కరణ, అందరికీ అందించడం' అనేవి భారత్ బయోటెక్ అనుసరిస్తున్న ప్రాథమిక సూత్రాలని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్ల తెలిపారు.

పవన్‌కల్యాణ్, ఎన్టీఆర్‌ల వ్యక్తిగత హక్కుల రక్షణపై కేసు విచారణ మే 12కి వాయిదా

ఈనాడు, దిల్లీ: సామాజిక మాధ్యమాలు, వాణిజ్య వెబ్‌సైట్‌లలో పెడుతున్న పోస్టుల కారణంగా దెబ్బతింటున్న తమ వ్యక్తిగత హక్కులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ప్రముఖ నటుడు ఎన్టీఆర్ వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను దిల్లీ హైకోర్టు మే 12వ తేదీకి వాయిదా వేసింది. సోమవారం వీరి పిటిషన్లపై విచారించిన జస్టిస్ మన్‌ప్రీత్ ప్రీతంసింగ్ అరోడా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పవన్‌కల్యాణ్, ఎన్టీఆర్ ఫొటోలు, వీడియోలు, పేర్లను వాణిజ్య అవసరాలు, తప్పుడు ప్రచారం కోసం సామాజిక మాధ్యమాల్లో దుర్వినియోగం చేస్తున్నందున వాటిని అడ్డుకోవాలని వారి తరఫున వాదనలు వినిపించిన సాయిదీపక్ న్యాయమూర్తిని కోరారు. పలు సామాజిక మాధ్యమ పోస్టుల్లో తప్పుడు సమాచారం, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, పరువునష్టం కలిగించే కంటెంట్ ఉన్నట్లు విన్నవించారు. అందువల్ల ఫ్లిప్‌కార్ట్ అమెజాన్, ఎక్స్, గూగుల్ వేదికల్లో ఉన్న ఇలాంటి పోస్టులను తొలగించేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. అయితే ఇందుకు ప్రతివాదుల తరఫు న్యాయవాదులు స్పందిస్తూ కోర్టు ఇదివరకు జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి ఇప్పటికే వివాదాస్పద లింక్‌లు తొలగించినట్లు ధర్మాసనానికి తెలిపారు. అయితే ఇదే సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ ఏదైనా లింక్‌లను తొలగించమని ఆదేశాలు ఇచ్చేటప్పుడు వాటిని పోస్ట్‌చేసిన వినియోగదారుల వాదనలూ వినాల్సి ఉంటుందన్నారు. అభిమానులు చేసిన పోస్ట్‌లపై ఇన్‌స్టాగ్రామ్ స్పష్టంగా డిస్‌క్లెయిమర్ ముద్రించాలని సూచించారు. అలాగే సెలబ్రిటీల వ్యక్తిగత హక్కులకు భంగం కలిగిస్తే జరిగే పరిణామాల గురించి గూగుల్ వినియోగదారులకు చెప్పాలని, ఆ తర్వాత కూడా ఎవరైనా అలా నడుచుకుంటే వారి ఖాతాలను సస్పెండ్ చేయాలని న్యాయమూర్తి నిర్దేశించారు. ప్రస్తుత పిటిషన్లలో పేర్కొన్న వివాదాస్పద పోస్టులకు సంబంధించిన ఐపీ లాగిన్ వివరాలను మూడు వారాల్లో సమర్పించాలని ప్రతివాదులకు ఆదేశించారు. తదుపరి విచారణను మే 12కి వాయిదా వేశారు.

'ముస్తాబు'పై దేశవ్యాప్తంగా ఆసక్తి : మంత్రి సవిత



పాఠశాలలో వాష్ బేసిన్, అద్దాలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌తో కలిసి ప్రారంభిస్తున్న మంత్రి సవిత

మోపిదేవి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి ఆలోచన మేరకు పాఠశాలలు, వసతిగృహాల్లో కొత్తగా ప్రారంభించిన 'ముస్తాబు' కార్యక్రమంపై దేశవ్యాప్తంగా ఆసక్తి కనిపిస్తోందని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా మోపిదేవి మహాత్మ జ్యోతిబా ఫులే సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 'ముస్తాబు' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన వాష్‌బేసిన్లు, అద్దాలను ప్రారంభించారు. నెయిల్‌కట్టర్లు, దువ్వెనలు తదితర సామగ్రి నిర్వహణ, విద్యార్థుల పరిశుభ్రతలను బేరీజు వేసి స్టార్‌లను నిర్ణయించి పాఠశాలలకు జిల్లా స్థాయిలో అవార్డులు ఇస్తామన్నారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఆరోగ్య సంరక్షణ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత వంటివి 'ముస్తాబు' లక్ష్యాలన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ వినూత్న ఆలోచనల రూపశిల్పులు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ అని కొనియాడారు. విద్య, భోజన నాణ్యత, సమస్యలు, అవసరాలను మంత్రి, ఎమ్మెల్యే విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చేతులు రోజుకి ఎన్నిసార్లు కడుగుతావని ఓ విద్యార్థిని మంత్రి ప్రశ్నించగా 10 సార్లకు పైగా అని సమాధానమివ్వడంతో చిరునవ్వునవ్వారు.

మంత్రివర్గ సమావేశం 29కి వాయిదా

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 24న నిర్వహించాల్సిన మంత్రివర్గ సమావేశం 29కి వాయిదా పడింది. ఆ రోజు ఉదయం సచివాలయంలో ఈ సమావేశం ప్రారంభం కానుంది.

ఏపీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా అమర్ జహాన్ బేగ్



ఈనాడు, దిల్లీ: ఏపీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా తూర్పుగోదావరి జిల్లా కాపవరానికి చెందిన అమర్ జహాన్ బేగ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడి ఆమోదంతో ఈ నియామకం చేపట్టినట్లు వెల్లడించారు.

నేడు పులివెందులకు జగన్

ఈనాడు, అమరావతి: మాజీ సీఎం జగన్ మూడు రోజుల పాటు పులివెందులలో పర్యటించనున్నారు. మంగళవారం బెంగళూరు నుంచి బయలుదేరి సాయంత్రం పులివెందులకు చేరుకోనున్నారు. 24న ఉదయం ఇడుపులపాయలో జరిగే క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం పులివెందుల చేరుకుని అక్కడ ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. 25న ఉదయం పులివెందుల సీఎస్ఐ చర్చిలో నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం బెంగళూరు వెళతారు.

దాచుకోవచ్చు.. అవసరంలో వాడుకోవచ్చు

- రాష్ట్రంలో బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టులు
- 1,000 మెగావాట్ల సామర్థ్యం
- ఏడు ప్రాంతాల్లో ఏర్పాటు
- పీక్ సమయంలో యూనిట్ విద్యుత్ అతి తక్కువ ధరకు అందుబాటులోకి

ఈనాడు-అమరావతి: రాష్ట్రంలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ విద్యుత్ సాంకేతికత వినియోగంలోకి రాబోతోంది. 2,000 మెగావాట్ అవర్ (వెయ్యి మెగావాట్ల సామర్థ్యం ఉన్న యూనిట్ల ద్వారా.. ఉదయం, సాయంత్రం రెండేసి గంటల చొప్పున విద్యుత్ నిల్వ) బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఇంధన శాఖ టెండర్లను ఖరారు చేసింది. మెగావాట్‌కు.. నెలకు సగటున రూ.1,58,575 చొప్పున అతి తక్కువ రేటును గుత్తేదారులు కోట్ చేశారు. రాష్ట్రంలో ఏడు ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు ఆ శాఖ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా నిల్వ చేసిన విద్యుత్ 12 ఏళ్ల పాటు అందుబాటులో ఉంటుంది. దీనివల్ల పీక్ డిమాండ్ సమయంలో యూనిట్ విద్యుత్ రూ.4.38కే లభిస్తుంది. సుమారుగా ఏడాది కాలంలో ఇవి అందుబాటులోకి రావచ్చని అంచనా.

రూ.910 కోట్లు ఆదా

రాష్ట్రంలో ఏర్పాటు చేసే ప్రాజెక్టుల ద్వారా 12 ఏళ్ల పాటు సేవలు అందుతాయి. వీటి ద్వారా 95 శాతం విద్యుత్ నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉంటుందని అంచనా. యూనిట్ విద్యుత్ నిల్వకు సగటున రూ.1.68 చొప్పున ఖర్చు అవుతుందని అధికారులు లెక్కలు తేల్చారు. నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ నిర్వహించే బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా యూనిట్ విద్యుత్ నిల్వకు రూ.2.15 చొప్పున ఖర్చు అవుతోంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఏర్పాటు చేసే 1,000 మెగావాట్ల ప్రాజెక్టులో నిల్వ చేసే విద్యుత్ ద్వారా రూ.910 కోట్లు ఆదా అవుతుందని అధికారులు లెక్కలు వేశారు.

పీక్ డిమాండ్‌లో.. యూనిట్ రూ.4.38కు అందుబాటులో

పీక్ డిమాండ్ సమయంలో ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.10 చొప్పున డిస్కంలు కొంటున్నాయి. దీనివల్ల కొనుగోలు వ్యయం పెరిగి వినియోగదారులపై ట్రూఅప్ భారం పడుతోంది. బ్యాటరీ ప్రాజెక్టుల ఏర్పాటుతో విద్యుత్ కొనుగోలు వ్యయం భారీగా తగ్గుతుందని అంచనా. ఉదయం పీక్ డిమాండ్ సమయంలో రెండు గంటలు, సాయంత్రం పీక్ డిమాండ్ వేళల్లో రెండు గంటల చొప్పున బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్ వినియోగించుకోవాలని అధికారులు భావిస్తున్నారు.

■ పీక్ డిమాండ్ సమయంలో యూనిట్ విద్యుత్ రూ.4.38 ధరకు అందుబాటులోకి వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టులకు యూనిట్‌కు చెల్లించే స్థిర ఛార్జీలు రూ.1.68, యూనిట్ విద్యుత్ కొనుగోలుకు రూ.2.70 చొప్పున (మైలవరం సౌర ప్రాజెక్టు ద్వారా యూనిట్ రూ.2.70 చొప్పున అందుతుంది) డిస్కంలు చెల్లిస్తాయి.

ప్రాజెక్టులు ప్రతిపాదించిన ప్రాంతాలివి

సబ్‌స్టేషన్/ప్రాజెక్టు	సామర్థ్యం (మెగావాట్లు)	ఎల్1 బిడ్డర్	మెగావాట్/నెలకు కోట్ చేసిన ధర
శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం	225	బొండాడ ఇంజినీరింగ్	1,64,000
అనంతపురం జిల్లా తలారిచెరువు	275	సుధాకర ఇన్‌ఫ్రాటెక్, ఎకోరన్ కన్సార్షియం	1,50,000
చిత్తూరు జిల్లా కలికిరి	150	పీజీసీఐఎల్, గురుగ్రామ్	1,64,000
అనంతపురం జిల్లా పంపనూరు తండా	225	సుధాకర ఇన్‌ఫ్రాటెక్, ఎకోరన్ కన్సార్షియం	1,65,000
విజయనగరం జిల్లా మరడాం	75	భగవతి ల్యాక్టో వెజిటేరియన్ ఎక్స్‌పోర్ట్స్	1,50,000
విశాఖ జిల్లా సింహాచలం	25	లెజియాన్ ఎనర్జీ ప్రొడక్ట్స్	1,50,000
విశాఖ జిల్లా గాజువాక	25	ఎస్‌వీఆర్ ఎలక్ట్రో ప్రాజెక్ట్స్	1,48,000

ఏడు వైద్యశాలల్లో 'టిఫా' స్కానింగ్ సేవలు

ఈనాడు, అమరావతి: మాతా శిశు సంరక్షణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం రూ.2.13 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని ఏడు సెకండరీ వైద్యశాలల్లో టిఫా (టార్గెటెడ్ ఇమేజింగ్ ఫర్ ఫీటల్ ఎనామలీస్) స్కానింగ్ యంత్రాలు అందుబాటులోకి తెచ్చింది. వీటిని తుని, నర్సీపట్నం, నందిగామ ప్రాంతీయ ఆసుపత్రులతో పాటు పార్వతీపురం, అనకాపల్లి, తెనాలి, ఒంగోలు జిల్లా ఆసుపత్రుల్లో అమర్చారు. ప్రస్తుతం వాటి పనితీరును పరిశీలిస్తున్నారు. జనవరి 1 నుంచి గర్భిణులకు స్కానింగ్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేనున్నట్లు సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధరబాబు తెలిపారు.



టిఫా స్కానింగ్ యంత్రం

ఘోస్ట్ గ్రామంగా లేవ్‌గఢ్




ఉత్తరాఖండ్‌లో ఘోస్ట్ గ్రామాలు (నిర్మానుష్య) పెరుగుతున్నాయి. తాజాగా రుద్ర ప్రయాగ్ జిల్లాలోని లేవ్‌గఢ్ ఆ జాబితాలో చేరింది. ఈ గ్రామం స్వాతంత్ర్య సమరయోధుడు శివ్‌సింగ్ సజ్వాన్ సొంత గ్రామం కావడం గమనార్హం. సరైన సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఈ గ్రామం నుంచి అందరూ వలసవెళ్లారు. ఉత్తరాఖండ్‌లోని కొండ ప్రాంత గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఇటీవల 90 ఏళ్ల సీతా దేవి మరణించడంతో మిగిలిన ఇద్దరు వృద్ధులు గ్రామాన్ని విడిచి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆ గ్రామం ఎడారిగా మారింది.

ఈటీవీ భారత్

కామన్‌వెల్త్ గేమ్స్‌కు కేరళ నుంచి హిందీ గీతం

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరగనున్న కామన్‌వెల్త్ క్రీడల కోసం ప్రత్యేక హిందీ గీతం కేరళలో రూపొందింది. 2030లో జరిగే ఈ క్రీడల్లో ఈ గీతం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. కోజికోడ్‌లోని మలబార్ క్రిస్టియన్ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ వశిష్ఠ్ దీనికి రూపకల్పన చేశారు. ఆయన మాజీ విద్యార్థి సాయి గిరిధర్ ఆలపించారు. కామన్‌వెల్త్ క్రీడలు ప్రపంచానికి భారత్ అందించే బహుమతి అంటూ గీతం ప్రారంభమవుతుంది. అన్ని దేశాల యువత భాగస్వామ్యాన్ని వర్ణిస్తుంది.



హెలికాప్టర్‌లో పులి తరలింపు



సివనీ: మధ్యప్రదేశ్‌లోని పెంచ్ పులుల అభయారణ్యం నుంచి ఒక ఆడ పులిని రాజస్థాన్‌లోని రామ్‌గఢ్ విష్ధారి అభయారణ్యానికి హెలికాప్టర్‌లో తరలించారు. పీఎన్-224 అనే ఈ పులిని వైమానిక దళానికి చెందిన ఎంఐ-17 హెలికాప్టర్‌లో తీసుకెళ్లారు. సోమవారం ఉదయం 6.35 గంటల సమయంలో పులి రామ్‌గఢ్ చేరుకుంది. తొలుత పులిని హెలికాప్టర్‌లో జైపుర్‌కు తీసుకొచ్చారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో అభయారణ్యానికి తరలించారు.

భారత్‌కు వీసా సేవల్ని నిలిపివేసిన బంగ్లా

ఢాకా: బంగ్లాదేశ్‌లోని చత్తోగ్రాంలో ఉన్న తన వీసా కేంద్రం సేవల్ని భారత్ రద్దుచేసినందుకు ప్రతిగా బంగ్లా కూడా దిల్లీ, త్రిపురలోని తన దౌత్య కార్యాలయాల్లో వీసా సేవల్ని సోమవారం తాత్కాలికంగా నిలిపివేసింది. తదుపరి సమాచారం అందించే వరకూ వీసా సేవల్ని నిలిపివేస్తున్నట్లు బంగ్లాదేశ్ పేర్కొంది. గత సంవత్సరం బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ మార్పునకు దారితీసిన విద్యార్థి యువజన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఇంకిలాబ్ మంచా నాయకుడైన షరీఫ్ ఉస్మాన్ హాదీ ఇటీవల హత్యకు గురైన నాటి నుంచీ భారత బంగ్లా సంబంధాల పతనం కొనసాగుతోంది. "అనివార్య కారణాల రీత్యా బంగ్లాదేశ్ హైకమిషన్ అన్ని దౌత్య, వీసా సేవల్ని తాత్కాలికంగా నిలిపివేస్తోంది" అని దిల్లీలోని బంగ్లా రాయబార కార్యాలయం ప్రకటించింది.

మరో ఉద్యమ నేతపై కాల్పులు

గత సంవత్సరం బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా పదవీచ్యుతికి దారితీసిన విద్యార్థి యువజన ఉద్యమంలో రెండో కీలక నేతగా గుర్తింపు పొందిన మొతాలెబ్ షిక్దర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం కాల్పులు జరిపారు. ఖుల్నా నగరంలో ఈ ఘటన జరిగింది. తలపై తీవ్ర గాయమైన ఆయనను తక్షణం ఖుల్నా వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు.

సౌదీ వాతావరణంలో అసాధారణ మార్పులు

- మంచు దుప్పట్లో పలు ప్రాంతాలు



ఇంటర్నెట్ డెస్క్: సౌదీ అరేబియా అనగానే ముందుగా మనసులో మెదిలేవి.. భరించలేని వేడి, అనంతమైన ఎడారులు! అలాంటి దేశాన్ని ఈసారి అనూహ్యంగా మంచు దుప్పటి కప్పేసింది. ఏళ్లుగా వర్షమే ఎరుగని అనేక నగరాల్లో ఇప్పుడు భారీగా వానలు కురుస్తున్నాయి. తెల్లవారుజామున ఉష్ణోగ్రతలు సున్నాస్థాయికి పడిపోతున్నాయి. ఈ పరిణామాలు ప్రజలకు ఆశ్చర్యం, ఆందోళన కలిగిస్తున్నాయి. సౌదీలోని ఉత్తర ప్రాంతంలో ఈ అసాధారణ వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. తబుక్ రాష్ట్రంలోని పర్వత శ్రేణులను ఎప్పుడూ లేనివిధంగా మంచు కప్పేసింది. అక్కడ 2,600 మీటర్ల ఎత్తులో ఉన్న ట్రొజెనా పర్వత ప్రాంతంలో మంచుతో పాటు వర్షం కురుస్తోంది. హెయిల్ నగర పరిసరాల్లోనూ అదే పరిస్థితి కనిపించింది. అలాగే చలిగాలుల ప్రభావంతో పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దేశ రాజధాని రియాద్‌కు ఉత్తరాన విస్తరించిన ఎత్తయిన ప్రదేశాల్లో హిమపాతం కురిసినట్లు సౌదీ జాతీయ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయని పేర్కొంది. వరదలు సంభవించే అవకాశం ఉన్న లోయ ప్రాంతాలకు దూరంగా ఉండాలని, ఆ కేంద్రం ప్రజలకు హెచ్చరిక జారీ చేసింది. తీవ్ర వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దేశ రాజధానిలో పాఠశాలలు విద్యార్థుల కోసం ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నాయి.



వైద్యుడు రాఘవ్, బాధితుడు అర్జున్ పన్వార్

గౌరవమిచ్చి మాట్లాడమన్నందుకు రోగిని చితకబాదిన వైద్యుడు

హిమాచల్‌లో సస్పెన్షన్ వేటు

శిమ్లా: చికిత్స కోసం వచ్చిన రోగిని ఓ వైద్యుడు చితకబాదాడు. మర్యాదగా మాట్లాడమన్నందుకు విచక్షణ మరిచి దాడి చేశాడు. హిమాచల్‌ప్రదేశ్ రాజధాని శిమ్లాలోని ఇందిరా గాంధీ వైద్య కళాశాల(ఐజీఎంసీ)లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారుతున్నాయి. శిమ్లా జిల్లాకు చెందిన అర్జున్ పన్వార్ కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం ఐజీఎంసీ ఆసుపత్రికి వెళ్లాడు. "నాకు శ్వాస తీసుకోవడంతో ఇబ్బంది ఉంది. ఆక్సిజన్ కోసం అడిగినప్పుడు డా.రాఘవ్ నా అడ్మిషనుపై ప్రశ్నించాడు. గౌరవం ఇచ్చి మాట్లాడమని నేను అడగడంతో 'తూ' (నువ్వు) అని అన్నాడు. ఇంట్లోవారితో మీరు ఇలాగే మాట్లాడతారా అన్న నా ప్రశ్నను వ్యక్తిగత దాడిగా భావించి నన్ను కొట్టడం ప్రారంభించాడు" అని బాధితుడు అర్జున్ వెల్లడించారు. ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న వైద్యుడిపై సస్పెన్షన్ వేటు పడింది.

ప్రధాని అధ్యక్షతన 26 నుంచి సీఎస్‌ల జాతీయ సమావేశం

ఈనాడు, దిల్లీ: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శు(సీఎస్)ల 5వ జాతీయ సమావేశం ఈనెల 26 నుంచి 28 వరకు మూడురోజుల పాటు దిల్లీలో జరగనుంది. దీనికి ప్రధాని మోదీ అధ్యక్షత వహించనున్నారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాలను సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేసేలా దిశానిర్దేశం చేయడానికి కేంద్రం ఈ సమావేశం నిర్వహిస్తోంది. ఇందులో సీఎస్‌ల తోపాటు జిల్లా యువ కలెక్టర్లు, పలు మంత్రిత్వశాఖల కార్యదర్శులు పాల్గొంటారు.

కారు బాంబు పేలుడులో.. రష్యా కీలక జనరల్ మృతి



పేలుడులో ధ్వంసమైన కారు



ఫానిల్ సర్వరోవ్

మాస్కో: దక్షిణ మాస్కోలో సోమవారం ఉదయం కారు బాంబు పేలుడు కలకలం సృష్టించింది. ఈ ఘటనలో రష్యా లెఫ్టినెంట్ జనరల్ ఫానిల్ సర్వరోవ్ మృత్యువాతపడినట్లు అధికారులు వెల్లడించారు. ఫానిల్ సాయుధ దళాల ఆపరేషనల్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ అధిపతిగా వ్యవహరిస్తున్నారు. ఆయన కారు కింద అమర్చిన ఓ పరికరం పేలిందని.. ఈ దాడి వెనక ఉక్రెయిన్ నిఘా విభాగం హస్తం ఉందని రష్యా అధికారులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. యాసెనెవా స్ట్రీట్‌లోని ఓ అపార్ట్‌మెంట్ దగ్గర కారు పార్కింగ్ ప్రాంతంలో ఉదయం 7 గంటల సమయంలో కారు పేలిపోయిందని, ఆ సమయంలో వాహనం లోపల డ్రైవర్ కూడా ఉన్నారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. 2024 డిసెంబరులో ఇలాగే రష్యా అణు దళాధిపతి, లెఫ్టినెంట్ జనరల్ ఇగోర్ కిరిల్లోవ్‌పై దాడి జరిగింది. అది తమ పనేనని తర్వాత ఉక్రెయిన్ ప్రకటించింది.

సైబర్ వలలో చిక్కుకొని.. తుపాకీతో కాల్చుకున్న మాజీ ఐపీఎస్

- పంజాబ్‌లో ఘటన



అమర్‌సింగ్

పటియాలా: సైబర్ నేరగాళ్ల చేతుల్లో రూ.8.10 కోట్లు మోసపోయిన ఓ మాజీ ఐపీఎస్ అధికారి అవమాన భారంతో తనను తాను తుపాకీతో కాల్చుకున్న ఘటన పంజాబ్‌లోని పటియాలాలో సోమవారం కలకలం సృష్టించింది. పటియాలా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వరుణ్ శర్మ తెలిపిన వివరాల ప్రకారం- అమర్ సింగ్ చాహల్ మాజీ ఐపీఎస్ అధికారి. గతంలో పంజాబ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పని చేశారు. డీబీఎస్ బ్యాంకు సీఈవోగా, ఇతర అధికారులుగా, సంపద నిర్వహణ సలహాదారులుగా చెప్పుకొంటూ కొందరు సైబర్ నేరగాళ్లు వాట్సప్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా ఆయన్ను ఆకర్షించారు. స్టాక్ ట్రేడింగ్, ఐపీవో కేటాయింపులు, ఓటీసీ ట్రేడ్‌ల వంటి విధానాల్లో అధిక రిటర్నులు ఆశజూపారు. వారిని నమ్మి అమర్‌సింగ్ పెట్టుబడులు పెట్టారు. ఆయన పెట్టుబడులు అధిక లాభాల్లో ఉన్నట్లు సైబర్ మోసగాళ్లు నకిలీ డ్యాష్‌బోర్డుల ద్వారా చూపించారు. అది నమ్మి అమర్‌సింగ్ మరిన్ని పెట్టుబడులు పెట్టారు. వాటిని ఉపసంహరించుకునేందుకు సర్వీసు రుసుము, పన్నుల రూపంలోనూ భారీ మొత్తాలను చెల్లించారు. పెట్టుబడుల ఉపసంహరణ ఎంతకీ వీలు కాకపోవడంతో.. తాను మొత్తం రూ.8.10 కోట్లు మోసపోయిన విషయాన్ని గ్రహించారు. మాజీ పోలీసు అధికారినయ్యుండి తానే సైబర్ వలలో చిక్కుకోవడాన్ని అవమానంగా అమర్‌సింగ్ భావించారు. తాను మోసపోయిన విధానాన్ని వివరిస్తూ, సైబర్ నేరగాళ్లపై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలని పంజాబ్ డీజీపీని కోరుతూ ఆయన 12 పేజీల నోట్ రాశారు. అనంతరం సెక్యూరిటీ గార్డుకు చెందిన రైఫిల్‌తో తనను తాను కాల్చుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఆయన పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.

అలసటను సాధారణంగా భావించొద్దు



చాలా మంది అలసటతో బాధపడుతుంటారు. దీనికి కొన్ని కారణాలు.. ✦ నాణ్యమైన నిద్రలేకపోవడం. ✦ పోషకాల లోపం. ✦ శరీరానికి తగినంత సూర్యరశ్మి తగలకపోవడం

ఈ పరిస్థితులను అధిగమించి శరీర కణాలను ఆరోగ్యకరంగా మార్చుకోవడం ద్వారా అలసటను దూరం చేసుకోవచ్చు.

– గ్యారీ బ్రెకా, జీవశాస్త్రవేత్త

నేషనల్ హెరాల్డ్ కేసు.. సోనియా, రాహుల్‌లకు దిల్లీ హైకోర్టు నోటీసులు



దిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ తదితరులపై దాఖలు చేసిన ఛార్జిషీటును పరిగణనలోకి తీసుకునేందుకు నిరాకరిస్తూ విచారణ కోర్టు జారీ చేసిన ఆదేశాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దిల్లీ హైకోర్టులో సవాలు చేసింది. ఈడీ దరఖాస్తుపై స్పందించాల్సిందిగా సోనియా, రాహుల్ తదితరులకు ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న విచారణ కోర్టు జారీ చేసిన ఆదేశాలపై స్టే విధించాలని ఈడీ కోరింది. దర్యాప్తు సంస్థ ఎఫ్ఐఆర్ ఆధారంగా తన ఛార్జిషీటు దాఖలు చేయలేదని, అందువల్ల దాన్ని అనుమతించడం చట్టసమ్మతం కాదని ట్రయల్ కోర్టు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. వ్యాజ్యానికి సంబంధించిన తన ప్రధాన పిటిషన్‌ను కూడా పరిశీలించాలని ఈడీ తాజా అభ్యర్థనలో దిల్లీ హైకోర్టును కోరింది. జస్టిస్ రవీందర్ దుదేజా ఈ కేసుపై విచారణను వచ్చే ఏడాది మార్చి 12కు వాయిదా వేశారు. ఈడీ దాఖలు చేసిన అభ్యర్థన ఆధారంగా హైకోర్టు గాంధీలతోపాటు సుమన్ దుబే, శాం పిట్రోడా, యంగ్ ఇండియన్, డోటెక్స్ మర్చండైజ్ ప్రైవేట్ లిమిటెడ్, సునీల్ భండారీలకు నోటీసులు జారీ చేసింది.

అజ్‌మేర్ షరీఫ్ దర్గాకు చాదర్ సమర్పించిన కేంద్రం


జైపుర్: ప్రసిద్ధ సూఫీ గురువు ఖాజా మొయినుద్దీన్ చిష్తీ ఉర్సు (జయంతి) ఉత్సవాల సందర్భంగా కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రభుత్వం తరఫున అజ్‌మేర్ షరీఫ్ దర్గాకు సోమవారం చాదర్ సమర్పించారు. "ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని నేను దర్గాకు వచ్చాను. చాదర్ సమర్పించే సమయంలో నేను మా ప్రభుత్వం తరఫున శాంతి సౌభాగ్యాల కోసం ప్రార్థించాను. దేశ ప్రగతి కోసం, శాంతి సామరస్యాల కోసం, అభివృద్ధి కోసం ప్రార్థన చేశాను" అని రిజిజు విలేకరులకు తెలిపారు. మరోవైపు అజ్‌మేర్ షరీఫ్ దర్గాకు కేంద్ర ప్రభుత్వం చాదర్ సమర్పించే క్రతువును నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. ఈ అంశం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మల్యా బాగ్చీల సెలవు కాలీన ధర్మాసనం సమక్షంలో సోమవారం ప్రస్తావనకు వచ్చింది. ప్రభుత్వం చాదర్ సమర్పించే సంప్రదాయానికి చట్టబద్ధత కానీ, రాజ్యాంగ బద్ధత కానీ లేవని పిటిషనర్లు జితేందర్ సింగ్ తదితరులు పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై రిజిస్ట్రీని సంప్రదించాలని ధర్మాసనం పిటిషనర్లను ఆదేశించింది.



అజ్‌మేర్ దర్గాకు చాదర్ సమర్పిస్తున్న కేంద్రమంత్రి కిరణ్ రిజిజు


ప్రజల్ని దోచుకునే ఏ అవకాశాన్నీ మోదీ వదలడం లేదు

రైల్వే టికెట్ల పెంపుపై ఖర్గే



దిల్లీ: ప్రజలను దోచుకోవడానికి మోదీ ప్రభుత్వం ఏ అవకాశాన్నీ వదిలిపెట్టడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే టికెట్ల ధరలను పెంచిన నేపథ్యంలో ఆయన సోమవారం ఎక్స్‌లో ఈ మేరకు పోస్ట్ చేశారు. ఒకే ఏడాదిలో రెండోసారి, అందునా కేంద్ర బడ్జెట్‌కు ముందే రైల్వే ఛార్జీలు పెంచడం ప్రజలపై భారమని ఆయన అన్నారు. మోదీ పాలనలో రైల్వేలు నిర్లక్ష్యం, నిరాసక్తతకు గురయ్యారని విమర్శించారు. రైల్వేకు ఆదాయం వస్తున్నా, సేవలు మెరుగుపడటం లేదన్నారు. రైల్వేలో 3.16 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వీటి భర్తీకోసం యువత ఎదురు చూస్తోందని గుర్తుచేశారు. భద్రతనూ పణంగా పెడుతున్నారని, 2014-23 మధ్య రైలు ప్రమాదాల్లో 2.18 లక్షల మంది చనిపోయారని చెప్పారు. ప్రచారమే తప్పిస్తే స్టేషన్ల అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు.

విద్య, వైద్యాలను వికేంద్రీకరించాలి: భాగవత్



చంద్రపుర్: ప్రతి వ్యక్తికి అందుబాటు ధరలో విద్య, వైద్యం అవసరమని, ఈ సేవల వికేంద్రీకరణ జరగాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. సోమవారం ఆయన మహారాష్ట్రలోని చంద్రపుర్‌లో పండిట్ దీన్‌దయాళ్ క్యాన్సర్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోగులపైనే కాకుండా వారి కుటుంబంపై కూడా క్యాన్సర్ తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. "క్యాన్సర్‌కు కారణాలు నిర్దిష్టంగా ఉండవు. దేవుడి ఇచ్చిన ఈ దేహాన్ని మానవాళి సేవకు మనం వినియోగించాలి. క్యాన్సర్ బాధితులకు సేవ చేయడంలో భాగస్వామ్యం కావాలి" అని పేర్కొన్నారు.

తండ్రితో సాధన చేసి.. బీచ్‌లో కాల్పులు



- సిడ్నీ ఉగ్రదాడి ఘటనలో వెలుగులోకి కీలక విషయాలు

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఇటీవల చోటుచేసుకున్న మారణహోమంపై దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఉగ్రదాడికి పాల్పడిన తండ్రీకొడుకులు సాజిద్ అక్రమ్ (50), నవీద్ అక్రమ్ (24).. కాల్పులకు ముందు ఓ రహస్య ప్రాంతంలో శిక్షణ తీసుకున్నట్లు తెలుస్తోంది. కేసు దర్యాప్తుపై కోర్టుకు సమర్పించిన పత్రాల్లో అధికారులు ఈ విషయాన్ని పేర్కొన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఓ గ్రామీణ ప్రాంతంలో నిందితులు తుపాకులు పట్టుకుని ఫైరింగ్ సాధన చేస్తున్న కొన్ని వీడియోలను అధికారులు పరిశీలించారు. అది న్యూ సౌత్‌వేల్స్‌లోని మారుమూల ప్రాంతంగా అనుమానిస్తున్నారు. ఈ ఏడాది అక్టోబరులో ఈ వీడియోను రికార్డ్ చేసినట్లుగా అధికారులు వెల్లడించారు. ఎవరికీ కనిపించకుండా దాక్కొని కాల్పులు ఎలా జరపాలి, ఎలా పారిపోవాలి అనేది వీరు సాధన చేసినట్లు ఆ వీడియోలో ఉన్నట్లు తెలిపారు. ఇక నవంబరులో వీరిద్దరూ ఫిలిప్పీన్స్‌లోని దవావో నగరానికి వెళ్లారు. ఈ నగరాన్ని ఇస్లామిక్ స్టేట్ కార్యకలాపాలకు హాట్‌స్పాట్‌గా చెబుతారు. అక్కడే నిందితులు ఉగ్రదాడికి శిక్షణ తీసుకొని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

బాంబులు విసిరి..

కాల్పులకు రెండు రోజుల ముందు డిసెంబరు 12న సాజిద్ అక్రమ్, నవీద్ కలిసి బోండీ బీచ్ ప్రాంతంలో రెక్కీ నిర్వహించినట్లు అధికారులు గుర్తించారు. పక్కా ప్రణాళికతోనే వీరు మారణహోమానికి పాల్పడినట్లు తెలిపారు. కాల్పులు జరపడానికి ముందు బీచ్‌లోని జనం పైకి నాలుగు బాంబులను విసిరినట్లు దర్యాప్తులో గుర్తించారు. అయితే, అందులో ఒక్కటి కూడా పేలలేదని, లేదంటే ప్రాణనష్టం మరింత ఎక్కువగా ఉండేదని తెలిపారు.

'ఎంజీనరేగా' విధ్వంసంతో గ్రామీణ భారతానికి విపత్తు: సోనియా గాంధీ

దిల్లీ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీనరేగా) స్థానంలో మోదీ ప్రభుత్వం వీబీ-జీ రాం జీ చట్టాన్ని తీసుకొస్తుండటంపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ స్పందించారు. మోదీ సర్కారు 'ఎంజీనరేగా'ను ధ్వంసం చేయడం గ్రామీణ భారతంలో కోట్ల మందికి విపత్తుగా పరిణమిస్తుందంటూ ఆమె మండిపడ్డారు. ప్రజాహక్కుల పరిరక్షణకు ఐక్యంగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. 'ది బుల్డోజర్ డిమాలిషన్ ఆఫ్ ఎంజీనరేగా' పేరుతో ఓ ఆంగ్ల పత్రికకు రాసిన వ్యాసంలో సోనియా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ఎంజీనరేగా కేవలం సంక్షేమ పథకం కాదు. గ్రామీణ కుటుంబాలకు జీవనోపాధి భద్రత, గౌరవాన్ని కల్పించిన హక్కుల ఆధారిత చట్టం. ఈ పథకం నాశనం కావడం మన సమష్టి వైఫల్యం. రానున్న సంవత్సరాల్లో కోట్లమంది కార్మిక కుటుంబాలపై ఆర్థికంగా దీని ప్రభావం పడుతుంది' అని వ్యాసంలో సోనియా పేర్కొన్నారు.

ఇండోనేసియాలో బస్సు ప్రమాదం.. 16 మంది మృతి

జకార్తా: ఇండోనేసియాలోని జావా దీవిలో బస్సుప్రమాదం చోటుచేసుకుంది. 34 మంది ప్రయాణిస్తోన్న ఇంటర్-ప్రావిన్స్ బస్సు అతి వేగంతో కాంక్రీట్ అడ్డుకట్టను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో 16 మంది మృతి చెందారు. బస్సు జకార్తా నుంచి యోగ్యకార్తకు వెళ్తుండగా.. సీమారెంగ్ నగరంలోని ఆదివారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని బస్సులో నుంచి 6 మృతదేహాలను వెలికితీశారు. తీవ్రంగా గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా.. మరో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. 13 మంది చికిత్స పొందుతున్నారు.

చిన్నారిని లాక్కెళ్లి చంపిన తోడేలు

బహరాయిచ్: ఇంటి వరండాలో కన్నతల్లి పక్కనే నిద్రిస్తున్న మూడేళ్ల బాలుణ్ని తోడేలు పొలాల్లోకి ఈడ్చుకెళ్లి చంపితిన్న ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని బహరాయిచ్ జిల్లా కైసర్‌గంజ్ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. కైసర్‌గంజ్‌లో ఇప్పటి వరకూ 12 మంది తోడేలు దాడిలో మృతి చెందగా ఒక వృద్ధ జంటతో సహా మొత్తం 32 మంది గాయాలపాలయ్యారని అటవీశాఖ అధికారులు వివరించారు. "రసూల్‌పుర్ దరేతా గ్రామంలో ఒక ఇంటి వరండాలో తల్లి పక్కన నిద్రిస్తున్న అంశ్ అనే మూడేళ్ల బాలునిపై సోమవారం తెల్లవారుజామున 4.30 ప్రాంతంలో తోడేలు దాడిచేసి చంపింది" అని డివిజనల్ ఫారెస్టు అధికారి రామ్ సింగ్ యాదవ్ వెల్లడించారు.

ఒక ఇంజిన్ నిలిచిపోయి విమానం అత్యవసర దించివేత

- దిల్లీ-ముంబయి సర్వీసుకు తప్పిన ప్రమాదం

దిల్లీ: ఎయిరిండియా విమానానికి గగనతలంలో అత్యవసర పరిస్థితి ఎదురైంది. సాంకేతిక లోపం కారణంగా ఒక ఇంజిన్ మొరాయించడంతో ప్రమాదాన్ని తప్పించడానికి దానిని అత్యవసరంగా విమానాశ్రయంలో దించాల్సి వచ్చింది. దిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సోమవారం ఉదయం ఎయిరిండియా బోయింగ్ 777 విమానం ఏఐ887 ముంబయికి వెళ్లడానికి టేకాఫ్ అయింది. దానిలో 335 మంది ప్రయాణికులు ఉన్నారు. సుమారు గంట ప్రయాణించిన తర్వాత విమానం కుడివైపు ఇంజిన్ మొరాయించింది. దానిలో ఆయిల్ ప్రెషర్ అసాధారణంగా తగ్గిపోవడాన్ని పైలట్ గుర్తించారు. కాసేపటికి అది సున్నాకి పడిపోయింది. దాంతో ఆ ఇంజిన్‌ను ఆఫ్ చేసి, విమానాన్ని వెనక్కి మళ్లించాలని పైలట్ నిర్ణయించారు. సురక్షితంగా దిల్లీలో దించారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ ఘటన గురించి ఎయిరిండియా నుంచి వివరాలు కోరింది. 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)' దర్యాప్తు చేపట్టింది. భద్రతాపరమైన నియమాల ఆధారంగా విమాన సిబ్బంది నిర్ణయం తీసుకున్నారని ఎయిరిండియా పేర్కొంది. ఆ విమానంలో సాంకేతికపరమైన తనిఖీలు నిర్వహిస్తున్నామని, ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపింది. ప్రయాణికులు ముంబయి చేరుకోవడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది.

ఎప్‌స్టీన్ కుంభకోణం.. ట్రంప్ ఫొటో తిరిగి ప్రత్యక్షం

ఇంటర్నెట్ డెస్క్: ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించి అమెరికా న్యాయశాఖ వెబ్‌పేజీ నుంచి అదృశ్యమైన డొనాల్డ్ ట్రంప్ ఫొటో తిరిగి ప్రత్యక్షమయ్యింది. ఆ ఫొటోను తాత్కాలికంగా రివ్యూ కోసమే తొలగించినట్లు న్యాయశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ ఫొటోలో ట్రంప్, ఆయన భార్య మెలనియా, ఎప్‌స్టీన్, ఆయన సన్నిహితురాలు గిస్లైన్ మాక్స్‌వెల్ కలిసి ఉన్నారు. ఈ కేసులో బాధితుల వివరాలు బయటకు రాకుండా ఉండడానికి చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో సమీక్ష కోసం ట్రంప్ ఫొటోను తాత్కాలికంగా తొలగించినట్లు అమెరికా న్యాయశాఖ తెలిపింది. ఆ తర్వాత ఫొటోలో బాధితులు ఎవరూ లేరని తేలడంతో దానిని పునరుద్ధరించినట్లు పేర్కొంది. బాధితులను రక్షించడానికి మాత్రమే చట్టం ప్రకారం తాము ఫైళ్లలో సవరణలు చేస్తున్నామని.. ఏ రాజకీయ నాయకుల పేర్లనూ తొలగించడం లేదని స్పష్టం చేసింది.



చెత్త కుప్పలో దొరికిన చైనా రైఫిల్ టెలిస్కోప్

శ్రీనగర్: చైనాకు చెందిన రైఫిల్ టెలిస్కోప్ జమ్మూకశ్మీర్‌లో కలకలం రేపింది. సిద్రా ప్రాంతంలోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కార్యాలయానికి అతి సమీపంలోని ఓ చెత్తకుప్పలో ఆరేళ్ల బాలుడు దీన్ని గుర్తించారు. టెలిస్కోప్‌తో బాలుడు ఆడుకుంటున్న సమయంలో పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకున్నారు. అప్రమత్తమైన అధికారులు చుట్టుపక్కల ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ, సైనిక కార్యాలయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దని సూచించారు. ఈ ఘటనకు సంబంధించి 24 ఏళ్ల వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

భారత ద్వేషుల్ని కలిసేందుకే రాహుల్, ప్రియాంకల విదేశీ పర్యటనలు

- భాజపా ఆరోపణ

దిల్లీ: కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ వాద్రా చేపట్టనున్న అమెరికా పర్యటనపై భాజపా తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఆమె తన సోదరుడు రాహుల్‌గాంధీ మాదిరిగానే భారత ద్వేషుల్ని కలిసి దేశాన్ని అపఖ్యాతి పాలుచేసేందుకే అమెరికా పర్యటనకు పూనుకున్నారని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సయ్యద్ జాఫర్ ఇస్లాం తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. "భారత ద్వేషులైన జార్జ్ సోరోస్ వంటి వారు అమెరికాలో ప్రియాంకకు స్వాగతం పలుకుతున్నారు. ఇలాంటి స్టంట్‌లు వారికే నష్టం కలిగిస్తాయని ప్రియాంక గుర్తించాలి" అని ఆయన అన్నారు. రాహుల్‌గాంధీ 2015 నుంచీ ఇప్పటివరకూ 247 విదేశీ యాత్రలకు వెళ్లారని, అవన్నీ ప్రైవేటు సమావేశాలని ప్రకటించడం ద్వారా అక్కడ ఆయన ఏం చేశారో, ఏ ఎజెండా కోసం పనిచేశారో, ఎలాంటి విరాళాలు పొందారో దాచి పెడుతున్నారని భాజపా నాయకురాలు షాజియా ఇల్మీ ఆరోపించారు. రాహుల్‌గాంధీ విదేశాలకు వెళ్లి వచ్చిన ప్రతిసారీ వీధిస్థాయి నిరసనలు, ప్రపంచ నివేదికలు, భారతీయ వ్యవస్థల్ని ప్రశ్నించే పరిణామాలు, సీఏఏ వ్యతిరేక నిరసనలు, రైతు చట్టాలపై ఉద్యమం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయని ఇల్మీ అభిప్రాయపడ్డారు. "జార్జ్ సోరోస్ వంటి భారత వ్యతిరేకులు, అతని అనుచరులు రాహుల్‌గాంధీని కలవడం దేశం చూసింది. రాహుల్ ఒక వారం జర్మనీలో గడిపాక ఇప్పుడు ప్రియాంక అమెరికాకు వెళ్తున్నారు. ఈ అన్నాచెల్లెళ్లు విదేశాల్లో ఎవరిని కలుస్తున్నారు? ఈ అనధికారిక పర్యటనల లక్ష్యం ఏమిటి" అని భాజపా మరో అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ నిలదీశారు.

బెంగాల్ ఎస్ఐఆర్.. తప్పుల తడక

- ఈసీపై మమత విమర్శలు



కోల్‌కతా: 'భాజపా మార్గదర్శకత్వంలోనే ఎన్నికల సంఘం(ఈసీ) పనిచేస్తోంది. రాష్ట్రంలో నిర్వహించిన ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో చాలా తప్పులున్నాయి. చట్టపరంగా ఓటు హక్కు కలిగిన అనేక మంది ఓట్లను తొలగించారు. కనీసం రెండేళ్లు పట్టే ఓటరు గణన ప్రక్రియ కేవలం రెండు నెలల్లోనే పూర్తిచేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి' అంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విరుచుకుపడ్డారు. కోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో టీఎంసీ బూత్ లెవల్ ఏజెంట్ల(బీఎల్ఏ) సమావేశంలో ప్రసంగించిన ఆమె.. ఎస్ఐఆర్ పేరుతో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ విచారణల కోసం నియమించిన కేంద్ర అధికారులపై కూడా మమత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక భాషపై అవగాహన లేని వారిని పరిశీలకులుగా నియమించడం సరికాదని, వారు రెండో దశ ధ్రువీకరణ ప్రక్రియ నిర్వహించడానికి అనర్హులని అన్నారు. రాష్ట్రంలోకి భాజపా బయట రాష్ట్రాల నుంచి ప్రజలను తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోందని, వీరిని గుర్తించి నిలువరించాలని బీఎల్ఏలకు మమత దిశానిర్దేశం చేశారు.

చేనేతకు ఆధునిక హంగులు

- 90 శాతం రాయితీతో పరికరాలు
- ఎన్‌హెచ్‌డీపీ కింద కేంద్రం అందజేత
- ఏడాదికి రూ.3 కోట్ల వరకు లబ్ధి

ఈనాడు, అమరావతి: చేనేతకు ఆధునికత జోడించి వృత్తిని సరళతరం చేయడంతో పాటు కార్మికుల ఆదాయాన్ని పెంచేందుకు కేంద్రం 'జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమాన్ని(ఎన్‌హెచ్‌డీపీ)' అమలు చేస్తోంది. ఈ పథకం కింద 90 శాతం రాయితీతో ఆధునిక పరికరాలు అందించనుంది. మిగతా 10 శాతాన్ని లబ్ధిదారు తన వాటాగా చెల్లించాలి. కేంద్రం ప్రకటించిన క్లస్టర్ల పరిధిలోని కార్మికులతోపాటు వ్యక్తిగతంగా చేనేతను జీవనోపాధిగా కలిగిన వారికి కూడా రాయితీని వర్తింపజేస్తోంది. కార్మికులకు విస్తృత ప్రయోజనాలను కలిగించే ఈ పథకాన్ని గత వైకాపా ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంతో సంప్రదింపులు జరుపుతూ రాష్ట్రానికి ఎక్కువ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటోంది. ఆధునిక పరికరాల వినియోగం వల్ల చేనేత కార్మికులు ఎదుర్కొనే కీళ్ల నొప్పుల వంటి సమస్యలు దూరం కానున్నాయి. నూతన డిజైన్లతో వస్త్రాలను అందంగా నేయవచ్చు.

26 రకాల విభాగాలుగా..

ఎన్‌హెచ్‌డీపీ కింద కేంద్రం ఇచ్చే ఆధునిక చేనేత పరికరాలను 26 విభాగాలుగా విభజించారు. మోటరైజ్డ్ జకార్డ్, ఫ్రేమ్ మగ్గం, 120/140 జకార్డ్ మిషన్, అచ్చుసెట్టు, నూలు చుట్టే యంత్రం, తదితర వాటిని రాయితీపై అందిస్తారు. ఒక్కో పరికరం విలువ రూ.3,500 నుంచి రూ.లక్ష వరకు ఉన్నాయి.

- అర్హత కలిగిన వారు జిల్లా ఏడీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆధార్‌కార్డు, చేనేత కార్డు, రేషన్ కార్డు, ఫొటో సమర్పించాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కూడిన ఇద్దరు సభ్యుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హతను నిర్ధారిస్తారు.
- ఆ తర్వాత కేంద్రానికి నివేదిస్తారు. దానికి అనుగుణంగా పరికరాల మంజూరు ఉంటుంది.

ఫ్రేమ్ మగ్గం



ఉపయోగం: చాలా ప్రాంతాల్లో చేనేత కార్మికులు గుంత మగ్గాల్లో వస్త్రాలను నేస్తున్నారు. వర్షాకాలంలో గుంతల్లోకి నీరు ఊట ద్వారా చేరి కొన్ని రోజులపాటు ఉపాధి లేకుండా పోతోంది. ఫ్రేమ్ మగ్గాల వినియోగం వల్ల ఆ సమస్య ఉండదు. అంతేకాకుండా వీటిని ఒకచోటు నుంచి మరో చోటుకు సులువుగా తరలించొచ్చు.

మోటరైజ్డ్ జకార్డ్

ఉపయోగం: కార్మికులు పావు చెక్కలను కాళ్లతో నొక్కి నేస్తుంటారు. బరువు ఎక్కువగా ఉండటం వల్ల కీళ్ల నొప్పులు వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పుడు మోటరైజ్డ్ జకార్డ్ వినియోగం వల్ల కింద ఉన్న బటన్‌ను కాలితో ఒత్తితే చాలు సులువుగా అల్లిక కదులుతుంది. వేగంగా కూడా నేయవచ్చు. శ్రమ తగ్గి ఉత్పత్తి పెరుగుతుంది.



ఈ ఏడాది 10 ప్రాజెక్టులు..

ఆధునిక పరికరాల మంజూరును కేంద్రం ఏటా ఆయా రాష్ట్రాలకు ప్రాజెక్టుల వారీగా కేటాయిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు 2025-26 ఏడాదికి 10 ప్రాజెక్టులను ఇచ్చింది. ఒక్కో ప్రాజెక్టు విలువ రూ.30 లక్షలు. అంటే ఏడాదికి రూ.3 కోట్ల వరకు భరోసా లభించనుంది. లబ్ధిదారులు ఎంపిక చేసుకునే పరికరాల విలువ ఆధారంగా వారి సంఖ్య ఉంటుంది. అంటే లబ్ధిదారులు తక్కువ ధర ఉన్న పరికరాలను తీసుకుంటే ఎక్కువ మందికి పథక లబ్ధి అందుతుంది. ఏడాదికి సగటున 900 మందికి చేయూత అందించేలా ఈ పథకాన్ని అమలు చేస్తారు. గతేడాది రాష్ట్రానికి నిర్దేశించిన లక్ష్యం కంటే ఎక్కువమంది దరఖాస్తుచేసుకున్నా.. కేంద్రం మంజూరు చేసింది.

120 జకార్డ్ మిషన్

ఉపయోగం: సాధారణ చీరలు నేసే కార్మికులను మంచి డిజైన్ల వైపు మళ్లించడానికి ఇది ఉపయోగపడుతుంది. చీర అంచుల్లో, మధ్యలో కోరుకున్న డిజైన్లను వీటితో వేయవచ్చు. చీర అందంగా తయారై, కూలీ భత్యం పెరుగుతుంది. మంచి ధర వస్తుంది.



100% రాయితీతో షెడ్లు..

కార్మికులకు స్థలం ఉండి షెడ్ ఏర్పాటు చేసుకోవాలనుకుంటే 100% రాయితీతో అవకాశం ఉంది. పరిమాణం ఆధారంగా రూ.70 వేలు-రూ.1.20 లక్షలు ఉచితంగా ఇస్తారు. దీంతో పాటు కోరిన వారికి రూ.15 వేల విలువగల లైటింగ్ సెట్‌ను వేయిస్తారు.

పర్యాటకుల భద్రతకు ప్రత్యేక పాలసీ అవసరం

- రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా ఇబ్బంది ఉండదన్న భరోసా కల్పించాలి
- అప్పుడే దేశ, విదేశీ పర్యాటకులను ఎక్కువగా ఆకర్షించవచ్చు
- పర్యాటక అభివృద్ధిపై సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పర్యాటకుల రక్షణ, భద్రత కోసం ప్రత్యేకంగా పాలసీ తీసుకురావాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు సంతోషంతో తిరిగి వెళ్లాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి, ఉపాధి కల్పనపై పర్యాటక, దేవాదాయ, రోడ్లు, భవనాల శాఖలతో ఆయన సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు.



పర్యాటక అభివృద్ధి, ఉపాధి కల్పనపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్. చిత్రంలో మంత్రి కందుల దుర్గేష్, అధికారులు

'రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా భద్రతకు ఇబ్బంది ఉండదన్న భావన పర్యాటకుల్లో కల్పించాలి. పర్యాటక ప్రాంతాల్లో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఎకో టూరిజం అభివృద్ధి చేస్తున్న ప్రాంతాల్లో మన సంస్కృతి, సామాజిక పరిస్థితులపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. పర్యాటకులతో ఎలా మెలగాలనే అంశంపై ప్రవర్తనా నియమావళిని కొన్ని అమలు చేయాలి. ఉల్లంఘనలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరించాలి. ముఖ్యంగా హోటళ్లు, ట్రావెల్స్ నిర్వాహకులు నియమావళిని కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలి' అని ఉప ముఖ్యమంత్రి అన్నారు.

హెలీ పర్యాటకం అభివృద్ధి చేయాలి

'పర్యాటక హాట్ స్పాట్‌లు గుర్తించి హెలీ టూరిజం అభివృద్ధి చేయాలి. అడ్వెంచర్ టూరిజంలో భాగంగా కృష్ణా, గోదావరి జిల్లాల్లో బోట్ రేసులు నిర్వహించాలి. మంగళగిరి, కొండపల్లి, సిద్ధవటం తదితర కొండ ప్రాంతాల్లో పర్యాటకోపయోగంగా అనువైన ప్రదేశాలు కల్పించాలి. పార్వతీపురం మన్యంలో ప్రకృతి అందాలు వారసత్వ సంపదగా గుర్తించి వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి' అని పవన్ కల్యాణ్ సూచించారు.

సాహితీ సర్క్యూట్‌గా తీర్చిదిద్దాలి

'మన కవులు, రచయితల గొప్పతనాన్ని భావితరాలకు అందించేలా గుర్రం జాషువా, విశ్వనాథ సత్యనారాయణ, గురజాడ అప్పారావు, మొల్ల తదితరుల ఇళ్లను సాహితీ సర్క్యూట్‌గా తీర్చిదిద్దాలి. రాష్ట్రంలో యువతకు, గిరిజన ప్రాంతాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేందుకు పర్యాటకశాఖలో అద్భుత అవకాశాలు ఉన్నాయి. ఆర్థికవ్యవస్థలు ఏర్పాటైతే దేశ, విదేశాల నుంచి పర్యాటకులను ఆకర్షించొచ్చు' అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు.



వరాహరూపంలో రామయ్య దర్శనం

భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా సోమవారం దివ్య ప్రబంధ పారాయణం వసంతం నిర్వహించారు. తిరువీధిలో స్వామివారు వరాహ అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మంగళవారం నరసింహావతారంలో స్వామి దర్శనం ఉంటుందని ఆలయ ఈఓ దామోదర్‌రావు తెలిపారు. - న్యూస్‌టుడే, భద్రాచలం

రప్పా.. రప్పా..

ప్రింటింగ్ దుకాణాన్ని సీజ్ చేసిన పోలీసులు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ఫ్లెక్సీని ప్రింట్ చేసినందుకు తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో రాయల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ దుకాణాన్ని సీజ్ చేసినట్లు ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ తెలిపారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం రామసింగవరంలో పలువురు వైకాపా కార్యకర్తలు ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ జన్మదినం సందర్భంగా '2029 ఎన్నికల్లో 88 మ్యాజిక్ ఫిగర్ దాటగానే గంగమ్మ జాతరలో వేటతలలు నరికినట్లు రప్పా.. రప్పా.. నరుకుతాం ఒక్కొక్కడిని' అనే వ్యాఖ్యలతో కూడిన ఫ్లెక్సీని ఆదివారం ఏర్పాటు చేశారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. పలువురు గ్రామస్థులు, తెదేపా నాయకులు అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన ఆరుగురు వ్యక్తులు, ఫ్లెక్సీని తయారు చేసిన రాయల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ దుకాణంపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఫ్లెక్సీ ప్రింటింగ్ దుకాణాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆ రోజు లీకైన స్టైరీన్ గ్యాస్ 800 టన్నులు!

- ఎల్‌జీ పాలిమర్స్ ఘటన ఎందుకు ప్రాణాంతకంగా మారింది?
- ప్రయోగశాలల్లో కృత్రిమ వాతావరణం సృష్టించి పరిశీలన

ఈనాడు, విశాఖపట్నం: ఎల్‌జీ పాలిమర్స్ ఘటనలో లీకైన స్టైరీన్ గ్యాస్ 800 టన్నుల వరకు ఉంటుందని కల్పాక్కంలోని ఇందిరాగాంధీ అణుపరిశోధన కేంద్రం, ముంబయిలోని హోమీభాబా జాతీయ పరిశోధన సంస్థల అధ్యయనంలో గుర్తించాయి. దాదాపు ఐదున్నరేళ్ల క్రితం చోటుచేసుకున్న ఈ దుర్ఘటన విశాఖ ప్రజలను భయకంపితులను చేసింది. ప్లాంటు నుంచి విడుదలైన గ్యాస్ పీల్చి 12మంది మృతిచెందారు. వందలమంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ప్రమాదం ఎందుకంత ఘోరంగా మారిందన్నదానిపై పరిశోధన సంస్థలు ప్రయోగశాలల్లో కృత్రిమ వాతావరణం సృష్టించి అధ్యయనం చేయగా ఆ నివేదిక తాజాగా బయటకొచ్చింది.

అలా గుర్తించారు...

2020 మే 7న తెల్లవారుజామున గ్యాస్ లీకైంది. ఆ ఘటన ఎలా జరిగిందో అలాగే చేసి ప్రయోగశాలలో పరీక్షించారు. బ్యూయాన్సీ-మోడిఫైడ్ డబ్ల్యూఆర్ఎఫ్ - ఫ్లెక్స్‌పార్ట్ డిస్పర్షన్ విధానంలో వాతావరణ పరిశోధన అంశాలు, వాతావరణ వ్యాప్తి డేటా విశ్లేషణకు పరిశోధన చేపట్టారు. నాటి వాతావరణ పరిస్థితి ప్రకారం ఉష్ణోగ్రత, గాలిలో తేమ, సాంద్రతల పరిమాణం కృత్రిమంగా సృష్టించారు. గ్యాస్ లీకైనప్పుడు సమయంలో స్థిరమైన వాతావరణం ఉంది. దీంతో గ్యాస్ పైకి వెళ్లకుండా భూఉపరితలంలోనే ఉండిపోయింది. ఆ సమయంలో గాలి వేగం తక్కువగా ఉండడంతో విషవాయువు ఎక్కువ దూరం వ్యాప్తి చెందకుండా, పైకి వెళ్లకుండా సమీప నివాసాల చుట్టూ దట్టమైన పొగమంచులా నిలిచిపోయింది. గంటల తరబడి 9-50 టన్నుల వరకు విషవాయువు విడుదల కావడం పరిస్థితిని మరింత దిగజార్చింది. విడుదలైన గ్యాస్ మొత్తం 800 టన్నులు ఉంటుందని అంచనా వేశారు. లీకైన ప్రాంతం నుంచి 430 మీటర్ల పరిధిలో ప్రాణాంతక స్థాయి ఉండగా 1.1 కి.మీ. పరిధిలో దీని ప్రభావం కనిపించిందని 'సిమ్యులేషన్'లో కనుగొన్నారు. నాటి పరిస్థితులూ దాదాపు అంతే ప్రభావాన్ని చూపాయి.

అప్పట్లో డేటా పరిమితం

1984లో జరిగిన భోపాల్ దుర్ఘటన అనంతరం జరిగిన అధ్యయనాలతో పోలిస్తే.. తాజా అధ్యయనం వాస్తవ వాతావరణం, వ్యాప్తి పరిస్థితులు ఉపయోగించి చేసింది. అప్పట్లో వాతావరణ డేటా పరిమితంగా ఉండేది. ఎల్‌జీ ఘటనలో స్టైరీన్ గ్యాస్ ఎలా ప్రవర్తించిందో పరిశోధకులు కర్మాకర్, సీవీ శ్రీనివాస్, రాకేష్, శ్రీవాణి ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. మొదటి గంటలో వాతావరణం బాగా స్థిరంగా ఉందని మోడల్ సూచించింది. ఈ నివేదిక... ఆ ఘటనపై హైపవర్ కమిటీ ఇచ్చిన నివేదికకు దగ్గరగా ఉంది. ఈ అధ్యయన ఫలితం అధికారిక అంచనాలతో పాటు ఎల్‌జీ పాలిమర్స్ ప్రధానగేటు వద్ద తీసిన గ్యాస్ కొలతలతో సరిపోలింది. ఈ తరహా ప్రమాదాలను అధ్యయనం చేయడానికి ఈ మోడల్ విశ్వసనీయమైందని పరిశోధకులు చెబుతున్నారు.



కమలేష్ డి.పటేల్‌ను సత్కరిస్తున్న మంత్రి నారాయణ, సీఆర్డీఏ అధికారులు

అమరావతి దినదినాభివృద్ధి చెందాలి

శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేష్ డి.పటేల్

తుళ్లూరు, న్యూస్‌టుడే: శ్రీరామచంద్ర మిషన్ కమలేష్ డి.పటేల్ (దాజీ) సోమవారం అమరావతిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. పురపాలకశాఖ మంత్రి నారాయణ, సీఆర్డీఏ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. రాజధానిలో కొనసాగుతున్న వివిధ నిర్మాణ పనులు, ఇక్కడ నెలకొల్పిన విశ్వవిద్యాలయాలు, భవిష్యత్తులో రాబోయే సంస్థలు, పర్యావరణ హితంగా రాజధానిని తీర్చిదిద్దుతున్న తీరు... తదితర అంశాలను సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు, ఇతర అధికారులు దాజీకి వివరించారు. అమరావతి బృహత్ ప్రణాళికపై సీఆర్డీఏ అదనపు కమిషనర్ ఏ.భార్గవతేజ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అనంతరం హైదరాబాద్ శివారు కన్హా శాంతి వనాన్ని సందర్శించాలని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ, ఏడీసీ ఛైర్‌పర్సన్ డి.లక్ష్మీ పార్థసారథిని దాజీ ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సహకారంతో ప్రజారాజధాని అమరావతి నిర్మాణం జరుగుతోందని, ఈ ప్రాంతంలో ప్రజలందరికీ సమ్మిళిత వృద్ధిలో భాగస్వామ్యం కల్పించాలన్నారు. అమరావతి నగరం దినదినాభివృద్ధి చెందుతూ రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. దాజీ మూడు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి వచ్చారు.

మెట్రోరైలు ప్రాజెక్టులకు మోక్షమెప్పుడు?

- డీపీఆర్‌లు పంపి ఏడాదైనా కదలిక లేదు
- రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీలు ఒత్తిడి తెస్తేనే పురోగతి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరవుతున్నా... అత్యంత కీలకమైన విజయవాడ, విశాఖ మెట్రోరైలు ప్రాజెక్టులపై కదలిక లేదు. మెట్రో ప్రాజెక్టులపై విభజన చట్టంలో ఇచ్చిన హామీని అమలుచేసే బాధ్యత కేంద్రంపై ఉంది. విజయవాడ, విశాఖ మెట్రోరైలు ప్రాజెక్టులపై సమగ్ర ప్రాజెక్టు నివేదికల్ని (డీపీఆర్) కేంద్రం ఆమోదం కోసం పంపి ఏడాదైంది. కానీ ఇంతవరకు ఏమీ కదల్లేదు. అయినా రాష్ట్రానికి అత్యంత కీలకమైన ఇలాంటి ప్రాజెక్టుల విషయంలో కేంద్రంపై రాష్ట్ర ఎంపీలు ఒత్తిడి తేవట్లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సన్నిహిత సంబంధాలున్నా ఇంత జాప్యమెందుకన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మొదటిదశే ఇంత జాప్యమైతే... రెండో దశ ఇంకెప్పుడు?

✦ విశాఖ, విజయవాడ మెట్రోరైలు ప్రాజెక్టుల డీపీఆర్‌లను 2015లోనే అప్పటి తెదేపా ప్రభుత్వం మొదటిసారి కేంద్రానికి పంపింది. వాటికి అప్పట్లోనే కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. తర్వాత కేంద్రం తీసుకొచ్చిన కొత్త మెట్రో రైలు విధానానికి అనుగుణంగా మళ్లీ డీపీఆర్‌లు సమర్పించాలంటూ... వాటిని తిప్పి పంపింది. ✦ 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా.. మిగతావాటిలాగే మెట్రోరైలు ప్రాజెక్టుల్నీ తీవ్ర నిర్లక్ష్యం చేసింది. విజయవాడ ప్రాజెక్టును పూర్తిగా అటకెక్కించింది. విశాఖ మెట్రో చేపడతామంటూ కొంత హడావుడి చేసింది. కానీ కేంద్రానికి డీపీఆర్‌లు కూడా పంపలేదు. ✦ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక విజయవాడ, విశాఖ మెట్రోరైలు ప్రాజెక్టులకు ఆరు నెలల్లోనే డీపీఆర్‌లు సిద్ధం చేసి 2024 డిసెంబరులో కేంద్రం ఆమోదానికి పంపింది. కానీ వాటిపై ఏడాదైనా స్పందన లేదు. ✦ విజయవాడ, విశాఖ మెట్రోరైలు ప్రాజెక్టుల్ని రెండుదశల్లో చేపడతారు. తొలిదశ పనులకే ఇంకా అనుమతులు రాకపోతే... ఇక రెండోదశ పనులకు ఎన్ని దశాబ్దాలు పడుతుందోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ✦ ప్రాజెక్టు వ్యయంలో 40% కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్య విధానం (జేవీ మోడల్)లో చెరిసగం భరించాలన్న అంగీకారం ఇదివరకే జరిగింది. రాష్ట్రం తనవంతు నిధులు సమకూర్చేందుకు, వాటితో పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. కానీ కేంద్రం ఇంకా డీపీఆర్‌కే ఆమోదం తెలపకపోవడంతో ప్రాజెక్టు కదలట్లేదు. ✦ ప్రాజెక్టులో జాప్యాన్ని నివారించేందుకు కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోగా... తనవంతు 20% నిధులతో భూసేకరణ, సివిల్ పనులు చేపట్టేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధమైంది. టెండర్లు పిలిచింది. ఆ పనులకు అనుమతుల కోసం రెండు నెలల క్రితం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ✦ సంయుక్త భాగస్వామ్య ప్రాజెక్టు కావడంతో రాష్ట్ర నిధులతో చేపట్టే పనులకైనా కేంద్ర అనుమతి తప్పనిసరి. కానీ ప్రతిపాదన పంపి రెండు నెలలవుతున్నా కేంద్రం నుంచి స్పందన లేకపోవడంతో... రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు టెండర్లు ఖరారు చేయలేదు.

ఎంపీలు చొరవ చూపాలి

అమరావతి పనులు వేగం పుంజుకోవడం, విశాఖకు గూగుల్ లాంటి ఐటీ దిగ్గజాలు వస్తుండటంతో... విజయవాడ, విశాఖలకు మెట్రో ప్రాజెక్టులు అత్యంత అవసరం. వచ్చే ఎన్నికల్లోగా తొలిదశ పనులైనా పూర్తిచేయాలి. వాటికి కేంద్రం నుంచి త్వరగా అనుమతులు తేవాల్సిన బాధ్యత రాష్ట్రానికి చెందిన కూటమి ఎంపీలపైనే ఉంది.

పీఎం జన్‌మన్ కింద..

రూ.358 కోట్లతో రోడ్లు, వంతెనల నిర్మాణం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అత్యంత నిర్లక్ష్యానికి గురైన గిరిజన ప్రాంతాల్లో రహదారులు, వంతెనల నిర్మాణాల కోసం పీఎం జన్‌మన్ పథకం మొదటి దఫాలో 2025-26 సంవత్సరానికి ప్రభుత్వం రూ.358.82 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో వివిధ జిల్లాల్లో 97 రోడ్లు, 33 వంతెనల పనులు చేపట్టనున్నారు. వీటికి పరిపాలన ఆమోదం తెలుపుతూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో రహదారి సౌకర్యం లేని గ్రామాలను పీఎం జన్‌మన్ పథకానికి ఎంపిక చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ పనులు చేయనున్నాయి.



ఇది నా స్టైల్!

మామూలుగా తాగితే గొప్ప ఏముంది అనుకుందేమో.. డ్రింక్‌ను ఇలా తాగింది ఓ కోతి. విశాఖలోని ఆంధ్ర మెడికల్ కళాశాల (ఏఎంసీ) క్రీడా ప్రాంగణంలో సోమవారం సాయంత్రం ఓ కోతికి శీతల పానీయ సీసా కనిపించింది. దానిని నోట కరచి, ఉన్న కొద్ది పానీయాన్ని చేతులతో పట్టుకోకుండా స్టైల్‌గా తాగింది. దీనిని ఎక్కడ చూసి నేర్చుకుందా అని అక్కడున్న క్రీడాకారులు ఆసక్తిగా గమనించారు. - ఈనాడు, విశాఖపట్నం

189 టన్నుల పశుమాంసం పూడ్చివేత

- వివిధ రాష్ట్రాల నుంచి సేకరణ
- విశాఖ పోర్టు మీదుగా గల్ఫ్ దేశాలకు

ఆనందపురం, న్యూస్‌టుడే: దేశవిదేశాలకు అక్రమంగా గో మాంసాన్ని ఎగుమతి చేస్తున్న రాకెట్‌ను విశాఖ పోలీసులు ఛేదించారు. పట్టుబడిన మొత్తం 189 టన్నుల మాంసాన్ని కోర్టు ఆదేశాలతో సోమవారం పూడ్చివేశారు. ఆనందపురం పోలీసుస్టేషన్‌లో డీసీపీ-1 మణికంఠ ఈ కేసు వివరాలు మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టులో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారుల తనిఖీల్లో.. విశాఖలోని ఆనందపురం మండలం శొంఠ్యాం సమీపంలోని శ్రీమిత్ర కోల్డ్ స్టోరేజ్ నుంచి విదేశాలకు గోమాంసం వెళ్తున్నట్లు అనుమానించారు. దీంతో అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా మొత్తం 189 టన్నుల మాంసం నిల్వలు గుర్తించారు. అందులోని నమూనాలను హైదరాబాద్‌లోని ల్యాబ్‌లో పరీక్షించగా.. ఆవు, ఎద్దు, గేదె మాంసంగా తేలింది. దీనిపై పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు అప్పారావు ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కోర్టు ఆదేశాలతో మరో 8 నమూనాలు తీయగా మొత్తం పశు మాంసంలో అధికంగా నిషేధిత ఆవు, ఎద్దు మాంసం ఉన్నట్లు తేలింది. దీంతో ఆ మొత్తాన్ని పూడ్చివేయాలని కోర్టు ఆదేశించడంతో కుసులవాడ సమీపంలో ప్రభుత్వ కొండపోరంబోకు భూమిలో పూడ్చివేశారు. ఏసీపీ అప్పలరాజు, సీఐ వాసునాయుడు, ఎస్సై హరీశ్, జి.సంతోష్‌కుమార్ పర్యవేక్షించారు.



శ్రీమిత్ర కోల్డ్ స్టోరేజ్ నుంచి తరలిస్తున్న మాంసం

వివిధ రాష్ట్రాల్లో నెట్‌వర్క్

ఈ కేసులో మొత్తం 9 మంది నిందితులను గుర్తించి, ఇప్పటికే ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. శ్రీమిత్ర కోల్డ్ స్టోరేజ్‌ను అద్దెకు తీసుకున్న మిష్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యజమాని మహమ్మద్ ఫర్హాన్‌ను మాంసం ఎగుమతిదారుగా గుర్తించి అరెస్టు చేశారు. మాంసం సరఫరాదారులు మన్సూర్ అలీని మహారాష్ట్రలో, రషీద్ ఖురేషిని ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. వీరంతా తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్‌లలో ఆవులను వధించి గేదెలుగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి, నకిలీ ఇన్వాయిస్‌లు, ఈ-వేబిల్లులు, హెల్త్ సర్టిఫికెట్లతో విశాఖ పోర్టు ద్వారా గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా ఆవులను వధించడం లేదని, పశువధపై వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు చట్టాలు ఉండటంతో వీరు ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రాయిలా శరీరం.. బాలికకు నరకం

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాకు చెందిన పన్నెండేళ్ల బాలిక రాజేశ్వరి గత కొన్నేళ్లుగా అరుదైన చర్మ వ్యాధితో బాధపడుతోంది. క్రమంగా శరీరం రాయిలా మారుతుండటంతో దుర్భర జీవితం అనుభవిస్తోంది. "బిడ్డకు నాలుగేళ్ల వయసున్నప్పుడు వ్యాధి లక్షణాలు బయటపడ్డాయి. శరీరంపై ముందుగా పొలుసులు ఏర్పడి... తర్వాత చెట్టు బెరడులా, తర్వాత క్రమంగా రాయిలా గట్టిగా మారుతోంది. తొలుత చేతులకు వ్యాపించిన సమస్య తర్వాత శరీరమంతా పాకుతోంది. వ్యాధి కారణంగా అమ్మాయి ఎవరితోనూ కలవలేకపోతోంది. రోజురోజుకూ మానసికంగా కుంగిపోతోంది" అంటూ గిరిజనులైన కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పలు ఆసుపత్రులలో చూపించినా ఫలితం లేకపోయిందని విలపిస్తున్నారు. రాజేశ్వరి 'ఇక్థియోసిస్ హిస్ట్రిక్స్' అనే జన్యుపరమైన చర్మ వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. 'ఇది అరుదైనది. ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధికి సంబంధించి పదుల సంఖ్యలో కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఇది అంటువ్యాధి కాదు. ప్రతిరోజూ మాయిశ్చరైజర్ రాసుకోవడం ద్వారా వ్యాధి ప్రభావాన్ని కొంత మేర తగ్గించవచ్చు' అని వైద్య నిపుణులు చెబుతున్నారు.



నల్లగా మారిన చేయితో బాలిక రాజేశ్వరి



జీతంపై చర్చల్లో ఇలా వ్యవహరించండి

కెరీర్, ఆర్థిక వృద్ధి కోసం ఉద్యోగం మారడం నేటి కాలంలో సాధారణంగా మారింది. ఇటువంటి సందర్భాల్లో కొత్త కొలువు జీతం విషయంలో అనుసరించాల్సిన పద్ధతులు: ✦ మీరు పొందుతున్న, ఆశిస్తున్న జీతం మొత్తాన్ని పేర్కొనరాదు. బదులుగా మార్కెట్‌లో మీకు కనిష్ఠం నుంచి గరిష్ఠం వరకూ ఎంత దక్కే అవకాశం ఉందో తెలపాలి. ✦ ఖర్చులను అధిగమించేందుకు ప్రస్తుతం మీరు పొందుతున్న జీతం సరిపోవడంలేదని, వేతనం పెరుగుదల అవసరమని చెప్పరాదు. బదులుగా మీ అనుభవం, బాధ్యతలు వివరిస్తూ మార్కెట్‌లో మీస్థాయి వారికి దక్కుతున్న ప్యాకేజీలను పేర్కొనాలి.

- సైమన్స్, ఉద్యోగాన్వేషకుల సలహాదారు

శ్మశానం కబ్జా.. ఆపై ప్లాట్లు చేసి విక్రయం

- వైకాపా మాజీ ఎమ్మెల్యే కుమారుడి భూదందా
- సీఎస్, డీజీపీలకు సొంత పార్టీ నేత బుట్టా రేణుక ఫిర్యాదు

కర్నూలు, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాకు చెందిన వైకాపా సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కుమారుడు, ఆయన అనుచరులు శ్మశానస్థలాన్ని ఆక్రమించారని అదే పార్టీకి చెందిన మాజీ ఎంపీ బుట్టా రేణుక ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కబ్జా చేసిన శ్మశానస్థలం విలువ దాదాపు రూ.4 కోట్లు అని, ఆక్రమణకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ఈ భూకబ్జాపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్, డీజీపీ, ఎస్పీకి ఫిర్యాదు చేసిన ప్రతులను విడుదల చేశారు.

ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు..

ఎమ్మిగనూరు పట్టణంలోని 171ఏ, 172బీ సర్వే నంబర్లలో 2.87 ఎకరాల భూమి ఉండగా, దాన్ని 1960లో ఆదుకర్, కంసాలి, వడ్డెరులకు శ్మశానవాటిక కింద కేటాయించారు. అందులోనే 20 సెంట్ల స్థలాన్ని తర్వాత బ్రాహ్మణులకు కేటాయించారు. ఈ స్థలంపై ఏ హక్కులూ లేని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి, స్థిరాస్తి వ్యాపారి మునగాల సుధాకర్‌రెడ్డి, కుమ్మరి వెంకటేశ్, మాల నరసన్న రాజకీయ పలుకుబడితో కబ్జా చేశారు. ఈ స్థలాన్ని తొలుత వెంకటేశ్, నరసన్న పేర్లపై గతంలో తహసీల్దారు సహాయంతో రెవెన్యూ రికార్డుల్లో ఆన్‌లైన్ చేయించారు. వాస్తవానికి ఈ భూమి ఆర్ఎస్ఆర్‌లో 'గవర్నమెంట్ డ్రై ల్యాండ్'గా నమోదై ఉంది. 171ఏ సర్వే నంబరులోని 66 సెంట్ల భూమి గడిగే గంగమ్మ పేరిట, 171బీలోని 2.21 ఎకరాలు పంచాయతీ బోర్డు పేరిట ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి, తన అనుచరుడు వెంకటేశ్ ద్వారా 2022 ఫిబ్రవరి 2న కొన్నట్లు డాంగ్ రిజిస్ట్రేషన్ చేసుకొని డాక్యుమెంట్లు తీసుకున్నారు. రాజకీయంగా ఒత్తిడి తెచ్చి ఆ స్థలాన్ని పట్టణ బ్యాంకులో తనఖా పెట్టి రూ.5 లక్షల రుణం తీసుకున్నారు. శ్మశానం చుట్టూ రాళ్లు పాతి, అందులోకి ఎవరూ వెళ్లకుండా చేశారు. తాజాగా ఆ స్థలాన్ని ప్లాట్లు వేసి మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా అమ్ముతున్నారు. కుమ్మరి వెంకటేశ్, మాల నరసన్న, సబ్ రిజిస్ట్రార్, గత తహసీల్దారు, టౌన్ బ్యాంకు కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్, జగన్‌మోహన్‌రెడ్డి, మునగాల సుధాకర్‌రెడ్డిపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.



కబ్జాకు గురైన శ్మశాన స్థలం

పది పరీక్షలకు 6.23 లక్షల మంది నమోదు

- అత్యధికంగా కర్నూలు జిల్లా నుంచి 33,930 మంది నమోదు
- మొత్తం విద్యార్థుల్లో ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాయనున్న 94% మంది

ఈనాడు, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఈ ఏడాది 6.23 లక్షల మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్ష ఫీజు చెల్లింపు, నామినల్ రోల్ దాదాపుగా పూర్తి కావడంతో ప్రభుత్వ పరీక్షల విభాగం తుది జాబితాను రూపొందించింది. ఈ ఏడాది కర్నూలు జిల్లా నుంచి అత్యధికంగా 33,930 మంది పరీక్షలు రాయనున్నారు. ఆ తర్వాత అనంతపురం జిల్లా నుంచి 31,979 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. మార్చి 16 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. మొత్తం విద్యార్థుల్లో 94% మంది ఆంగ్ల మాధ్యమంలోనే పరీక్షలు రాయనున్నారు. పరీక్షలకు ఇన్విజిలేటర్ల కేటాయింపులో ప్రభుత్వ పరీక్షల విభాగం ఈ ఏడాది కొత్త మార్పులు తీసుకొచ్చింది. పారదర్శకత కోసం ఆన్‌లైన్ విధానం ద్వారా ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు పరీక్షల విధులను కేటాయించనున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను డిజిటల్ రూపంలో లీప్ యాప్ ద్వారా సిబ్బందికి అందజేయనున్నారు. మూల్యాంకనంలో మార్కుల లెక్కింపులో తప్పులు లేకుండా ఉండేందుకు ఈ సారి ట్యాబ్‌ల ద్వారా మార్కులు నమోదు చేయనున్నారు. సహాయ ఎగ్జామినర్ నమోదు చేసిన మార్కులను చీఫ్ ఎగ్జామినర్ పరిశీలిస్తారు. గత పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో మార్కుల కూడికలు, నమోదులో తప్పులు వెలుగు చూడడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఏటా తగ్గిపోతున్న తెలుగు మాధ్యమం: తెలుగు మాధ్యమంలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. 2024లో 1.61లక్షల మంది తెలుగు మాధ్యమంలో పరీక్షలు రాయగా.. 2025లో ఇది 51వేలకు తగ్గిపోయింది. ప్రస్తుతం ఈ సంఖ్య 32వేలకు పడిపోయింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ ఆంగ్ల మాధ్యమాన్నే అమలు చేస్తున్నారు. కొన్ని ఎయిడెడ్ బడుల్లో తెలుగు మాధ్యమం ఉండగా.. ప్రభుత్వ పాఠశాలల్లో అనధికారికంగా కొన్ని సెక్షన్లు తెలుగు మాధ్యమంలో నిర్వహిస్తున్నారు.

పరాఖ్ విధానంలో ప్రశ్నపత్రాల రూపకల్పన

సమగ్ర అభివృద్ధి కోసం జ్ఞానం అంచనా, సమీక్ష, విశ్లేషణ (పరాఖ్) విధానంలో ఈ ఏడాది పదో తరగతి ప్రశ్నపత్రాల్లో స్వల్ప మార్పులు చేశారు. ఈ మేరకు బ్లూప్రింట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడంతోపాటు ఇప్పటికే పాఠశాలలకు పంపించారు.




మిస్ ఆంధ్ర కిరీటం అందుకుంటున్న సాత్విక

మిస్ ఆంధ్రాగా సాత్విక

ఈనాడు, అమరావతి: ఫరెవర్ స్టార్ మిస్ ఇండియా అందాల పోటీల్లో చెన్నమనేని గమన సాత్విక మిస్ ఆంధ్ర - 2025 విజేతగా నిలిచారు. రాజస్థాన్‌లోని జైపుర్‌లో ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో బీటెక్ ఫైనల్ ఇయర్ సీఎస్‌ఈ చదువుతున్న సాత్విక ఆగస్టులో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో మిస్ తిరుపతిగా ఎంపికయ్యారు. మిస్ ఇండియా పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచినట్టు తెలిపారు. ఈమె తిరుపతి జిల్లా వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ సీసీ నాయుడి కుమార్తె.

వీల్‌ఛైర్‌లోంచే నలుగురికి దారిచూపాడు!



బిజువర్గీస్

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: కేరళలోని కొట్టాయం జిల్లాకు చెందిన బిజువర్గీస్ రోడ్డు ప్రమాదంలో వెన్నెముక నాడి దెబ్బతిని వీల్‌ఛైర్‌కే పరిమితమయ్యారు. అలాగని తన లోపాన్ని నిందించుకుంటూ కూర్చోలేదు. తనలాంటి వారందరికీ ఉపయోగపడే పని చేయాలని తపించారు. ఆ మథనంలోంచే నడవలేని వారూ కారు నడిపేలా ఓ పరికరాన్ని కనుగొన్నారు. బిజువర్గీస్ పదో తరగతి వరకే చదువుకున్నారు. తన కల సాకారం చేసుకునేందుకు కారు రిపేర్ నేర్చుకున్నారు. ఎన్నో పరికరాలతో ప్రయోగాలు చేశారు. చివరికి తన వద్ద ఉన్న చిన్న మొత్తంతో బ్రేక్, క్లచ్, యాక్సిలేటర్‌ను చేతితోనే నియంత్రించే పరికరం రూపొందించారు. దీనికి ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆమోదం లభించింది. ఆ పరికరాన్ని ఇంకా సౌకర్యవంతంగా మార్చేందుకు తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ టీవోసీఐ సెంటర్ 2013లో రూ.9 లక్షలు మంజూరు చేసి ప్రోత్సహించింది.



కారులో అమర్చిన పరికరం



గతంలో అబ్దుల్ కలాం నుంచి పురస్కారం అందుకుంటున్న బిజువర్గీస్

ఏంటా పరికరం: 'స్పింజ్ ఇంజినీరింగ్' పేరిట అభివృద్ధి చేసిన ఈ ప్రత్యేక వ్యవస్థతో కాళ్లతో పనిలేకుండా కారును సులువుగా నడపొచ్చు. కారు గేరుపై అమర్చుకునేలా హ్యాండ్ ఆపరేటెడ్ బ్రేక్, క్లచ్, యాక్సిలేటర్ ఉంటుంది. దీన్ని ఏ కారులోనైనా 15 నిమిషాల్లో అమర్చవచ్చు. వద్దనుకుంటే తొలగించవచ్చు. ఈ పరికరం తయారు చేసినందుకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంతోపాటు ఎందరో ప్రముఖులు బిజువర్గీస్‌ను ప్రశంసించారు. ఇప్పుడు 2 వేలకుపైగా దివ్యాంగులు ఈ పరికరాన్ని వాడుతున్నారు. దీంతో బిజు పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

డీఐజీ అమ్మిరెడ్డికి సభాహక్కుల సంఘం శ్రీముఖం

- నేడు హాజరు కావాలని ఆదేశం
- 2020లో లోకేశ్‌పై ట్వీట్ చేసిన వ్యవహారంలో..


ఈనాడు, అమరావతి: రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో పరిపాలనా విభాగం డీఐజీగా వ్యవహరిస్తున్న అమ్మిరెడ్డికి శాసనమండలి ప్రివిలేజెస్ కమిటీ నోటీసు పంపించింది. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాలులో తమ ముందు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. 2020లో గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులో ఒక ప్రభుత్వ భవనం ప్రహరీ ప్రారంభ కార్యక్రమానికి అప్పటి ఎమ్మెల్యే హాజరవుతారని వైకాపా నేతలు ఫ్లెక్సీలు కట్టారు. అయితే 'ఇదేమైనా చైనా వాలా? దీన్ని ప్రారంభించడానికి ఎమ్మెల్యే రావాలా?' అన్నట్లు తెదేపా కార్యకర్త ఒకరు చేసిన వీడియో వైరలైంది. అతన్ని గుంటూరు పోలీసులు తీసుకువెళ్లి, తర్వాత వదిలేశారు. ఆ సమయంలో ఎమ్మెల్సీగా ఉన్న ప్రస్తుత మంత్రి నారా లోకేశ్.. 'పులివెందుల పిల్లి భయపడినట్లుంది. ప్రశ్నిస్తే అరెస్ట్ చేస్తారా?' అని ట్వీట్ చేశారు. దానిపై నాడు గుంటూరు ఎస్పీగా ఉన్న అమ్మిరెడ్డి స్పందిస్తూ 'లోకేశ్ తప్పుడు వార్తను ప్రచారం చేస్తున్నారు. న్యాయపరంగా చర్యలకు ఆయన బాధ్యుడవుతారు' అంటూ మరికొన్ని అంశాలు ప్రస్తావిస్తూ ట్వీట్ చేశారు. తాను చేయనిదాన్ని చేసినట్లుగా చెబుతూ ఎస్పీ తన ప్రతిష్ఠకు భంగం కలిగించారని లోకేశ్ అప్పట్లోనే శాసనమండలి ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. దాన్ని ఆయన అప్పటి మండలి సభాహక్కుల సంఘానికి పంపారు. కానీ, ఆ ఫిర్యాదుపై పురోగతి లోపించింది. ఇటీవల కొత్త ప్రివిలేజెస్ కమిటీ సమీక్షకు సిద్ధమైంది. ఇందులో భాగంగా అమ్మిరెడ్డికి నోటీసు ఇచ్చింది.

- మరోవైపు శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు ఫిర్యాదుపై భీమవరం మున్సిపల్ కమిషనర్‌ను, వైకాపా ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్ ఫిర్యాదు మేరకు 2020లో ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన అధికారిని ప్రివిలేజెస్ కమిటీ మంగళవారం విచారణకు పిలిచింది.

అక్కసుతోనే పీపీపీ విధానంపై రాద్ధాంతం

- వైకాపాపై మంత్రి సత్యకుమార్‌యాదవ్ ధ్వజం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు పాలనను చూసి కొంతమంది జీర్ణించుకోలేకపోతున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అటల్-మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో సోమవారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 'వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్మిస్తుంటే రాద్ధాంతం చేస్తూ కోటి సంతకాలు అంటూ హడావుడి చేస్తున్నారు. అసలు తాము సంతకాలే చేయలేదని ప్రజలు అంటున్నారు. ఒకవేళ ప్రేతాత్మలు, ఆత్మలు సంతకాలు పెట్టాయా? అయిదేళ్లు రాష్ట్రాన్ని ఏవిధంగా నాశనం చేశారో అందరూ చూశారు. గత పాలకులను భవిష్యత్తులోనూ తరిమికొట్టాలి. ఎవరైనా చనిపోతే 200 మందితో పరామర్శలకు వెళ్లి హడావుడి చేస్తారు' అని పరోక్షంగా వైకాపాపై విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీ సారథ్యంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ఏపీ అభివృద్ధి చెందుతోందని మంత్రి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపుపొందేలా దేశాన్ని ప్రధాని మోదీ అభివృద్ధి చేశారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయీ విలువలు కలిగిన నేత అని, అణు పరీక్షలతో దేశ సత్తా చాటారని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కొనియాడారు. ఈ నెల 25న అమరావతిలో జరిగే ముగింపు సభలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాల్గొంటారని చెప్పారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు పాల్గొన్నారు.



వాజ్‌పేయీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో శ్రీనివాసవర్మ, రఘురామకృష్ణరాజు, రామ్మోహన్‌నాయుడు, మాధవ్, సత్యకుమార్‌యాదవ్

లోకేశ్ నాయకత్వంలో ఏపీకి పరిశ్రమలు: అన్నామలై

ఆంధ్రప్రదేశ్‌కు కొత్త పరిశ్రమలు, కంపెనీలు, పెట్టుబడులు వస్తున్నాయని, మంత్రి లోకేశ్ నాయకత్వంలో ఇప్పటికే అనేక కంపెనీలు పెద్దఎత్తున ఒప్పందాలు చేసుకుని వాటి స్థాపన దిశగా అడుగులు వేస్తున్నాయని తమిళనాడు భాజపా మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై అన్నారు. సోమవారం రాత్రి ఏలూరు శివారు ఆశ్రమం ఆసుపత్రి వద్ద జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని వాజ్‌పేయీ కాంస్య విగ్రహావిష్కరణ, అటల్-మోదీ సుపరిపాలన యాత్ర సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

పారిశ్రామికవేత్త డీకే ఆదికేశవులునాయుడి వారసుల అరెస్టు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: దివంగత పారిశ్రామికవేత్త డీకే ఆదికేశవులు నాయుడి కుమారుడు డీఏ శ్రీనివాస్, కుమార్తె డీఏ కల్పన, డీవైఎస్పీ ఎస్‌వై మోహన్‌లను కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) అధికారులు సోమవారం అరెస్టు చేశారు. నగదు వ్యవహారాలకు సంబంధించి కె.రఘునాథ్ హత్యకు గురయ్యారు. ఈ కేసులో కుట్రకోణం, వంచన, ఆస్తులపత్రాల ఫోర్జరీ, తదితర ఆరోపణలపై కర్ణాటక హైకోర్టులో కేసు దాఖలైంది. ఈ విచారణపై సర్వోన్నత న్యాయస్థానం గతంలో స్టే విధించింది. స్టే తొలగిపోవడంతో వీరు ముగ్గురినీ సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. వైద్య పరీక్షల అనంతరం న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టి, విచారణ నిమిత్తం వారిని అదుపులోకి తీసుకుంటామని వెల్లడించారు.

సీఐపై కత్తితో దాడి



గాయపడిన సీఐ శ్రీకాంత్

- నిందితుడిపై రెండు రౌండ్ల కాల్పులు
- అనంతపురం జిల్లాలో ఘటన



నిందితుడు అజయ్‌కుమార్

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురంలో అజయ్‌కుమార్ అనే యువకుడు సీఐపైనే కత్తితో దాడి చేశాడు. స్థానిక ఎస్కే యూనివర్సిటీకి సమీపంలోని ఆకుతోటపల్లికి చెందిన దేవరకొండ అజయ్‌కుమార్ పలు చోరీల్లో నిందితుడు. ఆదివారం రాత్రి నగరంలోని అరవిందనగర్ చర్చి వద్ద నగరానికి చెందిన చాకలి రాజాతో అజయ్‌కుమార్, అతని మిత్రులు అక్రమ్, సొహైల్‌లు ఘర్షణకు దిగారు. ఈ గొడవలో రాజాను అజయ్‌కుమార్ కత్తితో పొట్టలో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని ఫిర్యాదుతో అనంతపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని పట్టుకోవడానికి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నగర శివారులోని షికారు కాలనీ వద్ద ఉన్నాడన్న సమాచారంతో సీఐ శ్రీకాంత్, ఎస్సై రుషేంద్ర, సిబ్బందితో కలిసి సోమవారం ఉదయం ఆ ప్రాంతానికి ఆటోలో చేరుకున్నారు. నిందితుడు ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టి గాలిస్తుండగా అక్కడే ఉన్న ఆటోడ్రైవర్ బాబాపై నిందితుడు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. పోలీసులు పట్టుకోవడానికి ప్రయత్నించగా పక్కనే ఉన్న చెట్లపొదల్లోకి వెళ్లి తప్పించుకున్నాడు. అతని మొబైల్ సిగ్నళ్ల ఆధారంగా పోలీసులు వెంబడించారు. ఆకుతోటపల్లి-కందుకూరు గ్రామాల మధ్యన ఉన్న ఓ చెరకు తోటలో దాక్కున్నట్లు గుర్తించారు. తోటలోకి వెళ్లి పోలీసులు గాలిస్తుండగా, చెరకు పొదల్లో దాక్కున్న నిందితుడు ఒక్కసారిగా సీఐ శ్రీకాంత్‌పై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయమైంది. నిందితుడిని నిలువరించే ప్రయత్నం చేస్తుండగా మరోమారు కత్తితో పొడవడానికి యత్నించాడు. దీంతో సీఐ తన వద్దనున్న రివాల్వర్‌తో రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. ఒక బుల్లెట్ నిందితుడి కాలికి తగిలింది. అనంతరం అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ శ్రీకాంత్, నిందితుడు అజయ్‌కుమార్‌లను చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఎస్పీ జగదీశ్ ఈ ఘటనపై ఆరా తీశారు.

ఆధిపత్య పోరులో బావమరుదుల హత్య

- పల్నాడు జిల్లా అడిగొప్పలలో దారుణం



హత్యకు గురైన శ్రీరామ్మూర్తి, హనుమంతు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: తన వద్ద పని చేసేవారే ఎదురుతిరగడం.. తన పనులకే అడ్డం పడుతుండడం.. గ్రామంలో ఆధిపత్యపోరు వంటివి.. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో జంట హత్యలకు దారితీశాయి. దుర్గి మండలం అడిగొప్పలలో ఆదివారం రాత్రి అన్నదమ్ముల జంటహత్యలు కలకలం రేపాయి. గ్రామంలో రాజకీయంగా యాగంటి నరేశ్‌దే పైచేయి. బావమరుదుల వరసయ్యే కొత్త హనుమంతు(32), కొత్త శ్రీరామ్మూర్తి(35) అతడి అనుచరులుగా వ్యవహరిస్తుంటారు. వారిద్దరూ గ్రామంలో సెటిల్‌మెంట్లు చేస్తుంటారు. ఇటీవల వారు అన్నింటిలోనూ నరేశ్ నుంచి వాటాలు కోరుతున్నారని, గ్రామంలో వారి ఆగడాలు ఎక్కువయ్యాయని తెలిసింది. వీరి మధ్య ఆధిపత్యపోరు విభేదాలను పెంచింది. నెల కిందట అడిగొప్పల నిదానంపాటి అమ్మవారి ఆలయంలో తలనీలాలకు సంబంధించి నరేశ్ మేనత్త తన మనుషులను నియమించింది. ఆలయ ఛైర్మన్ వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న కొత్త శ్రీరామ్మూర్తి వారిని పనిలో చేర్చుకోకుండా అడ్డుకున్నాడు. ఈ విషయమై గొడవ జరిగింది. మహిళ అనైనా చూడకుండా నరేశ్ మేనత్తపై శ్రీరామ్మూర్తి చేయి చేసుకున్నాడు. దీంతో 'ఇంటి ఆడపడుచుపై చేయి చేసుకుంటే వారిని ఏం చేయలేకపోయారంటూ' నరేశ్‌ను ఉద్దేశించి ఆ కుటుంబంలోని మహిళలు కొద్దికాలంగా దెప్పిపొడుస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే హనుమంతు తన బెల్టుషాపు విషయంలో తల దూర్చాడని, శ్రీరామ్మూర్తి మురుగు కాలువల నిర్మాణంలో బిల్లులు రాకుండా అడ్డుపడ్డాడని నరేశ్‌కు కోపం ఉంది. వారిని అలాగే వదిలేస్తే తన ఆధిపత్యానికే ముప్పు వాటిల్లేలా ఉందని భావించాడు. ఆదివారం రాత్రి నరేశ్ మరికొందరు అనుచరులతో కలిసి శ్రీరామ్మూర్తిని పిలిచి మద్యం తాగించి వేట కొడవళ్లతో దాడి చేశాడు. తర్వాత ఊళ్లోకి వచ్చి, హనుమంతును ఇంట్లోంచి బయటకు పిలిచి వేట కొడవలితో దాడి చేసి పరారయ్యాడు. మృతుల తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కారంపూడి సర్కిల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ జంట హత్యల్లో మొత్తం 11 మంది పాల్గొన్నట్లు తెలుస్తోందని పోలీసులు వెల్లడించారు. ప్రధాన నిందితుడు నరేశ్ పరారీలో ఉండగా, ఇద్దరు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

రొమ్ము క్యాన్సర్ చికిత్సకు నానో ఇంజెక్షన్


అభివృద్ధి చేసిన ఐఐటీఎం పరిశోధకులు



డాక్టర్ స్వాతి సుధాకర్ పరిశోధక బృందం

చెన్నై (వడపళని), న్యూస్‌టుడే: ఐఐటీ మద్రాస్, ఆస్ట్రేలియాలోని మోనాష్, డీకిన్ యూనివర్సిటీల పరిశోధకులు రొమ్ము క్యాన్సర్ చికిత్సను సురక్షితంగా, మరింత ప్రభావవంతంగా చేసే అత్యాధునిక నానో ఇంజెక్షన్ డ్రగ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేశారు. నానో అయోంటోఫోరెటిక్ ఆధారిత డ్రగ్ ఎన్‌క్యాప్సులేషన్‌తో సిలికాన్ నానో ట్యూబ్(ఎస్ఐఎన్‌టీ) ద్వారా నేరుగా క్యాన్సర్ గ్రంథి కణాల్లోకి ప్రవేశపెడతారు. తద్వారా ఈ ఔషధం ఆరోగ్యంగా ఉన్న కణాలకు నష్టాన్ని కలిగించకుండా, కేవలం క్యాన్సర్ ప్రభావిత కణాలపైనే పని చేస్తుంది. బ్రెస్ట్ క్యాన్సర్ చికిత్స విధానాల్లో ఇది మరింత కచ్చితమైన, స్థిరమైన సరికొత్త పరిశోధనలు పేర్కొన్నారు. ఐఐటీ మద్రాస్ అప్లైడ్ మెకానిక్స్, బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగ సహాయ ఆచార్యులు స్వాతి సుధాకర్ ఆధ్వర్యంలోని ఈ పరిశోధక బృందంలో కావ్య విజయలక్ష్మి, బాబు నాగప్పన్, విమల్ రాజ్ సెల్వరాజ్, నికోలస్ హెచ్.వోయెల్కర్, రోయ్ ఎల్నాథన్ ఉన్నారు.

రాకెట్ ప్రయోగాలు ఫలించాలని శ్రీవారికి పూజలు



శ్రీవారి ఆలయం ఎదుట ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణన్, శాస్త్రవేత్తలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణన్, శాస్త్రవేత్తలు సోమవారం దర్శించుకున్నారు. ఈ నెల 24న శ్రీహరి కోట నుంచి ప్రయోగించనున్న ఎల్‌వీఎం03-ఎం6 రాకెట్ నమూనాను శ్రీవారి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వెలుపల ఇస్రో ఛైర్మన్ మాట్లాడుతూ.. ఈ ప్రయోగం ద్వారా అమెరికాకు చెందిన బ్లూ బర్డ్ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపిస్తామన్నారు. ఈ ఉపగ్రహం నేరుగా కక్ష్య నుంచి డివైజ్‌కు సిగ్నల్ ఇస్తుందన్నారు. వచ్చే ఏడాది నాలుగుకు పైగా ప్రయోగాలు చేయనున్నట్లు చెప్పారు. గగన్‌యాన్‌లో భాగంగా మరో రెండు ప్రయోగాత్మక పరీక్షలు జరపనున్నట్లు తెలిపారు. 2027లో గగన్‌యాన్ క్రూ మాడ్యూల్, అంతరిక్ష స్పేస్‌స్టేషన్, చంద్రుడిపైకి వ్యోమగాములను పంపేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు.

ఎక్సైజ్ పన్ను విధింపులో జనాభా లెక్కలే ఆధారం: హైకోర్టు

ఈనాడు, అమరావతి: మద్యం దుకాణాలకు విధించే రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్(ఆర్ఈటీ)ని అధికారిక జనాభా లెక్కల ఆధారంగానే విధించాలని హైకోర్టు స్పష్టంచేసింది. అంచనా వేసిన జనాభా ఆధారంగా విధించడానికి వీల్లేదంది. ఎక్సైజ్ అధికారులు వైఎస్సార్ కడప జిల్లా మైదుకూరు మున్సిపాలిటీలో జనాభా 50,000 కన్నా ఎక్కువ ఉంటుందని అంచనా వేసి ఓ బార్, రెస్టారెంట్‌కు రూ.55 లక్షల ఆర్ఈటీని విధించడాన్ని తప్పుపట్టింది. 2011 జనాభా లెక్కల ప్రకారం మైదుకూరులో 50,000కు మించి జనాభా లేకపోయినా అధికారులు తమకు రూ.55 లక్షల ఆర్ఈటీ విధించడాన్ని సవాల్ చేస్తూ లక్ష్మీ వెంకటేశ్వర రెస్టారెంట్, బార్ లైసెన్స్‌దారు వెంకట సుబ్బయ్య హైకోర్టులో వ్యాజ్యం వేశారు. మైదుకూరులో 2011 లెక్కల ప్రకారం 45,790 మంది మాత్రమే ఉన్నారన్నారు. దీనిపై ఇటీవల హైకోర్టు విచారించింది. 'మైదుకూరు మున్సిపల్ కమిషనర్ ఎలాంటి శాస్త్రీయ ఆధారం లేకుండా.. జనాభా పెరిగినట్లు పేర్కొనడం సరికాదు. '2011 నుంచి ఇప్పటి వరకు జనాభా లెక్కలు తీయలేదు. ఈ నేపథ్యంలో 2011లో జనాభానే పరిగణనలోకి తీసుకోవాలి' అని న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు తీర్పు ఇచ్చారు. సంబంధిత బార్, రెస్టారెంట్ యజమాని ఇచ్చిన వినతిపై తగిన ఉత్తర్వులు జారీచేయాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఆరు వారాల్లో ఉత్తర్వులు జారీచేయడంలో విఫలమైతే పిటిషనర్ నుంచి రూ.35 లక్షలు మాత్రమే వసూలు చేయాలని స్పష్టంచేసింది.

గర్భిణిపై వైకాపా కార్యకర్త దాడి

- జుట్టు పట్టుకునిలాగి, కడుపుపై తన్నిన వైనం
- జగన్ పుట్టినరోజున వేడుకల పేరిట వీరంగం
- శ్రీసత్యసాయి జిల్లాలో ఘటన

కదిరి పట్టణం, తనకల్లు, న్యూస్‌టుడే: వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లాలోని ముత్యాలవాండ్లపల్లిలో ఆ పార్టీ కార్యకర్తలు వీరంగం సృష్టించారు. ఆదివారం రాత్రి గ్రామంలో కేకు కోసి, పెద్దశబ్దాలతో బాణసంచా కాలుస్తూ అరుపులు, కేకలతో హంగామా చేశారు. గ్రామానికి చెందిన ఏడునెలల గర్భిణి సంధ్యారాణి ఇంటివద్ద పదేపదే బాణసంచా కాల్చడంతో.. శబ్దాలతో ఇబ్బందిగా ఉందని, పక్కకు వెళ్లి కాల్చుకోండని ఆమె చెప్పారు. దీంతో వైకాపా నాయకులు కోపంతో ఊగిపోయారు. ఆగ్రహించిన ఆ పార్టీ కార్యకర్త అజయ్‌దేవ్ ఆమెపై దాడిచేశాడు. గర్భిణి అన్న కనికరం లేకుండా ఆమె జుట్టు పట్టుకునిలాగి, కడుపుపై కాలితో తన్ని గాయపరిచాడు. బాధితురాలిని కుటుంబ సభ్యులు తనకల్లు సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి శిశువు కదలికలు లేవని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం ఆమె, గర్భంలోని శిశువు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఆరునెలల కిందట బాధితురాలి కుమారుడు మృతి: సంధ్యారాణి మూడేళ్ల కుమారుడు నిశాంత్‌బాబు ఆరునెలల కిందట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న నీటిసంపులో పడి మృతిచెందాడు. ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి అయిన ఆమెపై వైకాపా కార్యకర్త దాడిచేయడంతో ఆ దంపతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నిందితుడిని చట్టపరంగా శిక్షించాలని బాధితులు వేడుకుంటున్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

గర్భిణిపై దాడి చేయడం దారుణం

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ఈనాడు, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుకల పేరిట గర్భిణి అని తెలిసినా టపాసులు పేల్చి దాడికి తెగబడటం దారుణమని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ మండిపడ్డారు. గర్భిణిపై చేయి చేసుకోవడం నేరమని, ఇలాంటి క్రూరత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. మహిళల గౌరవం, భద్రతతో చెలగాటం ఆడితే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శ్రీసత్యసాయి జిల్లాలో గర్భిణిపై జరిగిన దాడి ఘటనపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై సోమవారం జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి ఆరా తీశారు. ఆసుపత్రి వైద్యులను సంప్రదించి గర్భిణి, గర్భంలోని శిశువు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

జీవితం రెండు రకాలు



జీవితం రెండు రకాలుగా ఉంటుంది. మొదటి దాంట్లో ఎటువంటి ఆసక్తి, ఉత్సాహం, ఉత్తేజం ఉండవు. చివరకు పశ్చాత్తాపం మిగులుతుంది. రెండో దాంట్లో మీరు కోరుకున్న జీవితాన్ని గడపడం, కొత్త విషయాలను అన్వేషించడం, ప్రయోగాలు చేయడం, జీవితంపై సంతృప్తిని పొందడం ఉంటాయి. ఏ రకమైన జీవితం గడపాలనేది మన ఎంపికపై ఆధారపడి ఉంటుంది.

– బీఎస్ గుప్తా, రచయిత.

EENADU Vol: 52, Issue: 133 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

sukhi@eenadu.in

సుఖీభవ

ఈనాడు

15 మంగళవారం డిసెంబరు 23, 2025

కార్నియా ఇన్‌ఫెక్షన్‌కు కొత్త చికిత్స

కంట్లోని కార్నియాలో తలెత్తే కెరటైటిస్ ఫంగస్ ఇన్‌ఫెక్షన్‌ను నయం చేయటంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు గొప్ప ముందడుగు వేశారు. కోల్‌కతాలోని బోస్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకుల సాయంతో ఎస్ఏ-ఎక్స్‌వీ అనే కొత్త పెప్టైడ్‌ను రూపొందించారు. సూక్ష్మక్రిములను నిర్మూలించే గుణం గల ఎస్100ఏ12 అనే మరో పెద్ద పెప్టైడ్ నుంచి దీన్ని సంగ్రహించటం గమనార్హం. ఇది ఫంగస్ డీఎన్ఏకు అంటుకొని, కణ వృద్ధిని ఆపటం ద్వారా పనిచేస్తుంది. చివరికి ఫంగస్ కణం చనిపోయేలా ప్రేరేపిస్తుంది. సాధారణంగా కార్నియా ఇన్‌ఫెక్షన్లను నిశ్శబ్ద మహమ్మారులుగా భావిస్తుంటారు. మనదేశంలో చాలామందిలో ముఖ్యంగా వ్యవసాయ పనులు చేసేవారిలో ఇవి ఎక్కువగా కనిపిస్తుంటాయి. ప్రస్తుతం ఫంగల్ కెరటైటిస్ చికిత్సకు యాంఫోటెరిసిన్ బి మందు ఒక్కటే అందుబాటులో ఉంది. అయితే దీంతో కిడ్నీలకు హాని కలగటం, ఎర్ర రక్తకణాలు విచ్ఛిన్నం



కావటం వంటి దుష్ప్రభావాలు పొంచి ఉంటున్నాయి. అందువల్ల కొత్త యాంటీఫంగల్ మందులు తక్షణావసరంగా మారాయి. ఈ నేపథ్యంలో ఎల్వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు రూపొందించిన ఎస్ఏ-ఎక్స్‌వీ కొత్త ఆశలు రేపుతోంది. దీనికి సంబంధించిన పరిశోధన పత్రం ఇటీవలే జర్నల్ ఆఫ్ బయాలాజికల్ కెమిస్ట్రీ పత్రికలో ప్రచురితమైంది. ఈ పెప్టైడ్ విషతుల్యం కాదు, రక్తంలో స్థిరంగా ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. ఇది రెండు రకాల ఫంగస్ జాతులనూ (ఫ్యూజేరియం, క్యాండిడా) సమర్థంగా అడ్డుకుంటుందని వివరిస్తున్నారు. దీన్ని ఎలుకలపై పరీక్షించగా కెరటైటిస్ తీవ్రత తగ్గినట్టు తేలింది. ఇది కేవలం ఫంగస్‌ను నిర్మూలించటమే కాకుండా కార్నియా ఇన్‌ఫెక్షన్లలో పుండు మానటాన్నీ ప్రేరేపిస్తుండటం విశేషం. అందుకే ప్రస్తుత చికిత్సలకు ఈ పెప్టైడ్ ప్రత్యామ్నాయం కాగలదని ఆశిస్తున్నారు.

చెమటతో విషతుల్యాలు పోవు

చెమట పడితే విషతుల్యాలు బయటకు పోతాయని కొందరు ఆవిరి స్నానం చేస్తుంటారు. ఆవిరి గదుల్లో వేడి ఎక్కువగా ఉండటం వల్ల చెమట పోసే మాట నిజమే కావొచ్చు. కానీ చెమటలో దాదాపు 99% వరకూ ఉండేది నీరే. మిగతా ఒక శాతంలో సోడియం, క్లోరైడ్ వంటి లవణాలు.. కొద్దిగా ఖనిజాలు, యూరియా, ప్రొటీన్లు ఉంటాయి. మన శరీరంలో కిడ్నీలు, కాలేయమే ప్రధానంగా విషతుల్యాలను తొలగిస్తాయి. చెమట చేసే ముఖ్యమైన పని శరీర ఉష్ణోగ్రతను నియంత్రించటం. హానికారక విషతుల్యాలను తొలగించటానికిది ఉపయోగపడదు.

చల్లటి నీరు తాగితే జలుబు చేస్తుందా?

అపోహ | నిజం

మనలో చాలామంది చల్లటి నీరు తాగితే జలుబు చేస్తుందని భావిస్తుంటారు. ఇది నిజం కాదు. జలుబుకూ చల్లటి నీరుకూ సంబంధం లేదు. జలుబు, ఫ్లూ రావటానికి కారణం వైరస్‌లు. ఇవి నీటిలో ఉండవు. గాలి ద్వారానే ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. జలుబు, ఫ్లూ గలవారు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెలువడే తుంపర్లు గాలిలో కలుస్తాయి. వీటిని పీల్చినప్పుడు ఇతరులకు సోకుతాయి. తుంపర్లు అంటుకున్న వస్తువుల మీద చేయి పెట్టి, అదే చేత్తో ముక్కు, నోరు, కళ్లను రుద్దుకున్నా వైరస్‌లు వ్యాపిస్తాయి. అంతే తప్ప చల్లటి నీరు తాగితే జలుబు చేయదు. నిజానికి క్రీడాకారుల వంటి వారు శరీర సామర్థ్యం పెరగటానికి చల్లటి నీరే తాగుతుంటారు. వీరెవరికీ జలుబు చేయటం లేదు కదా. కొందరు చల్లగాలి తాకితే జలుబు చేస్తుందనీ అనుకుంటుంటారు. ఇదీ అపోహే. మరి చలికాలంలో జలుబు, దగ్గు ఎందుకు ఎక్కువగా వస్తుంటాయి? ఈ కాలం వైరస్ వృద్ధి చెందటానికి, వ్యాపించటానికి అనుకూలంగా ఉంటుంది. చలికాలంలో గాలిలో తేమ



తగ్గి, పొడిబారుతుంది. దీంతో తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వెలువడే తుంపర్లు ఎక్కువకాలం గాలిలో ఉంటాయి. అలాగే చలికాలంలో ఎక్కువగా ఇంట్లో ఉండటానికి ప్రయత్నిస్తుంటారు. ఇంట్లో వాళ్లంతా దగ్గరదగ్గరగా ఉంటారు కూడా. దీంతో వైరస్‌లు త్వరగా వ్యాపిస్తాయి. మరోవైపు చలికాలంలో కాలుష్యం ఎక్కువ. ముక్కు ద్వారా శ్వాసనాళాల్లోకి చేరుకునే కాలుష్య కారకాలు లోపల జిగురుపొరను దెబ్బతీస్తాయి. అప్పుడు జిగురు స్రావాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. ఇది ఇన్‌ఫెక్షన్ త్వరగా తలెత్తటానికి ఆస్కారం కలిగిస్తుంది. అప్పటికే ఆస్థమా వంటి సమస్యలు గలవారికి చలిగాలితో లక్షణాలు ఉద్ధృతమవుతాయి. ఉష్ణోగ్రతలో తేడా వల్ల లక్షణాలు తీవ్రమైనట్టు అనిపిస్తుంది.



డా॥ ఎం.వి.రావు, జనరల్ ఫిజీషియన్

ఆరోగ్యపరంగా ఏవైనా అపోహలుంటే sukhi@eenadu.in కు పంపొచ్చు. నిపుణుల ద్వారా తీర్చటానికి ప్రయత్నిస్తాం.

నడుం పోటు!



గుండెపోటు గురించి తెలిసిందే. మరి నడుం పోటు గురించి విన్నారా? ఆశ్చర్యంగా అనిపించినా ఇదీ గుండెపోటు వంటిదే. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నాళాల్లో పూడికలు ఏర్పడితే గుండెపోటు వస్తుంది కదా. అప్పుడు ఛాతీనొప్పి (యాంజైనా) తలెత్తుతుంది. అలాగే నడుం వద్ద కండరాలకు, అవయవాలకు రక్తాన్ని తీసుకెళ్లే నాళాల్లో పూడికలు ఏర్పడినా వాటికి రక్త సరఫరా తగ్గుతుంది. ఇదీ నొప్పికి దారితీస్తుంది. అచ్చం గుండెపోటు మాదిరిగానే. అందుకే దీన్ని లంబార్ యాంజైనా అనీ పిలుచుకుంటారు. అంటే నడుం పోటుతో తలెత్తే నొప్పి అన్నమాట.

నడుం నొప్పి తరచూ చూసేదే. కుటుంబంలో ఎవరో ఒకరు ఎప్పుడో అప్పుడు దీని గురించి ఫిర్యాదు చేస్తూనే ఉంటారు. అయితే అన్నిసార్లూ ఇది వెన్నెముక సమస్యే కాకపోవచ్చు. ముఖ్యంగా ఊబకాయం, మధుమేహం గలవారు నడుం నొప్పితో ఇబ్బంది పడుతుంటే ఒకింత సునిశితంగా గమనించాల్సిందే. ప్రత్యేకించి కూర్చున్నప్పుడు నొప్పి తగ్గటం, నడవటం మొదలెట్టగానే నొప్పి తలెత్తటం, నడక అలాగే కొనసాగిస్తే తీవ్రమవుతుండటం.. ఆ వెంటనే నడక ఆపితే నొప్పి తగ్గటం, కాసేపటికి నొప్పి పూర్తిగా మాయమవుతున్నట్టయితే మరేదో కారణమవుతుండొచ్చని అనుమానించాల్సిందే. చాలామంది దీన్ని దిగువ వెన్నెముక నొప్పి, సయాటికాగా పొరపడుతుంటారు. క్యాల్షియం, నొప్పి నివారణ మాత్రలు వేసుకుంటుంటారు. కొందరు ప్రత్యేక వ్యాయామాలూ చేస్తుంటారు. అయినా ఫలితం కనిపించదు. సమస్య ఒకటి, చికిత్స మరోటి అయితే ఏం ప్రయోజనముంటుంది?



డా॥ కె.కె.పాండే
వాస్కులర్
&
కార్డియోథొరాసిక్ సర్జన్
ఇంద్రప్రస్థ అపోలో హాస్పిటల్స్, దిల్లీ

నడుం నొప్పా? పోటా?

ఎవరికైనా నడుం నొప్పి వచ్చిందంటే సాధారణంగా రెండు కారణాలు కనిపిస్తుంటాయి. ఒకటి- దీర్ఘకాల నడుం నొప్పి. ఇది చాలావరకూ కింద పడటం వల్ల వస్తుంది. రెండు- ఊబకాయం, అధిక బరువు. దీనికి కారణం శారీరక శ్రమ, వ్యాయామం తగ్గటం. రోజులో ఎక్కువసేపు కూర్చునేవారిలో వెన్నెముక కదలటం తగ్గుతుంది. క్రమంగా పూసలు బిగుసుకోవటం మొదలెడతాయి. దీంతో వెన్నెముక సాఫీగా సాగదు. ఇలాంటివారు పనులు చేయటం మొదలెట్టగానే నొప్పితో విలవిల్లాడుతుంటారు. దీనికి భిన్నమైంది లంబార్ యాంజైనా. ఇందులో నడుస్తున్నప్పుడు నడుం, తొడ నొప్పి మొదలవుతుంది. వెన్నుపూసలు బిగుసుకోవటంతో దీనికి సంబంధం లేదు. ఇది నడుం, తొడ భాగాలకు మంచి రక్తం సరఫరా తగ్గటం వల్ల వస్తుంది. ఎవరైనా కూర్చున్నప్పుడు నడుం నొప్పితో బాధపడుతుంటే దీన్ని అనుమానించాలి. ముఖ్యంగా మధుమేహులు, పొగతాగేవారిలో దీన్ని చూస్తుంటాం. రక్త సరఫరా తగ్గటం వల్ల వచ్చే నొప్పిని వైద్యపరంగా యాంజైనా అంటారు. గుండె కండరానికి రక్తం సరఫరా తగ్గితే గుండెపోటు వచ్చినట్టుగానే నడుం వద్ద కండరాలకు, తుంటి అవయవాలకు రక్తం తగినంత అందకపోతే లంబార్ యాంజైనాకు దారితీస్తుంది. దీన్ని నిర్లక్ష్యం చేస్తే పాదాలకు రక్తసరఫరా తగ్గి, కుళ్లిపోయే (గ్యాంగ్రీన్) ముప్పు పెరుగుతుంది.

ఎందుకొస్తుంది?


గుండె నుంచి వచ్చే పెద్ద రక్తనాళం కడుపు గుండా సాగుతూ నడుం కింది భాగానికి వెళ్తుంది. ఇది నడుం దిగువ కండరాలకు, తుంటి అవయవాలకు రక్తాన్ని సరఫరా చేస్తుంది. ఈ రక్తనాళం రెండుగా చీలి కుడి, ఎడమ తొడలకు రక్తాన్ని తీసుకెళ్తుంది. అక్కడి నుంచి మరింత కిందికి సాగి కాళ్లకు, పాదాలకు రక్తం సరఫరా చేస్తుంది. వ్యాయామం చేయకపోవటం, రక్తంలో గ్లూకోజు అదుపులో లేకపోవటం వల్ల రక్తనాళాల్లో త్వరగా కొవ్వు పేరుకుపోతుంది. దీంతో లోపలి మార్గం సన్నబడుతుంది. పొగ తాగేవారు, మధుమేహుల్లో ఇది మరింత ఎక్కువ. దీంతో నడుం, తొడ భాగాలకు మంచి రక్తం అందటం తగ్గుతుంది. ఫలితంగా నడుస్తున్నప్పుడు నడుం నొప్పి తలెత్తుతుంది. దీన్నే వైద్యపరంగా లీక్స్ సిండ్రోమ్ అంటారు.

నొప్పి మందులు వద్దు

నడుం నొప్పి అనగానే మనదగ్గర నొప్పి మాత్రలు వేసుకోవటం మొదలెట్టేస్తుంటారు. అదీ డాక్టర్ సలహా తీసుకోకుండా. ఒక మాత్ర పనిచేయకపోతే మరో మాత్ర మారుస్తుంటారు. ఇలా వారాలు, నెలల కొద్దీ వేసుకుంటుంటారు. ఇది తప్పు. కారణాన్ని తెలుసుకోకుండా నొప్పి మాత్రలు వాడటం చాలా హానికరం. నడుం, తొడ భాగాలకు సరిగా రక్తం అందకపోవటం వల్ల వచ్చే నొప్పికి సరైన చికిత్స తీసుకోకపోతే మున్ముందు కాళ్లను కోల్పోయే ప్రమాదముంది. అదేపనిగా నొప్పి మాత్రలు వాడితే కిడ్నీలూ దెబ్బతినొచ్చు. చివరికి కిడ్నీ వైఫల్యమూ సంభవించొచ్చు.

కాళ్లకు, శృంగారానికి ప్రమాదం

నడం పోటును నిర్లక్ష్యం చేస్తే రెండు రకాలుగా హాని కలుగుతుంది మగవారిలో అంగానికి రక్త సరఫరా సరిగా జరగకపోతే స్తంభన లోపం, శృంగారాన్ని ఆస్వాదించలేకపోవటానికి దారితీస్తుంది. మరో సమస్య- కాళ్లకు మంచి రక్తం అందటం తగ్గుతూ రావటం. దీంతో కాళ్లలో తీవ్రమైన నొప్పి, చర్మం నల్లబడటం మొదలవుతుంది. పాదాలు, కాళ్లు కుళ్లిపోవటమూ ఆరంభమవుతుంది. అప్పుడు వాటిని శస్త్రచికిత్స చేసి తొలగించటం తప్ప మరో మార్గముండదు.



పొగతాగటం మానెయ్యాలి

మధుమేహం గలవారికి పొగతాగటం లేదా తరచూ జర్దా, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులు తినే అలవాటు కూడా ఉన్నట్టయితే కాళ్లకు చేటు తెచ్చుకున్నట్టే. దీర్ఘకాలంగా మధుమేహం గలవారికి రక్తనాళాలు దెబ్బతినే ముప్పు ఎక్కువ. దీనికి పొగాకు తోడైతే అగ్నికి ఆజ్యం పోసినట్టే. కాళ్లు, పాదాలకు రక్తం అందటం మరింత తగ్గుతుంది త్వరగా గ్యాంగ్రీన్ ముంచుకొస్తుంది. పొగతాగే అలవాటు గల మధుమేహులకు చికిత్స చేసినా ఫలితం అంతగా ఉండకపోవచ్చు కూడా.

ఏం చేయాలి?

నడుం నొప్పితో బాధపడేవారు.. ముఖ్యంగా మధుమేహం, పొగతాగే అలవాటు గలవారు నిర్లక్ష్యం చేయొద్దు. అధునాతన డాప్లర్ స్టడీస్, సీటీ యాంజియోగ్రఫీ పరీక్షల సదుపాయాలున్న ఆసుపత్రికి వెళ్లి, కారణాన్ని తెలుసుకోవాలి. రక్తనాళాలకు లేదా గుండెరక్తనాళాలకు (వాస్కులర్, కార్డియోవాస్కులర్) చికిత్స చేసే నిపుణులను సంప్రదించాలి. నడుం నొప్పి కారణాన్ని నిర్ధారించటానికిది తప్పనిసరి. ఆసుపత్రిలో కాళ్ల ధమనుల బైపాస్, యాంజియోప్లాస్టీ, స్టెంట్ చికిత్సల సదుపాయాలు ఉన్నాయేమో చూసుకోవాలి. అవసరమైతే అక్కడ వెన్నెముక సర్జరీ కూడా చేయగలిగి ఉండాలని గుర్తుంచుకోవాలి.

చికిత్స ఇలా..

ముందుగా యాంజియోగ్రామ్ పరీక్షతో కడుపు వద్ద రక్తనాళాల్లో పూడికలను తెలుసుకోవటం ద్వారా జబ్బును నిర్ధారిస్తారు. ఇందులో గజ్జల్లోని రక్తనాళాల్లో పూడికల తీరు తెన్నులు బయటపడతాయి. ఎలాంటి చికిత్స అవసరమో నిర్ణయించటానికిది తోడ్పడుతుంది. చాలామందికి ధమని బైపాస్ శస్త్రచికిత్స అవసరమవుతుంది. శరీరంలోంచి ఇతర భాగాల నుంచి తీసుకున్న రక్తనాళాన్ని లేదా కృత్రిమ గ్రాఫ్టును పూడిక ఏర్పడిన చోటుకు అటూ ఇటూ అతికిస్తారు. దీంతో తిరిగి రక్తసరఫరా పుంజుకుంటుంది. కొందరికి యాంజియోప్లాస్టీతో రక్తనాళం లోపలి మార్గాన్ని వెడల్పు చేయటం లేదా స్టెంట్ అమర్చటం అవసరమవ్వచ్చు. అయితే ఈ చికిత్సలు ఎవరికి అవసరమో, ఎవరు వీటికి సరిపోతారో గుర్తించటం చాలా కీలకం. వాస్కులర్ లేదా కార్డియోవాస్కులర్ సర్జన్లు మాత్రమే దీన్ని నిర్ణయించగలరని తెలుసుకోవాలి.

మీ నూనెలో ఒమేగా 3 లేదా?




గింజల నుంచి తీసిన వంట నూనెల వాడకంలో వివాదాలు బోలెడు. వీటిల్లో ఒమేగా 6 కొవ్వు ఆమ్లాలు ఎక్కువగానూ, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు తక్కువగానూ ఉంటాయని.. వీటి మధ్య సమతుల్యత లోపించటంతో ఒంట్లో కణస్థాయిలో వాపుప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) ప్రేరేపితమవుతుందని భావిస్తుంటారు. ఇందులో నిజమెంత?

మనం తరచూ వంటలకు పొద్దు తిరుగుడు, సోయా, మొక్కజొన్న నూనెల వంటివి వాడుతుంటాం. గింజల నుంచి తీసే వీటిల్లో ఒమేగా 6 కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా, ఒమేగా 3 కొవ్వులు తక్కువగా ఉంటాయి. ఇప్పటికే మన ఆధునిక వంటకాల్లో ఒమేగా 6 కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉంటున్నందున గింజ నూనెలతో వీటి మధ్య వ్యత్యాసం మరింత పెరుగుతుంది. దీంతో కొందరిలో.. ముఖ్యంగా ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలతో కూడిన ఆహారం తీసుకోనివారిలో స్వల్పస్థాయి వాపుప్రక్రియ ప్రేరేపితమవ్వచ్చు. అంతమాత్రాన పూర్తిగా గింజ నూనెల మీదే నింద వేయటం సరికాదు. ఇవి స్వతహాగా హానికరమైనవేమీ కావు. వీటిల్లో అసంతృప్త కొవ్వులు ఉండటం వల్ల సురక్షితం. సంతృప్త కొవ్వులకు బదులు వీటిని వాడితే గుండెకూ మేలు చేస్తాయి. అయితే సమస్యంతా ఆహార పద్ధతులతోనే వస్తోంది. వంట నూనెలతో కాదు. ఇలాంటి గింజ నూనెలతో చేసే వేపుళ్లు, ప్యాకెట్లలో అమ్మే పదార్థాలు, చిరుతిళ్లు అధికంగా తింటుంటే ఒమేగా 6, 3 కొవ్వుల మధ్య వ్యత్యాసం ఇంకాస్త ఎక్కువవుతుంది. ఒకవేళ ఒమేగా 3 కొవ్వులతో కూడిన ఆహారాన్ని చేర్చుకుంటే రెండింటి మధ్య సమతూకాన్ని సాధించొచ్చు. అదీ వంట నూనెలను పూర్తిగా పక్కనపెట్టేయకుండానే.

ఇలా భర్తీ చేసుకోవాలి

ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు.. ముఖ్యంగా ఈపీఏ, డీహెచ్ఏ చేపలతో లభిస్తుంది. ఈ ఆమ్లాలకు వాపు ప్రక్రియను తగ్గించే గుణముంది. శాకాహారంలో అవిసె, చియా గింజలు, అక్రోట్లలో కొంతవరకూ ఏఎల్ఏ అనే ఆమ్లం ఉంటుంది. వీటిని తరచూ తీసుకుంటూ ఉన్నట్టయితే ఒమేగా 6, 3 కొవ్వుల మధ్య వ్యత్యాసం క్రమంగా భర్తీ అవుతూ వస్తుంది. అయితే ఒమేగా 6 కొవ్వులను మరీ అతిగా తీసుకోకుండానూ చూసుకోవాలి. ఈ రెండు రకాల కొవ్వులనూ శరీరం అత్యవసర పనుల కోసం వాడుకుంటుంది. అంటే ఒమేగా 6 కొవ్వులను మానెయ్యటం కాకుండా తగినంత ఒమేగా 3 కొవ్వులనూ తీసుకోవటం ముఖ్యమని గుర్తించాలి. వారానికి రెండు మూడు సార్లు కొవ్వుతో కూడిన చేపలు లేదా తరచూ అవిసె, చియా, అక్రోట్ల వంటివీ తినటం మంచిది. అలాగే అతిగా పాలిష్ చేసిన పదార్థాలతో కూడిన ఆహారం, వేపుళ్ల వంటివి తగ్గించుకోవాలి కూడా. ఈ రెండూ కలిపి పాటిస్తే గుండె, మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. జీవక్రియలు సరిగా సాగేలా చూసుకోవచ్చు.



ఒమేగా 3 మాత్రలు అవసరమా?

చేపలు తగినంత తిననివారికి, గుండె జబ్బులు గలవారికి, ట్రైగ్లిజరైడ్ల మోతాదులు ఎక్కువగా ఉన్నవారికి, వాపుప్రక్రియతో ముడిపడిన సమస్యలు గలవారికి ఒమేగా 3 మాత్రలు అవసరం. చేప నూనె లేదా ఆల్గే ఆధారిత మాత్రలతో ఈపీఏ, డీహెచ్ఏ నేరుగా అందుతాయి. వృక్ష ఆధారిత ఏఎల్ఏ కన్నా వీటిని శరీరం సమర్థంగా వినియోగించుకుంటుంది కూడా. అలాగని అందరికీ మాత్రలు అవసరం లేదు. రక్తాన్ని పలుచగా చేసే మందులు వాడేవారు, రక్తం సరిగా గడ్డకట్టని సమస్యలు గలవారు, శస్త్రచికిత్సలకు సన్నద్ధమయ్యే వారు, చేపలు లేదా ఆల్గే పడనివారు ఈ మాత్రలను మొదలెట్టే ముందు డాక్టర్‌ను సంప్రదించటం తప్పనిసరి. వీటిని పెద్దమొత్తంలో తీసుకుంటే రక్తస్రావమయ్యే గుణం పెరగొచ్చు. జీర్ణ సమస్యలు తలెత్తొచ్చు. గర్భిణులకు ఒమేగా 3 మేలు చేసేదే అయినా గర్భిణుల కోసం ప్రత్యేకంగా తయారుచేసిన మాత్రలనే వాడుకోవాలి. అలాగే విటమిన్ ఏ ఎక్కువగా తీసుకోకుండానూ చూసు కోవాలి. ఆరోగ్యవంతులు చాలావరకూ ఆహారం ద్వారా ఒమేగా 3 లభించేలా చూసుకుంటే చాలు. ఆహారం ద్వారా తగినంత అందనప్పుడు లేదా డాక్టర్లు సూచిస్తే మాత్రలు వాడుకోవచ్చు.

పరీక్షించుకోవాలా?

ఒమేగా 3 ఇండెక్స్ అనే రక్తపరీక్ష ద్వారా ఒమేగా 3 మోతాదులను పరీక్షించుకునే వీలుంది. ఇది ఎర్ర రక్తకణాల పొరలో ఈపీఏ, డీహెచ్ఏ శాతాలను అంచనా వేస్తుంది. మామూలు కొలెస్ట్రాల్ పరీక్షలతో పోలిస్తే ఇందులో దీర్ఘకాలంలో ఒమేగా 3 కొవ్వు ఆమ్లాల మోతాదులు స్పష్టంగా తెలుస్తాయి. అయితే ఇది అందరికీ అవసరం లేదు. ప్రధానంగా గుండెజబ్బు ముప్పు, వాపుప్రక్రియతో ముడిపడిన సమస్యలు గలవారికి ఉపయోగపడుతుంది. ఒమేగా 3 కొవ్వు మాత్రలు వేసుకునేవారిలో వాటి మోతాదులు ఎలా ఉన్నాయో తెలుసుకోవటానికీ తోడ్పడుతుంది. మిగతావారికిది తప్పనిసరి కాదు. అవసరమనుకుంటే చేయించుకోవచ్చు. తమ శరీర అవసరాలకు అనుగుణంగా ఆహార పద్ధతులు పాటించేవారికి, ఒమేగా 3 లోపంతో కూడిన లక్షణాలు గలవారికి, చేపల వంటివి తక్కువగా తినేవారికి అవసరమైన సమాచారం అందించటానికీ ఇది వీలు కల్పిస్తుంది.

ఆరోగ్యంలో కీలక పాత్ర



ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలను మన శరీరం తయారుచేసుకోలేదు. కాబట్టి ఆహారం ద్వారా తీసుకోవటం తప్పనిసరి. ఇవి మెదడు పనితీరు, గుండె ఆరోగ్యం, కణాల ఆకృతి, వాపు ప్రక్రియ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. గుండె లయబద్ధంగా కొట్టుకోవటానికి, ట్రైగ్లిజరైడ్లు తగ్గటానికి, రక్తనాళాలు ఆరోగ్యంగా ఉండటానికి ఈపీఏ, డీహెచ్ఏ తోడ్పడతాయి. ముఖ్యంగా మెదడు పనితీరు, మూడ్, జ్ఞాపకశక్తి, విషయ గ్రహణ సామర్థ్యం పెంపొందటానికి డీహెచ్ఏ బాగా ఉపయోగపడుతుంది. కీళ్లు సాఫీగా కదలటానికి, కళ్లు ఆరోగ్యంగా ఉండటానికి, గర్భస్థ శిశువు ఎదుగుదలకు, బాల్యంలో పిల్లల వృద్ధికి ఒమేగా 3 కొవ్వులు దోహదం చేస్తాయి. ఇవి లోపిస్తే గుండెజబ్బు వంటి దీర్ఘకాల సమస్యలు, వాపుప్రక్రియతో ముడిపడిన జబ్బుల ముప్పు పెరుగుతుంది. అయినా కూడా మనదగ్గర చాలామంది నిర్ణీత మోతాదుల కన్నా తక్కువగా తీసుకోవటం ఆందోళనకరం. ఆహారం లేదా అవసరాన్ని బట్టి మాత్రలతో వీటిని తగినంత తీసుకుంటే దీర్ఘకాలంలో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు. జీవనశైలి మార్పులతో తలెత్తే జబ్బుల బారినపడకుండా కాపాడుకోవచ్చు. కాకపోతే క్రమం తప్పకుండా తగినంత తీసుకోవటం ముఖ్యమనే విషయాన్ని మరవొద్దు. ఎందుకంటే వీటి ప్రయోజనాలు ఉన్నట్టుండి కనిపించవు. క్రమంగా కనిపిస్తుంటాయి.

ముందస్తు మధుమేహమే (ప్రిడయాబిటీస్) కదాని తేలిగ్గా తీసుకోకండి. ఆహార, వ్యాయామ నియమాలతో గ్లూకోజు మోతాదులను తిరిగి మామూలు స్థితికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించండి. దీంతో భవిష్యత్తులో తీవ్ర గుండె సమస్యల ముప్పును గణనీయంగా తగ్గించుకోవచ్చని తాజాగా బయటపడింది. మధుమేహ నివారణకు ప్రస్తుతం అనుసరిస్తున్న పద్ధతులను ఇది సవాల్ చేస్తోంది.


ముందస్తు మధుమేహాన్నీ కట్టడి చేయాల్సిందే

ముందస్తు మధుమేహం గలవారిలో గ్లూకోజు మోతాదులు ఇంకా ఎక్కువగానే ఉన్నవారితో పోలిస్తే- మునుపటి స్థితికి తెచ్చుకున్నవారికి గుండెపోటుతో మరణించటం లేదా గుండె వైఫల్యంతో ఆసుపత్రిలో చేరటం 58% తక్కువని ద లాన్సెట్ డయాబిటీస్ అండ్ ఎండోక్రైనాలజీ పత్రికలో ప్రచురితమైన పరిశోధన పేర్కొంటోంది. గ్లూకోజు మోతాదులను మామూలు స్థితికి తెచ్చుకున్నవారిలో దశాబ్దాల తర్వాతా ఈ రక్షణ ప్రభావం కనిపిస్తుండటం గమనార్హం. ముందస్తు మధుమేహంలోనూ గ్లూకోజు మోతాదులు నార్మల్ కన్నా ఎక్కువగానే ఉంటాయి. కాకపోతే మధుమేహంగా గుర్తించేంత ఎక్కువగా ఉండవు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే పూర్తిస్థాయి మధుమేహంలోకి జారటం ఖాయం. అందుకే బరువు తగ్గటం, వ్యాయామం చేయటం, ఆహారంలో మార్పులు చేసుకోవటం మంచిదని డాక్టర్లు సూచిస్తుంటారు. వీటితో గుండె పోటు, అకాల మరణం ముప్పు తగ్గించుకోవచ్చని చెబుతుంటారు. అయితే ఇలాంటి జీవనశైలి మార్పులు పాటించటమే కాదు, గ్లూకోజు స్థాయులను తిరిగి నార్మల్‌కు తీసుకురావటమూ ముఖ్యమేనని తాజా అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి. అప్పుడే గుండెజబ్బుల బారినపడకుండా చూసుకోవటం సాధ్యమని వివరిస్తున్నాయి. ఇన్సులిన్‌కు కణాలు బాగా స్పందించటం, అవయవాల చుట్టూ పోగుపడే హానికర కొవ్వు తగ్గటం ఇందుకు దోహదం చేస్తుండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. కణాలు ఇన్సులిన్‌కు సరిగా స్పందించకపోతే రక్తనాళాలు దెబ్బతినే ప్రమాదముంది. పూర్తిస్థాయి మధుమేహం తలెత్తటానికి ముందే గుండెజబ్బుల ముప్పు పెరుగుతుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.



మల్టిపుల్ స్క్లిరోసిస్ మూలం పేగుల్లో!

విపరీతమైన నిస్సత్తువ, శరీరం తూలటం, సరిగా నడవలేకపోవటం.. ఇలాంటి లక్షణాలతో మల్టిపుల్ స్క్లిరోసిస్ (ఎంఎస్) తీవ్రంగా వేధిస్తుంది. దీనికి కారణం రోగనిరోధక వ్యవస్థ పొరపాటున నాడుల మీదుండే మైలీన్ అనే రక్షణ పొర మీద దాడి చేసి, దెబ్బతీయటం. ఇందుకు పేగుల్లోని కొన్నిరకాల బ్యాక్టీరియా అదృశ్యంగా ఆజ్యం పోస్తున్నట్టు బయటపడింది. ఇది రోగనిరోధక వ్యవస్థను నాడుల మీద దాడిచేసేలా పురికొల్పుతున్నట్టు, జబ్బు తీవ్రమయ్యేలా చేస్తున్నట్టు వెల్లడైంది. మల్టిపుల్ స్క్లిరోసిస్ సాధారణంగా 20-40 ఏళ్ల వయసువారికి వస్తుంటుంది. కొన్నిసార్లు పిల్లలు, యుక్తవయసువారికీ రావొచ్చు. మగవారికన్నా ఆడవారిలో ఎక్కువ. వీరిలో రోగనిరోధక వ్యవస్థ ఎందుకు గతి తప్పుతుందో తెలుసుకోవాలని శాస్త్రవేత్తలు చాలాకాలంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా బేసల్, బాన్ విశ్వవిద్యాలయాల పరిశోధకులు పేగు బ్యాక్టీరియా మీద దృష్టి సారించారు. ఎందుకంటే ఆరోగ్యవంతులతో పోలిస్తే ఎంఎస్ గలవారి పేగుల్లో బ్యాక్టీరియా భిన్నంగా ఉంటుంది మరి. అయితే ఇదెలా జబ్బును ప్రేరేపిస్తుందనేది స్పష్టంగా తెలియదు. తాజాగా దీని రహస్యాన్ని ఛేదించారు. కొన్ని బ్యాక్టీరియా ఉపరితల ఆకృతులు మైలీన్ పొరను పోలి ఉంటాయి. దీంతో రోగనిరోధక కణాలు తికమకకు గురై బ్యాక్టీరియాతో పాటు నాడీకణాల మీదా దాడి మొదలెడతాయి. దీన్ని పరీక్షించటం కోసమే శాస్త్రవేత్తలు వాపుప్రక్రియను ప్రేరేపించే సాల్మొనెల్లా బ్యాక్టీరియాను మైలీన్ పైపొరను పోలి ఉండేలా జన్యుపరంగా తీర్చిదిద్ది, ఎలుకల్లో ప్రవేశపెట్టారు. వీటికి ఎంఎస్ త్వరగా రావటమే కాకుండా జబ్బు ఇంకాస్త తీవ్రంగానూ పరిణమిస్తున్నట్టు తేలటం ఆశ్చర్యకరం. అంత హానికరం కాని ఇ.కొలి బ్యాక్టీరియాతో ఇదే విధానాన్ని పరీక్షించగా జబ్బు అంత తీవ్రం కాకపోవటం గమనార్హం. రోగనిరోధక వ్యవస్థను ప్రేరేపించటానికి బదులు దానికి తిరిగి శిక్షణ ఇచ్చే అవకాశముందని ఫలితాలు సూచిస్తున్నాయి. ఈ ప్రక్రియ ఏదో ఒకనాడు చికిత్సగానూ ఉపయోగపడగలదని పరిశోధకులు ఆశిస్తున్నారు.



జీర్ణం జీర్ణం

మనం తిన్న ఆహారం ముందు జీర్ణాశయంలో విచ్ఛిన్నమవుతుంది. ఆ తర్వాత పేగుల్లోకి వెళ్తుంది. జీర్ణాశయంలో ఆహారం ఎంత సేపు ఉంటుందనేది రకరకాల అంశాల మీద ఆధారపడుతుంది. చాలా ఎక్కువగా తిన్నప్పుడు.. అలాగే కొవ్వు పదార్థాలు, ఎక్కువ కేలరీలు తీసుకున్నప్పుడు ఆహారం నెమ్మదిగా కిందికి వెళ్తుంది. కొన్ని సమస్యలూ దీనికి కారణం కావొచ్చు. గ్యాస్ట్రోపెరెసిస్ ఇలాంటిదే. ఇది అంత ఎక్కువగా కనిపించేది కాకపోయినా ప్రతి నలుగురిలో ఒకరు దీంతో పోలిన లక్షణాలతో బాధపడుతుండటం గమనార్హం. జీర్ణాశయంలోంచి ఎంత వేగంగా ఆహారం బయటకు వెళ్తుందో లెక్కించటం ద్వారానే సమస్యను తెలుసుకోవటం సాధ్యమవుతుంది.

లక్షణాలు ఇవీ..

- వికారం, వాంతి
- కొద్దిగా తినగానే కడుపు నిండినట్టు అనిపించటం
- కడుపు నొప్పి
- కడుపులో అసౌకర్యం

- జీర్ణాశయంలో పుండ్లు, అడ్డంకులు, వాపుప్రక్రియ వంటి ఇతరత్రా సమస్యలేవీ లేవని తేల్చుకున్న తర్వాతే గ్యాస్ట్రోపెరెసిస్‌ను నిర్ధారిస్తారు. పరీక్షల్లో ఇలాంటి సమస్యలు లేవని తేలినా కూడా ఎవరైనా ఈ లక్షణాలతో ఇబ్బంది పడుతుంటే గ్యాస్ట్రోపెరెసిస్ ఉండే అవకాశం ఎక్కువ.

కారణాలేంటి?

గ్యాస్ట్రోపెరెసిస్ గల చాలామందిలో ప్రత్యేకించి ఎలాంటి కారణమూ కనిపించదు. కానీ పేగుల కదలికల్లో పాలు పంచుకునే నాడులను దెబ్బతీసే జబ్బులు దీనికి దారితీయొచ్చు. వీటిల్లో అన్నింటికన్నా ముఖ్యమైంది నియంత్రణలో లేని మధుమేహం. రక్తంలో గ్లూకోజు ఎక్కువగా ఉండటం వల్ల వేగస్ నాడి వంటి నాడులు దెబ్బతింటాయి. జీర్ణాశయ కండరాలు సంకోచించేలా, వదులయ్యేలా చేసే.. అలాగే తిన్న తర్వాత కడుపు నిండిన భావన కలిగించే సంకేతాలను మెదడు, పేగుల మధ్య ప్రసారం చేసేది వేగస్ నాడే.

- పొరపాటున రోగనిరోధక వ్యవస్థ తమ మీదే దాడిచేసే సమస్యలు, నాడులను దెబ్బతీసే వైరల్ జబ్బులూ సమస్యకు దోహదం చేయొచ్చు.

జాగ్రత్తలు ఇవీ

గ్యాస్ట్రోపెరెసిస్‌తో పోషణ లోపం తలెత్తుతుంది. కొన్ని జాగ్రత్తలతో దీన్ని నివారించుకోవచ్చు.

- తక్కువ తక్కువగా ఎక్కువసార్లు తినాలి. కొవ్వు, పీచు పదార్థాలు తగ్గించుకోవాలి. ఆహారం పూర్తిగా ఉడికేలా వండుకోవాలి, బాగా నమిలి తినాలి.
- నీరు, ద్రవాహారం ఎక్కువగా తీసుకోవాలి.
- భోజనం చేశాక కాసేపు నడవాలి.
- తిన్న వెంటనే పడుకోకూడదు.
- కూల్‌డ్రింకులు, మద్యం మానెయ్యాలి.

కోరమాండల్ ఇంటర్నేషనల్ నుంచి కొత్త రకం ఎరువు

ఈనాడు, హైదరాబాద్: కోరమాండల్ ఇంటర్నేషనల్ నీటిలో సులువుగా కరిగిపోయే 'పెల్లెట్స్' ఎరువును తాజాగా విడుదల చేసింది. ఈ ఎరువును పైపైనే చల్లడం కాకుండా, నీటిలో కలిపి డ్రిప్, స్ప్రింక్లర్ ద్వారా అందించాలి. స్మార్ట్ సిగ్నలింగ్ టెక్నాలజీని ఇందులో వినియోగించినందున, పంటకు ఎరువు బాగా అందుతుందని కోరమాండల్ ఇంటర్నేషనల్ వివరించింది. పండ్లు, కూరగాయలు, విదేశాల్లో, తోటలకు ఈ ఎరువు అనుకూలమని పేర్కొంది. విశాఖపట్నం ప్లాంటు నుంచి ఈ 'పెల్లెట్స్' ఎరువు సరఫరాని ప్రారంభించింది.

బొండాడ ఇంజినీరింగ్‌కు రూ.945 కోట్ల కాంట్రాక్టు

ఈనాడు, హైదరాబాద్: ఎన్‌ఎల్‌సీ ఇండియా యొక్క అనుబంధ సంస్థ ఎన్‌ఎల్‌సీ ఇండియా రెన్యువబుల్స్ (ఎన్ఐఆర్ఎల్) నుంచి 810 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్రాజెక్టుకు సంబంధించిన బ్యాలెన్స్ ఆఫ్ సిస్టమ్ (బీఓఎస్) వర్క్స్ కాంట్రాక్టును హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న బొండాడ ఇంజినీరింగ్ దక్కించుకుంది. ఈ కాంట్రాక్టు విలువ రూ.945.10 కోట్లు. రాజస్థాన్‌లోని బికనీర్‌లో ఆర్‌వీయూఎన్ఎల్ సోలార్ పార్క్‌లో ఈ ప్రాజెక్టు వస్తోంది. ఈ పనులను 15 నెలల్లో పూర్తి చేసి, మూడేళ్ల పాటు బొండాడ ఇంజినీరింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. ఈ కాంట్రాక్టుతో, బొండాడ ఇంజినీరింగ్ చేతిలో సౌర విద్యుత్తు విభాగంలో 3 గిగావాట్ల ఈపీసీ ఆర్డర్లు ఉన్నట్లు అవుతోంది.

18 లక్షల ఐటీ ఉద్యోగాలొచ్చాయ్

2025లో 16% వృద్ధి: క్వెస్ కార్ప్



దేశీయ ఐటీ రంగంలో రికవరీ సంకేతాలు ప్రస్ఫుటమవుతున్నాయి. ఈ ఏడాదిలో నియామకాలు గతేడాది కంటే 16% పెరిగి, 18 లక్షలకు చేరుకున్నట్లు వర్క్‌ఫోర్స్ అండ్ టాలెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్ క్వెస్ కార్ప్ రూపొందించిన 'ఐటీ వర్క్‌ఫోర్స్ ట్రెండ్స్ ఇన్ ఇండియా 2025' నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు, మనదేశంలో నెలకొల్పిన గ్లోబల్ కేపబులిటీ కేంద్రాల (జీసీసీ) కోసం నిపుణులను అధికంగా ఎంపిక చేసుకున్నాయి. 2025 మొత్తం నియామకాల్లో జీసీసీల వాటాయే 27 శాతమని నివేదిక పేర్కొంది. 2024 నియామకాల్లో జీసీసీల వాటా 15 శాతమే.

✦ ప్రోడక్ట్, సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ (ఎస్ఏఏఎస్) సంస్థలు కూడా నియామకాలను పెంచాయి. అయితే ఐటీ సేవలు, కన్సల్టింగ్ నియామకాల్లో ఒక మోస్తరు వృద్ధి నమోదైంది. పెట్టుబడులు నెమ్మదించడంతో, ఆ ప్రభావం అంకుర నియామకాలపై పడింది. 2024తో పోల్చితే వీటిల్లో నియామకాల వృద్ధి ఒక అంకె స్థాయికి పరిమితమైంది.

✦ అధునాతన నైపుణ్యాలు నేర్చుకున్న అనుభవజ్ఞులకు, శరవేగంగా కొత్త ఉద్యోగాలు లభిస్తున్నాయి. మొత్తం నియామకాల్లో మధ్యస్థాయి వృత్తి నిపుణులు (4-10 ఏళ్ల అనుభవం)కే 65% లభించాయి. 2024లో వీరి వాటా 50 శాతమే. ప్రారంభ స్థాయి ఉద్యోగ నియామకాలు మొత్తం గిరాకీలో 15 శాతంగా ఉన్నాయి.

✦ కొత్త నియామకాల్లో కాంట్రాక్టు ఉద్యోగాలు 10-11 శాతంగా ఉన్నాయి. 2024లో ఇవి 8 శాతంగా ఉన్నాయి. ఐటీ రంగంలో కాంట్రాక్టు నియామకాలు క్రమంగా పెరుగుతున్నాయని ఇది సూచిస్తోంది.

✦ ఏఐ, క్లౌడ్, సైబర్ భద్రత, డేటా ఆధారిత ఉద్యోగాలు, బీఎఫ్ఎస్ఐ, ఎస్ఏఏఎస్, టెలికాం, తయారీ తదితర రంగాల్లో నియామకాలకు గిరాకీ బాగా పెరిగింది.

ఫాక్స్‌కాన్ 30,000 నియామకాలు

● గత 9 నెలల్లోనే ● అత్యధికం మహిళలే

ఐఫోన్ల తయారీ కోసం బెంగళూరు సమీపంలోని దేవనహళ్లి వద్ద, 300 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ప్లాంటులో నియామకాలను ఫాక్స్‌కాన్ వేగవంతం చేసింది. గత 8-9 నెలల్లోనే 30,000 మందిని నియమించుకున్నట్లు, వీరిలో 80% మంది మహిళలని సంబంధిత వర్గాలు తెలిపాయి. వీరిలో అధికులు 19- 24 ఏళ్ల వారే. ఈ ఏడాది ఏప్రిల్- మేలో ఐఫోన్ 16 టెస్టింగ్ ఉత్పత్తిని ఈ ప్లాంటులో ప్రారంభించారు. ఇప్పుడు ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ మోడళ్లను తయారు చేస్తున్నారు. ఇక్కడ తయారయ్యే ఐఫోన్లలో 80% ఎగుమతి చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. వచ్చే ఏడాదిలో ఉత్పత్తి సామర్థ్యం గరిష్ఠ స్థాయికి చేరితే, సిబ్బంది సంఖ్య 50,000కు చేరొచ్చు.

సిప్లా నుంచి పీల్చుకునే ఇన్సులిన్ పౌడర్

మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉపశమనం



ఈనాడు, హైదరాబాద్: అగ్రశ్రేణి ఫార్మా కంపెనీల్లో ఒకటైన సిప్లా లిమిటెడ్, పీల్చుకునే ఇన్సులిన్ పౌడర్‌ను విడుదల చేసింది. మధుమేహ వ్యాధితో ఇబ్బంది పడుతూ, ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకుంటున్న వారికి ఇది ఎంతో ఊరట కలిగించే అంశం. అఫ్రెజా పేరుతో ఇన్సులిన్ పౌడర్ విక్రయించడానికి ఈ కంపెనీ, గత ఏడాదిలో సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) నుంచి అనుమతి తీసుకోగా.. ఇప్పుడు దేశీయ మార్కెట్లో విడుదల చేసింది. మనదేశంలో 10 కోట్ల మంది మధుమేహ వ్యాధితో బాధపడుతున్నారని అంచనా.

వినియోగం సులభం: పీల్చుకునే ఇన్సులిన్ పౌడర్‌ను సింగిల్ డోస్ క్యాట్రిడ్జ్ రూపంలో అందిస్తున్నారు. ఇన్‌హేలర్ మాదిరిగా ఉన్న పరికరంలో అమర్చి, పీల్చుకోవాలి. ఆ తర్వాత ఇన్‌హేలర్ నుంచి క్యాట్రిడ్జ్‌ను తొలగించాలి. మధ్యాహ్న భోజనం తర్వాత, ఇన్సులిన్ పౌడర్ పీల్చుకుంటే మెరుగైన ఫలితాలు లభిస్తాయని కంపెనీ తెలిపింది.

కొత్త గృహ రుణాలపై వడ్డీ రేటు 7.15%

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్

దిల్లీ: ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కొత్త గృహ రుణాలపై వడ్డీ రేటును 7.15 శాతానికి తగ్గించింది. సవరించిన వడ్డీ రేట్లు ఈ నెల 22 నుంచి అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. ఈ నిర్ణయం గృహ కొనుగోలుదార్ల సెంటిమెంటును పెంచుతుందని వెల్లడించింది. ఆర్‌బీఐ ఇటీవల పరపతి విధాన సమీక్షలో కీలక రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన నేపథ్యంలో, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ కూడా రుణ రేట్లను సవరించింది.

ఈనాడు బిజినెస్

రూ.3,000 వరకు పెరగనున్న ఏథర్ స్కూటర్ల ధర



దిల్లీ: ఉత్పత్తి వ్యయాలు పెరగడంతో పాటు, డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ పతనమైన నేపథ్యంలో.. జనవరి 1 నుంచి తన స్కూటర్ల ధరలను రూ.3,000 వరకు పెంచనున్నట్లు విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ తెలిపింది. ప్రస్తుతం 450 సిరీస్ స్కూటర్లతో పాటు, ఫ్యామిలీ స్కూటర్ రిజ్టాను సంస్థ విక్రయిస్తోంది. వీటి ధరలు రూ.1,14,546 - 1,82,946 (ఎక్స్ షోరూం, దిల్లీ)గా ఉన్నాయి. ఎంపిక చేసిన నగరాల్లో 'ఎలక్ట్రిక్ డిసెంబర్' పేరిట అమలు చేస్తున్న పథకం ఈ స్కూటర్లపై రూ.20,000 వరకు ప్రయోజనాలు పొందొచ్చని కంపెనీ ప్రకటించింది.

సెన్సా కోర్‌కు రూ.645 కోట్ల పెట్టుబడి

ఈనాడు, హైదరాబాద్: వైద్య పరికరాల తయారీ కంపెనీ సెన్సా కోర్‌లో మోతీలాల్ ఓస్వాల్ ఆల్టర్నేటివ్స్ 72 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.645 కోట్లు) పెట్టుబడి పెట్టింది. 2006లో ఏర్పాటైన ఈ కంపెనీ ఇన్-విట్రో డయాగ్నస్టిక్ పరికరాల డిజైన్, అభివృద్ధి, ఉత్పత్తి, విక్రయాల్లో క్రియాశీలకంగా ఉంది. ఈ సంస్థ రూపొందించిన ఎలక్ట్రోలైట్ అనలైజర్లను 78 దేశాలకు ఎగుమతి చేస్తున్నారు కూడా. గ్లూకోమీటర్లు, హిమోగ్లోబిన్ మీటర్లు, ఆర్టీరియల్ బ్లడ్ గ్యాస్ అనలైజర్లనూ ఈ సంస్థ ఉత్పత్తి చేస్తోంది. హైదరాబాద్ శివార్లలోని పాశమైలారంలో ఒక యూనిట్ ఉండగా, సుల్తాన్‌పూర్‌లోని మెడికల్ డివైజెస్ పార్కులో రెండో యూనిట్ నెలకొల్పుతోంది.

అంబుజాలో ఏసీసీ, ఓరియంట్ సిమెంట్ విలీనం

దిల్లీ: అదానీ గ్రూపునకు చెందిన అంబుజా సిమెంట్స్‌లోకి దాని అనుబంధ సంస్థలైన ఏసీసీ, ఓరియంట్ సిమెంట్ విలీనం కానున్నాయి. ఈ విలీన ప్రతిపాదనకు అంబుజా సిమెంట్స్ బోర్డు సోమవారం ఆమోదం తెలిపింది. ప్రతిపాదిత విలీన పథకం కింద ఏసీసీ వాటాదార్లు, తమ వద్ద ఉన్న ప్రతి 100 షేర్లకుగాను 328 అంబుజా షేర్లను పొందుతారు. ఓరియంట్ సిమెంట్ వాటాదార్లకు వారి వద్ద ప్రతి 100 ఓరియంట్ షేర్లకుగాను 33 అంబుజా షేర్లు లభిస్తాయి.

న్యూజిలాండ్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయ్

దిల్లీ: అమెరికాతో ఆలస్యమవుతున్నా, పలు దేశాలతో వరుసపెట్టి వాణిజ్య ఒప్పందాలను మనదేశం కుదుర్చుకుంటోంది. జులైలో బ్రిటన్, ఈ నెల మొదట్లో ఒమన్‌తో సంతకాలు చేయగా, తాజాగా న్యూజిలాండ్‌తో ఒప్పంద సంప్రదింపులను మనదేశం పూర్తి చేసింది. భారత, న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి (ఎఫ్‌టీఏ) సంబంధించిన సంప్రదింపులు కొలిక్కి వచ్చాయని భారత ప్రధాని నరేంద్ర మోదీ, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సోమవారం ప్రకటించారు. 2026 ప్రథమార్ధంలో సంతకాలు జరగనున్న ఈ ఎఫ్‌టీఏ కింద వచ్చే 15 ఏళ్లలో భారత్‌లో 20 బి. డాలర్ల (సుమారు రూ.1.8 లక్షల కోట్ల) పెట్టుబడులను న్యూజిలాండ్ పెట్టనుంది.

ఇరుదేశాల మధ్య వస్తు, సేవల ద్వైపాక్షిక వాణిజ్యం 2024లో 2.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.21,600 కోట్ల) మేర జరిగింది. ఇందులో వస్తువుల వాటా 1.3 బి.డా. (సుమారు రూ.11,700 కోట్లు). ఎఫ్‌టీఏ కుదిరాక, అయిదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపై 5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.45,000 కోట్ల)కు చేరే అవకాశం ఉంది.

న్యూజిలాండ్‌కు ప్రయోజనాలివీ

ఉన్ని, బొగ్గు, కలప, వైన్, అవకాడో, బ్లూబెర్రీ వంటి 95% వస్తువులపై మనదేశం టారిఫ్‌ల రద్దు/ తగ్గింపు చేస్తుంది. అయితే మన రైతులు, పరిశ్రమ ప్రయోజనాలను కాపాడడానికి డెయిరీ ఉత్పత్తులు, చక్కెర, సుగంధ ద్రవ్యాలు, నూనెలు, రబ్బరు దిగుమతులపై మాత్రం ఎటువంటి మినహాయింపులూ ఇవ్వలేదు.

✦ కొన్ని వ్యవసాయ వస్తువులకు కోటా, కనీస దిగుమతి ధర(ఎమ్ఐపీ)తో భారత్ సుంకం మినహాయింపులివ్వనుంది. ఇందులో మనూకా తేనె, యాపిళ్లు, కివీ పళ్లు, ఆల్బుమిన్ వంటివి ఉన్నాయి.

✦ భారత్‌లో న్యూజిలాండ్ కంపెనీలు డెయిరీ ముడి పదార్థాలను ప్రాసెస్ చేసి, తిరిగి 100% వస్తువులను ఎగుమతి చేయడానికి అనుమతినిచ్చామని వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ తెలిపారు.

మనకు లాభాలివీ..

తయారీ, మౌలిక వసతులు, సేవలు, ఆవిష్కరణలు, ఉపాధికి మద్దతు ఇస్తూ న్యూజిలాండ్ 20 బి. డాలర్ల పెట్టుబడులను పెట్టనుంది. ఇది విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి మాత్రమేనని, ఎఫ్‌పీఐ/ఎఫ్ఐఐ నుంచి వచ్చేది కాదని తెలిపింది.. ఔషధాలు, వైద్య పరికరాలకు అనుమతులు వేగవంతమవుతాయి.

అమెరికాతో ముందస్తు దశలో

అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముందస్తు దశలో ఉన్నట్లు పీయూశ్ గోయల్ ఈ సందర్భంగా ప్రకటించారు. కెనడాతో చర్చలను తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపారు.



ఏటా 5,000 వీసాలు

భారతీయ వృత్తి నిపుణులకు న్యూజిలాండ్ తాత్కాలిక ఎంప్లాయ్‌మెంట్ ఎంట్రీ వీసాను అందించనుంది. మూడేళ్ల పాటు ఆ దేశంలో నివసించడానికి ఏటా 5000 వీసాలను జారీ చేయనుంది. ఆయుశ్ ప్రాక్టీషనర్లు, యోగా ఇన్‌స్ట్రక్టర్లు, చెఫ్‌లు, సంగీత అధ్యాపకులతో పాటు ఐటీ, ఇంజినీరింగ్, విద్య, నిర్మాణ, ఆరోగ్య సంరక్షణ రంగాల నిపుణులకూ వీటిని ఇవ్వనున్నారు.

గ్రాన్యూల్స్ ఔషధానికి అమెరికాలో అనుమతి

ఈనాడు, హైదరాబాద్: గ్రాన్యూల్స్ ఇండియా అనుబంధ సంస్థ అయిన గ్రాన్యూల్స్ ఫార్మాస్యూటికల్స్ ఇంక్., యాంఫెటమైన్ ఈఆర్ (ఎక్స్టెంటెడ్ రిలీజ్) ట్యాబ్లెట్‌కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి తాత్కాలిక అనుమతి పొందింది. అయితు బయోఫార్మాకు చెందిన అడ్జెనిస్ ఎక్ఆర్-ఓడీటీ అనే బ్రాండుకు ఇది జనరిక్ ఔషధం. ఇది కేంద్ర నాడీ వ్యవస్థ విభాగానికి చెందిన మందు. దీన్ని ఏడీహెచ్‌డీ (అటెన్షన్ డెఫిసిట్ హైపరాక్టివిటీ డిజార్డర్) వ్యాధి చికిత్సలో వినియోగిస్తున్నారు. అమెరికాలో ఏటా 172 మిలియన్ డాలర్ల (సుమారు రూ.1,500 కోట్ల) అమ్మకాలను ఈ మందు నమోదు చేస్తోంది. ప్రస్తుతం అమెరికాలో ఒక జనరిక్ ఔషధం, మరొక ఆథరైజ్డ్ జనరిక్ మందు మాత్రమే ఇలాంటివి అందుబాటులో ఉన్నాయి. అందువల్ల తమ ఔషధానికి అమ్మకాలు ఆకర్షణీయంగా ఉంటాయని గ్రాన్యూల్స్ ఫార్మా ఆశాభావంతో ఉంది.

కోడి గుడ్లు

23న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	675
వరంగల్	677
విజయవాడ	720
తూ/ప గోదావరి	695
విశాఖపట్నం	702
చిత్తూరు	703

బెర్జర్ పెయింట్స్‌లో యూకే పెయింట్స్‌కు మరో 14% వాటా

అంతర్గత పునర్వ్యవస్థీకరణ ద్వారా బెర్జర్ పెయింట్స్ ఇండియాలో మరో 14.48% వాటాను కొనుగోలు చేయనున్నట్లు ప్రమోటర్ గ్రూప్ సంస్థ యూకే పెయింట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ప్రకటించింది. డిసెంబరు 29న లేదా ఆ తర్వాత జెన్సన్ అండ్ నికోల్సన్ (ఏషియా) నుంచి ఈ వాటాకు సమానమైన 16,87,88,138 షేర్లను కొనుగోలు చేయనుంది. ఈ లావాదేవీ పూర్తయితే బెర్జర్ పెయింట్స్‌లో యూకే పెయింట్స్ వాటా 50.09% నుంచి 64.57 శాతానికి పెరగనుంది.

జపాన్ సంస్థ చిప్‌సెట్ల తయారీకి టాటా ఎలక్ట్రానిక్స్ ఒప్పందం

భారత, విదేశీ మార్కెట్ల కోసం భారత్‌లో ఎలక్ట్రానిక్స్ చిప్‌సెట్లు ఉత్పత్తి చేసేందుకు టాటా ఎలక్ట్రానిక్స్‌తో వ్యూహాత్మక ఒప్పందాన్ని జపాన్ సెమీకండక్టర్ కంపెనీ ఆర్ఓహెచ్ఎం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఆర్ఓహెచ్ఎం, టాటా ఎలక్ట్రానిక్స్ కలిసి మనదేశంలో పవర్ సెమీకండక్టర్ల తయారీ కోసం ప్లాంట్ ఏర్పాటు చేయనున్నాయి. భారత్ కోసం ఆర్ఓహెచ్ఎం రూపొందించిన ఆటోమోటివ్ గ్రేడ్ ఎన్‌సీహెచ్ 100వి, 300 ఏ ఎస్ మోస్‌ఫెట్ చిప్‌సెట్లను అసెంబ్లింగ్ చేసి, టాటా ఎలక్ట్రానిక్స్ పరీక్షిస్తుంది. వచ్చే ఏడాదిలో ఈ చిప్‌సెట్ల వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించాలనేది లక్ష్యం.

అపోలో మైక్రోసిస్టమ్స్‌కు డీఆర్‌డీఓ సాంకేతికత

ఈనాడు, హైదరాబాద్: డీఆర్‌డీఓ (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) రెండు కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అపోలో మైక్రోసిస్టమ్స్‌కు బదిలీ చేయనుంది. ఇందులో ఒకటైన మల్టీ-ఛానల్ 10 కేడబ్ల్యూ లేజర్ డీఈడబ్ల్యూ సిస్టమ్స్ పరిజ్ఞానాన్ని హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓ ల్యాబ్ అయిన సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్ (ఛెస్) నుంచి బదిలీ చేస్తారు. రెండోది, ఈఓ ట్రాకింగ్ సిస్టమ్ విత్ ఈఓ సెన్సర్స్ ఫర్ డీఈడబ్ల్యూ టెక్నాలజీ. డెహ్రాడూన్‌లోని డీఆర్‌డీఓ ల్యాబ్, ఇన్‌స్ట్రుమెంట్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఆర్‌డీఈ) నుంచి బదిలీ చేస్తారు. దీనివల్ల రక్షణ ఉత్పత్తుల విభాగంలో క్రియాశీలక పాత్ర పోషించే అవకాశం లభిస్తుందని అపోలో మైక్రోసిస్టమ్స్ ఎండీ కరుణాకర్ రెడ్డి వివరించారు.

ఎయిర్ ట్యాక్సీ సేవల్లో మరో ముందడుగు



ముంబయి: దేశంలో 2028 కల్లా విద్యుత్తు ఎయిర్ ట్యాక్సీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేసుకుంటున్న ఏవియేషన్ అంకుర సంస్థ సార్లా ఏవియేషన్, ఇందుకు అవసరమైన భౌతిక పరీక్షలను బెంగళూరులోని తన తయారీ కేంద్రంలో జరుపుతున్నట్లు సోమవారం తెలిపింది. ఎయిర్ ట్యాక్సీ సేవలకు శ్రీకారం చుట్టేందుకు, ఇది కీలక ధ్రువీకరణ దశ అని వెల్లడించింది. ఇప్పటివరకు డిజిటల్ కాన్సెప్ట్లు, ప్రయోగశాలలో మాత్రమే ఎయిర్‌ట్యాక్సీని పరిశీలించారు. తన ప్రోటోటైప్ ఎయిర్ ట్యాక్సీ శూన్యను ఈ ఏడాది జనవరిలో ఆవిష్కరించిన సంస్థ, ఇప్పుడు 7.5 మీటర్ల వింగ్ స్పాన్ కలిగిన ఇవిటోల్ డిమాన్‌స్ట్రేటర్ సైల ఎస్‌వైఎల్-ఎక్స్1ను పరీక్షించడం ద్వారా, ఈ రంగంలో ముందడుగు వేసిన అతికొద్ది దేశాల సరసన మనదేశం నిలిచినట్లయ్యింది. ఈ వాహన నిర్మాణం ఎలా ఉంది, ప్రొపల్షన్ ఇంటెగ్రేషన్, భద్రతా ప్రమాణాలు ఎలా ఉన్నాయో దీని ద్వారా పరీక్షిస్తున్నారు.

నెమ్మదించిన కీలక రంగాల వృద్ధి

నవంబరులో 1.8%

దిల్లీ: దేశంలో 8 కీలక మౌలిక రంగాల వృద్ధి నవంబరులో నెమ్మదించింది. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, పెట్రోలియం, రిఫైనరీ ఉత్పత్తులు, విద్యుత్, ఎరువులు, ఉక్కును కీలక రంగాలుగా వ్యవహరిస్తారు. 2024 నవంబరులో ఈ రంగాల వృద్ధి 5.8% కాగా, గత నెలలో 1.8 శాతానికి పరిమితమైంది. ముడి చమురు, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, విద్యుత్ రంగాల వృద్ధి తగ్గడమే ఇందుకు కారణమని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది అక్టోబరులో ఈ రంగాల వృద్ధి ప్రతికూలంగా (-0.1%) నమోదైంది. దీంతో పోల్చితే మాత్రం నవంబరులో ఈ రంగాల పనితీరు మెరుగైనట్లే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబరులో 8 కీలక రంగాల వృద్ధి 2.4 శాతంగా నమోదైంది. 2024-25 ఇదే కాలంలోని 4.4% వృద్ధితో పోలిస్తే ఇది తక్కువే.

కొత్త సిరీస్‌లో ద్రవ్యోల్బణం, జీడీపీ, ఐఐపీ గణాంకాలు: రిటెయిల్ ద్రవ్యోల్బణం, జీడీపీ, పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)గణాంకాలను కొత్త సిరీస్‌లో ప్రభుత్వం విడుదల చేయబోతోంది. ఈ గణాంకాల లెక్కింపునకు ఆధారంగా తీసుకునే సంవత్సరాలను (బేస్ ఇయర్) మార్పు చేస్తుండటమే ఇందుకు కారణం. కొత్త ఆధారిత సంవత్సరాలతో వినియోగ ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (రిటెయిల్ ద్రవ్యోల్బణం), నేషనల్ అకౌంట్స్ గణాంకాలను 2026 ఫిబ్రవరి నుంచి, ఐఐపీ గణాంకాలను 2026 మే నుంచి విడుదల చేస్తామని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. 2024 బేస్ ఇయర్‌తో కొత్త సిరీస్‌లో రిటెయిల్ ద్రవ్యోల్బణ గణాంకాలను ఫిబ్రవరి 12న; 2022-23 ఆర్థిక సంవత్సరాన్ని బేస్ ఇయర్‌గా చేసుకుని నేషనల్ అకౌంట్స్ గణాంకాలను 2026 ఫిబ్రవరి 27న ప్రభుత్వం విడుదల చేయనుంది. 2022-23 బేస్ ఇయర్‌గా కొత్త సిరీస్‌లో ఐఐపీ గణాంకాలు మే 28న ప్రకటించనుంది.



ఎంయూఎఫ్‌జీ పెట్టుబడితో 31 శాతానికి శ్రీరామ్ ఫైనాన్స్ మూలధన నిష్పత్తి



దేశీయ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) శ్రీరామ్ ఫైనాన్స్‌లో 20% వాటాను, జపాన్‌కు చెందిన మిత్సుబిషి యూఎఫ్‌జే ఫైనాన్షియల్ గ్రూప్ ఇంక్ (ఎంయూఎఫ్‌జీ) కొనుగోలు చేయబోతోంది. ఈ లావాదేవీ విలువ రూ.39,618 కోట్లు (సుమారు 4.4 బిలియన్ డాలర్లు). ఈ లావాదేవీ కోసం ఎంయూఎఫ్‌జీ బ్యాంక్‌కు 47.11 కోట్ల షేర్లను, ఒక్కోటి రూ.840.93 చొప్పున కేటాయించనున్నట్లు శ్రీరామ్ ఫైనాన్స్ తెలిపింది. మిత్సుబిషి పెట్టుబడుల తరవాత శ్రీరామ్ ఫైనాన్స్ కనీస మూలధన నిష్పత్తి 31 శాతానికి చేరనుంది. 2025 సెప్టెంబరు ఆఖరుకు ఇది 20.68% వద్ద ఉంది. వివిధ రేటింగ్ ఏజెన్సీల నుంచి కంపెనీ రేటింగ్ కూడా పెరిగే అవకాశాలున్నాయి. ఏఏ+ నుంచి ఏఏఏకు రేటింగ్ మెరుగుపడితే, రుణ సమీకరణ వ్యయం 50-70 బేసిస్ పాయింట్లు తగ్గుతుందని అంచనా వేస్తున్నట్లు శ్రీరామ్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఉమేశ్ రేవంకర్ వెల్లడించారు. 3-4 ఏళ్లలో ఈ ప్రయోజనం కంపెనీకి లభిస్తుందని శ్రీరామ్ ఫైనాన్స్ ఎండీ, సీఈఓ పరాగ్ శర్మ తెలిపారు.

బ్యాంక్ లైసెన్సు కోసం దరఖాస్తు చేయం: ఈ లావాదేవీ పూర్తయితే శ్రీరామ్ ఫైనాన్స్ బోర్డులోకి ఎంయూఎఫ్‌జీ డైరెక్టర్లు ఇద్దరు వస్తారు. అనంతరమూ బ్యాంకింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసే ప్రణాళిక ఏదీ లేదని శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ స్పష్టత ఇచ్చింది. అయితే శ్రీరామ్ ఫైనాన్స్ అనుబంధ శ్రీరామ్ ఓవర్‌సీస్ ఇన్వెస్ట్‌మెంట్స్ మాత్రం ప్రాథమిక డీలర్ (పీడీ) లైసెన్స్ కోసం జనవరి మధ్యలో రిజర్వ్ బ్యాంకుకు దరఖాస్తు చేయనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

రెండేళ్లలో మరో 200 శాఖలు: వాణిజ్య వాహనాలు, ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాల కొనుగోలుకు; ఎంఎస్ఎంఈ సంస్థలకు శ్రీరాం ఫైనాన్స్ రుణాలిస్తోంది. పసిడి తనఖా - వ్యక్తిగత - వర్కింగ్ క్యాపిటల్ రుణాలూ అందిస్తున్న ఈ సంస్థకు 3,225 శాఖలున్నాయి. 78,833 మంది ఉద్యోగులు పని చేస్తుండగా, 96.6 లక్షల మంది ఖాతాదార్లకు సేవలు అందిస్తున్నామని.. ఏటా 100 శాఖల చొప్పున మరో రెండేళ్లలో 200 శాఖలను ప్రారంభించడం ద్వారా 3,000-5,000 మందికి ఉద్యోగాలు కల్పించాలనుకుంటున్నట్లు ఉమేశ్ వెల్లడించారు. వార్షిక ప్రాతిపదికన 20% రుణ వృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. జీఎస్‌టీ తగ్గాక, వాహన రుణాలు 20-25% వృద్ధి చెందాయని పేర్కొన్నారు.

ఈ వార్తల నేపథ్యంలో సంస్థ షేరు 3.70% పెరిగి రూ.935.10కి చేరింది.

ఎమ్‌క్యూర్ ఫార్మా నుంచి సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్

దిల్లీ: బరువు తగ్గించడానికి వీలుకల్పించే సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్‌ను 'పొవిట్జా' బ్రాండు పేరుతో మనదేశంలో ఎమ్‌క్యూర్ ఫార్మా విడుదల చేసింది. డెన్మార్క్ సంస్థ నొవో నార్డిస్క్‌కు చెందిన ఈ ఇంజెక్షన్‌ను విడుదల చేసిన తొలి దేశీయ ఫార్మా కంపెనీగా ఎమ్‌క్యూర్‌కు గుర్తింపు లభించింది. వారానికి ఒకసారి చేసుకునేలా, పెన్ను మాదిరిగా ఉండే ఇంజెక్షన్‌లో 0.25, 0.5, 1.0, 1.75 ఎంజీ డోసుల్లో ఈ మందు లభిస్తోంది. నాలుగు వారాల డోసు ధర రూ.8,790 నుంచి ఉంటుంది.

కెనరా బ్యాంక్ కొత్త ఎండీ, సీఈఓగా బ్రిజేశ్ కుమార్!



దిల్లీ: ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ కొత్త మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), సీఈఓగా బ్రిజేశ్ కుమార్ సింగ్ పేరును ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) సోమవారం సిఫారసు చేసింది. ప్రస్తుతం ఇండియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బ్రిజేశ్ పనిచేస్తున్నారు. కెనరా బ్యాంక్ ప్రస్తుత ఎండీ, సీఈఓ కె.సత్యనారాయణ రాజు ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. ఈ పదవికి పోటీపడిన 17 మందిని ఇంటర్వ్యూ చేసిన ఎఫ్ఎస్ఐబీ, బ్రిజేశ్ పేరును సిఫారసు చేసింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని మంత్రివర్గ నియామకాల సంఘం దీనిపై తుది నిర్ణయం తీసుకోనుంది.

రూ.4.10 లక్షల కోట్ల లాభం

సెన్సెక్స్ ▲ 638	నిఫ్టీ ▲ 206
85567	26172

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.457 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.4058 కోట్లు



సానుకూల విదేశీ సంకేతాల మద్దతుతో సోమవారం దేశీయ సూచీలు పరుగులు తీశాయి. ద్రవ్యోల్బణం అంచనా కంటే తక్కువగా నమోదైనందున, అమెరికా ఫెడరల్ రిజర్వ్ మరిన్ని రేట్ల కోతలు విధించొచ్చన్న అంచనాలు కలిసొచ్చాయి. ఐటీ, వాహన, లోహ షేర్లు కళకళలాడాయి. దీంతో నిఫ్టీ మళ్లీ 26,100 పాయింట్ల ఎగువకు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి పైసా తగ్గి 89.68 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.86% లాభంతో 60.99 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా సూచీలు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.4.10 లక్షల కోట్లు పెరిగి రూ.475.32 లక్షల కోట్లు (5.31 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 216 పాయింట్ల (క్రితం ముగింపు 84,929.36) లాభంతో 85,145.90 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. కొనుగోళ్ల మద్దతుతో రోజంతా అదే జోరు కొనసాగించిన సూచీ, ఇంట్రాడేలో 85,601.33 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 638.12 పాయింట్ల లాభంతో 85,567.48 వద్ద ముగిసింది. నిఫ్టీ 206 పాయింట్లు పెరిగి 26,172.40 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 26,047.80- 26,180.70 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 25 రాణించాయి. ట్రెంట్ 3.56%, ఇన్ఫోసిస్ 3.06%, భారతీ ఎయిర్‌టెల్ 2.43%, టెక్ మహీంద్రా 2.09%, హెచ్‌సీఎల్ టెక్ 1.67%, బీఈఎల్ 1.57%, సన్‌ఫార్మా 1.50%, మారుతీ 1.32% లాభపడ్డాయి. ఎస్‌బీఐ, కోటక్ బ్యాంక్, ఇండిగో, ఎల్ అండ్ టీ 0.60% వరకు నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. ఐటీ 1.99%, ఫోకస్డ్ ఐటీ 1.72%, యంత్ర పరికరాలు 1.65%, పరిశ్రమలు 1.33%, లోహ 1.32%, కమొడిటీస్ 1.05% పెరిగాయి. బీఎస్ఈలో 2768 షేర్లు లాభపడగా, 1551 స్క్రిప్‌లు నష్టపోయాయి. 194 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

✦ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహా వివిధ ప్రాజెక్టుల కోసం ప్రస్తుతం నడుస్తున్న బిడ్లలో పాల్గొనేందుకు దిల్లీ హైకోర్టు తమను అనుమతించిందని కేఈసీ ఇంటర్నేషనల్ వెల్లడించింది.

✦ దక్షిణాఫ్రికా సంస్థ ట్వీజ్జాను స్థానిక అనుబంధ సంస్థ ది బెవరేజెస్ కంపెనీ ప్రొప్రైటరీ లిమిటెడ్ (బెవ్కో) ద్వారా రూ.1118.7 కోట్లకు కొనుగోలు చేయడం పూర్తి చేసినట్లు వరుణ్ బెవరేజెస్ తెలిపింది.

✦ పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌కు యూఏఈలోని అనుబంధ సంస్థ అయిన **పేటీఎం అరబ్ ఎమిరేట్స్‌**లో 49% వాటాను అబుదాబీకి చెందిన అబ్బుర్ గ్లోబల్ ఆపర్చునిటీస్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు (ఏజీఓహెచ్‌ఎల్) రూ.19 కోట్లకు సంస్థ విక్రయించింది.

✦ ఈ ఏడాదిలో భారత స్థిరాస్తి రంగంలోకి సంస్థాగత మదుపర్ల పెట్టుబడులు 17% పెరిగి 10.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.93,600 కోట్ల)కు చేరినట్లు స్థిరాస్తి కన్సల్టెంట్ సంస్థ **జేఎల్ఎల్ ఇండియా** అంచనా వేసింది.


ఐపీఓ సమాచారం..

✦ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా రూ.600 కోట్లు సమీకరించేందుకు అనుమతి కోరుతూ, సెబీ వద్ద ముసాయిదా పత్రాలను పంట సొల్యూషన్స్ సంస్థ క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ దాఖలు చేసింది.

✦ గుజరాత్ కిడ్నీ అండ్ సూపర్ స్పెషాలిటీ ఐపీఓ మొదటి రోజున 1.47 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,32,26,880 షేర్లను ఆఫర్ చేయగా, 1,94,25,792 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ విభాగంలో 4.69 రెట్ల స్పందన వచ్చింది.


ఈనాడు సినిమా

బండెడు అన్నం తిని.. కుండెడు రక్తం తాగే రాచ్చసుడు


విజయ్ దేవరకొండ

"కళింగ పట్నంలో ఇంటికొకరు నేను రౌడీనని చెప్పుకు తిరుగుతారు. కానీ, ఇంటిపేరునే రౌడీగా మార్చుకున్నోడు ఒక్కడే ఉన్నాడు.. జనార్దన.. రౌడీ జనార్దన" అంటూ శత్రుమూకలపై కత్తి దూస్తున్నారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రవి కిరణ్ కోలా తెరకెక్కిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. కీర్తి సురేశ్ కథానాయిక. ఈ సినిమాకి 'రౌడీ జనార్దన' అనే పేరును ఖరారు చేస్తూ సోమవారం హైదరాబాద్‌లో టైటిల్ గ్లింప్స్‌ని విడుదల చేశారు. 'బండెడు అన్నం తిని.. కుండెడు రక్తం తాగే రాచ్చసుడి గురించి విన్నావా' అంటూ విజయ్ డైలాగ్‌తో మొదలైన గ్లింప్స్ ఆద్యంతం యాక్షన్ కోణంలో ఆసక్తికరంగా సాగింది. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. "విజయ్ దేవరకొండ ఇప్పటివరకూ విభిన్నమైన సినిమాలు చేస్తూ వచ్చాడు. కానీ, ఇలాంటి పూర్తి స్థాయి మాస్ పాత్ర ఇంత వరకు చేయలేదు. తొలిసారి ఈ సినిమాలో తనతో తూర్పు గోదావరి యాసలో మాట్లాడిస్తున్నాం. ఈ కథ విన్నప్పుడే నాకు చాలా వినూత్నంగా అనిపించింది. 80వ శకం నేపథ్యంలోని ప్రపంచాన్ని మా సాంకేతిక నిపుణులంతా అద్భుతంగా పునఃసృష్టించారు. దర్శకుడు రవికిరణ్ విజన్‌లోని కొత్తదనాన్ని తెరపైకి తీసుకొచ్చేందుకు చిత్ర బృందమంతా కష్టపడుతోంది. ఈ సినిమాని వచ్చే ఏడాది డిసెంబరులో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. 'టైటిల్ గ్లింప్స్ అందరికీ నచ్చిందనుకుంటున్నా. ఈ కథ చెప్పిన కొద్దిసేపటికే విజయ్ ఆ పాత్రలా మాట్లాడటం, రౌడీ జనార్దనలా ప్రవర్తించడం మొదలు పెట్టేశారు. ఈ కథ ఎంత బాగుందో.. విజయ్ తూర్పు గోదావరి యాసలో మాట్లాడుతుంటే అంతే బాగుంది" అన్నారు దర్శకుడు రవికిరణ్ కోలా. ఈ కార్యక్రమంలో శిరీష్, డినో శంకర్, ఆనంద్ సి చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటకు మళ్లీ సిద్ధం



"నేస్తుడు, హంతకుడు, మోసగాడు, హీరో, తండ్రి, అమాయకుడు.. ఇలా ప్రపంచం నన్ను అనేక పేర్లతో పిలుస్తుంది. కానీ నాకు వాటితో అవసరం లేదు"ని అంటున్నారు అజయ్ దేవగణ్. మరి ఆయనను పలు పేర్లతో పిలవడానికి కారణమేంటో తెలుసుకోవాలంటే 'దృశ్యం 3' చూడాల్సిందే. ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న 'దృశ్యం' ఫ్రాంఛైజీలో రాబోతున్న చివరి భాగమిది. అభిషేక్ పాఠక్ తెరకెక్కిస్తున్నారు. శ్రియ, టబు, రజత్ కపూర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను వచ్చే ఏడాది అక్టోబర్ 2న విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఇన్‌స్టా వేదికగా ఓ వీడియోను పంచుకుంది చిత్రబృందం. ఈ వీడియోలో "కథ ఇంకా ముగియలేదు.. ఆట తిరిగి ప్రారంభం కానుంది" అంటూ అజయ్ చెప్పిన సంభాషణలు ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుగుతోందని, త్వరలో ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

ఓటీటీలో ఈ వారం

చూస్తుండగానే మరో వారం రానే వచ్చింది. మరి కొత్త కథల సంగతులేంటో తెలుసుకోవాలి కదా! ఈ వారాంతం అలరించడానికి ఎలాంటి సినిమాలు, సిరీస్‌లు రాబోతున్నాయో అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినీప్రియుల కోసం మళ్లీ నాన్‌స్టాప్‌గా వినోదాలు పంచడానికి సిద్ధంగా ఉన్నాయి ఓటీటీలు.

గుడ్‌బై జూన్(సినిమా)	బుధవారం	నెట్‌ఫ్లిక్స్
నిధియుమ్ భూతవుమ్ (సినిమా)	బుధవారం	సన్‌నెక్ట్స్
హ్యాపీ అండ్ యూ నో ఇట్(సినిమా)	గురువారం	జియోహాట్‌స్టార్
ఇతిరి నేరం(సినిమా)	గురువారం	సన్‌నెక్ట్స్
కోపెన్‌హగన్ టెస్ట్ (సిరీస్)	శనివారం	జియోహాట్‌స్టార్

రీటా రాక



'రివాల్వర్ రీటా'లో తుపాకీ చేతపట్టి ప్రేక్షకుల్ని అలరించింది కథానాయిక కీర్తి సురేశ్. ఈ మహిళా ప్రాధాన్య చిత్రానికి జేకే చంద్రు దర్శకత్వం వహించారు. ఇటీవలే థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా శుక్రవారం నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది. సాధారణ జీవితం గడుపుతున్న ఓ అమ్మాయి అనుకోని పరిస్థితుల్లో తుపాకీ చేతపట్టాల్సి వచ్చింది. ఆ తర్వాత ఆమె ఎలాంటి సవాళ్లు ఎదుర్కొందనే కథాంశంతో దీన్ని తీర్చిదిద్దారు. ఇందులో రీటా పాత్రలో తనదైన నటనతో సినీప్రియుల్ని ఆకట్టుకుంది కీర్తి. కామెడీ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో రాధికా శరత్‌కుమార్, సునీల్, అజయ్ ఘోశ్ కీలక పాత్రలు పోషించారు.

ఓ అభిమాని బయోపిక్



"పిచ్చి కాదు.. అభిమానమండీ ఇది" అంటూ ఇటీవలే 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించారు కథానాయకుడు రామ్ పోతినేని. ఆయన హీరోగా పి.మహేశ్‌బాబు దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ఉపేంద్ర కీలక పాత్ర పోషించారు. ఓ హీరో అభిమానిగా కనిపించిన రామ్ నటన సినీప్రియుల్ని మెప్పించింది. ఇప్పుడీ చిత్రం గురువారం నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా రాబోతుంది. "మన సెలబ్రిటీల బయోపిక్‌లు చూశాం. ఇప్పుడు ఒక అభిమాని బయోపిక్ చూడాల్సిన సమయం వచ్చింది'' అంటూ ఆకట్టుకుంటోన్న ఈ సినిమా కథేంటో మీరూ చూసేయ్యండి.


తమన్, ప్రియదర్శి, ఆది, అర్చన అయ్యర్, కిరణ్ అబ్బవరం, అనిల్ రావిపూడి

నా పేరు నిలబెడతాడు ఆది

- సాయికుమార్

"థియేటర్లలో 'శంబాల' చిత్రాన్ని చూసి అందరూ ఆశ్చర్యపోతార"న్నారు ఆది సాయికుమార్. ఈ సినిమాతో ఈ క్రిస్మస్‌కు తాము హిట్టు కొట్టబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని యుగంధర్ ముని తెరకెక్కించారు. రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మించారు. అర్చన అయ్యర్ కథానాయిక. స్వసిక, రవివర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. హీరోలు కిరణ్ అబ్బవరం, మంచు మనోజ్, ప్రియదర్శి, దర్శకుడు అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు తమన్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. "హిట్లు కొట్టడం ఒకెత్తైతే.. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడం మరొకెత్తు అని ఆదిని చూస్తే అర్థమైంది. ఈ చిత్రంతో తను విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నా" అన్నారు కిరణ్ అబ్బవరం. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. "ఆది అద్భుతమైన నటుడు. తనిప్పటి వరకు ఎన్నో జానర్లు ప్రయత్నించాడు. ఈ 'శంబాల'తో చక్కటి విజయం దక్కాలని కోరుకుంటున్నా" అన్నారు. హీరో ఆది సాయికుమార్ మాట్లాడుతూ.. "దుల్కర్ సల్మాన్ విడుదల చేసిన టీజర్, ప్రభాస్, నాని విడుదల చేసిన ట్రైలర్లు మా సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. యుగంధర్ ముని దీన్ని అద్భుతంగా తెరకెక్కించాడు కాబట్టే ఈరోజు ఈ చిత్రంపై ఇంతటి అంచనాలేర్పడ్డాయి. నాన్న నేను హిట్టు కొట్టాలని ఎంతగానో ఎదురు చూస్తున్నారు. తప్పకుండా ఈ సినిమాతో హిట్టు కొడుతున్నాం" అన్నారు. "ఈ చిత్రంతో నా పేరుని.. అభిమానుల పేరుని ఆది ఈసారి నిలబెడతాడు. ఈ సినిమాతో తనకు చిత్రోత్సాహం, నాకు పుత్రోత్సాహం, చిత్ర బృందానికి విజయోత్సాహం రావాలని కోరుకుంటున్నా" అన్నారు నటుడు సాయికుమార్. ఈ కార్యక్రమంలో టీజీ విశ్వప్రసాద్, నవీన్ యెర్నేని, యుగంధర్ ముని, మహీధర్, రాజశేఖర్, శ్రీచరణ్ పాకాల, అశ్విన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నారీ నారీ.. నవ్వుల మురారి


సాక్షి వైద్య, శర్వానంద్, సంయుక్త

ఈ సంక్రాంతికి 'నారీ నారీ నడుమ మురారి' చిత్రంతో థియేటర్లలో సందడి చేయనున్నారు శర్వానంద్. ఆయన హీరోగా నటించిన ఈ సినిమాని రామ్ అబ్బరాజు తెరకెక్కించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య కథానాయికలు. వచ్చే ఏడాది జనవరి 14న సాయంత్రం నుంచి ప్రీమియర్ షోలతో ఈ చిత్ర సందడి మొదలు కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్ విడుదల చేశారు. "పెళ్లి కూతుర్ని తీసుకురావడానికి వెళ్తున్నాను" అంటూ శర్వానంద్ చెప్పే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. ఒకే ఆఫీస్‌లో ఉంటూ ఇటు ప్రేమించి పెళ్లి చేసుకోబోయే అమ్మాయికి.. అటు మాజీ ప్రేయసికి మధ్య నలిగిపోయే కుర్రాడిగా శర్వా పాత్రని తీర్చిదిద్దిన తీరు ఆసక్తిరేకెత్తించింది. మరి వాళ్లిద్దరితో తనెలాంటి తిప్పలు పడ్డాడు? ఆఖరికి ఎవర్ని పెళ్లి చేసుకున్నాడు? తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ.. "ఈ సినిమా పొట్ట పగిలి నవ్వేలా ఉంటుంది. దీన్ని అందరూ తప్పకుండా థియేటర్లలో చూడండి. చాలా ఎంజాయ్ చేస్తార"న్నారు. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్ర శేఖర్, కథ: భాను బోగవరపు, ఛాయాగ్రహణం: జ్ఞానశేఖర్ వీఎస్, యువరాజ్.

ఊహలకి అందని వృషభ


బలగం సంజయ్, సమర్జిత్ లంకేశ్, నయన్ సారిక, అలీ, బన్నీ వాస్

"'వృషభ' చాలా శక్తిమంతమైన సినిమా. తర్వాత ఏం జరుగుతుందన్నది అసలు ఊహించలేరు. క్లైమాక్స్ అదిరిపోయేలా ఉంటుంది'' అంది నటి నయన్ సారిక. మోహన్‌లాల్ కథానాయకుడిగా నటించిన ఈ పాన్ ఇండియా చిత్రంలో సారిక ఓ ముఖ్య పాత్ర పోషించింది. నంద కిశోర్ దర్శకత్వం వహించారు. కనెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్స్, అభిషేక్ ఎస్ వ్యాస్ స్టూడియోస్ సంస్థలు నిర్మించాయి. సమర్జిత్ లంకేశ్, రాగిణి ద్వివేది ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత బన్నీవాస్ మాట్లాడుతూ.. "భారీ బడ్జెట్‌తో నిర్మితమైన ఈ సినిమా తెలుగులోనూ చిత్రీకరణ చేసుకుంది. నిజానికిది రెండు నెలల క్రితమే విడుదల కావాల్సినప్పటికీ అనివార్య కారణాలతో వాయిదా పడింది. అందుకే ఇప్పుడు ముందుగా చేసుకున్న ఒప్పందం మేరకు ఇంత పోటీలోనూ విడుదల చేయాల్సి వస్తోంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో సమర్జిత్ లంకేశ్, బలగం సంజయ్, అలీ తదితరులు పాల్గొన్నారు.


అగస్త్య, సిమర్ భాటియా

ప్రేమా?.. కర్తవ్యమా?


కొత్త సంవత్సరంలో ప్రేక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమవుతోంది 'ఇక్కీస్' చిత్రం. అగస్త్య నంద, సిమర్ భాటియా ప్రధాన పాత్రలు పోషించిన చిత్రమిది. శ్రీరామ్ రాఘవన్ తెరకెక్కించారు. ధర్మేంద్ర నటించిన చివరి సినిమా ఇదే కావడం విశేషం. ఇటీవలే విడుదలైన ట్రైలర్, పాటలకు మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి 'ప్రేమనా..? కర్తవ్యమా..?' అనే వ్యాఖ్యతో ఇన్‌స్టా వేదికగా మరో పాటను విడుదల చేసింది చిత్రబృందం. 'తేరా ఆషిక్' అంటూ సాగుతున్న ఈ గీతం.. సైనికుడు తన కర్తవ్యం కోసం ప్రేమకు దూరంగా ఉండడం గురించి కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. చిన్న వయసులోనే పరమవీర చక్ర పురస్కారాన్ని అందుకున్న సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ జీవితాధారంగా దీన్ని రూపొందించారు. జనవరి 1న రానుందీ చిత్రం.

డిజిటల్ ఛార్జీలు చిన్న నిర్మాతలకు భారం

కిరణ్ హీరోగా ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఆర్యే దీక్ష'. అక్సాఖాన్, అలేఖ్య రెడ్డి కథానాయికలు. తులసి, రోహిత్ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర కొత్త పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. "ఎన్టీఆర్ 50ఏళ్ల క్రితం చేసిన 'దీక్ష' అనే టైటిల్‌తో మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు గర్వంగా ఉంది. దీంట్లో చాలా అద్భుతమైన అంశాలున్నాయి. ప్రస్తుతం చిన్న నిర్మాతలకు డిజిటల్ ఛార్జీలు మరింత భారంగా మారాయి. ఇదిలాగే కొనసాగితే సినిమాలు చేయడం కష్టం. ఈ చిత్రంతోనైనా ఆ ఛార్జీలు తగ్గించాలని కోరుకుంటున్నా'' అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు చిత్ర నిర్మాతల మండలి సెక్రటరీ టి.ప్రసన్న కుమార్, తులసి, అక్సాఖాన్, డీఎస్ రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రతాని రామకృష్ణ గౌడ్, అక్సాఖాన్

కొత్త చిత్రానికి శ్రీకారం


ఎల్బీ శ్రీరామ్

వినోద్ నువ్వుల హీరోగా నటిస్తూ.. స్వీయ నిర్మాణంలో ఓ చిత్రానికి శ్రీకారం చుట్టారు. దీన్ని తల్లాడ సాయి కృష్ణ దర్శకత్వ పర్యవేక్షణలో దర్శకుడు ప్రణయ్ రాజ్ వంగరి తెరకెక్కిస్తున్నారు. కిశోర్ దాస్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా ఇటీవల పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఎల్బీ శ్రీరామ్ క్లాప్ కొట్టగా.. సునీల్ కుమార్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేశారు. ''ఒక గురువుగా నా విద్యార్థుల ప్రతిభను వెండితెరపై చూపించాలనే ఉద్దేశంతో సొంత నిర్మాణ సంస్థను స్థాపించి.. ఈ చిత్రానికి శ్రీకారం చుట్టా. భవిష్యత్తులో మా బ్యానర్ నుంచి మరిన్ని సినిమాలొస్తాయి'' అన్నారు హీరో, నిర్మాత వినోద్ కుమార్ నువ్వుల. ఈ చిత్రానికి సంగీతం: లలిత్, ఛాయాగ్రహణం: నిక్కీ.

ఈ సినిమా చాలా పాజిటివ్


చిత్రబృందంతో మారుతి

"ఈనాటి ఆడపిల్లలు ఎలా ఉన్నారు.. వాళ్ల ఆలోచనా విధానం ఎలాగుంది.. వాళ్లేం కోరుకుంటున్నారు? అనే కాన్సెప్ట్‌తో తీసిన చిత్రం 'బ్యాడ్ గాళ్స్'' అన్నారు దర్శకుడు మారుతి. ఈ సినిమాతో దర్శకుడు ఫణి ప్రదీప్ ఒక మంచి విషయాన్ని కొత్తగా చెప్పే ప్రయత్నం చేశారని తెలిపారు. '30రోజుల్లో ప్రేమించటం ఎలా' అనే సినిమా తర్వాత ఫణి ప్రదీప్ నుంచి వస్తున్న కొత్త చిత్రమే 'బ్యాడ్ గాళ్స్'. రేణు దేశాయ్, అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మించారు. ఈ సినిమా ఈనెల 25న థియేటర్లలోకి రానున్న నేపథ్యంలో దర్శకుడు మారుతి ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఈ చిత్రం చాలా పాజిటివ్‌గా ఉంటుంది. ఆడవాళ్లకు ప్రాధాన్యతనిచ్చే ఈ సినిమా తప్పక ఆడాలి'' అన్నారు. 'ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిది. కథ, కథనాలు చాలా కొత్తగా ఉంటాయి'' అన్నారు దర్శకుడు ఫణి ప్రదీప్. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, ఛాయాగ్రహణం: ఆర్లి గణేశ్.


శివకార్తికేయన్, శ్రీలీల

ముందుగానే పరాశక్తి

సైన్యమై కదిలి రా.. అంటూ ఇటీవలే టీజర్‌తో 'పరాశక్తి' ప్రపంచాన్ని పరిచయం చేశారు హీరో శివకార్తికేయన్. ఆయన, శ్రీలీల జంటగా నటిస్తున్న చిత్రమిది. సుధా కొంగర దర్శకత్వం వహిస్తున్నారు. డాన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా జనవరి 14న తీసుకొస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించింది చిత్రబృందం. తాజాగా దీన్ని ఇంకాస్త ముందుగానే విడుదల చేస్తున్నట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకుంది చిత్రబృందం. ''మీరు ఊహించిన దానికంటే ముందే... 'పరాశక్తి' జనవరి 10న రాబోతుంద''నే వ్యాఖ్యను జోడించింది. ఈ చిత్రంలో రవి మోహన్, అథర్వ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

దిల్లీ హైకోర్టును ఆశ్రయించిన మాధవన్



డీప్‌ఫేక్ బారి నుంచి తమ వ్యక్తిగత హక్కులను కాపాడాలంటూ ఈ మధ్య కాలంలో పలువురు సినీతారలు కోర్టును ఆశ్రయిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ బాటలోనే నటుడు ఆర్.మాధవన్ దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా పలు వెబ్‌సైట్‌లు, ప్లాట్‌ఫామ్‌లు వాణిజ్య లాభం కోసం అతని పేరుని, ఫొటోలను వినియోగిస్తూ అసభ్యకర కంటెంట్‌ను సృష్టిస్తున్నాయని పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం.. సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన అశ్లీల కంటెంట్‌ను తొలగించాలని ఆదేశించింది. కృత్రిమ మేధను వినియోగించి 'కేసరి 3', 'షైతాన్ 2' లాంటి చిత్రాల ట్రైలర్‌లను కూడా సృష్టించినట్లు, ఆ సినిమాలు త్వరలో విడుదల కాబోతున్నాయని ప్రకటిస్తూ మాధవన్ పేరుతో పోస్ట్ చేశారని ఆయన తరఫున న్యాయవాది వాదించారు. "ఏఐ సమస్య గురించి మాకు స్పష్టంగా తెలియదు. దాని గురించి పరిశీలించే వరకు ఇప్పుడే ఆర్డర్లు ఇవ్వమ"ని న్యాయస్థానం పేర్కొంది.

ప్రతిక్షణం మనమేంటో గుర్తుచేస్తేనే...!


చిత్రాంగద

"చిత్రపరిశ్రమకు జ్ఞాపకశక్తి చాలా తక్కువ.. మీరు కొన్ని రోజులు కనిపించకపోతే మిమ్మల్ని మర్చిపోతార''ని అంటోంది బాలీవుడ్ నాయిక చిత్రాంగద సింగ్. మీరు చేసే పనిని, మీరేం చేయగలరో అనేది ఇక్కడ ప్రతిక్షణం ప్రేక్షకులకు గుర్తుచేస్తూనే ఉండాలని చెప్తోంది. ప్రస్తుతం అగ్రహీరో సల్మాన్ ఖాన్ సరసన 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'లో నటిస్తున్న కథానాయికీమె. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. తొలినాళ్లలో పెద్ద ప్రాజెక్టులకు నో చెప్పడం వల్ల అవకాశాలు ఎలా చేజారిపోయాయో పంచుకుంది. ''గ్యాంగ్స్ ఆఫ్ వాసేపూర్' సినిమాలో నటించే అవకాశాన్ని తిరస్కరించాను. 'తను వెడ్స్ మను'కి కూడా నో చెప్పాను. ఇది కంగనా కెరీర్‌లోనే మైలురాయిగా మారింది. ప్రారంభంలో చాలా మంది మాటలు విని ప్రాధాన్యం లేని చిత్రాల్ని ఎంపిక చేసుకున్నా. షారుక్ ఖాన్‌తో కలిసి 'చల్తే చల్తే' సినిమాలో నటించే అవకాశాన్ని చేజార్చుకున్నా. ఇలా నా ఆలోచనలకు కాకుండా వేరే వాళ్ల మాటలకు విలువ ఇచ్చి ఎన్నో గొప్ప చిత్రాల్ని తిరస్కరించాన''ని అంది చిత్రాంగద.

కరెంట్ అఫైర్స్



◆ భారత సుప్రీంకోర్టు ఎన్నో ప్రధాన న్యాయమూర్తిగా 2025, నవంబరు 24న జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపట్టారు? (2027, ఫిబ్రవరి 9 వరకు ఈయన పదవిలో కొనసాగుతారు. హరియాణా నుంచి సీజేఐ అయిన మొదటి వ్యక్తిగా ఘనత సాధించారు.) **జ:** 53వ

◆ దేశంలో ఏటా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను ఎప్పుడు నిర్వహిస్తారు?

మాదిరి ప్రశ్నలు

జ: అక్టోబరు 27 - నవంబరు 2 (సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (అక్టోబరు 31) సందర్భంగా ఏటా అక్టోబరు చివరి వారంలో ఈ వారోత్సవాలను నిర్వహిస్తారు.)

2025లో 'విజిలెన్స్: అవర్ షేర్డ్ రెస్పాన్సిబిలిటీ' అనే థీమ్‌తో నిర్వహించారు.)


◆ స్పెయిన్ వైమానిక దళం నిర్వహించిన 'ఓషన్ స్కై 2025 ఎక్సర్‌సైజ్'లో పాల్గొన్న మొదటి నాటోయేతర దేశంగా ఇటీవల ఏది ఘనత సాధించింది? (2025, అక్టోబరు 20 నుంచి 31 వరకు స్పెయిన్‌లోని కానరీ దీవుల్లోని గాండో ఎయిర్‌బేస్‌లో ఈ విన్యాసాలను నిర్వహించారు.) **జ:** భారత్

మరింత సమాచారం

◆ చైనా కొత్తగా అభివృద్ధి చేసిన ఏ హైస్పీడ్ రైలు పరీక్ష సమయంలో గంటకు 453 కి.మీ. వేగంతో ఇటీవల ప్రపంచ రికార్డు సృష్టించింది? **జ:** CR450

భూమి పొరల్లో సహజ శక్తి వనరులు!

ఆధునిక ప్రపంచంలో శక్తివనరులు లేకపోతే జీవుల మనుగడ సాధ్యం కాదు. శక్తిని అందించే వనరుల్లో సౌరశక్తి, జలశక్తి, బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు ముఖ్యమైనవి. అందులోనూ శిలాజ ఇంధనాల వినియోగం సంప్రదాయంగా సాగుతోంది. వాటి వాడకంతోనే పారిశ్రామిక విప్లవం మొదలైంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విద్యుత్తు ఉత్పత్తి, రవాణా, పరిశ్రమలు, వ్యవసాయం, గృహ అవసరాలను ప్రధానంగా శిలాజ ఇంధనాలే తీరుస్తున్నాయి. అయితే వాటి లభ్యత పరిమితం. అంతేకాకుండా అవి పర్యావరణ పరంగా హానికరమైనవి. ఈ నేపథ్యంలో భూమి అంతర పొరల నుంచి బొగ్గు, పెట్రోలియం ఉత్పన్నమయ్యే విధానం, శుద్ధి ప్రక్రియతో వచ్చే ఉపఉత్పత్తులు, వాటి ప్రయోజనాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరాన్నీ అర్థం చేసుకోవాలి.



నేల బొగ్గు, పెట్రోలియం

శిలాజ ఇంధన వినియోగం లేకుండా ఆధునిక జీవనాన్ని ఊహించడం సాధ్యం కాదు. నిత్య జీవితంలో ఉపయోగించే విద్యుత్తు వాహనాలు, వంట గ్యాస్, పరిశ్రమల ఉత్పత్తులన్నింటికీ ప్రధాన ఆధారం నేల బొగ్గు, పెట్రోలియం, సహజ వాయువులే. ప్లాస్టిక్, ఎరువులు, ఔషధాలు, వస్త్రాలు లాంటి అనేక పరిశ్రమలతో పాటు రోజువారీగా అవసరాలు తీర్చే ఉత్పత్తుల తయారీకి ఈ మూడు వనరులే ప్రధానాధారం. ప్రకృతిలో వివిధ వనరుల నుంచి ఉత్పన్నమయ్యే వాటిని సహజ వనరులు అంటారు. వీటి లభ్యత ఆధారంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

1) తరగని శక్తి వనరులు/సంప్రదాయేతర శక్తి వనరులు/పునర్వినియోగితమయ్యే వనరులు. 2) తరిగిపోయే శక్తి వనరులు/సంప్రదాయ శక్తి వనరులు/పునర్వినియోగితం కాని వనరులు.

జనరల్ స్టడీస్ - రసాయన శాస్త్రం

తరగని శక్తి వనరులు: మానవ కార్యకలాపాల కోసం ఎంత ఉపయోగించినప్పటికీ తరిగిపోనివే తరగని శక్తి వనరులు. ఇవి ప్రకృతిలో అపరిమితంగా ఉంటాయి.

ఉదా: సౌరశక్తి, జల శక్తి, పవన శక్తి, అలల శక్తి, భూగర్భ ఉష్ణ శక్తి, బయోగ్యాస్, బయోడీజిల్ మొదలైనవి.

సౌరశక్తి నుంచి సౌరవిద్యుత్తు, జల శక్తి - జల విద్యుత్తు, సముద్ర అలలు - టైడల్ పవర్, పవన శక్తి - పవన విద్యుత్తు, జంతువుల పేడ - బయోగ్యాస్, జట్రోఫా మొక్కల నుంచి బయోడీజిల్‌ను ఉత్పత్తి చేస్తారు. ఇవన్నీ కాలుష్యరహిత ఇంధనాలు.

తరిగిపోయే శక్తి వనరులు: మానవ కార్యకలాపాల వినియోగంతో తరిగిపోయేవి, తిరిగి ఉత్పత్తి చేయలేనివి 'తరిగిపోయే శక్తి వనరులు'.

ఉదా: నేల బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు.

శిలాజ ఇంధనాలు: ఇవి జీవుల మృతదేహాల అవశేషాల నుంచి తయారయ్యే ఇంధనాలు. భూమి లోపల అత్యధిక ఉష్ణోగ్రత, పీడనాల వద్ద ఏర్పడతాయి. శిలాజ ఇంధనం ఏర్పడేందుకు కొన్ని వేల సంవత్సరాలు పడుతుంది. నల్ల బంగారంగా పిలిచే బొగ్గు ఘనరూప శిలాజ ఇంధనం. పెట్రోలియం ద్రవరూప శిలాజ ఇంధనం. దీనినే 'ద్రవ బంగారం' అంటారు. సహజ వాయువు అనేది వాయు రూప శిలాజ ఇంధనం.

నేల బొగ్గు: సుమారు 300 మిలియన్ ఏళ్ల కిందట ప్రకృతి వైపరీత్యాల కారణంగా భూమిపై ఉన్న మొక్కలు భూమి లోపలి పొరల్లో చేరి మట్టితో కూరుకుపోయాయి. ఆ తర్వాత కాలక్రమంలో అధిక ఉష్ణోగ్రత, పీడనానికి గురికావడంతో వాటి అవశేషాలు నల్లని ఘనపదార్థంగా మారాయి. ఈ విధంగా ఏర్పడిన పదార్థాన్నే నేల బొగ్గు అంటారు. వృక్ష అవశేషాలు నెమ్మదిగా నేల బొగ్గుగా మారే ప్రక్రియను 'కార్బొనైజేషన్' అంటారు. నేలబొగ్గులో ప్రధానంగా ఉండే మూలకం కార్బన్ (C). నేల బొగ్గును మండిస్తే వెలువడే వాయువు కార్బన్ డై ఆక్సైడ్ (CO_2). నేలబొగ్గును వంట చెరకుగా, రైలు ఇంజిన్ నడపడానికి, థర్మల్ పవర్ ప్లాంటుల్లో విద్యుత్తు ఉత్పత్తికి వినియోగిస్తారు. పరిశ్రమల్లో ఇంధనంగా ఉపయోగపడే దీనిని పారిశ్రామికంగా శుద్ధి చేస్తే కోక్, కోల్‌తార్, కోల్ గ్యాస్ అనే మూడు ఉత్పన్నాలు ఏర్పడతాయి.

కోక్: ఇది నల్లని సచిద్ర దృఢమైన ఘన పదార్థం. బొగ్గును ఆక్సిజన్ లేకుండా నిర్వాత స్వేదనం చెందిస్తే ఏర్పడుతుంది. కోక్‌ను లోహాల సంగ్రహణ, స్టీల్ తయారీలో ఇంధనంగా వాడతారు. కార్బన్ శాతం ఆధారంగా కోక్‌ను నాలుగు రకాలుగా విభజిస్తారు. 1) పీట్ 2) లిగ్నైట్ 3) బిట్యుమినస్ 4) ఆంథ్రసైట్. వీటిలో అత్యంత నాణ్యమైంది - ఆంథ్రసైట్ (98%).

కోల్‌తార్: దుర్వాసనతో కూడిన నల్లటి చిక్కని ద్రవం. దాదాపు 200 పదార్థాల తయారీలో దీనిని ముడి పదార్థంగా ఉపయోగిస్తారు. కోల్‌తార్‌ను రోడ్లు వేయడానికి, ఔషధాలు, పేలుడు పదార్థాలు తదితరాల తయారీలో వినియోగిస్తారు.

కోల్ గ్యాస్: నేల బొగ్గు నుంచి కోక్‌ను పొందడానికి జరిపే సంగ్రహణ ప్రక్రియలో కోల్ గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. దీనిని పరిశ్రమల్లో ఇంధనంగా వాడతారు. కోల్ గ్యాస్‌ను వీధి దీపాలు వెలిగించడానికి మొదటిసారిగా 1810లో లండన్‌లో, 1820లో న్యూయార్క్‌లో ఉపయోగించారు. ఈ రోజుల్లో దీనిని కాంతి జనకంగా కంటే ఉష్ణ జనకంగా వాడుతున్నారు.

పెట్రోలియం: సుమారు కొన్ని మిలియన్ల ఏళ్ల కిందట సముద్రంలో నివసించే 'ప్లాంక్టన్' అనే సూక్ష్మజీవులు చనిపోయి వాటి అవశేషాలు సముద్ర అడుగు భాగాన రాతి పొరల్లోకి చేరడంతో ఇసుక, మట్టి వాటిని కప్పేసింది. ఆ తర్వాత అధిక ఉష్ణోగ్రత, పీడనానికి గురికావడంతో చిక్కని ద్రవం ఏర్పడింది. దీనినే పెట్రోలియం లేదా రాతి నూనె అని పిలుస్తారు.


సహజ వాయువు: పెట్రోలియం పైభాగంలో వాయురూపంలో ఉండే ఇంధనాన్ని సహజ వాయువు అంటారు. సహజ వాయువును అధిక పీడనానికి గురి చేస్తే సీఎన్‌జీ ఏర్పడుతుంది. ఇది తక్కువ కాలుష్య ఇంధనం.



రచయిత: **ఎస్.రామకృష్ణ**

సీనియర్ ఇంటర్ - జంతు శాస్త్రం

జీర్ణక్రియ శోషణం



ఫైనల్ పరీక్షలు 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

2 మార్కులు

1. **స్వయం ఉత్ప్రేరణ అంటే ఏమిటి? రెండు ఉదాహరణలు ఇవ్వండి.**

జ: స్వయం ఉత్ప్రేరణ: ఉత్ప్రేరణ చర్యలో దేనినైతే ఉత్ప్రేరకంగా ఉపయోగిస్తారో అదే ఆ చర్యలో ఒక ఉత్పన్నంగా వస్తే అలాంటి చర్యను స్వయం ఉత్ప్రేరణ చర్య అంటారు.

ఉదా: పెప్సిన్, ట్రిప్సిన్

పెప్సిన్ ఉదా: పెప్సినోజన్ స్వయం ఉత్ప్రేరణే పెప్సిన్ (జీర్ణాశయంలో)

ఉదా: ట్రిప్సినోజన్ స్వయంఉత్ప్రేరణే ట్రిప్సిన్ (పేగులో).

2. **క్రైమ్ అంటే ఏమిటి?**

జ: క్రైమ్: జీర్ణాశయంలో అసంపూర్ణంగా జీర్ణమై, ఆమ్లయుతంగా ఉన్న ఆహారాన్ని 'క్రైమ్' అంటారు. జీర్ణాశయ కండరాల చిలకబడే కదలికల వల్ల ఇది ఏర్పడుతుంది.

3. **మానవుడిలోని వివిధ రకాల లాలాజల గ్రంథులను పేర్కొని, అవి నోటిలో ఏ ప్రాంతాల్లో ఉన్నాయో తెలపండి.**

జ: మానవుడిలో మూడు జతల లాలాజల గ్రంథులు ఉన్నాయి.

★ 'పెరోటిడ్ గ్రంథులు': ఇవి వెలుపలి చెవిలో ఉంటాయి. (చెవి లంబిక)

★ 'అథోజంభికా గ్రంథులు లేదా సబ్‌మాండిబ్యులార్ గ్రంథులు': కింది దవడ మూలంలో అమరి ఉంటాయి.

★ 'అథోజిహ్వికా గ్రంథులు': నాలుక కింది భాగంలో అమరి ఉంటాయి.

4. **మానవుడి నాలుక పై ఉన్న వివిధ సూక్ష్మాంకురాలు తెలపండి.**

జ: మానవుడి నాలుకపై మూడు రకాల సూక్ష్మాంకురాలు ఉంటాయి. (నాలుక పైభాగంలో చిన్నగా పొడుచుకుని వచ్చే నిర్మాణాలు)

★ 'ఫంజీఫామ్' సూక్ష్మాంకురాలు: ఇవి పూర్వ ఉపాంతంలో నాలుక చివర ఉంటాయి.

★ 'తంతురూప' సూక్ష్మాంకురాలు: ఇవి నాలుక ఉపరితలంలో ఉంటాయి.

★ 'సర్కంవెల్లేట్' సూక్ష్మాంకురాలు: ఇవి నాలుక ఆధార భాగంలో ఉంటాయి.

5. **మానవుడి దేహంలో అత్యంత కఠిన పదార్థం ఏది? అది ఎలా ఏర్పడుతుంది?**

జ: ★ మానవుడి దేహంలో అత్యంత కఠిన పదార్థం పింగాణి (దంతం యొక్క కిరీట భాగాన్ని ఏర్పరుస్తుంది.)

★ బహిస్త్వచం నుంచి ఏర్పడిన ఎమియోబ్లాస్టులు స్రవించడం వల్ల ఇది ఏర్పడుతుంది.

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు



రచయిత: **రవిచరణ్ కంటి**

'రోమ్ బంగారం అంతా భారత్‌కు తరలిపోతోంది!'

శాతవాహనులు


ప్రాచీన భారతదేశంలో తెలుగునేల కేంద్రంగా దక్షిణాపథంలో తొలి స్వతంత్ర్య రాజ్యాన్ని స్థాపించిన పాలకులే శాతవాహనులు. పాలనా వ్యవస్థలతో పాటు కళాపోషణ, విదేశీ వాణిజ్యంలో గొప్ప పురోగతి సాధించి చరిత్రలో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నారు. హిందూ సంస్కృతితో పాటు బౌద్ధాన్నీ ప్రోత్సహించి పరమత సహనాన్ని చాటారు. యుద్ధ వీరులు, ఉదార పాలకులు, తొలి తెలుగు రాజులు, నాణేలపై తమ చిత్రాలను ముద్రించిన మొదటి పాలకులు తదితర ఎన్నో ఘనతలు వీరి సొంతం. శాతవాహన వంశ క్రమం, పాలనా విశేషాలు, సాధించిన విజయాలు, నాటి పరిస్థితులు, పరిణామాలను వెల్లడించే చారిత్రక ఆధారాల గురించి పోటీ పరీక్షార్థులకు తెలిసి ఉండాలి. వీరి కాలంలో ప్రసిద్ధ వర్తక, ఆధ్యాత్మిక ప్రాంతాలు, వివిధ రంగాల ప్రముఖులు, వెలువడిన గ్రంథాలు, శాతవాహనుల్లో గొప్పవాడైన గౌతమీపుత్ర శాతకర్ణి ప్రత్యేకతలపై అవగాహన పెంపొందించుకోవాలి.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర


1. కింది వాటిలో శాతవాహనుల రాజధాని ఏది?
   1) కోటిలింగాల 2) ప్రతిష్ఠానపురం
   3) అమరావతి 4) పైవన్నీ
2. శాతవాహన రాజ్యస్థాపకుడు ఎవరు?
   1) శ్రీముఖుడు 2) గౌతమీపుత్ర శాతకర్ణి
   3) యజ్ఞశ్రీ శాతకర్ణి 4) వేదశ్రీ శాతకర్ణి
3. కింది ఏ శాసనం గౌతమీ బాలశ్రీని 'రాజర్షి పత్ని'గా పేర్కొంది?
   1) నాసిక్ శాసనం 2) మ్యాకదోని శాసనం
   3) నానాఘాట్ శాసనం 4) చినగంజాం శాసనం
4. కింది వాటిలో సరికానిది ఏది?
   1) నానాఘాట్ శాసనం - దేవీ నాగానిక
   2) నాసిక్ శాసనం - గౌతమీపుత్ర శాతకర్ణి
   3) మ్యాకదోని శాసనం - 3వ పులోమావి
   4) చినగంజాం శాసనం - యజ్ఞశ్రీ శాతకర్ణి
5. శాతవాహనుల్లో అత్యంత గొప్పరాజు ఎవరు?




   1) గౌతమీపుత్ర శాతకర్ణి
   2) వాశిష్టిపుత్ర పులోమావి
   3) మొదటి శాతకర్ణి
   4) యజ్ఞశ్రీ శాతకర్ణి
6. దక్షిణ భారతదేశంలో బ్రాహ్మణులకు పన్ను మినహాయింపు భూములు దానం చేసిన మొదటి వంశం?
   1) ఇక్ష్వాకులు 2) చోళులు
   3) పల్లవులు 4) శాతవాహనులు
7. మొదటి శాతకర్ణి బిరుదుల్లో తప్పుగా ఉన్నదాన్ని గుర్తించండి.
   1) అప్రతిహతచక్ర
   2) త్రిసముద్రతోయ పీతవాహన
   3) ఏకవీర 4) దక్షిణాపథపతి
8. కింది ఏ శాతవాహన రాజు కాలంలో భాగవత మతం దక్షిణ భారత్‌లోకి ప్రవేశించింది?
   1) శ్రీముఖుడు 2) కన్హుడు
   3) హాలుడు 4) పులోమావి
9. 'లీలావతి పరిణయం' అనే గ్రంథాన్ని రచించింది?
   1) సోమదేవ సూరి 2) ఆచార్య నాగార్జునుడు
   3) కుతూహలుడు 4) అశ్వఘోషుడు
10. కింది ఏ శకరాజు శాతవాహనులతో వివాహ సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు?
    1) నహపాణుడు 2) రుద్రదాముడు
    3) రుద్రసింహుడు 4) రుద్రసేనుడు
11. ద్విభాష నాణేలను ముద్రించిన శాతవాహన రాజు?
    1) వాశిష్టపుత్ర పులోమావి 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) శివశ్రీ శాతకర్ణి 4) గౌతమీపుత్ర శాతకర్ణి
12. స్కంధవారాలు అంటే?
    1) పట్టణంలోని తాత్కాలిక సైనిక శిబిరాలు
    2) రాజు ఆంతరంగిక సైనిక దళంలోని గూఢచారులు
    3) రెవెన్యూ రికార్డులు రాసేవారు
    4) శిస్తు నిర్ణయించి వసూలు చేసే వ్యక్తులు
13. ఆచార్య నాగార్జునుడు రాసిన గ్రంథం ఏది?



    1) సుహ్రుల్లేఖ
    2) ప్రజ్ఞాపారమిత శాస్త్రం
    3) రసరత్నాకర
    4) పైవన్నీ
14. శాతవాహనుల పరిపాలనకు సంబంధించి సరికానిది?
    1) వీరి పాలన మౌర్యుల పాలనను పోలి ఉంటుంది.
    2) 'రాజు దైవాంశ సంభూతుడు' అనే భావన ఉంది.
    3) వీరి కాలంలో మాతృస్వామిక వ్యవస్థ ప్రధానమైంది.
    4) వీరి కాలంలో నిగమ సభలు ఉన్నాయి.
15. శాతవాహన రాజు హాలుడికి సంబంధించి సరైంది?
    1) ఈయన కాలం ప్రాకృత భాషకు స్వర్ణయుగం లాంటిది.
    2) ఈయన ప్రాకృత భాషలో గాథాశప్తశతి అనే గ్రంథాన్ని రాశాడు.
    3) ఇందులో 700 కథలు దాగి ఉన్నాయి.
    4) పైవన్నీ.
16. కింది రచనల్లో తప్పుగా ఉన్నదానిని గుర్తించండి.
    1) కాతంత్ర వ్యాకరణం - శర్వవర్మ
    2) బృహత్కథ - గుణాఢ్యుడు
    3) కామసూత్ర - వాత్సాయనుడు
    4) లీలావతి పరిణయం - హాలుడు
17. కింది వాటిలో గౌతమీపుత్ర శాతకర్ణి బిరుదు?
    1) క్షత్రియ దర్పయాణ మర్ధన
    2) వర్ణ సాంకర్య నిరోధక
    3) క్షహరాట వంశ నిరవశేష 4) పైవన్నీ
18. శాతవాహనులు ఎక్కువగా ఏ దేశంతో వ్యాపారం చేశారు?
    1) రోమ్ 2) గ్రీకు 3) చైనా 4) ఇండోనేసియా
19. 'రోమ్ దేశ బంగారం అంతా భారతదేశానికి తరలిపోతుంది' అని పేర్కొన్న వ్యక్తి ఎవరు?




    1) ప్లీని
    2) టాలమీ
    3) మెగస్తనీస్
    4) హుయాన్‌త్సాంగ్
20. శాతవాహనుల కాలంలో నీటిని పైకి లాగడానికి ఉపయోగించిన యంత్రం ఏది?
    1) ఉదగ యంత్రం 2) ఘటీ యంత్రం
    3) గరిక యంత్రం 4) మహాశిల కంఠక
21. శాతవాహనుల్లో చివరి రాజు ఎవరు?
    1) శివశ్రీ శాతకర్ణి 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) మూడో పులోమావి 4) గౌతమీపుత్ర శాతకర్ణి
22. శాతవాహనుల కాలంలో ఉన్న వృత్తి శ్రేణుల్లో సరికాని జతను గుర్తించండి.
    1) గధిక - సుగంధ పరిమళాలు తయారు చేసేవారు.
    2) తిలపిశక - శిలలను చెక్కేవారు.
    3) ఓదయాంత్రిక - వ్యవసాయ పనిముట్లు తయారు చేసేవారు.
    4) హాలక - వ్యవసాయదారులు.
23. కింది ఏ విదేశీ గ్రంథంలో అరికమేడురేవు పట్టణాన్ని అంతర్జాతీయ రేవు పట్టణంగా పేర్కొన్నారు?




    1) పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్ సీ
    2) గైడ్ టు జియోగ్రఫీ
    3) ఇండికా 4) నేచురల్ హిస్టరీ
24. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న గుడిమల్లం ప్రాముఖ్యత?
    1) భారతదేశం మొదటి దేవాలయం ఇక్కడ ఉంది.
    2) భారతదేశంలో ప్రాచీన శివలింగం ఇక్కడ ఉంది.
    3) ఆంధ్రప్రదేశ్‌లో వజ్రాల గనులున్న ప్రదేశం.
    4) ప్రపంచంలో మొదటి బొగ్గు గని ఇక్కడ గుర్తించారు.
25. శాతవాహనుల రాజభాష ఏది?
    1) సంస్కృతం 2) పాళీ
    3) అర్ధమాగధి 4) ప్రాకృతం
26. హుయాన్‌త్సాంగ్ రచించిన గ్రంథం?
    1) సి-యు-కి 2) ఫో-కు-వోకీ
    3) నేచురల్ హిస్టరీ 4) హిస్టరీ ఆఫ్ టిబెట్
27. శాతవాహనుల జన్మస్థలానికి సంబంధించి సరైన దాన్ని గుర్తించండి.
    1) శ్రీనివాస అయ్యంగార్ ప్రకారం వీరిది మహారాష్ట్రలోని నాసిక్.
    2) మిరాశీ ప్రకారం వీరిది మహారాష్ట్రలోని విదర్భ.
    3) సుక్తాంకర్ ప్రకారం వీరిది కన్నడ ప్రాంతం.
    4) పైవన్నీ.
28. ప్రతిపాదన-(ఎ): గౌతమీపుత్ర శాతకర్ణి శకులను, పహ్లావులను ఓడించాడు.
    వివరణ-(ఆర్): శకులను ఓడించినందుకు గౌతమీపుత్ర శాతకర్ణిని 'శకారి' అని పిలిచారు.
    1) ఎ, ఆర్ సరైనవి; ఆర్‌కు ఎ సరైన వివరణ.
    2) ఎ, ఆర్ సరైనవి; ఆర్‌కు ఎ సరైన వివరణ కాదు.
    3) ఎ సరికాదు, కానీ ఆర్ సరైంది.
    4) ఎ సరైంది, కానీ ఆర్ సరికాదు.
29. శాతవాహన రాజుల్లో ఓడబొమ్మ ఉన్న నాణేలు ముద్రించిన రాజు?
    1) గౌతమీపుత్ర శాతకర్ణి 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
    3) రెండో శాతకర్ణి
    4) వాశిష్టిపుత్ర పులోమావి
30. ఆచార్య నాగార్జునుడు యజ్ఞశ్రీ శాతకర్ణికి అంకితం ఇచ్చిన గ్రంథం ఏది?
    1) రసరత్నాకరం 2) రసరంజని
    3) సుహ్రుల్లేఖ 4) యోగాచారం
31. శాతవాహనుల అనంతరం ఆంధ్ర ప్రాంతాన్ని పాలించిన వారు ఎవరు?
    1) ఇక్ష్వాకులు 2) గుప్తులు
    3) చోళులు 4) శుంగులు
32. ఇక్ష్వాకుల రాజధాని ఏది?
    1) అమరావతి 2) విజయపురి
    3) శ్రీకాకుళం 4) నాగార్జునకొండ
33. అమరావతి స్తూపాన్ని కనుక్కున్న వ్యక్తి ఎవరు?



    1) సి.పి.బ్రౌన్
    2) అలెగ్జాండర్ కన్నింగ్‌హాం
    3) కల్నల్ కాలిన్ మెకాంజి 4) సర్ జాన్ మార్షల్
34. శాతవాహనుల కాలంలో కొండాపూర్ ఏ పరిశ్రమకు ప్రసిద్ధి చెందింది?
    1) దంతపు పనుల పరిశ్రమ
    2) జౌళి పరిశ్రమ
    3) దుస్తుల పరిశ్రమ 4) ఇనుము పరిశ్రమ
35. శక రాజవంశానికి చెందిన నహపాణుడి అల్లుడైన రిషభదత్తుడి గురించి ప్రస్తావించిన శాతవాహన కాలం నాటి శాసనం?



    1) నానాఘాట్ శాసనం 2) మ్యాకదోని శాసనం
    3) అమరావతి శాసనం 4) నాసిక్ శాసనం
36. శాతవాహనుల కాలంలో భూమి శిస్తు ఎంత?
    1) 1/2 2) 1/4 3) 1/6 4) 1/8
37. సాంచీ స్తూపానికి దక్షిణ తోరణం నిర్మించిన శాతవాహన రాజు?
    1) మొదటి శాతకర్ణి 2) రెండో పులోమావి
    3) రెండో శాతకర్ణి 4) గౌతమీపుత్ర శాతకర్ణి
38. పునర్ ముద్రిత నాణేలను ముద్రించిన శాతవాహన రాజు?
    1) గౌతమీపుత్ర శాతకర్ణి 2) మొదటి శాతకర్ణి
    3) శ్రీముఖుడు 4) మూడో పులోమావి
39. శాతవాహనుల కాలంనాటి సామాజిక అంశాలను ప్రస్తావించిన గ్రంథం ఏది?
    1) మృచ్ఛకటికం 2) లీలావతి పరిణయం
    3) నీతిసారం 4) గాథా సప్తశతి
40. చివరి శాతవాహన రాజుల్లో గొప్పవాడు?
    1) యజ్ఞశ్రీ శాతకర్ణి 2) రెండో శాతకర్ణి
    3) మూడో పులోమావి 4) హాలుడు
41. పులోమావి అంటే అర్థం?
    1) పులి లాంటి గంభీర్యం ఉన్నవాడు.
    2) పుత్రుల్లో చివరివాడు. 3) గడ్డిలో పుట్టినవాడు.
    4) మామిడిపండు లాంటివాడు.
42. బ్రాహ్మణులకు పన్ను మినహాయింపు భూములు ఇచ్చిన మొదటి శాతవాహన రాజు?
    1) మొదటి శాతకర్ణి 2) రెండో శాతకర్ణి
    3) గౌతమీపుత్ర శాతకర్ణి
    4) శివశ్రీ శాతకర్ణి



రచయిత: **కాకులూరు వెంకటేశ్వర్లు**

సమాధానాలు

1-4; 2-1; 3-1; 4-2; 5-1; 6-4; 7-2, 8-2; 9-3; 10-2; 11-3; 12-1; 13-4; 14-3; 15-4; 16-4; 17-4, 18-1; 19-1; 20-2; 21-3; 22-2; 23-1; 24-2; 25-4; 26-1; 27-4, 28-4; 29-2, 30-3; 31-1; 32-2; 33-3; 34-4; 35-4; 36-3; 37-3; 38-1; 39-4; 40-1; 41-3; 42-1.

ఉష్ణం - ఉష్ణోగ్రత

బాష్పీభవనం

ద్రవ అణువులు ఏ ఉష్ణోగ్రత వద్దనైనా ద్రవ ఉపరితలాన్ని విడిపోయే ప్రక్రియను బాష్పీభవనం అంటారు.

▌ఉదాహరణకు బైక్‌లో పెట్రోల్ కొట్టించుకునేటప్పుడు పొరపాటున చేతిపై కొన్ని చుక్కల పెట్రోల్ పడితే చల్లగా అనిపిస్తుంది. కానీ గమనించేలోపే అది ఆవిరైపోతుంది. ఇదే ఫలితం చేతిపై శానిటైజర్ వేసుకున్నప్పుడు కూడా గమనించవచ్చు. బాష్పీభవన ప్రక్రియే వీటన్నింటికి కారణం.

ప్రయోగం ద్వారా... రెండు చిన్న గిన్నెలు తీసుకుని వాటిలో 20 ml స్పిరిట్ వేయాలి. ఒక దాన్ని ఫ్యాన్ గాలి తగిలేలా ఉంచి, రెండో దానిపై మూతపెట్టి ఒక మూలకు ఉంచాలి. కాసేపటి తర్వాత పరిశీలిస్తే, గాలి తగిలిన గిన్నెలో స్పిరిట్ ఉండదు. రెండో గిన్నెలో కొద్ది పరిమాణంలో ఉంటుంది. దీని ఫలితంగా.. బాష్పీభవనం వీచే గాలిపై ఆధారపడి ఉంటుందని చెప్పవచ్చు.

❖ గిన్నెలో ఉంచిన ద్రవం అణువులు నిరంతరం పలు దిశల్లో వివిధ వేగాలతో కదులుతూ ఉంటాయి. ఫలితంగా అణువులు పరస్పరం అభిఘాతం చెందుతాయి. ద్రవం లోపల ఉన్న అణువులు ఉపరితలం వద్ద ఉండే అణువులతో అభిఘాతం చెందినప్పుడు, ఉపరితల అణువులు శక్తిని గ్రహించి ద్రవ ఉపరితలాన్ని వదిలి పైకి వెళ్తాయి. ఆ ద్రవం పూర్తిగా ఆవిరయ్యే వరకు ద్రవ ఉపరితలంలోని అణువులు గాలిలోకి చేరుతూనే ఉంటాయి. ఈ విధంగా బాష్పీభవనం జరుగుతుంది.



తడిగా ఉన్న దుస్తులు కొంత సమయం తర్వాత పొడిగా మారతాయి. అయితే ఆ దుస్తుల్లోని నీరు ఏమైపోయింది మరి..? అదేవిధంగా ఇంటిలోని మార్బుల్స్ లేదా టైల్స్‌ని తుడిచినప్పుడు కొద్దిసేపటికి వాటంతట అవే ఆరిపోతాయి కదా..! ఈ దృగ్విషయాలు ఎలా జరుగుతున్నాయి, అసలు వీటి వెనుక ఏ సూత్రం దాగుంది? వీటన్నింటిని అర్థం చేసుకోవాలంటే బాష్పీభవనం అనే భావన గురించి తెలుసుకోవాల్సిందే. బాష్పీభవనం అంటే ఏమిటి, ఏ వాతావరణ పరిస్థితుల్లో, ఎలాంటి సందర్భాల్లో ఈ ప్రక్రియ జరుగుతుంది, ఏ అంశాలపై ఆధారపడి ఉంటుందనే విషయాలపై పోటీపరీక్షార్థులు అవగాహన కలిగి ఉండాలి.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఫిజిక్స్

నీటి ఆవిరి సాంద్రీకరణం..
బిందువులుగా మారి తుషారం!

❖ ఫ్యాన్ కింద ఉన్న గిన్నెలోని ద్రవం త్వరగా ఆవిరవుతుంది. ఉపరితలాన్ని వదిలి గాలిలోకి చేరిన అణువులు తిరిగి గిన్నెలోకి రాలేకపోవడమే దీనికి కారణం. పక్కకు పెట్టిన గిన్నెకు గాలి తక్కువగా తగలడంతో బాష్పీభవన రేటు తక్కువగా ఉంటుంది. అందుకే ఈ గిన్నెలోని ద్రవం నెమ్మదిగా ఆవిరవుతుంది.
ఈ దృగ్విషయం ఆధారంగానే గాలి వీచే సమయంలో దుస్తులు త్వరగా ఆరడాన్ని మనం గమనించవచ్చు.

❖ బాష్పీభవనం అనేది ఉపరితలానికి సంబంధించిన ప్రక్రియ.

❖ బాష్పీభవన సమయంలో వ్యవస్థ ఉష్ణోగ్రత తగ్గుతుంది.

❖ ద్రవంలోని అణువులు ఉపరితలం నుంచి తొలగిపోయే అణువులకు నిరంతరం శక్తినిస్తాయి. కాబట్టి బాష్పీభవనం ఒక శీతలీకరణ ప్రక్రియ.

❖ పని లేదా వ్యాయామం చేసేటప్పుడు శక్తి ఖర్చవుతుంది. ఈ సమయంలో శరీరం నుంచి శక్తి ఉష్ణం రూపంలో విడుదలై, చర్మం ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఫలితంగా స్వేద గ్రంథుల నుంచి నీరు బాష్పీభవనం చెందడం ప్రారంభమవుతుంది. కాబట్టి శరీరం చల్లగా మారుతుంది.

❖ ఒక ద్రవం బాష్పీభవన రేటు ఆ ద్రవ ఉపరితల వైశాల్యం, ఉష్ణోగ్రత, దాని పరిసరాల్లో అంతకుముందు గాలిలోకి చేరిన నీటి ఆవిరి, గాలి వీచే వేగం లాంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది.

మరగటం

ఏదైనా పీడనం, స్థిర ఉష్ణోగ్రత వద్ద ద్రవస్థితిలోని పదార్థం వాయు స్థితిలోకి మారడాన్ని 'మరగడం' అంటారు. ఆ ఉష్ణోగ్రతను ఆ ద్రవం 'మరిగే స్థానం' అంటారు.

● ఒక బీకరులో నీటిని తీసుకుని, దానిలో ఒక ఉష్ణమాపకాన్ని ఉంచి వేడి చేస్తే ఉష్ణోగ్రత నిరంతరం పెరుగుతుంది. కానీ ఒక బిందువు వద్దకు చేరిన తర్వాత ఉష్ణోగ్రత నిలకడగా ఉంటుంది. ఆ సమయంలో బీకరులోని నీరు నీటిఆవిరిగా మారుతుంది.

● పై ఉదాహరణలో నీటి ఉష్ణోగ్రత 100°Cకి చేరి ఉష్ణం అందుతున్నప్పటికీ ఉష్ణోగ్రత స్థిరంగా ఉంటుంది. కాబట్టి నీరు మరిగే స్థానం 100°C.

● నీటి ఉష్ణోగ్రత పెరగకపోవడానికి కారణం అందించే ఉష్ణశక్తి పదార్థ స్థితి మారడానికి ఉపయోగపడిందని అర్థం. కానీ ఉష్ణోగ్రత పెరగడానికి కాదు, కాబట్టి ఆ ఉష్ణాన్ని బాష్పీభవనం గుప్తోష్ణం అంటారు. నీటి బాష్పీభవనం గుప్తోష్ణం విలువ 540 కెలోరీ/గ్రామ్.

ఆర్ద్రత

ఒక నిర్దిష్ట సమయంలో ఒక ప్రదేశంలోని గాలిలో (వాతావరణంలో) ఉండే నీటి ఆవిరి పరిమాణాన్ని ఆర్ద్రత అంటారు. వాతావరణంపై ఆర్ద్రత చాలా ప్రభావం చూపుతుంది.

తుషారం: శీతాకాలంలో ఉదయం వాహనాలు, గడ్డి, మొక్కలపై నీటి బిందువులు ఏర్పడతాయి. ఎందుకంటే ఈ కాలంలో రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. దీంతో గాలిలోని నీటిఆవిరి సాంద్రీకరణం చెంది నీటి బిందువులుగా మారి వస్తువులపై పడుతుంది. ఇలా సాంద్రీకరణం చెందిన నీటి బిందువులనే తుషారం అంటారు.

పొగమంచు: శీతాకాలంలో సాధారణంగా ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. ఆ ఉష్ణోగ్రతలు ఇంకా తగ్గినట్లయితే, ఆ ప్రాంతంలోని వాతావరణంలో ఉండే నీటిఆవిరి అణువులు గాలిలోని ధూళికణాలపై సాంద్రీకరణం చెంది చిన్నచిన్న నీటి బిందువులుగా ఏర్పడతాయి. ఇవి గాలిలో తేలుతూ పలుచటి పొగ లేదా మేఘంలా కనిపిస్తాయి. ఇలా పొగ మాదిరిగా గాలిలో తేలియాడే నీటి బిందువులను పొగమంచు అంటారు.

▼ ఒక్కొక్కసారి పొగమంచు అధికంగా ఉన్న కారణంగా విమానాలు ఆలస్యంగా నడవడం, రైళ్లు, బస్సుల ప్రయాణ సమయాలను మార్చడం మనం గమనిస్తుంటాం.

సాంద్రీకరణం

వాయువు ద్రవ స్థితికి మార్పు చెందడాన్నే సాంద్రీకరణం అంటారు.

◆ ఫ్రిజ్ నుంచి తీసిన వాటర్ బాటిల్‌ను టేబుల్‌పై పెట్టిన కొద్దిసేపటికే దాని ఉపరితలంపై నీటి బిందువులు ఏర్పడతాయి. గాలిలోని నీటి అణువులు చలనంలో ఉన్నప్పుడు చల్లటి నీరున్న బాటిల్ ఉపరితలాన్ని తాకగానే అవి గతిశక్తిని కోల్పోతాయి. కాబట్టి వాటి ఉష్ణోగ్రత తగ్గిపోయి నీటి బిందువులుగా మారతాయి.

◆ గాలిలోని నీటి బిందువులు కోల్పోయిన శక్తి బాటిల్‌లోని అణువులకు తద్వారా లోపలి నీటి బిందువులకు అందజేస్తుంది. ఫలితంగా సీసాలోని నీటి బిందువుల గతిశక్తి పెరిగి, నీరు కొద్దిగా వేడెక్కుతుంది. కాబట్టి సాంద్రీకరణం ఒక ఉష్ణీకరణ ప్రక్రియ.

◆ అదేవిధంగా వేసవి రోజుల్లో షవర్ కింద స్నానం చేసి టవల్‌తో శరీరాన్ని తుడిచినా చుట్టూ ఉన్న నీటిఆవిరి అణువులు చర్మంపై సాంద్రీకరణం చెందుతాయి. ఫలితంగా శరీరం వెచ్చగా ఉన్నట్లు అనిపిస్తుంది.

ఘనీభవనం

ద్రవస్థితిలో ఉన్న ఒక పదార్థం కొంత శక్తిని కోల్పోవడం ద్వారా ఘనస్థితిలోకి మారే ప్రక్రియను 'ఘనీభవనం' అంటారు.

◗ సాధారణ వాతావరణ పీడనం (1 అట్మాస్ఫియర్), 0 °C ఉష్ణోగ్రత వద్ద నీరు ఘనీభవనం చెందుతుంది.

◗ ఒక బాటిల్‌లో నీటిని నింపి డీప్‌ఫ్రిడ్జ్‌లో పెట్టినప్పుడు, ఆ బాటిల్ ప్లాస్టిక్ అయితే కొంచెం ఉబ్బుతుంది. గాజుది అయితే పగిలిపోతుంది. ఎందుకంటే నీరు గడ్డ కట్టినప్పుడు వ్యాకోచిస్తుంది కాబట్టి.

◗ నీటి సాంద్రత కంటే మంచు సాంద్రత తక్కువ కాబట్టి మంచు నీటిపై తేలుతుంది.

ద్రవీభవనం

స్థిర ఉష్ణోగ్రత వద్ద ఘనస్థితిలో ఉన్న పదార్థం ద్రవస్థితిలోకి మారే ప్రక్రియను ద్రవీభవనం అంటారు.

■ ఒక బీకరులో కొన్ని మంచు ముక్కలు, ఒక ఉష్ణమాపకం తీసుకుని బల్లపై కాసేపు ఉంచితే ఉష్ణోగ్రత పెరుగుతూ ఉంటుంది.
కానీ 0 °Cకి చేరిన తర్వాత చాలాసేపు నిలకడగా ఉంటుంది.
ఆ సమయంలో బయట నుంచి అందిన ఉష్ణం మంచు కరిగి నీరుగా మారడానికి ఉపయోగపడుతుంది. కానీ ఉష్ణోగ్రతను పెంచదు. దీన్నే ద్రవీభవన గుప్తోష్ణం అంటారు. మంచు ద్రవీభవన గుప్తోష్ణం విలువ 80 కెలోరీ/ గ్రామ్.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

Word of the Day 869

Indigent

Telugu meaning: నిరుపేద, దీనావస్థ గల

English meaning: The word indigent (ఇండిజెంట్) is an adjective that describes a person who is extremely poor and lacks basic necessities.

Synonyms: Poor, Destitute; ***Antonyms:*** Wealthy, Affluent

Usage: 1. The government launched welfare schemes to support indigent families in rural areas.

2. Charitable organizations often provide free medical care to indigent patients.

Current Affairs



The Indian Coast Guard (ICG) Ship 'Amulya' was commissioned at Goa Shipyard Limited, Vasco, Goa on 19 December 2025. This is the third vessel in the new-generation Adamya-class Fast Patrol Vessel (FPV). The 51-metre FPV powered by two 3000 kW advanced diesel engines, was designed and built by Goa Shipyard Limited (GSL).



President Droupadi Murmu inaugurated the 26th National Conference for the Chairpersons of Public Service Commissions (PSC) in Hyderabad on 19 December 2025. Organised by the Telangana Public Service Commission (TGPSC), the two-day conference aims to bring together the Union Public Service Commission (UPSC) and State PSCs as a premier national platform for dialogue, institutional introspection and cooperative reforms.

Former Iraqi President Barham Salih was elected as the next head of the U.N. refugee agency, its first from the Middle East since the late 1970s. The United Nations General Assembly announced this on 19 December 2025.
✦ The 193-member world body elected the Kurdish politician as the U.N. high commissioner for refugees by consensus and a bang of the gavel by Assembly President Annalena Baerbock.

President Droupadi Murmu on 21 December 2025 gave her assent to the Viksit Bharat-Guarantee for Rozgar and Ajeevika Mission (Gramin) (VB-G Ram G) Bill. It replaces the erstwhile Congress-led government's flagship Mahatma Gandhi National Rural Employment Guarantee Act (MGNREGA), which initially guaranteed at least 100 days of employment.

For more Current Affairs: Scan QR code

జాతీయ రైతుల దినోత్సవం

డిసెంబరు 23 — చరిత్రలో ఈనాడు

భారత్ వ్యవసాయ ఆధారిత దేశం. నేటికీ అత్యధిక జనాభా వ్యవసాయం, దాని అనుబంధ రంగాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. వీరిలో రైతులే ముందు వరుసలో ఉంటారు. తమ శ్రమతో గ్రామీణాభివృద్ధితోపాటు ఆహార భద్రత సాధనలోనూ విశేషంగా కృషి చేస్తున్నారు. రైతుల హక్కులు, సంక్షేమం కోసం పాటుపడిన మాజీ ప్రధాన మంత్రి చౌధరి చరణ్ సింగ్ జయంతి సందర్భంగా ఏటా డిసెంబరు 23న 'జాతీయ రైతుల దినోత్సవం'గా (National Farmer's Day) నిర్వహిస్తారు. దీన్నే 'కిసాన్ దివస్'గానూ పిలుస్తారు. భారతదేశానికి వెన్నెముకగా ఉన్న రైతులను గౌరవించుకోవడం, వారి అభివృద్ధి - శ్రేయస్సును ఆకాంక్షించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం. అంతేకాకుండా రైతుల సమస్యలను పరిష్కరించడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంపైనా ఈ రోజు ప్రధానంగా దృష్టి సారిస్తుంది.

దేశంలో రైతుల పరిస్థితి

భారత్‌లో వ్యవసాయం వర్షాధారం. పంటలు ప్రధానంగా రుతుపవన వ్యవస్థపై ఆధారపడి ఉంటాయి. సకాలంలో వర్షాలు కురవకపోయినా, రుతుపవనాలు ఆలస్యమైనా ఆ ప్రభావం సాగుపై ఉంటుంది.

✦ ఇటీవలి కాలంలో అకాల వర్షాలు, వడగళ్ల వానలు లాంటివి తరచుగా సంభవించి పంట నష్టానికి కారణమవుతున్నాయి. దీంతో రైతులు అప్పులపాలవుతున్నారు.

✦ జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) 2025, సెప్టెంబరు 30న 'ప్రమాద మరణాలు-ఆత్మహత్యల సమాచార నివేదిక-2023'ను విడుదల చేసింది. దీని ప్రకారం, 2023లో దేశవ్యాప్తంగా 10,786 మంది రైతులు, వ్యవసాయ కూలీలు బలవన్మరణాలకు పాల్పడ్డారు.

చారిత్రక నేపథ్యం: రైతుల జీవితాలను మెరుగుపరిచే లక్ష్యంతో చౌధరి చరణ్ సింగ్ భూ సంస్కరణలు, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం లాంటి కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా, భారతదేశ అయిదో ప్రధానిగా ఆయన పనిచేసిన కాలంలో రైతు సమాజ సంక్షేమానికి పెద్ద పీట వేశారు. కర్షక పక్షపాతిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు, అందించిన సేవలను గుర్తించే ఉద్దేశంతో



ఆయన జన్మదినమైన డిసెంబరు 23న 'జాతీయ రైతుల దినోత్సవం'గా జరుపుకోవాలని 2001లో భారత ప్రభుత్వం ప్రకటించింది. అప్పటి నుంచి ఏటా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

వ్యవసాయ గణాంకాలు, చౌధరి చరణ్ సింగ్ రాజకీయ ప్రస్థానం తదితర పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

జాతీయ సమైక్యత - సమస్యలు - సవాళ్లు

ఒక దేశంలోని భిన్నత్వంలో ఏకత్వమే జాతీయ సమైక్యత. ప్రజల్లో కుల, మత, జాతి, వర్గ, వర్ణ భేదాలు లేకుండా అంతా ఒకటే అనే భావన కలిగినప్పుడే జాతీయ సమైక్యత ఏర్పడుతుంది. దీనికి అనేక అంశాలు అవరోధాలుగా నిలుస్తున్నాయి.



జాతీయ సమైక్యత సాధించడానికి సూత్రాలు

రాజకీయ పక్షాలు కుల, మత, భాషా వర్గాల్లోని భిన్నత్వాలను రెచ్చగొట్టే చర్యలకు ఉపక్రమించరాదు.

● శాంతిభద్రతలకు హాని కలిగించే ఉద్యమాలు, ఆందోళనలు ప్రారంభించి తమ భాష, ప్రాంతీయ మత సమస్యల పరిష్కారానికి ప్రయత్నించరాదు.

● ఒక రాజకీయ పార్టీకి చెందిన సభలు, సమావేశాలు, ఊరేగింపులకు ఇతర రాజకీయ పార్టీలు భంగం కలిగించరాదు.

జాతీయ సమగ్రతా మండలి

1961లో జాతీయ సమగ్రతా మండలిని ఏర్పాటు చేశారు. దీనిలో 31 మంది సభ్యులు ఉండేవారు. ప్రధాని అధ్యక్షతన ఇది పనిచేసింది. ఈ మండలి దేశంలోని వివిధ జాతులు, మతాలు, ప్రజల మధ్య సమైక్యతను నెలకొల్పేందుకు కృషి చేస్తుంది.

● దీని తొలి సమావేశం 1962 జూన్ 2న జరిగింది. 1968లో కేంద్రప్రభుత్వం జాతీయ సమగ్రతా మండలిని పునర్‌వ్యవస్థీకరించి సభ్యుల సంఖ్యను 31 నుంచి 55కు పెంచింది. పారిశ్రామిక, వ్యాపార, ట్రేడ్ యూనియన్లకు మండలిలో ప్రాతినిధ్యం కల్పించింది.

జాతీయ సమైక్యతకు సమస్యలు - పరిష్కార మార్గాలు, అంతర్ రాష్ట్ర వివాదాలు, కులతత్వం, ప్రాంతీయతత్వం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Jobs in Pawan Hans Limited

Pawan Hans Limited (PHL), Uttar Pradesh, is inviting applications for the Network Administrator, Assistant Manager, Safety Manager, etc. posts on a regular and contractual basis. The total number of posts is 18. The application fee is Rs. 295 + GST. Eligible candidates can apply online before 2 January 2026.

Anganwadi Worker Posts

The Women and Child Welfare Department office (ICDS) in Satya Sai district, Andhra Pradesh state, has released a notification for filling Anganwadi Worker posts in various categories. The total number of posts is 69. Eligible candidates can apply offline before 30 December 2025.

Did You Apply..?

Today (December 23) is the last date for the following Jobs

☛ 996 Specialist Cadre Officers in SBI. ***Eligibility:*** Degree.

☛ 14 Project Associate Posts in CSIR-CLRI. ***Eligibility:*** BE/B.Tech, MCA, MVSc, MBA, M.Sc, M.Tech.

☛ 25 Hydrographic Surveyor Jobs in DCIL, Visakhapatnam. ***Eligibility:*** Diploma, Degree, MBA, MCA, LLB.

☛ 29 Executive Trainee Posts in GAIL, New Delhi. ***Qualification:*** Law Degree, CA, CMA, Diploma, MBA, BA, B.Sc, MBBS.

☛ 54 Executive Trainee jobs in Damodar Valley Corporation. ***Eligibility:*** Bachelor's degree.

For more information and other notifications - scan QR code

Bank Exams
Quantitative Aptitude
Relative Speed - II

1. Two persons Rathesh and Rakesh are 975 m apart. They both cycling simultaneously in the same direction with speed of 18 m/s and 13 m/s respectively. In how much time will Rathesh overtake Rakesh?
A) 3 min 30 sec B) 3 min 15 sec
C) 3 min 45 sec D) 3 min 25 sec
E) 3 min 19 sec

2. Pradeep walks a certain distance and rides back by a bike in 3 hrs 45 min. He could ride both ways by bike in 3 hrs. The time required by Pradeep to walk both ways is:
A) $4\frac{3}{4}$ hrs B) $4\frac{1}{4}$ hrs
C) $4\frac{1}{2}$ hrs D) $4\frac{2}{3}$ hrs
E) None of the above

3. Keerthi and Karuna start travelling together in the same direction at 42 kmph and 58 kmph respectively. After 7 hours Keerthi increases speed by $42\frac{6}{7}$% and Karuna reduces her speed by 13 kmph and reached the destination together. How long the entire journey last?
A) $14\frac{7}{15}$ hrs B) $14\frac{4}{15}$ hrs
C) $14\frac{14}{15}$ hrs D) $14\frac{11}{15}$ hrs
E) None of the above

4. A train travelling at 66 kmph crosses a man walking with a speed of 12 kmph in the same direction in 18 seconds. If the train crosses a woman coming from the opposite direction in 12 seconds, then what is the speed of the woman in kmph?
A) 25 kmph B) 16 kmph
C) 18 kmph D) 15 kmph
E) 28 kmph

5. Sneha sitting in a train is counting the pillars of electricity. The distance between two pillars is 90 meters and the speed of train is 45 kmph in 6 hours. How many pillars will she count?
A) 3001 B) 3000 C) 3200
D) 2701 E) 4532

6. A train takes 8 min to cross a pole. Then the time taken by another train whose length is $1\frac{1}{2}$ times of the first train and moving with same speed to cross a platform of its own length is:
A) 16 min B) 24 min C) 12 min
D) 18 min E) 32 min

7. A train P speeding with 117 kmph crosses another train Q running in the same direction in $2\frac{1}{3}$ minutes. If the lengths of the trains P and Q be 130 m and 150 m respectively. What is the speed of the train Q in kmph?
A) $109\frac{1}{5}$ kmph B) $109\frac{3}{5}$ kmph
C) $109\frac{2}{5}$ kmph D) $109\frac{4}{5}$ kmph
E) None of the above

8. Harshitha starts walking at 7 kmph and after 6 hours Hasika starts cycling from the same point as that of Harshitha in the same direction 22 kmph. After how much distance from the starting point will Hasika catch up with Harshitha?
A) $61\frac{3}{4}$ kmph B) $61\frac{4}{5}$ kmph
C) $61\frac{3}{5}$ kmph D) $61\frac{2}{3}$ kmph
E) None of the above

9. A thief escaped from a prison and started running at 8 kmph. After $2\frac{1}{2}$ hours, the police realised that the thief had escaped and started chasing the thief with the help of his dog in the same direction. The speeds of the police and the dog are 13 kmph and 23 kmph respectively. Since the speed of the dog is higher, it reaches the thief first and travels back to the police and again to the thief. It keeps travelling like this till the police reaches the thief. The total distance travelled by the dog till then is:
A) 92 km B) 90 km C) 98 km
D) 95 km E) 91 km

10. A truck and a car are running in the same direction on parallel roads. If the truck now takes $3\frac{1}{3}$ times as long to pass the car, as when they are running in opposite directions, then what is the ratio of the speed of the truck to that of the car? (Assuming the truck and car run at uniform speeds)
A) 7 : 13 B) 10 : 3
C) 13 :7 D) 3 : 10
E) None of the above

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas,
Subject Expert

హిస్టరీతో ఎలాంటి అవకాశాలు?

బీఏ చదువుతున్నాను. పీజీలో హిస్టరీ పూర్తి చేయాలనుంది. ఇందులో అవకాశాలు ఎలా ఉంటాయి. మేటి సంస్థలు ఎక్కడ ఉన్నాయి? - శ్రీధర్



■ బీఏ చదువుతున్న మీరు పీజీలో హిస్టరీ చదవాలని నిర్ణయించుకోవడం మంచి ఆలోచన. చరిత్ర అంటే గత సంఘటనలను తెలుసుకోవడమే కాకుండా, సమాజం ఎలా మారింది, రాజకీయ వ్యవస్థలు ఏ విధంగా రూపుదిద్దుకున్నాయి, సంస్కృతి, ఆర్థిక వ్యవస్థల మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషించే శాస్త్రం. అందువల్ల హిస్టరీ చదివిన వారికి విశ్లేషణాత్మక ఆలోచన, సమాజ అవగాహన లాంటి నైపుణ్యాలు అభివృద్ధి అవుతాయి.

✦ పీజీ హిస్టరీ తర్వాత ప్రధానంగా బోధన, పరిశోధన రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయి. జూనియర్ కళాశాలల్లో లెక్చరర్‌గా ఉద్యోగం పొందవచ్చు. ఎంఏ తర్వాత బీఈడీ కూడా చేస్తే నవోదయ, కేంద్రీయ పాఠశాలల్లో, అంతర్జాతీయ స్కూళ్లలో పీజీటీ హిస్టరీ ఉద్యోగానికి అవకాశం ఉంటుంది. యూజీసీ-నెట్ లేదా రాష్ట్ర స్థాయి సెట్‌లో అర్హత సాధిస్తే డిగ్రీ కాలేజీల్లో అధ్యాపకులుగా పనిచేయవచ్చు. హిస్టరీలో పీహెచ్‌డీ పూర్తిచేసినవారికి ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీల్లో అధ్యాపకులుగా, పరిశోధకులుగా ఎదగడానికి అవకాశాలు ఉంటాయి. విద్యా రంగంలో స్థిరమైన కెరియర్ కోరుకునేవారికి ఇది సరైన మార్గం.

✦ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్, స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించే గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 లాంటి పోటీ పరీక్షల్లో హిస్టరీ ఒక ముఖ్యమైన సబ్జెక్ట్ కావడంతో, ఈ నేపథ్యం ఉన్నవారు సమర్థంగా సన్నద్ధం కావచ్చు.

హిస్టరీ విద్యార్థులకు మ్యూజియంలు, ఆర్కైవ్స్, పురావస్తు శాఖ, హెరిటేజ్ మేనేజ్‌మెంట్, టూరిజం రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం హెరిటేజ్ టూరిజం, డాక్యుమెంటేషన్, కల్చరల్ స్టడీస్ లాంటి రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. అలాగే అకడమిక్ కంటెంట్ రైటింగ్, పబ్లిషింగ్, మీడియా రంగాల్లోనూ చరిత్రపై అవగాహన ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

✦ జాతీయ స్థాయిలో హిస్టరీ పీజీ కోసం.. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, దిల్లీ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, బనారస్ హిందూ యూనివర్సిటీల గురించి ఆలోచించవచ్చు.

✦ రాష్ట్ర స్థాయిలో ఉస్మానియా, ఆంధ్రా, శ్రీవెంకటేశ్వర, కాకతీయ, యోగి వేమన యూనివర్సిటీలు హిస్టరీలో నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి.

స్పష్టమైన లక్ష్యం, నిరంతర అధ్యయనం, నెట్ లేదా సివిల్స్ లాంటి పరీక్షలకు ముందస్తు ప్రణాళికతో సిద్ధమైతే హిస్టరీలో మంచి భవిష్యత్తు ఉంటుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

బిట్‌శాట్‌తో బిర్లా సంస్థల్లోకి



దేశంలో ఇంజినీరింగ్ విద్య అందిస్తోన్న ప్రతిష్ఠాత్మక సంస్థల్లో బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్) ముఖ్యమైనవి. పిలానీ, గోవా, హైదరాబాదుల్లో క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో బీఈ, బీఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సులను ఇంటర్మీడియట్ విద్యార్హతతో అందిస్తున్నారు. బిట్స్ నిర్వహించే ప్రవేశ పరీక్షతో అవకాశం కల్పిస్తారు. ఇటీవలే బిట్‌శాట్–2026 ప్రకటన వెలువడింది.

బిర్లా సంస్థల్లో ప్రవేశానికి బిట్‌శాట్‌తోనే అవకాశం ఉంటుంది. ఇతర ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలతో పోలిస్తే ఇది కొంచెం భిన్నమైంది. ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ, లాజికల్ రీజనింగ్ విభాగాల్లో ప్రశ్నలు బిట్స్ ప్రత్యేకత. ఈ సంస్థల్లో బీఈ కెమికల్, సివిల్ బ్రాంచీల కంటే ఎమ్మెస్సీ ఎకనామిక్స్, మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో చేరడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. గత ఫలితాలు గమనిస్తే.. 390కి 240 మార్కులు పొందినవారు ఏదైనా ఇంజినీరింగ్ విభాగంలో సీటు ఆశించవచ్చు. బీఫార్మసీలోకి 165 మార్కులతో ప్రవేశం లభిస్తుంది. ఎమ్మెస్సీ జనరల్ స్టడీస్ కోర్సు పిలానీ క్యాంపస్‌లోనే ఉంది. ఎమ్మెస్సీ కోర్సుల్లో చేరినవారు ఏడాది అనంతరం డ్యూయల్ డిగ్రీ చదువుకోవచ్చు. మొదటి ఏడాది కోర్సులో చూపిన ప్రతిభతో ఈ సీట్లు కేటాయిస్తారు. ఈ విధానం ఎంచుకున్నవారు ఐదేళ్ల వ్యవధితో నచ్చిన బ్రాంచీలో ఇంజినీరింగ్‌తోపాటు ఎమ్మెస్సీ పూర్తి చేసుకోవచ్చు. ఇక్కడి ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులు నాలుగేళ్లకే పూర్తవుతాయి. బిట్‌శాట్ స్కోరుతో పలు ఇతర సంస్థలూ బీఈ/బీటెక్‌లోకి అవకాశమిస్తున్నాయి. బిట్‌శాట్ రెండు సెషన్లలో నిర్వహిస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు రెండు సెషన్లలోనూ పరీక్ష రాసుకోవచ్చు. రెండిటిలో ఎక్కువ స్కోరును పరిగణనలోకి తీసుకుంటారు.

సన్నద్ధత

▸ ఎన్సీఈఆర్టీ 11, 12 తరగతుల పాఠ్యపుస్తకాల నుంచే ప్రశ్నలు రూపొందిస్తారు. ప్రకటనలో పేర్కొన్న సిలబస్ ప్రకారం వాటిని శ్రద్ధగా చదవాలి. ముందుగా ప్రాథమికాంశాలతో అధ్యయనం ప్రారంభించాలి. ముఖ్యమైనవి నోట్సు రాసుకోవాలి. పరీక్షకు ముందు మరోసారి చదవాలి.

▸ పాత ప్రశ్నపత్రాలను అధ్యయనం చేయాలి. వీటిద్వారా సబ్జెక్టుల్లో పాఠ్యాంశాలవారీ దక్కుతోన్న ప్రాధాన్యం, ప్రశ్నలడిగే తీరు, స్థాయి తెలుసుకోవచ్చు. సన్నద్ధతను అందుకు అనుగుణంగా మార్పులు చేసుకోవాలి.

▸ పరిమిత పుస్తకాలే ఎంచుకుని, వాటినే ఎక్కువ సార్లు చదవాలి.

▸ చాప్టర్ల వారీ ఎక్కువ మాదిరి ప్రశ్నలు సాధనచేయాలి.

▸ ఆంగ్లం, లాజికల్ రీజనింగ్‌లకూ ప్రాధాన్యం ఉంది కాబట్టి ప్రత్యేక శ్రద్ధతో వాటినీ చదవాలి.

▸ పరీక్షకు ముందు కనీసం పది మాక్ టెస్టులైనా రాయాలి. ఫలితాలు విశ్లేషించుకుని, తర్వాతి పరీక్షలో తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి.

▸ జేఈఈ మెయిన్స్ సన్నద్ధతతో బిట్ శాట్ ఎదుర్కోవచ్చు. మెయిన్స్ మాదిరి, పాత ప్రశ్నపత్రాలు బాగా సాధన చేయడం ఉపయోగపడుతుంది. ఏపీ, టీఎస్ ఈఏపీసెట్లు, డీమ్డ్ సంస్థల ప్రశ్నపత్రాల అధ్యయనంతో ప్రయోజనమే.

▸ రుణాత్మక మార్కుల కారణంగా తెలియనివి వదిలేస్తేనే మేలు. అలాగే జవాబు కోసం ఎక్కువ సమయం తీసుకునే ప్రశ్నలు చివరిలోనే ప్రయత్నించాలి.

పరీక్ష

ఇందులో 4 విభాగాలు ఉంటాయి. పార్ట్-1 ఫిజిక్స్ 30, పార్ట్-2 కెమిస్ట్రీ 30, పార్ట్-3 ఏ.ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ 10, బీ.లాజికల్ రీజనింగ్ 20, పార్ట్-4 మ్యాథ్స్ / బయాలజీ (బీఫార్మసీ కోసం) 40 ప్రశ్నలు వస్తాయి. మొత్తం 130 ప్రశ్నలను 3 గంటల్లో పూర్తి చేయాలి. సెక్షన్ల వారీ సమయ నిబంధనలు లేవు. ప్రతి సరైన జవాబుకూ 3 మార్కులు. తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. నిర్ణీత సమయం కంటే ముందే ప్రశ్నలన్నిటికీ జవాబులు గుర్తించినవారికి అదనంగా 12 ప్రశ్నలు లభిస్తాయి. మ్యాథ్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, లాజికల్ రీజనింగ్ ఒక్కో విభాగం నుంచి 3 చొప్పున ఇవి ఉంటాయి. వీటికి సరైన సమాధానాలు గుర్తిస్తే అదనపు మార్కులు పొందవచ్చు. అయితే ఈ విధానం ఎంచుకున్నవారు ముందు గుర్తించిన 130 ప్రశ్నలకూ జవాబులు మార్చుకోవడానికి అవకాశం ఉండదు. ప్రశ్నలు ఆంగ్ల మాధ్యమంలోనే అడుగుతారు.

ప్రోత్సాహకాలు

బిట్‌శాట్‌లో మెరిసినవారికి స్కాలర్‌షిప్పు లభిస్తుంది. ప్రతిభ, అవసరాల ప్రాతిపదికన వీరికి 10 నుంచి వంద శాతం ట్యూషన్ ఫీజులో రాయితీ ఇస్తున్నారు. మెరిట్ అవార్డు స్కీమ్‌లో భాగంగా.. పరీక్షలో టాప్ 2 శాతంలో నిలిచినవారు ఫీజులో వంద శాతం, ఆ తర్వాత టాప్ 1 శాతం విద్యార్థులు ఫీజులో 50 శాతం రాయితీ పొందవచ్చు. మెరిట్ కమ్ నీడ్ అవార్డుల్లో భాగంగా టాప్ 5 శాతం విద్యార్థులు ఫీజు నుంచి పూర్తిగా మినహాయింపు పొందవచ్చు. ఆ తర్వాతి 2 శాతం టాపర్లు 50, వారి తర్వాత 5 శాతం టాపర్లు 25, అనంతరం 10 శాతం టాపర్లకు 10 శాతం ఫీజు తగ్గిస్తారు.

కోర్సులు

బీఈ: కెమికల్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మాన్యుఫ్యాక్చరింగ్, మ్యాథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్, ఆర్కిటెక్చరల్ అండ్ అర్బన్, మెకానికల్, ఎన్విరాన్‌మెంటల్ అండ్ సస్టెనబిలిటీ, రోబోటిక్స్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్.

బీఫార్మసీ

ఎమ్మెస్సీ: బయలాజికల్ సైన్సెస్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, సెమీకండక్టర్ అండ్ నానోసైన్స్, జనరల్ స్టడీస్.

అర్హత

ఇంజినీరింగ్, ఎమ్మెస్సీ కోర్సులకు ఇంటర్‌లో ఎంపీసీ గ్రూపు తప్పనిసరి. బీఫార్మసీకి బైపీసీ, ఎంపీసీ రెండు గ్రూపులవారూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్‌లో బైపీసీ/ఎంపీసీ గ్రూపులో కనీసం 75 శాతం మార్కులు సాధించాలి. అలాగే సబ్జెక్టుల వారీ 60 శాతం మార్కులు ఉండాలి. 2026లో ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్నవాళ్లు, 2025లో ఉత్తీర్ణులైనవారే అర్హులు. బైపీసీ విద్యార్థులు బీఈ- ఎన్విరాన్‌మెంటల్ అండ్ సస్టెనబిలిటీ ఇంజినీరింగ్ కోర్సుకూ అర్హులే.

వివరాలు

ఆన్‌లైన్ దరఖాస్తులు: సెషన్-1 లేదా సెషన్-1, సెషన్-2 రెండిటికీ కలిపి మార్చి 16 వరకు స్వీకరిస్తారు. సెషన్-2 కోసం ఏప్రిల్ 20 నుంచి మే 2 లోగా వివరాలు నమోదు చేసుకోవాలి.

ఆన్‌లైన్ పరీక్షలు: సెషన్-1 ఏప్రిల్ 15 నుంచి 17 వరకు నిర్వహిస్తారు. సెషన్-2 మే 24 నుంచి 26 వరకు.

ఫీజు: ఏదో ఒక సెషన్ కోసం అబ్బాయిలకు రూ.3600, అమ్మాయిలకు రూ.3100. రెండు సెషన్లకూ కలిపి అబ్బాయిలకు రూ.5600, అమ్మాయిలకు రూ.4600.

వెబ్‌సైట్: https://admissions.bits-pilani.ac.in/

సిపెట్ కోర్సులు

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్), చెన్నై- దేశవ్యాప్తంగా ఉన్న సంస్థల్లో డిప్లొమా, పీజీ డిప్లొమా, పోస్ట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

కోర్సులు:
- డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ
- డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ
- పోస్ట్-గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/ క్యామ్
- పోస్ట్-గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్

అర్హత: కోర్సును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ. గరిష్ఠ వయసు పరిమితి లేదు.

ఎంపిక: ప్రవేశ పరీక్ష ప్రతిభతో.

దరఖాస్తు రుసుము: జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌లకు రూ.500; ఎస్సీ/ఎస్టీలకు రూ.250.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 28.05.2026.

కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేదీ: 07.06.2026.

వెబ్‌సైట్: https://www.cipet.gov.in/

ఐపీఆర్‌సీలో అప్రెంటిస్‌లు

ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)కు చెందిన ప్రొపల్షన్ కాంప్లెక్స్, మహేంద్రగిరి (ఐపీఆర్‌సీ).. అప్రెంటిస్‌ల కోసం దరఖాస్తులు కోరుతోంది.

- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ (ఇంజినీరింగ్): 41
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ (నాన్ ఇంజినీరింగ్): 15
- టెక్నీషియన్ అప్రెంటిస్: 44

అర్హత: గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ అప్రెంటిస్‌కు సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉండాలి. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ (నాన్ ఇంజినీరింగ్)కు బీఏ, బీఎస్సీ, బీకాం అవసరం. టెక్నీషియన్ అప్రెంటిస్‌కు డిప్లొమా కావాలి. 2021-2025 మధ్య డిగ్రీ/డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.

వయసు: గ్రాడ్యుయేట్(ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్) అప్రెంటిస్‌కు 28 ఏళ్లు; టెక్నీషియన్ అప్రెంటిస్‌కు 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్ల వయసు సడలింపు వర్తిస్తుంది.

స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ (ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్) అప్రెంటిస్‌కు రూ.9,000; టెక్నీషియన్ అప్రెంటిస్‌కు రూ.8,000.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

ఇంటర్వ్యూ తేదీలు: గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్, టెక్నీషియన్ అప్రెంటిస్‌లకు 10.01.2026, గ్రాడ్యుయేట్ నాన్ ఇంజినీరింగ్‌కు 11.01.2026.

వెబ్‌సైట్: https://www.iprc.gov.in/index.html

ఎన్‌సీఎల్‌లో సాంకేతిక కొలువులు



సీఎస్ఐఆర్ అనుబంధ సంస్థల్లో ఒకటైన నేషనల్ కెమికల్ ల్యాబొరేటరీ(ఎన్‌సీఎల్).. టెక్నీషియన్, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీచేయనుంది. ఇంజినీరింగ్ డిప్లొమా/ బీఎస్సీ/ ఐటీఐలతో దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రేడ్ టెస్టు, రాత పరీక్షలతో నియామకాలుంటాయి.

ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నవారికి ముందుగా ట్రేడ్ టెస్టు నిర్వహిస్తారు. ఇందులో ఎంపికైనవారికి రాత పరీక్ష ఉంటుంది.

టెక్నీషియన్

ఖాళీలు: 15

అర్హత: పదోతరగతి, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్/ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఫిట్టర్/ ప్లంబర్/ రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ టెక్నీషియన్/ ఎలక్ట్రీషియన్/ వైర్‌మెన్/ డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్) ట్రేడ్‌తో 55 శాతం మార్కులతో ఐటీఐ పూర్తిచేయాలి. రెండేళ్ల అనుభవం ఉండాలి.

వేతన శ్రేణి: నెలకు రూ.19,900-63,200.

పరీక్ష: ఓఎంఆర్/ కంప్యూటర్ బేస్డ్ రాతపరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలతో ఉంటుంది. ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్ మాధ్యమాల్లో పదో తరగతి + ఐటీఐ స్థాయిలో ఉంటుంది. మూడు పేపర్లు ప్రత్యేక వ్యవధుల్లో ఉంటాయి.

◆ పేపర్-1లో మెంటల్ ఎబిలిటీ టెస్టు 50 ప్రశ్నలతో 100 మార్కులకు ఉంటుంది. ప్రశ్నకు రెండు మార్కులు. రుణాత్మక మార్కులు లేవు. జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, సిట్యుయేషనల్ జడ్జిమెంట్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి 60 నిమిషాలు.

◆ పేపర్-2లో జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్‌ల నుంచి 25 ప్రశ్నల చొప్పున వస్తాయి. ప్రశ్నకు మూడు మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ ఒకమార్కు తగ్గిస్తారు. వ్యవధి 30 నిమిషాలు.

◆ పేపర్-3లో సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలు 50 ఉంటాయి. ప్రశ్నకు మూడు మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ ఒకమార్కు తగ్గిస్తారు. వ్యవధి 90 నిమిషాలు.

టెక్నికల్ అసిస్టెంట్

పోస్టులు: 19.

అర్హత: కంప్యూటర్ ఇంజినీరింగ్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ మెకానికల్/ సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌తో డిప్లొమా, రెండేళ్ల అనుభవం ఉండాలి. లేదా కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో బీఎస్సీ, ఏడాది అనుభవం ఉండాలి. విద్యార్హతల డిగ్రీని 60 శాతంతో పూర్తిచేయాలి. **వేతన శ్రేణి:** నెలకు రూ.35,400-1,12,400.

పరీక్ష: ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిషుల్లో 200 మార్కులకు ఉంటుంది. డిప్లొమా/ డిగ్రీ స్థాయిలో ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

◆ పేపర్-1, పేపర్-2 టెక్నీషియన్ పరీక్ష మాదిరిగానే ఉంటాయి. పేపర్-3లో సబ్జెక్టు సంబంధిత 100 ప్రశ్నలకు 300 మార్కులు. ప్రశ్నకు మూడు మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ ఒకమార్కు తగ్గిస్తారు.

సన్నద్ధత

రెండు పోస్టులకు పేపర్-3లో సబ్జెక్టు సంబంధిత అంశాలకు అధిక ప్రాధాన్యం ఉంది.. ముఖ్యాంశాలను అధ్యయనం చేసి పునశ్చరణ చేసుకుంటే ఇందులో ఎక్కువ మార్కులు తెచ్చుకోవచ్చు.

- పేపర్-1లో ఉత్తీర్ణత కోసం.. వివిధ పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను సాధన చేయాలి.
- ప్రతి పేపర్‌కూ వేర్వేరు సమయాలు ఉన్నాయి. నిర్ణీత వ్యవధిలోగా సమాధానాలు రాయడానికి ప్రయత్నించాలి.
- రుణాత్మక మార్కుల కారణంగా తెలిసిన ప్రశ్నలకే జవాబులు రాయాలి.

వివరాలు

వయసు: 28 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: అన్‌రిజర్వుడ్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.500. మహిళలు/ ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12.01.2026

వెబ్‌సైట్: https://recruit.ncl.res.in/

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో..

భారత ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖకు చెందిన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్).. గ్రూప్ 'సి' నాన్-గెజిటెడ్ అండ్ నాన్-మినిస్టీరియల్ కింద స్పోర్ట్స్ కోటా కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- స్పోర్ట్స్ కోటా కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ): 549 పోస్టులు. పురుషులకు 277, మహిళలకు 272.

క్రీడా విభాగాలు: అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, ఫుట్‌బాల్, స్విమ్మింగ్, షూటింగ్, జూడో, కరాటే, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్, హ్యాండ్ బాల్, టేబుల్ టెన్నిస్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, సైక్లింగ్ తదితరాలు.

అర్హతలు: పదో తరగతి ఉత్తీర్ణత. దీంతోపాటు ప్రతిభావంతులైన క్రీడాకారులై ఉండాలి. గత రెండేళ్లలో జాతీయ లేదా అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించినవారు లేదా పోటీల్లో పాల్గొన్నవారు అర్హులు.

వయసు: 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్ల గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.

వేతన శ్రేణి: నెలకు రూ.21,700- 69,100.

ఎంపిక: ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ), మెరిట్ లిస్ట్(స్పోర్ట్స్ ప్రదర్శన ఆధారంగా), ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలతో.

దరఖాస్తు ఫీజు: రూ.159. ఎస్సీ/ఎస్టీ/మహిళలకు ఫీజు లేదు. **ఆన్‌లైన్ దరఖాస్తులు:** 27.12.2025 నుంచి 15.01.2026 వరకు స్వీకరిస్తారు.

వెబ్‌సైట్: https://rectt.bsf.gov.in/

ఎన్ఐటీలో జేఆర్ఎఫ్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), గోవా.. ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రిసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్), ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- జూనియర్ రిసెర్చ్ ఫెలో- 08
- ప్రాజెక్ట్ అసోసియేట్ - 01

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 60 శాతం మార్కులతో బీఈ/ బీటెక్/ ఎంఈ/ ఎంటెక్‌తో పాటు నెట్/ గేట్ స్కోరు ఉండాలి.

వేతనం: నెలకు జూనియర్ రిసెర్చ్ ఫెలోకు రూ.37,000. ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.30,000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 5, 2026.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

వెబ్‌సైట్: https://www.nitgoa.ac.in/careers.html

బీఈఎంఎల్‌లో మేనేజర్లు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్).. గ్రూప్-ఏ, బీ, సీ కేటగిరీల్లో మేనేజీరియల్, ఇంజినీరింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

- డిప్యూటీ జనరల్ మేనేజర్: 13
- అసిస్టెంట్ జనరల్ మేనేజర్: 15
- సీనియర్ మేనేజర్: 05
- మేనేజర్: 05
- ఆఫీసర్/ఇంజినీర్: 03
- అసిస్టెంట్ ఇంజినీర్: 01
- డిప్లొమా ట్రెయినీ: 06
- ఆఫీస్ అసిస్టెంట్: 02

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ/సీఎంఏ, డిప్లొమా, ఎంబీఏ/డిగ్రీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వేతన శ్రేణి: నెలకు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.90,000 - 2,40,000; అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు రూ.80,000 - 2,40,000; సీనియర్ మేనేజర్‌కు రూ.70,000 - 2,00,000; మేనేజర్‌కు రూ.60,000 - 1,80,000; ఆఫీసర్/ఇంజినీర్‌కు రూ.40,000 - 1,40,000; అసిస్టెంట్ ఇంజినీర్‌కు రూ.30,000 - 120,000; డిప్లొమా ట్రెయినీకి రూ.23,910 - 85,570.

ఎంపిక: షార్ట్ లిస్టింగ్, పని అనుభవం, ధ్రువపత్రాల పరిశీలన (అవసరమైతే ఇంటర్వ్యూ/స్కిల్ టెస్ట్)లతో.

దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు ఫీజు లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07.01.2026.

వెబ్‌సైట్: https://www.bemlindia.in/

వర్క్ ఫ్రమ్ హోమ్

ఇంటర్న్‌షిప్స్

కస్టమర్ సక్సెస్ – టెక్నికల్

సంస్థ: ఓటో ఇంటెలిజెన్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: కంప్యూటర్ నెట్‌వర్కింగ్, డాకర్, లినక్స్ **స్టైపెండ్:** రూ.10,000
దరఖాస్తు గడువు: జనవరి 16
☛ https://tinyurl.com/yhbb4acz

స్పికీటెక్ ప్రై.లి.లో

1.. వీడియో ఎడిటర్

నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ప్రీమియర్ ప్రో, వీడియో ఎడిటింగ్, వీడియో మార్కెటింగ్ **స్టైపెండ్:** రూ.2,500-9,000
దరఖాస్తు గడువు: జనవరి 16
☛ https://tinyurl.com/2buxw6t7

2. కిడ్ యానిమేషన్ క్రియేటర్

నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, యానిమేషన్, బ్లెండర్ 3డీ, మోషన్ గ్రాఫిక్స్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.4,000-20,000
దరఖాస్తు గడువు: జనవరి 16
☛ https://shorturl.at/NuYTJ

మార్కెటింగ్

సంస్థ: అప్‌మెంటర్-ఎక్స్ **నైపుణ్యం:** మార్కెటింగ్ **స్టైపెండ్:** రూ.8,500-10,000
దరఖాస్తు గడువు: జనవరి 16
☛ https://tinyurl.com/mru2j2a8

హ్యూమన్ రిసోర్సెస్ (హెచ్‌ఆర్)

సంస్థ: సర్టిఫైజ్‌హబ్ **నైపుణ్యాలు:** ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్
స్టైపెండ్: రూ.1,500-2,000
దరఖాస్తు గడువు: జనవరి 16
☛ https://tinyurl.com/33358trb

కస్టమర్ సర్వీస్/ కస్టమర్ సపోర్ట్

సంస్థ: రైడ్‌యు లాజిస్టిక్స్ యూజీ
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.10,000-12,000
దరఖాస్తు గడువు: జనవరి 16
☛ https://shorturl.at/YJIRu

యూఐ/యూఎక్స్ డిజైన్

సంస్థ: జాబ్‌యారీ
నైపుణ్యాలు: బ్యాక్‌ఎండ్ డెవలప్‌మెంట్, డిజైన్ థింకింగ్, ఫిగ్మా, ఫ్రంట్‌ఎండ్ డెవలప్‌మెంట్, హెచ్‌టీఎంఎల్, పీహెచ్‌పీ, యూఐ అండ్ యూఎక్ డిజైన్, యూజర్ ఇంటర్‌ఫేస్ (యూఐ) డెవలప్‌మెంట్, యూజర్ స్టోరీస్, యూఎక్స్ రిసెర్చ్, వెబ్ డెవలప్‌మెంట్
స్టైపెండ్: రూ.3,000-5,000
దరఖాస్తు గడువు: జనవరి 16
☛ https://shorturl.at/el1Mh

స్టార్టప్ వీసా ప్రక్రియను నిలిపేసిన కెనడా

ఇంటర్నెట్ డెస్క్: స్టార్టప్ వీసా ప్రక్రియను కెనడా నిలిపేసింది. ఆ స్థానంలో వ్యాపారాలు ప్రారంభించే విదేశీయుల కోసం సరికొత్త పథకాన్ని ప్రారంభించనుంది. 2026లో పైలట్ ప్రాజెక్టు రూపంలో కొత్త పథకాన్ని తీసుకురానున్నట్లు వలసలు, శరణార్థులు, పౌరసత్వ కేంద్రం (ఐఆర్‌సీసీ) అధికారులు వెల్లడించారు. కెనడాలో వ్యాపార ఇమ్మిగ్రేషన్ విధానాలను పునర్వ్యవస్థీకరించే చర్యలు తీసుకుంటున్న క్రమంలో స్టార్టప్ వీసా వర్క్ పర్మిట్ దరఖాస్తులను నిలిపివేసినట్లు తెలిపారు. అయితే ఈ వీసా ప్రక్రియ కింద ఇప్పటికే వర్క్ పర్మిట్ పొందినవారు దానిని పొడిగించుకోవడానికి చేసుకున్న దరఖాస్తులకు మినహాయింపు ఉంటుందని వెల్లడించారు.

చైనా వీసాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం

బీజింగ్: భారతీయుల కోసం ఆన్‌లైన్ వీసా దరఖాస్తుల ప్రక్రియను చైనా సోమవారం ప్రారంభించింది. దిల్లీలోని ఈ విధానాన్ని ఎంబసీ అధికారులు ప్రారంభించారు. గతంలో మాదిరిగా చాలా పత్రాలను సమర్పించాల్సిన అవసరాన్ని ఈ విధానం తగ్గించనుంది. https://www.visaforchina.cn/DEL3_EN/qianzhengyewu వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చైనా ఎంబసీ సూచించింది. దరఖాస్తులను నింపాక సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత బయోమెట్రిక్ కోసం స్లాట్ తీసుకోవాలి. ఈ విధానం పర్యాటకుల (ఎల్), వ్యాపారుల (ఎం), విద్యార్థుల (ఎక్స్), ఉద్యోగుల (జెడ్) వీసాలకు వర్తిస్తుంది. కొత్త విధానంలో ఒక్క బయోమెట్రిక్ కోసమే కాన్సులేట్‌ను సందర్శించాల్సి ఉంటుంది. వీసాను యూనియన్‌పే ద్వారా భారతీయ కరెన్సీలో చెల్లించవచ్చు.

హెచ్1బీ, హెచ్4 వీసాలపై ప్రపంచ వ్యాప్తంగా వెట్టింగ్

దిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా హెచ్1బీ, హెచ్4 వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా వెట్టింగ్ జరుగుతోందని దిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. ఈ నెల 15వ తేదీ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైందని వివరించింది. వేల మంది వీసా దరఖాస్తుదారుల ఇంటర్వ్యూలు నిలిపివేసి వాయిదా పడిన నేపథ్యంలో సోమవారం రాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. హెచ్1బీ వీసాలు దుర్వినియోగమవుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. కొత్త దరఖాస్తులను స్వీకరిస్తూనే ఉన్నామని తెలిపింది. సాధ్యమైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

30 మంది దౌత్య అధికారుల్ని వెనక్కి పిలిపిస్తున్న ట్రంప్

- 'అమెరికా ఫస్ట్' మద్దతుదారులతో నింపేందుకే



వాషింగ్టన్: అమెరికా దౌత్య విధానాన్ని పునర్వ్యవస్థీకరించాలని భావిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇందులో భాగంగా సుమారు 30 మంది రాయబారులు, దౌత్యవేత్తలు, దౌత్య కార్యాలయాల్లో ఇతర ఉన్నతస్థాయి పదవుల్లో ఉన్నవారిని వెనక్కి పిలిపించాలని నిర్ణయించారు. 'అమెరికా ముందు' (అమెరికా ఫస్ట్) అనే నినాదానికి పూర్తి అనుకూలంగా ఉన్నవారితో ఆ ఖాళీలను ట్రంప్ యంత్రాంగం భర్తీ చేయనుంది. ఈ మేరకు ఆయా దేశాల్లోని అమెరికా దౌత్య కార్యాలయాల అధిపతులకు గతవారమే సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. వారి పదవీకాలం జనవరిలో ముగుస్తుందని స్పష్టంచేసినట్లు సమాచారం. వీరంతా జో బైడెన్ హయాంలో నియమితులైనవారే. వీరికి నోటీసులు అందడం ప్రారంభమైంది. ఆఫ్రికా ఖండంలోని నైగర్, నైజీరియా, మడగాస్కర్, సోమాలియా తదితర దేశాలకు చెందినవారు సహా 13 దేశాల్లోని దౌత్య సిబ్బంది వెనక్కి రానున్నారు. ఈ జాబితాలో భారత పొరుగు దేశాలైన నేపాల్, శ్రీలంక దేశాల్లోని సిబ్బంది ఉన్నారు. వీరికి వేరే విధులు కేటాయిస్తారు.

గ్రీన్‌లాండ్‌కు రాయబారిని నియమించిన అమెరికా

- డెన్మార్క్ ఆగ్రహం

కోపెన్‌హేగెన్ (డెన్మార్క్): అపార ఖనిజ సంపద ఉన్న గ్రీన్‌లాండ్‌ను చేజిక్కించుకునేందుకు సైనిక చర్యకు సైతం తాము సిద్ధమని గతంలో ప్రకటించిన ట్రంప్ తాజాగా మరో వివాదానికి తెరతీశారు. గ్రీన్‌లాండ్‌కు లూసియానా గవర్నర్ జెఫ్ లాండ్రీని రాయబారిగా నియమిస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. 'గ్రీన్‌లాండ్ మన దేశ జాతీయ భద్రతకు ఎంత ముఖ్యమో జెఫ్‌కు తెలుసు. ఆయన మన దేశ ప్రయోజనాల కోసం, మిత్రదేశాల భద్రత కోసం, యావత్ ప్రపంచం కోసం బలంగా పనిచేస్తారు' అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ట్రంప్ చర్యపై డెన్మార్క్ ఆగ్రహం వ్యక్తం చేసింది. పాక్షిక స్వయంప్రతిపత్తి కలిగిన ప్రాంతమైన గ్రీన్‌లాండ్ డెన్మార్క్‌లో భాగం. 'అమెరికా సహా అన్ని దేశాలతో సంతోషంగా సహకరిస్తాం కానీ మా భవిష్యత్తును మేమే నిర్ణయించుకుంటాం' అని గ్రీన్‌లాండ్ ప్రధాని ప్రకటించారు. 'అమెరికాతో సహా ప్రతిఒక్కరూ డెన్మార్క్ రాజ్య ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలి' అని డెన్మార్క్ విదేశాంగ మంత్రి పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటనపై నిరసన తెలియజేసేందుకు తమ దేశంలోని అమెరికా రాయబారికి సమన్లు జారీ చేస్తామన్నారు.

దివ్యాంగురాలిపై లైంగిక దాడి యత్నం.. ప్రతిఘటించడంతో ఒంటిపై వేడి నూనె

గిరిడీహ్: ఝార్ఖండ్‌లోని గిరిడీహ్ జిల్లాలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్న ఓ దివ్యాంగురాలిపై లైంగిక దాడికి యత్నించిన ఇద్దరు వ్యక్తులు ఆమె ప్రతిఘటించడంతో ఒంటిపై వేడిగా ఉన్న వంట నూనె పోశారు. దీంతో బాధితురాలి ఎడమ చేయి, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించామని, మరొకరి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

స్టార్‌లింక్‌పై మాస్కో గురి

- యాంటీ శాటిలైట్ ఆయుధం అభివృద్ధి?



మాస్కో: అంతరిక్షంలో పాశ్చాత్య దేశాల ఆధిపత్యాన్ని నియంత్రించేందుకు, యుద్ధంలో ఉక్రెయిన్‌కు అందుతున్న నిఘా సాయాన్ని అడ్డుకునేందుకు రష్యా పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇందుకోసం అంతరిక్ష కక్ష్యలో ఉన్న ఎలాన్ మస్క్ సంస్థ 'స్టార్‌లింక్' ఉపగ్రహాలను లక్ష్యంగా చేసుకుని మాస్కో కొత్త ఆయుధాన్ని తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆ ఆయుధాలు కక్ష్యలోనే ఉపగ్రహాలను పేల్చేయనున్నాయని నాటోకు చెందిన దేశాల నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. దీనిపై అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) ఓ కథనాన్ని ప్రచురించింది. దీని ప్రకారం...రష్యా అభివృద్ధి చేస్తున్న ఈ ఆయుధం కేవలం ఉపగ్రహాన్ని మాత్రమే కాకుండా కక్ష్యలోని అధిక భాగాన్ని లక్ష్యంగా చేసుకుంటుంది. ఒకేసారి వేల సంఖ్యలో పెల్లెట్లను పంపించి స్టార్‌లింక్ ఉపగ్రహాలను పిట్టల్లా కూల్చేయగలదు.

మిల్లీమీటర్‌తో భారీ దెబ్బ

ఈ పెల్లెట్లు చాలా చిన్నగా, మిల్లీమీటర్ పరిమాణంలో ఉంటాయి. వీటిని భూమ్మీద గానీ.. అంతరిక్షంలో గానీ గుర్తించడం కష్టం. వీటిని ట్రాక్ చేసే అవకాశం లేకపోవడంతో ముప్పును ముందే పసిగట్టడం సాధ్యం కాదు. వీటితో దాడికి దిగితే కేవలం లక్షిత ఉపగ్రహాలే కాకుండా ఇతర వ్యవస్థలకూ ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. దీన్నే 'జోన్ ఎఫెక్ట్'గా పేర్కొంటున్నారు. ప్రస్తుతం స్టార్‌లింక్ ఉపగ్రహాలు భూమికి 550 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కక్ష్యలో ప్రయాణిస్తున్నాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం, చైనా అంతరిక్ష కేంద్రం దీని కంటే తక్కువ ఎత్తులో ఉండే కక్ష్యలో తిరుగుతున్నాయి. ఒకవేళ స్టార్‌లింక్ ఉపగ్రహాలపై దాడి జరిగితే...వాటి శకలాలు కింద ఉన్న అంతరిక్ష కేంద్రాలను ఢీకొనే ప్రమాదమూ లేకపోలేదని అంచనా.

స్టార్‌లింకే ఎందుకు..?

స్టార్‌లింక్ హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను ఉక్రెయిన్ దళాలు యుద్ధ క్షేత్రంలో తమ కమ్యూనికేషన్స్, శత్రుస్థావరాలను గుర్తించడం కోసం వినియోగిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే రష్యా అనేకసార్లు హెచ్చరికలు చేసింది కూడా. ఉక్రెయిన్‌కు సాయం చేసే కమర్షియల్ శాటిలైట్లను తాము లక్ష్యంగా చేసుకుంటామని బెదిరించింది. తమ ఎస్-500 క్షిపణి వ్యవస్థతో.. తక్కువ ఎత్తులో ఉన్న కక్ష్యలోని లక్ష్యాలను ఛేదించగలమని హెచ్చరించింది. ఇలాంటి ఆయుధంతో అంతరిక్షంలో తీవ్ర గందరగోళం తలెత్తితే.. అది రష్యాకు కూడా ప్రతికూలంగానే మారుతుందని కొందరు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రష్యా, దాని మిత్ర దేశం చైనా సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు, అనేక కంపెనీలు తమ కమ్యూనికేషన్స్, రక్షణ అవసరాల కోసం వేలాది శాటిలైట్లపై ఆధారపడుతున్నాయి. అందువల్ల ఈ ఆయుధాన్ని మాస్కో వినియోగించకుండా అంతర్జాతీయ సమాజం నిరోధించే అవకాశాలున్నాయని అభిప్రాయపడుతున్నారు.



తిరువనంతపురంలోని వెట్టుకాడ్ బీచ్‌లో ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్

మహారాష్ట్ర మాజీ మంత్రి కొకాటేకు సుప్రీం ఊరట

- శాసనసభ్యత్వంపై ప్రస్తుతానికి అనర్హత వర్తించదని స్పష్టీకరణ

దిల్లీ: మోసం, ఫోర్జరీ కేసుకు సంబంధించి మహారాష్ట్ర మాజీ మంత్రి మాణిక్‌రావ్ కొకాటేకు కిందిస్థాయి కోర్టు విధించిన శిక్షపై సుప్రీంకోర్టు సోమవారం స్టే విధించింది. దీంతో ప్రస్తుతం ఆయన శాసనసభ్యత్వంపై అనర్హత వేటు ముప్పు తప్పింది. రూ.30 వేల వార్షిక ఆదాయ పరిమితి కలిగి ఉన్నవారికి ఉద్దేశించిన గృహనిర్మాణ సదుపాయం పొందేందుకు కొకాటే 1989-1992 మధ్య మోసం, ఫోర్జరీలకు పాల్పడ్డారంటూ కేసు నమోదైంది. ఈ వ్యాజ్యానికి సంబంధించి కొకాటే చేసిన అభ్యర్థనపై మహారాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన సెలవుకాలీన ధర్మాసనం ఆదేశించింది. "శిక్షపై స్టే విధిస్తున్నాం. ఎమ్మెల్యేగా ఆయనకు అనర్హత వర్తించదు. అయితే లబ్ధి చేకూర్చే ఎలాంటి అధికార పదవినీ ఆయన ఈ కాలంలో నిర్వహించడానికి వీల్లేదు" అని ధర్మాసనం పేర్కొంది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ సభ్యుడైన మాణిక్‌రావ్ కొకాటేకు ఇటీవల కిందిస్థాయి కోర్టు రెండేళ్ల కారాగార శిక్ష విధించడంతో తన మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

కొత్తతరం ఇంజిన్‌తో ఎస్‌యూ-57 గగనవిహారం



మాస్కో: రష్యాకు చెందిన ఐదోతరం స్టెల్త్ యుద్ధవిమానం ఎస్‌యూ-57.. కొత్తతరం ఇంజిన్‌తో తొలిసారిగా గగనవిహారం చేసింది. ఇజ్డెలియే-177 అనే ఈ ఇంజిన్‌ను నిర్దిష్టంగా ఈ ఫైటర్ జెట్ కోసం రూపొందించారు. ఇది ఎక్కువ శక్తిని ఉత్పత్తి చేయగలదు. గాల్లో మెరుగ్గా పనిచేస్తుంది. ఎస్‌యూ-57ను సిరియా, ఉక్రెయిన్ పోరాటాల కోసం వినియోగించినట్లు రష్యా చెబుతోంది. యుద్ధంలో సత్తా చాటిన ఐదోతరం యుద్ధవిమానం ఇదొక్కటేనని వివరిస్తోంది. గాలి, నేల, సముద్రంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం ఈ ఫైటర్ జెట్‌కు ఉంది. రాత్రి సమయాల్లో, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఇది పోరాడగలదు. ప్రత్యర్థి ప్రయోగించే ఎలక్ట్రానిక్ యుద్ధరీతులను తట్టుకోగలదు. స్టెల్త్ సామర్థ్యం వల్ల ఇది శత్రు రాడార్లకు చిక్కదు. ఎస్‌యూ-57 ఉత్పత్తికి అవసరమైన పూర్తి టెక్నాలజీని అందిస్తామని భారత్‌కు ప్రతిపాదించినట్లు రష్యా అధికారులు తెలిపారు.

చివర్లో మొరాయించిన జపాన్ రాకెట్

- ఉపగ్రహ ప్రయోగం విఫలం!



టోక్యో: జపాన్‌కు చెందిన హెచ్3 రాకెట్.. నేవిగేషన్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలో పెట్టడంలో విఫలైంది. ఈ కొత్త రాకెట్‌కు ఇది రెండో వైఫల్యం. 2023లో తొలిసారి ప్రయోగించినప్పుడు కూడా అది విఫలం చెందింది. ఆ తర్వాత ఆరుసార్లు విజయవంతంగా ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టింది. తాజాగా ఇది మిచిబికి-5 అనే ఉపగ్రహంతో తనెగాషిమా అంతరిక్ష కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. సొంతంగా మరింత కచ్చితత్వంతో కూడిన దిక్సూచి వ్యవస్థను సాకారం చేసుకోవడంలో భాగంగా ఈ శాటిలైట్‌ను జపాన్ పంపింది. అయితే రాకెట్‌లోని రెండో దశ ఇంజిన్.. నిర్దేశిత సమయం కన్నా ముందే ఆగిపోయింది. దీంతో రాకెట్ నుంచి ఉపగ్రహం వేరైనట్లు నిర్ధారణ కాలేదు. దీన్ని నిగ్గుతేల్చేందుకు జపాన్ అంతరిక్ష సంస్థ (జాక్సా).. డేటాను విశ్లేషిస్తోంది. జీపీఎస్ తరహా దిక్సూచి సేవల కోసం జపాన్‌కు ప్రస్తుతం క్వాసీ-జెనిత్ ఉపగ్రహ వ్యవస్థ ఉంది. ఐదు ఉపగ్రహాలతో అది ప్రాంతీయ స్థాయిలో సేవలు అందిస్తోంది. ఆరోదైన మిచిబికి-5 శాటిలైట్‌ను జోడించడం ద్వారా ఈ వ్యవస్థ సేవల్లో కచ్చితత్వాన్ని పొందాలని జపాన్ భావిస్తోంది.

రాజ్యాంగం రద్దుకు భాజపా యత్నాలు

- కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ

దిల్లీ: భారత రాజ్యాంగాన్ని రద్దు చేసే దిశగా భాజపా ప్రభుత్వం ఆలోచిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దేశ వ్యవస్థలను ఆక్రమించడం ద్వారా రాజకీయ అధికారాన్ని తన గుప్పిట్లో పెట్టుకుందని విమర్శించారు. బెర్లిన్‌లోని హెర్టీ స్కూల్‌లో గత వారం ఆయన విద్యార్థులతో మాట్లాడారు. సంబంధిత వీడియోను కాంగ్రెస్ పార్టీ సోమవారం విడుదల చేసింది. "భారత ప్రజాస్వామ్యం ప్రపంచానికే ఆస్తి, ఆ వ్యవస్థపై దాడి ప్రపంచంపై దాడిగానే భావించాలి. ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ.. వంటి కీలక సంస్థలు భాజపా ప్రభుత్వానికి ఆయుధాలుగా మారాయి. ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడిని ఎదుర్కోవడానికి ప్రతిపక్షాలు ఓ కవచాన్ని రూపొందించనున్నాయి' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. గంట నిడివి ఉన్న ఆ వీడియోలో ప్రధాని మోదీ ఆర్థిక విధానాలు, ఎన్నికల ఫలితాలు, భాజపా సిద్ధాంతాలు తదితర అంశాలపై ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు.

మహిళలు కెమెరా ఫోన్లు వాడొద్దు

- రాజస్థాన్‌లోని 15 గ్రామాల్లో నిషేధం

జోధ్‌పుర్: రాజస్థాన్ జాలోర్ జిల్లాలోని 15 గ్రామాల్లో కోడళ్లు, యువతులు కెమెరాలున్న ఫోన్లు వాడటంపై నిషేధం విధించారు. ఇది వచ్చే జనవరి 26 నుంచి అమల్లోకి రానుంది. దీంతోపాటు ఫంక్షన్లకు, పొరుగిళ్లకు వెళ్లినప్పుడూ మహిళలు ఫోన్లు తీసుకెళ్లకూడదని ఆదేశించారు. ఆదివారం గాజీపుర్ గ్రామంలో జరిగిన చౌదరి వర్గం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మహిళలు కీప్యాడ్ ఫోన్లనే వినియోగించాలని ఆదేశించారు. పంచ్ హిమ్మత్‌రామ్ ఈ నిర్ణయం తీసుకుందని 14 సబ్‌డివిజన్ల అధ్యక్షుడైన సుజనారామ్ చౌదరి తెలిపారు. చదువులో ఫోన్లు వాడాల్సిన విద్యార్థులు ఇంట్లోనూ వాటిని వినియోగించాలని సూచించారు. పెళ్లిళ్లు, సామాజిక కార్యక్రమాలు, పొరుగిళ్లకు వెళ్లినప్పుడు స్మార్ట్ ఫోన్లు తీసుకెళ్లకూడదని ఆదేశించామని తెలిపారు.

అత్యవసర వ్యాజ్యాలపై రిజిస్ట్రీని సంప్రదించండి

- న్యాయవాదులకు సీజేఐ ఆదేశం

దిల్లీ: సుప్రీంకోర్టు తక్షణం పరిష్కరించాల్సిన వ్యాజ్యాలు ఏవైనా ఉంటే వాటిపై న్యాయస్థాన రిజిస్ట్రీని సంప్రదించాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ సోమవారం న్యాయవాదులను ఆదేశించారు. కొన్ని అత్యవసర వ్యాజ్యాల పరిష్కారం కోసం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన సెలవుకాలీన ధర్మాసనం సోమవారం విచారణకు కూర్చుంది. అత్యవసర అంశాలను న్యాయవాదులు తమ ముందు ప్రస్తావించడానికి బదులు కోర్టు రిజిస్ట్రీని సంప్రదించాలని, వారు అలాంటి కేసుల్ని ఈ నెల 26నగానీ 29నగానీ విచారణ జరిగేలా జాబితాలో చేరుస్తారని న్యాయమూర్తులు పేర్కొన్నారు. సాధారణంగా సుప్రీంకోర్టు శీతాకాల సెలవులు డిసెంబరు 19 నుంచి జనవరి 5 లేదా 6 వరకూ కొనసాగుతాయి.

2013 ఝీరం ఘాటీ దాడిలో నక్సల్స్‌తో కాంగ్రెస్ కుమ్మక్కు: నడ్డా

జాంజగీర్: ఛత్తీస్‌గఢ్‌లో 2013లో చోటుచేసుకున్న ఝీరం ఘాటీ నక్సల్స్ దాడి ఘటనతో కాంగ్రెస్‌లో కొందరికి సంబంధాలున్నాయని భాజపా జాతీయాధ్యక్షుడు జె.పి.నడ్డా ఆరోపించారు. ఈ రాష్ట్రంలో భాజపా సర్కారు ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం జాంజగీర్‌లో ఏర్పాటు చేసిన 'జనాదేశ్ పరబ్'లో ఆయన మాట్లాడారు. మునుపటి కాంగ్రెస్ ప్రభుత్వాలు నక్సలైట్లతో కుమ్మక్కయ్యాయని, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని సర్కారు మాత్రం వాళ్లతో ముఖాముఖి తలపడుతోందని చెప్పారు. 2013లో పలువురు కాంగ్రెస్ నేతలు ప్రాణాలు కోల్పోయిన ఘటన జరిగినప్పుడు రాష్ట్ర భాజపా వ్యవహారాల బాధ్యునిగా తాను ఆ పరిణామాలను స్వయంగా చూశానని గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ శ్రేణులు తమ సొంత నేతల ప్రాణాలు బలిగొన్నాయని, రక్షించాల్సినవారే భక్షిస్తే సామాన్యుల పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోవచ్చని చెప్పారు. భూపేశ్ బఘేల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లో అధికారంలో ఉన్నప్పుడు పాలనలో అవినీతి ఎలా ఉండేదో ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. నక్సల్స్‌తో ఆ పార్టీ కుమ్మక్కు కావడం అతిపెద్ద సమస్యగా ఉండేదని చెప్పారు. అందుకే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని సాగనంపి, భాజపాను ఎన్నుకున్నారని వివరించారు.

చిన్నారుల్లో సృజనాత్మకత పెంపునకు మ్యూజియం ఆధారిత అభ్యసన కార్యక్రమాలు

- రూపకల్పనకు నీతా ముకేశ్ అంబానీ సాంస్కృతిక కేంద్రం ఒప్పందం

దుబాయ్: మ్యూజియం ఆధారిత అభ్యసన కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించే దిశగా నీతా ముకేశ్ అంబానీ సాంస్కృతిక కేంద్రం (ఎన్ఎంఏసీసీ) కీలక ముందడుగు వేసింది. ఖతార్ మ్యూజియమ్స్ (క్యూఎం)తో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకుంది. ఐదేళ్ల వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన ఈ ఒప్పందంపై రిలయన్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఈశా అంబానీ, క్యూఎం ఛైర్‌పర్సన్ షేఖా అల్ మయస్సా బింట్ హమద్ బిన్ ఖలీఫా అల్ థానీ ఇటీవల దోహాలో సంతకాలు చేశారు. భారత్, ఖతార్ చిన్నారుల్లో సృజనాత్మకతను, సహానుభూతిని ప్రోత్సహించడం కోసం ఉపాధ్యాయులు, వాలంటీర్లకు ఉపయోగపడే కొత్త మార్గాలను ఎన్ఎంఏసీసీ, క్యూఎం రూపొందించనున్నాయి. పాఠశాలలు, అంగన్వాడీలు, కమ్యూనిటీ సెంటర్లలో విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉండే ఇతర కార్యక్రమాలనూ తయారుచేయనున్నాయి.

రష్యా చమురు టెర్మినల్‌పై ఉక్రెయిన్ దాడి

కీవ్: రష్యాపై గురిపెట్టిన ఉక్రెయిన్ దళాలు ఒక చమురు టెర్మినల్, నిలిపిఉన్న రెండు యుద్ధవిమానాలు, రెండు నౌకలపై వరసగా దాడులు జరిపాయి. ఆయుధ డిపోపై దాడి చేయడంతోపాటు డ్రోన్లను ప్రయోగించే చోటుపైనా రష్యా భూభాగంలోనే దాడి చేశామని ఉక్రెయిన్ జనరల్ స్టాఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దాడుల్లో రెండు నౌకలు దెబ్బతిన్నాయని, భారీగా మంటలు చెలరేగాయని చెప్పారు. ఏ ఆయుధాలను వాడారో వెల్లడించలేదు. ఒలెనివ్కాలో రష్యాకు చెందిన బోట్ బ్రిగేడ్ తాత్కాలిక స్థావరంపైనా క్షిపణిని ప్రయోగించామని చెప్పారు. దొనెత్స్క్ ప్రాంతంలో ఆయుధ డిపోపైనా దాడి చేశామని తెలిపారు. ఉక్రెయిన్ పంపిన 41 డ్రోన్లు కూల్చివేశామని రష్యా రక్షణశాఖ తెలిపింది. రష్యా తమపైకి 86 డ్రోన్లను ఆదివారం రాత్రి వదిలిందని, వాటిలో 58ని అడ్డుకున్నామని ఉక్రెయిన్ వాయుసేన ప్రకటించింది.

హింసను నియంత్రించే శక్తి యూనస్ ప్రభుత్వానికి లేదు

- షేక్ హసీనా ధ్వజం



దిల్లీ: విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ బిన్ హాదీ మరణంతో బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఆందోళనలు చెలరేగడంపై ఆ దేశ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా స్పందించారు. మొహమ్మద్ యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం హింసను నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బంగ్లాదేశ్‌లో హింస సాధారణ విషయంగా మారిపోయిందని ఆరోపించారు. ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఈమెయిల్ ఇంటర్వ్యూలో హసీనా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. "ఉస్మాన్ బిన్ హాదీ హత్య అనంతరం ఢాకాలో చెలరేగిన హింస దేశాన్ని మరింత అస్థిరతకు గురిచేస్తోంది. ఈ హత్య యూనస్ పాలనలో పెరిగిపోయిన అక్రమాలను ప్రతిబింబిస్తోంది. యూనస్ పాలనలో హింస సాధారణమైపోయింది. ఈ ఘటనలు బంగ్లాదేశ్ అంతర్గత స్థిరత్వాన్నే కాకుండా, పొరుగు దేశాలతో సంబంధాలనూ దెబ్బతీస్తున్నాయి. ఈ గందరగోళాన్ని, మైనారిటీలపై జరుగుతున్న వేధింపులను, మనం కలిసి నిర్మించిన వ్యవస్థల క్షీణతను భారత్ చూస్తోంది. దేశంలో ప్రాథమిక శాంతిభద్రతలను కాపాడుకోలేని ప్రభుత్వం అంతర్జాతీయంగా విశ్వసనీయత కోల్పోతుంది" అని హసీనా పేర్కొన్నారు. యూనస్ సర్కారు ఇస్లామిక్ తీవ్రవాద శక్తులకు అవకాశం కల్పిస్తోందంటూ ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు.

భారత్‌కు కృతజ్ఞతలు

భారత్‌పై శత్రుత్వ వైఖరిని యూనస్ ప్రభుత్వమే సృష్టిస్తోందని హసీనా అన్నారు. "భారత్-బంగ్లాదేశ్ సంబంధాలు మౌలికమైనవి. మధ్యంతర ప్రభుత్వం పోయిన తర్వాత కూడా అవి కొనసాగుతాయి. భారత్ చూపుతున్న ఐక్యతాభావానికి నేను కృతజ్ఞురాలిని. భారత రాజకీయ పార్టీలన్నీ ఈ అంశంలో ఒకే అభిప్రాయం వ్యక్తం చేయడం నాకు ధైర్యం ఇచ్చింది. నేను దేశం విడిచింది రక్తపాతాన్ని నివారించేందుకే" అని ఆమె తెలిపారు.

ఆ అధికారం యూనస్‌కు లేదు

బంగ్లాదేశ్ విదేశాంగ విధానాన్ని మార్చే అధికారం యూనస్‌కు లేదని షేక్ హసీనా అన్నారు. ఎన్నిక కాని ప్రభుత్వం తీసుకునే వ్యూహాత్మక నిర్ణయాలు దేశ భవిష్యత్తుపై దీర్ఘకాల ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. "బంగ్లాదేశ్ ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం పొందిన వెంటనే, మా విదేశాంగ విధానం మళ్లీ జాతీయ ప్రయోజనాల కోసమే పని చేస్తుంది. అంతే తప్ప.. తాత్కాలికంగా అధికారాన్ని కైవసం చేసుకున్న తీవ్రవాదుల భావజాల కల్పనకు కాదు. ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు న్యాయ నిర్ణయం కాదు. న్యాయ వేషంలో రాజకీయ హత్య. నాకు న్యాయవాదులను ఎంచుకునే హక్కు కూడా ఇవ్వలేదు. అవామీ లీగ్‌ను లక్ష్యంగా చేసుకున్న రాజకీయ వేట ఇది. బంగ్లాదేశ్ రాజ్యాంగ వ్యవస్థపై నమ్మకం ఇప్పటికీ చెక్కు చెదరలేదు" అని షేక్ హసీనా పేర్కొన్నారు.

ఉత్తరాదిలో అతిశీతల పరిస్థితులు

దిల్లీ: ఉత్తరాదిలోని అత్యధిక ప్రదేశాల్లో సోమవారం తీవ్ర శీతల పరిస్థితులు నెలకొన్నాయి. ఉష్ణోగ్రత సాధారణం కన్నా కిందికి జారిపోయింది. దేశ రాజధాని దిల్లీతోపాటు ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్‌లలోని కొన్ని ప్రాంతాల్లో ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకొని జనసామాన్యానికి ఇబ్బందులు సృష్టించింది. దిల్లీలో అత్యధిక ఉష్ణోగ్రత 16 నుంచి 18 డిగ్రీల మధ్యన, అత్యల్ప ఉష్ణోగ్రత 8 నుంచి 11 డిగ్రీల మధ్యన నమోదైందని వాతావరణ శాఖ తెలియజేసింది. పాలం ప్రాంతంలో ఉదయం 8 గంటలకు దట్టమైన పొగమంచు కారణంగా 150 మీటర్ల మేరకు మాత్రమే చూడగలిగే పరిస్థితి నెలకొంది. ఉదయం 9.30 గంటలకు పరిస్థితి మెరుగుపడి 400 మీటర్ల వరకూ చూసేందుకు వీలు కలిగింది. ఈనెల 25న క్రిస్మస్ నాడు దిల్లీలో దాదాపు సాధారణ వాతావరణ పరిస్థితులు ఉంటాయని వాతావరణ శాఖ తెలిపింది. పంజాబ్, హరియాణాలలో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా కొంత ఎక్కువగానే ఉన్నా వాతావరణం అతిశీతలంగా ఉంది. కశ్మీర్‌లో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రాత్రి ఉష్ణోగ్రత పెరిగి పగటి ఉష్ణోగ్రత తగ్గిందని వాతావరణ విభాగం పేర్కొంది.. పంజాబ్‌లో ఈనెల 27 వరకూ, ఉత్తర్‌ప్రదేశ్‌లో మంగళవారం వరకూ రాత్రివేళ, ఉదయం పూట దట్టమైన పొగమంచు కమ్మే అవకాశం ఉంది. హరియాణా, చండీగఢ్‌లలో 25 నుంచి 28వ తేదీ వరకూ ఈ పరిస్థితి ఉంటుంది. దిల్లీలో 24 నుంచి 27వ తేదీ వరకూ దట్టమైన పొగమంచు పరిస్థితి ఉండే అవకాశం ఉంది. రాజస్థాన్, ఉత్తర ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్‌లలో మరో రోజు పాటు దట్టమైన పొగమంచు ఉంటుంది.



హిమాచల్‌ప్రదేశ్‌లోని కోక్సర్ ప్రాంతంలో గడ్డ కట్టిన జలపాతం వద్ద పర్యాటకుల సందడి

ఇకపై సౌదీలో కార్మికులకు ఈ-వేతనం విధానం తప్పనిసరి

ఇంటర్నెట్ డెస్క్: సౌదీ అరేబియాలో పనిచేసే కార్మికులకు 2026 జనవరి 1 నుంచి ఈ-శాలరీ విధానం తప్పనిసరి చేస్తున్నట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. వేతన రక్షణను మెరుగుపరచడం, పారదర్శకత పెంచడం, ఉపాధి ప్రక్రియలను క్రమబద్ధీకరించడం వంటి చర్యల్లో భాగంగా ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా జీతాలు పొందడాన్ని అన్నిరకాల డొమెస్టిక్ వర్కర్స్‌కు తప్పనిసరి చేస్తున్నట్లు సౌదీ అరేబియా మానవ వనరుల మంత్రిత్వశాఖ వెల్లడించింది. నూతన చెల్లింపుల విధానంలో భాగంగా యజమానులు.. వీరికి నగదు రూపంలో జీతాన్ని చెల్లించడానికి బదులుగా గుర్తింపు పొందిన బ్యాంకులు లేదా డిజిటల్ వ్యాలెట్లను ఉపయోగించి నగదు బదిలీ చేయాలని మానవ వనరుల మంత్రిత్వ శాఖ సూచించింది. గడువుకు ముందే కార్మికుల ఒప్పందాలను రద్దు చేయడం వంటి విషయాలను తెలుసుకునేందుకు దీనివల్ల అవకాశం ఉంటుందని తెలిపింది. కార్మికులు ఈ-చెల్లింపులు వద్దంటే.. వారి జీతాలను తగిన పత్రాలతో నగదు లేదా చెక్కు రూపంలో చెల్లించవచ్చని పేర్కొంది.



నౌకా దళంలోకి 'అంజదీప్'

దిల్లీ: తక్కువ లోతు జలాల్లో సంచరించే జలాంతర్గాముల విధ్వంసక నౌక 'అంజదీప్' సోమవారం నౌకాదళంలో చేరింది. కోల్‌కతాకు చెందిన గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) సంస్థ తయారు చేసిన ఈ నౌకను లాంఛనంగా చెన్నైలో నౌకాదళానికి అందజేశారు. నౌకాదళంలో చేరిన ఈ కోవకు చెందిన నౌకల శ్రేణిలో ఇది మూడోది. వాటర్ జెట్స్ సాయంతో ముందుకు నడిచే ఈ నౌకలో అధునాతన తేలికపాటి టార్పిడోలు, దేశీయంగా రూపొందించిన సబ్‌మెరీన్ రాకెట్లు, షాలో వాటర్ సోనార్లు అమర్చి ఉన్నాయి. సముద్ర గర్భం నుంచి వచ్చే ముప్పును పసిగట్టి ధ్వంసం చేసేందుకు కావాల్సిన సరంజామా ఈ నౌకలో ఉంది. భారత నౌకాదళ చరిత్రలో అంజదీప్ అప్పగింత ఒక కీలక ఘట్టమని రక్షణ మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దాదాపు 80 శాతం దేశీయ ఉత్పత్తులు, పరిజ్ఞానంతో రూపొందిన ఈ నౌక రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్‌కు మరో సాక్ష్యమని వెల్లడించింది.



ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబును సత్కరించి, జ్ఞాపిక అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఒడిశా గవర్నర్ హరిబాబు భేటీ

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానం మేరకు ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు సోమవారం ఉండవల్లిలోని ఆయన నివాసానికి వెళ్లారు. సీఎంతో ఆయన మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. హరిబాబుకి ముఖ్యమంత్రి సాదర స్వాగతం పలికి సత్కరించారు.

ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసే లక్ష్యంతో పనిచేయాలి

సమీక్షలో మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఏపీ ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు(ఏపీకేవీఐబీ) సీఈవో కె.సింహాచలం, ఇతర అధికారులతో సోమవారం ఆమె సమీక్ష నిర్వహించారు. "స్వయం ఉపాధి యూనిట్ల మంజూరులో స్థానిక ప్రజాప్రతినిధులు, ఏపీకేవీఐబీ అధికారులు సమన్వయం చేసుకొని అర్హులకు మేలు చేయాలి. ఏపీకేవీఐబీ ఆధ్వర్యంలో లక్ష్యానికి మించి యూనిట్లు ఏర్పాటు చేయడం హర్షణీయం. స్వయం ఉపాధి రుణాలపై జిల్లాల్లో అవగాహన సదస్సులు నిర్వహించండి" అని సవిత పేర్కొన్నారు.

సిమెంటు ధరలు సవరిస్తూ ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: వివిధ ప్రభుత్వ శాఖలకు ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) సరఫరా చేసే సిమెంటు ధరలను సవరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిమెంటు బస్తాపై విధించే జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి కౌన్సిల్ సవరించింది. దీంతో జీఎస్టీ 10 శాతం తగ్గింది. ఆ మేరకు సిమెంటు ధరలను ప్రభుత్వం సవరించింది. కేటగిరీ వారీగా బస్తాకు కనిష్ఠంగా రూ.19, గరిష్ఠంగా రూ.21 వరకు ధర తగ్గించింది. సవరించిన ధరల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఏపీటీపీసీ వీసీఎండీని ఆదేశించింది.

దేశ సమగ్రతకు భంగం కలిగేలా.. గాదె ఇన్నయ్య ప్రసంగం

రిమాండ్ డైరీలో ఎన్ఐఏ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: దేశ సమగ్రతకు భంగం కలిగించేలా, నిషేధిత మావోయిస్టు పార్టీ వైపు ప్రజలు ఆకర్షితులయ్యేలా ప్రసంగించిన కారణంగానే పీపుల్స్‌వార్ మాజీ నేత, భారత్ బచావో ప్రధాన కార్యదర్శి గాదె ఇన్నయ్యను ఆరెస్టు చేసినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) పేర్కొంది. వరంగల్ జిల్లా జఫర్‌గడ్‌లో ఆదివారం ఇన్నయ్యను అరెస్టు చేసిన ఎన్ఐఏ సోమవారం హైదరాబాద్‌లోని ఎన్ఐఏ న్యాయస్థానంలో హాజరుపరిచింది. ఆయన అరెస్టును దారితీసిన అంశాలను రిమాండు డైరీలో వివరించింది. 'అక్టోబరు 18న మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ అంత్యక్రియల సందర్భంగా ఏర్పాటుచేసిన సంతాప సభలో గాదె ఇన్నయ్య ప్రసంగించారు. వికల్ప్‌ది బూటకపు ఎన్‌కౌంటర్ అని, చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారని వ్యాఖ్యానించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టాం. మావోయిస్టు పార్టీకి నిధులు సమకూర్చడంతోపాటు అన్ని రకాలుగా మద్దతు తెలుపుతున్నట్లు, ఇతర కేసులలో నిందితులుగా ఉన్న పలువురితోనూ ఇన్నయ్యకు సంబంధాలు ఉన్నట్టు తేలింది' అని రిమాండ్ డైరీలో ఎన్ఐఏ పేర్కొంది.

ప్రకృతి ప్రణమిల్లి.. పచ్చదనం శోభిల్లి..!

- గుజరాత్‌లోని స్టాట్యూ ఆఫ్ యూనిటీ చుట్టూ ప్రత్యేకతలెన్నో..
- ఉద్యానాలు, థీమ్ పార్కులతో కనువిందు చేస్తోన్న ఏక్తానగర్

గుజరాత్ నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

గుజరాత్ రాష్ట్రంలోని నర్మదా నది తీరంలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహాన్ని ఏర్పాటుచేసిన ప్రాంతాన్ని గత ఏడేళ్లలో ఏక్తానగర్‌గా గుర్తించి అభివృద్ధి చేశారు. పచ్చదనం, జీవవైవిధ్యంతో పర్యాటక స్వర్గధామంగా తీర్చిదిద్దారు. 182 మీటర్ల (597 అడుగులు) ఈ మహారూపం ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహంగా గుర్తింపు పొందింది. 2018 అక్టోబరు 31న ప్రధాని నరేంద్రమోదీ దీన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.

ప్రత్యేకం.. వామన వృక్ష వాటిక

ఏక్తానగర్‌లో ఏక్తానర్సరీ పక్కనే ఉంటుంది వామన వృక్ష వాటిక. ఈ తోటలో 450కంటే ఎక్కువ జాతులకు చెందిన వెయ్యికి పైగా బోన్సాయ్ మొక్కలు ఉన్నాయి. వీటిని ఆరు విభిన్న గ్యాలరీల్లో ప్రదర్శిస్తున్నారు. మామే, షోహిన్, చు, డై వంటి అనేక రకాలు ఇక్కడి ప్రత్యేకత. అరచేతిలో ఇమిడిపోయే వృక్షాలూ ఉన్నాయి. ఇందులోనే జెన్ గార్డెన్స్, చిన్న జలపాతాలు, కొలనులు ఉన్నాయి.



ఏక్తానగర్‌లో వామన వృక్ష వాటికలో మొక్కలు

ఖల్వానీ, జర్వాణి ఎకోటూరిజం భలే..

నర్మదా నదిపై నిర్మించిన సర్దార్ సరోవర్ డ్యామ్ పరిసరాల్లో ఖల్వానీ ఎకో టూరిజం ఉంది. ట్రీహౌస్‌లు, క్యాంప్ ఫైర్లు, యాంపి థియేటర్, చెట్ల మధ్య నడిచేందుకు అనువుగా అటవీబాటలు ఆకర్షణగా మలిచారు. 14 కిలోమీటర్ల పొడవుతో 3 గంటల పాటు ఉండే సైక్లింగ్ టూర్ మరో ఆకర్షణ. 100 రకాల సీతాకోకచిలుకలతో బటర్‌ఫ్లై పార్కు ఆకట్టుకుంటోంది.

✦ నర్మదా నదికి సమీపంలో ఉన్న చిన్న గ్రామం జర్వాణి. ఇది శూల్పనేశ్వర్ వన్యప్రాణుల అభయారణ్యంలో భాగం. ఇక్కడ వృక్షజాలం, జంతుజాలం పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. అడవిలో వైల్డ్ ట్రెక్కింగ్‌కు అవకాశం ఉంది. హెర్బల్ స్టీమ్ బాత్, థెరప్యూటిక్ మసాజ్‌కు పర్యాటకులు క్యూ కడుతుంటారు. సర్దార్ సరోవర్ ఆనకట్ట, పంచముళి సరస్సు ఆకట్టుకుంటాయి.

మేజ్ గార్డెన్, మియావాకీ ఫారెస్ట్..

మూడు ఎకరాల్లో విస్తరించి ఉంది మేజ్ గార్డెన్ (చిట్టడవి తోట). కేవలం ఎనిమిది నెలల కాలంలో దీన్ని అభివృద్ధి చేశారు. కెవాడియా వద్ద ప్రత్యేక ఆకారంలో ఇది నిర్మితమైంది. ఇందులో 1.80 లక్షల మొక్కలు ఉండగా.. ఆరెంజ్ జెమిన్, మధు కామిని, గ్లోరీ బోవర్, మెహందీ వంటి రకాలు ప్రత్యేకం. ఒకప్పుడు శిథిలాల డంపింగ్ ప్రదేశంగా ఉన్న ఇది, పచ్చదనానికి చిరునామాగా మారింది. పువ్వులు, కలప, పండ్ల తోటలతో మియావాకీ ఫారెస్టు ఆకట్టుకుంటోంది. హెర్బల్‌గార్డెన్, బటర్‌ఫ్లై గార్డెన్, కాక్టస్ గార్డెన్, ది వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ (భారత్ వాన్), యూనిటీ గ్లో గార్డెన్, చిల్డ్రన్ న్యూట్రిషన్ పార్కు, జంగిల్ సఫారీ.. ఇలా అనేక థీమ్ పార్కులతో కట్టిపడేస్తుండటం ఇక్కడి ప్రత్యేకత.

పర్యావరణానికి పెద్దపీట

ఏక్తానగర్‌లో బైకులు, కార్లు, బస్సులు అన్నీ ఎలక్ట్రిక్ వాహనాలే. ప్రైవేటు వాహనాల్లో ఏక్తానగర్ వరకు వెళితే అక్కడి నుంచి పర్యాటక ప్రదేశాలకు ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రయాణించవచ్చు. ఏక్తానగర్ అభివృద్ధిని గుజరాత్ ప్రభుత్వం నియమించిన యంత్రాంగం పర్యవేక్షిస్తోంది. పర్యావరణ హితమైన పర్యాటకాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏటా 5 లక్షల మొక్కలు నాటుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నారు.

గ్రామీణ పేదలకు వ్యతిరేకంగా కాంగ్రెస్, కమ్యూనిస్టుల కుట్ర

భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: ఎన్డీయే ప్రభుత్వం నేటి కాలానికి తగ్గట్టు ఉపాధి హామీ పథకంలో మార్పులు చేస్తే.. అందులోని మంచిని చూడాల్సిందిపోయి. . పేరు మార్చారని విమర్శించడం సరికాదని భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గ్రామీణ పేదలకు వ్యతిరేకంగా కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'పేదలకు మంచి జరిగినా.. ఆ నిర్ణయం ఎన్డీయే ప్రభుత్వం తీసుకుంది కనుక వ్యతిరేకించాలనే పడిగట్టు భావజాలంతో 'వికసిత్ భారత్- గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ్ (వీబీ-జీ రామ్-జీ)' పథకంపై వక్ర భాష్యాలు ప్రచారం చేస్తున్నారు. సెక్యులరిజం అంటే ప్రతి పేరులోనూ హిందుత్వ దేవుళ్ల పేర్లు వెతుక్కొని వ్యతిరేకించడం కాదని తెలుసుకోవాలి. కమ్యూనిస్టులు ఏనాడైనా గాంధీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు చేశారా..? కనీసం కార్యాలయాల్లో గాంధీ ఫొటో పెట్టారా..? సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ పార్టీ ఒక పథకానికి మహాత్మాగాంధీ పేరు పెట్టి.. ఆయనను గౌరవించామని ప్రచారం చేసుకుని రాజకీయ లబ్ధి పొందింది. గ్రామ సీమలే దేశానికి పట్టుగొమ్మలని చెప్పిన గాంధీ ఆశయాలు మాత్రం నెరవేర్చలేదు' అని విమర్శించారు.

ఆడిట్ అభ్యంతరాలు పరిష్కరించుకోవాలి

- పబ్లిక్ అండర్‌టేకింగ్ కమిటీ సూచన
- ఏపీ జెన్‌కో కార్యకలాపాలపై సమీక్ష

ఈనాడు, అమరావతి: ఏపీ జెన్‌కోలో 2015-16 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అభ్యంతరాలను పరిష్కరించుకోవాలని ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ (పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటి) అధికారులకు సూచించింది. ఈ అంశంపై రెండు మూడు నెలల్లో మరోసారి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపింది. విజయవాడలోని విద్యుత్తు సౌధలో జెన్‌కో వార్షిక అకౌంట్లు, కాంట్రాక్టు లేబర్, రెగ్యులర్ ఉద్యోగుల అంశాలపై కమిటీ ఛైర్మన్ కూన రవికుమార్ నేతృత్వంలోని కమిటీ సోమవారం అధికారులతో సమీక్షించింది. ఈ సందర్భంగా కమిటీ ప్రస్తావించిన అంశాలు..

● సంస్థలో ఆడిట్ అభ్యంతరాలను దీర్ఘకాలంగా ఎందుకు పెండింగ్‌లో ఉంచారు? వాటిని తక్షణం పరిష్కరించడంపై దృష్టి పెట్టండి.

● ఎన్టీపీసీ థర్మల్ యూనిట్ల నిర్వహణ తీరు బాగుంది. అదే విధానాలను జెన్‌కో ఎందుకు అనుసరించడం లేదు? ఎన్టీపీసీ థర్మల్ యూనిట్లలోని కోల్/యాష్ ప్లాంట్ల నిర్వహణను వార్షిక నిర్వహణ కింద ప్రైవేటు వారికి అప్పగిస్తుందని.. అదే విధానాన్ని అనుసరించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు జెన్‌కో అధికారులు కమిటీకి వివరించారు.

● జెన్‌కో కొత్తగా నిర్మించిన థర్మల్ విద్యుత్తు కేంద్రాల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం చాలా తక్కువ ఉండటానికి కారణం ఏమిటి? అన్న కమిటీ ప్రశ్నకు.. యూనిట్ల నిర్వహణకు నాణ్యమైన బొగ్గు అందుబాటులో లేదని, సమస్యను అధిగమించేందుకు ప్రత్యామ్నాయంగా ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ నుంచి బొగ్గు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

● ఏపీ జెన్‌కోలో పనిచేస్తున్న స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ ఉద్యోగుల ఖాళీల భర్తీలో సీనియారిటీ ఆధారంగా నిర్ణయం తీసుకునేలా ఒక విధానాన్ని అనుసరించాలని కమిటీ సూచించింది.

● గత వైకాపా ప్రభుత్వంలో ఏపీపీడీసీఎల్‌లో 39 మంది సిబ్బంది నియామకాలు జరిపిన తీరుపై వివరాలను తెలుసుకుంది.

వైద్యారోగ్య శాఖకు.. 'ఆన్‌లైన్' లక్ష్యం

- ఫిబ్రవరి మాసాంతానికి రాష్ట్రమంతటా ఈ- పాలన అమలయ్యేలా ప్రణాళిక

ఈనాడు, అమరావతి: 'జనవరి 15 నుంచి అన్ని దస్త్రాలు ఆన్‌లైన్‌లోకి రావాలి.. అన్ని సేవలు ఆన్‌లైన్‌లో అందాలి.. అప్పుడు సేవల్లో సౌలభ్యంతోపాటు సంతృప్తస్థాయి పెరుగుతుంది.' అని ఇటీవల కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వైద్యారోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ పత్రరహిత పాలన దిశగా కసరత్తు ప్రారంభించింది. వైద్యారోగ్యశాఖ కార్యదర్శి, కమిషనర్ కార్యాలయాలతోపాటు.. సెకండరీ హెల్త్, ఎన్టీఆర్ వైద్య సేవ, పబ్లిక్ హెల్త్, వైద్య విద్య సంచాలకులు, ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు - మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ), ఔషధ నియంత్రణ శాఖ, ఆయుష్ ఇలా అన్ని రాష్ట్ర ప్రధాన కార్యాలయాలు ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి లక్ష్యం చేరుకోవాలని నిర్ణయించాయి. అంతర్జాలం, కంప్యూటర్లు ఇతరత్రా మౌలిక సదుపాయాలు అందుబాటులో లేని గ్రామీణ ప్రాంతాల్లోని వైద్యశాలలకు 100 శాతం పత్రరహిత పాలనకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు గడువు ఇచ్చారు.

ఈ- పాలన లక్ష్యాలు ఇవీ..

✦ కార్యాలయాల్లో అన్ని అధికారిక లేఖలు, నివేదికలు, దస్త్రాలు డిజిటల్ రూపంలో నిర్వహించాలి.

✦ భౌతిక దస్త్రాలకు బదులుగా.. ఈ ఆఫీస్, శాఖ పోర్టల్ ద్వారా సమాచార వ్యవస్థ సాగాలి..

✦ డిజిటల్ వర్క్ ఫ్లో, డాక్యుమెంట్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రానిక్ రికార్డుల సురక్షిత నిర్వహణపై సిబ్బందికి అవగాహన కల్పించాలి.

✦ కాగితం వినియోగం, ప్రింటింగ్, ఫొటోకాపీల ఖర్చులు తగ్గించాలి. తప్పనిసరైతేనే కాగితం వినియోగించాలి.

గడువు నిర్దేశించారిలా..

కార్యాలయం	పత్రరహిత పాలన అమలు చేయాల్సిన తేదీ
రాష్ట్ర ప్రధాన కార్యాలయాలు	31.12.2025
డీఎం అండ్ హెచ్‌వో	31.01.2026
డీసీహెచ్ఎస్	31.01.2026
పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు	28.02.2026
హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు	28.02.2026

✦ పత్రరహిత పాలన అమలుపై నెలవారీ సమీక్షించి, పురోగతిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వాలి.

✦ ఉత్తమ పద్ధతులు, ఈ- పాలనలో ఎదురైన ఇబ్బందులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ పాలసీ ఖరారు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: ఏపీ ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీ విధానం 2025-30 అమలు మార్గదర్శకాలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ సెక్టార్, సెమీకండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్రికేషన్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈ విధానాన్ని రూపొందించినట్లు పేర్కొంది. ఆయా రంగాల్లో భారీఎత్తున పెట్టుబడులు ఆకర్షించాలన్నదే లక్ష్యమని తెలిపింది. ఐటీ, అనుబంధ రంగాలు, ఎలక్ట్రానిక్స్, స్టార్టప్‌ల సమస్యలు పరిష్కరించేందుకు సలహాదారుల కమిటీని పునర్వ్యవస్థీకరించినట్లు వెల్లడించింది. పాలసీ విధానాలు, పర్యవేక్షణ, పరిశ్రమ అభివృద్ధి ద్వారా ఆర్థిక, సాంకేతిక లక్ష్యాలు సాధించే దిశగా కమిటీ పర్యవేక్షిస్తుందని వివరించింది.

విధివిధానాలిలా..

➤ కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించాలి. అన్ని ప్రాజెక్టులకు కేంద్ర మంత్రిత్వ శాఖ నుంచి అవసరమైన అనుమతులు పొందాలి.

➤ మొదటగా అందే 10 ప్రతిపాదనలను ఎర్లీబర్డ్ కింద పరిగణించి ప్రత్యేక ప్రోత్సాహకాల చెల్లింపు. సదరు సంస్థ ఐదేళ్లలో పెట్టాల్సిన కనీస పెట్టుబడి రూ. 250 కోట్లు. ఆ సంస్థకు మూలధన రాయితీ మొత్తాన్ని రెండేళ్లలో సమాన వాయిదాల్లో చెల్లింపు. ఒకవేళ ఎర్లీబర్డ్ ప్రోత్సాహకాలకు ప్రాజెక్టు అర్హత పొందకుంటే.. మ్యాచింగ్ సబ్సిడీ పొందే అవకాశం.

➤ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కాంపోనెంట్ స్కీం కింద కేంద్రం ఇచ్చే సబ్సిడీకి సమానంగా మ్యాచింగ్ సబ్సిడీ ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆరు నెలల్లో చెల్లించేందుకు నిర్ణయం.

➤ ఎర్లీబర్డ్ విధానంలో ప్రోత్సాహకాలు పొందిన సంస్థలకు మ్యాచింగ్ సబ్సిడీ అర్హత ఉండదు.

➤ ప్రోత్సాహకాలు పొందేందుకు కేంద్రం నిర్దేశించిన మూడు లక్ష్యాల్లో కనీసం 50 శాతం సాధించాలి.

➤ ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులకు కేటాయించే భూములకు మార్కెట్ ధరలో 75 శాతం రాయితీ.

➤ సంస్థలు వినియోగించే విద్యుత్‌కు ఆరేళ్ల పాటు సుంకం రాయితీ.

➤ ఐదేళ్లలో కనీసం రూ.1,000 కోట్లు, వెయ్యి మందికి ఉపాధి కల్పించే వాటిని మెగా ప్రాజెక్టులుగా పరిగణించి.. టైలర్‌మేడ్ విధానంలో ప్రోత్సాహకాలు పొందే అవకాశం.

➤ రాష్ట్రంలో ప్రాజెక్టులు ఏర్పాటు చేసే సంస్థలు.. అవి పెట్టే ఖర్చులో గరిష్ఠంగా 75 శాతం ప్రోత్సాహకాల కింద పొందే వీలు.

పవన్‌ను కలిసిన వ్లాగర్ స్వాతిరోజా

ఈనాడు, అమరావతి: దేశవ్యాప్తంగా బైక్‌పై ప్రయాణిస్తూ, ఆధ్యాత్మిక అంశాలపై వీడియోలు చిత్రీకరిస్తున్న జెన్ జడ్ వ్లాగర్ స్వాతిరోజాను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందించారు. ఆమె యాత్రా విశేషాలు అడిగి తెలుసుకున్నారు. విజయవాడ కనకదుర్గ ఆలయంలో అమ్మవారి దర్శనం అనంతరం ఆమె పవన్‌ను మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. కొద్దివారాల క్రితం శ్రీశైలంలో పర్యటించినప్పుడు ఆమె వసతి, భద్రతకు సంబంధించిన సమస్యలను ఎదుర్కోవడంతో, విషయం తెలుసుకున్న పవన్ రాష్ట్రంలోని శ్రీశైలం, తిరుమల, శ్రీకాళహస్తి, విజయవాడ ఆలయాల్లో దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా బైక్ రైడింగ్, బైక్‌లపై తనకున్న ఆసక్తిని పవన్ ఆమెతో చర్చించారు.

వెంకటేశ్‌నాయుడి పిటిషన్లో కౌంటర్ వేయండి

సీఐడీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడు వెంకటేశ్‌నాయుడు(ఏ-34) బెయిలు కోసం దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటర్ వేయాలని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. విచారణ ఈనెల 30కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

కానిస్టేబుళ్ల శిక్షణ ప్రారంభం

వివిధ కారణాలతో రిపోర్టు చేయని 205 మంది

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి సోమవారం నుంచి శిక్షణ ప్రారంభమైంది. సివిల్, ఏపీఎస్పీ విభాగాలకు సంబంధించి మొత్తం 5,751 మంది శిక్షణ కేంద్రాల్లో రిపోర్టు చేయాల్సి ఉండగా.. 5,546 మంది చేరారు. మరో 205 మంది వివిధ కారణాలతో రిపోర్టు చేయలేదు. వీరిలో కొందరు ఇప్పటికే ప్రభుత్వ ఉపాధ్యాయులుగా, రైల్వే, ఇతర శాఖల్లో ఉద్యోగాలకు ఎంపికై వాటిల్లో చేరారు. మరికొందరు అనారోగ్య కారణాలు, వ్యక్తిగత సమస్యలతో నిర్దేశిత గడువులోగా రాలేకపోయారు. వీరందరికీ శిక్షణలో చేరేందుకు గరిష్ఠంగా 14 రోజుల పాటు పోలీసు శాఖ సమయమిచ్చింది. ఈలోగా వారు వచ్చి రిపోర్టు చేస్తే ఈ బ్యాచ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. కొందరు గర్భిణిలు, బాలింతలు ఉండటంతో వారికి తర్వాత బ్యాచ్‌ల్లో శిక్షణ పొందేందుకు అవకాశం కల్పించారు. అనంతపురం, తిరుపతిలో ఓ ఇద్దరు అభ్యర్థులు గెడ్డాలు తీయటానికి అంగీకరించకపోవటంతో వారిని వెనక్కి పంపించారు. మొత్తం 9 డీటీసీలు, 4 పీటీసీలు, 8 పీటీసీల్లో శిక్షణ మొదలైంది. సివిల్ కానిస్టేబుళ్లకు సంబంధించి 3,342 మంది రిపోర్టు చేయాల్సి ఉండగా 3,200 మంది, ఏపీఎస్పీకి సంబంధించి 2,409 మందికి గాను 2,346 మంది రిపోర్టు చేశారు. ఒంగోలులో హోంమంత్రి వంగలపూడి అనిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మిగతా చోట్ల ఆయా జిల్లాల ఎస్పీలు, రేంజ్ డీఐజీలు పాల్గొన్నారు.

నల్లబర్లీ సాగును అరికట్టాలి

వ్యవసాయశాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ఈనాడు, అమరావతి: నల్లబర్లీ పొగాకు సాగును అరికట్టాలని, తెల్లబర్లీ పొగాకును సాగు చేసే రైతులు సంబంధిత కంపెనీలతో 100% కొనుగోలు ఒప్పందాలు చేసుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్లకు వ్యవసాయశాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సూచించారు. సోమవారం ఆయన బర్లీ పొగాకు సాగుపై గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. తెల్లబర్లీ పొగాకు కొనుగోలుకు ఇకపై ప్రభుత్వం ఎలాంటి బాధ్యతా వహించదని సమావేశంలో ఆయన పేర్కొన్నారు. అనధికార నల్లబర్లీ పొగాకు సాగు కట్టడి చేయడంలో టాస్క్‌ఫోర్స్ బృందాల్ని చైతన్యం చేయాలని సూచించారు. గత ఏడాది మార్క్‌ఫెడ్ ద్వారా రాష్ట్రంలోనే మొదటిసారి 11,990 మంది రైతుల నుంచి 19.79 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేశామని, రూ.146 కోట్లు విడుదల చేశామని వివరించారు. తెల్లబర్లీ పొగాకు సాగుదారుల జాబితాతో పాటు కొనుగోలు ఒప్పందాల వివరాల్ని జత చేసి ఇవ్వాలని డైరెక్టర్ మనజీర్ జిలానీని ఆదేశించారు.

ప్రారంభమైనప్పటి నుంచి అసెంబ్లీకి వార్షిక నివేదికలు ఇవ్వలేదు

- ఇప్పటికీ ఆడిట్ అభ్యంతరాలను పరిష్కరించలేదు
- డెయిరీ అభివృద్ధి సంస్థ అధికారులపై పీయూసీ అసహనం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర డెయిరీ అభివృద్ధి సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి వార్షిక నివేదికలను, ఆడిట్ నివేదికలను అసెంబ్లీకి ఎందుకు సమర్పించలేదని అసెంబ్లీ ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ (పీయూసీ) నిలదీసింది. ఎప్పటికప్పుడు ఆడిట్ అభ్యంతరాలను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించింది. సోమవారం విజయవాడలోని జెన్‌కో కార్యాలయంలో ఈ కమిటీ సమావేశమైంది. కమిటి ఛైర్మన్ కూన రవికుమార్, సభ్యులు వసంత కృష్ణ ప్రసాద్, గౌతు శిరీష, శ్రావణ్‌కుమార్, వర్ల కుమార్ రాజా, సంబంధిత ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

చీటీపై సమాచారం పంపుతారా!

డెయిరీ అభివృద్ధి సంస్థ నివేదికలు సమర్పించకపోవడంపై గత సమావేశంలో చర్చించడానికి ఆహ్వానిస్తే అధికారులు ఎవరూ రాకపోగా.. ఆడిట్ నివేదికలను అసెంబ్లీకి సమర్పించామంటూ ఒక చీటీపై సమాచారం పంపారు. నివేదికలు సమర్పించకపోగా, తప్పుడు సమాచారామిస్తారా అని కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సోమవారం సమీక్షకు కూడా సంస్థ ఉన్నతాధికారులు రాకుండా, ప్రతినిధిగా ఒక అదనపు సంచాలకుడిని పంపడంపై కమిటీ అసహనం వ్యక్తం చేసింది.

రూ.100 కోట్ల నష్టం

అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు సంబంధించి రూ.100కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు సమీక్షలో కమిటీ గుర్తించింది. గోదాము నిర్మాణాలు చేపట్టేందుకు 2017లో కేంద్ర ప్రభుత్వం ఒక పథకం కింద రూ.228 కోట్లు రాష్ట్రానికి కేటాయిస్తే అందులో కేవలం రూ.98 కోట్లే రాష్ట్రం వాడుకోగలిగిందని గుర్తించారు. అంతేగాక ఈ పథకం కింద కేంద్రం వడ్డీ రాయితీ ఇస్తోందని, 9% వడ్డీలో 6% కేంద్రమే భరిస్తుంది, రాష్ట్రం కేవలం 3% వడ్డీ కడితే సరిపోతుంది గుర్తుచేసింది. అధికారుల నిర్లక్ష్యం వల్ల దానిని వినియోగించుకోలేకపోయామని కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోవైపు ఈ సంస్థ గిడ్డంగుల్లో ఆక్యుపెన్సీ 64 శాతమే ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 2022-24 మధ్య ఈ సంస్థకు పౌరసరఫరాల సంస్థ నుంచి సుమారు రూ. 110 కోట్లు, ఎఫ్‌సీఐ నుంచి రూ.6 కోట్లు పెండింగ్ పడితే ఇప్పటికీ దీనిపై అధికారులు ఫాలోఅప్ చేయలేకపోయారని కమిటీ మండిపడింది.

శాప్ వ్యవహారాలపై నేడు సమీక్ష

అసెంబ్లీ కమిటీ హాలులో మంగళవారం పీయూసీ సమావేశం జరగనుంది. ఏపీ ఫైబర్‌నెట్, ఆడుదాం ఆంధ్రాతోపాటు శాప్ వ్యవహారాలు, ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, పోలీస్ హౌసింగ్, మైనారిటీ, క్రైస్తవ ఆర్థిక సంస్థలపై సమీక్షించనుంది.

న్యాయవాదులకు సాయం కోసం రూ.5.6 కోట్లు

ఈనాడు, అమరావతి: న్యాయవాదుల మరణానంతర ప్రయోజనాలు, వైద్య ఖర్చులు, పదవీ విరమణ ప్రయోజనాల నిమిత్తం ఆర్థిక సాయం కోసం వచ్చిన దరఖాస్తులన్నింటిని పరిష్కరిస్తూ ఏపీ బార్ కౌన్సిల్ న్యాయవాదుల సంక్షేమ కమిటీ నిర్ణయం తీసుకుంది. సోమవారం జరిగిన సంక్షేమ కమిటీ సమావేశంలో హైకోర్టు, ఏపీ న్యాయశాఖ ప్రతినిధులతోపాటు ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథరెడ్డి, సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, పి. నరసింగరావు పాల్గొన్నారు. మరణానంతర ప్రయోజనం కింద 54 మంది న్యాయవాదుల కుటుంబసభ్యులకు రూ. 3.51 కోట్లు, వైద్య ఖర్చుల కోసం 137 మంది న్యాయవాదులకు రూ.1.90 కోట్లు, పదవీ విరమణ ప్రయోజనం కింద ఏడుగురు న్యాయవాదులకు రూ.19.20 లక్షలు.. మొత్తం కలిపి రూ. 5,60,80,000 న్యాయవాదుల కుటుంబాలకు మంజూరు చేసింది.

వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు అండతో హత్యాయత్నం

- తెదేపా గ్రీవెన్స్‌లో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: "వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు మద్దతుతో వైకాపా నాయకులు పథకం ప్రకారం నాపై కత్తులతో దాడికి దిగారు. తెదేపాలో తిరిగితే నిన్ను, నీ కుటుంబాన్ని చంపేస్తాం అని బెదిరించారు. దాడి నుంచి తప్పించుకున్నాను. ఎడమ చేతిపై గాయంతో రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చేరాను. వారిపై చర్యలు తీసుకోండి. నాకు రక్షణ కల్పించండి" అంటూ అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలం పిడతమామిడి గ్రామానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి వినతిపత్రం అందించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కృష్ణా డీసీసీబీ ఛైర్మన్ నెట్టెం రఘురాం బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు.

■ తెదేపా కార్యకర్తననే కారణంతో వారసత్వంగా తనకు దక్కిన భూమిని తహసీల్దారు, వీఆర్వో వేరొక వ్యక్తితో కుమ్మక్కయి, రికార్డులు మార్చి ఆన్‌లైన్‌లో నమోదు చేశారని ప్రకాశం జిల్లా బొడ్డువానిపల్లెకు చెందిన అక్కులరెడ్డి మహానందిరెడ్డి వినతిపత్రం ఇచ్చారు.

■ గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ వేశానన్న కారణంతో రామవరప్పాడు పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేసిన తనను రాజకీయ కక్షతో ఉద్యోగం నుంచి తొలగించారని కృష్ణా జిల్లా గన్నవరం మండలం ప్రసాదంపాడు గ్రామానికి చెందిన పద్మావతి ఫిర్యాదు చేశారు. అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు, అధికారులు కుమ్మక్కయి తన నామినేషన్ తిరస్కరించారని చెప్పారు. కోర్టును ఆశ్రయిస్తే.. ఆ కేసు వెనక్కి తీసుకోలేదనే కక్షతో తనను బెదిరిస్తూ దాడులకు దిగుతున్నారని వాపోయారు. జక్కంపూడి హౌసింగ్ కుంభకోణం, అక్రమ కట్టడాలు, లేని పారిశుద్ధ్య కార్మికులు ఉన్నట్లు చూపించి ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న వైనంపై ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు లేవని తెలిపారు.

■ తన భూమిని రౌడీషీటర్ ఆక్రమించి చంపేస్తానని బెదిరిస్తున్నాడని, అధికారులను కలిసినా న్యాయం జరగడంలేదని అన్నమయ్య జిల్లా బుట్టిగారిపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసరావు అర్జీ ఇచ్చారు.

■ తన భూమిలోకి వైకాపా నాయకుడు దౌర్జన్యంగా నీటిని మళ్లించి నష్టపరిచాడని, ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నాడని నంద్యాల జిల్లా నాగిశెట్టిపల్లెకు చెందిన చంద్రశేఖర్‌నాయుడు ఫిర్యాదు చేశారు.

పదో తరగతి విద్యార్థులకు యోగా, ధ్యానం

ఒత్తిడి తగ్గించేందుకు పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు

ఈనాడు, అమరావతి: పదో తరగతి విద్యార్థుల్లో పరీక్షల ఒత్తిడి, ఆందోళనను తగ్గించేందుకు పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఉదయం, మధ్యాహ్నం మొదటి పీరియడ్‌లలో తొలి 10 నిమిషాల పాటు యోగా, ధ్యానం చేయించాలని ఉపాధ్యాయులకు సూచించింది. విశ్రాంతి పద్ధతులకు ప్రాధాన్యమివ్వాలని, ప్రతిరోజూ చివరి పీరియడ్‌లో పోటీ లేని ఆటలు ఆడించాలని పేర్కొంది. ప్రధానోపాధ్యాయులు, తరగతి ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు చేయాల్సిన పనులను విడివిడిగా వివరించింది.

✦ రోజూ ఉదయం అసెంబ్లీలో అకడమిక్ ఒత్తిడి, పరీక్షల ఆందోళన తగ్గించి, వారిలో స్ఫూర్తినింపేలా ప్రసంగాలు చేయాలి.

✦ పాఠశాల ప్రాంగణంలోని ముఖ్య ప్రదేశాల్లో ఒత్తిడి నిర్వహణ, ఎదుర్కొనే విధానంపై పోస్టర్లు ప్రదర్శించాలి.

✦ పరీక్షల్లో ఫెయిల్ అవుతామనే భయం, సహచరులతో పోలిక, ఆందోళన, డిప్రెషన్ ఎదుర్కొనేలా కౌన్సెలింగ్ ఇవ్వాలి.

✦ విద్యార్థులు తమ సమస్యలను ఉపాధ్యాయులతో చర్చించే అవకాశం కల్పించాలి. సహాయ బాక్సులు పెట్టాలి.

✦ నెమ్మదిగా నేర్చుకునే పిల్లలకు క్రమశిక్షణా బెదిరింపులు ఉండకూడదు.

✦ అతిథి ఉపన్యాసకులు, జిల్లా స్థాయి అధికారులతో ఒత్తిడి నిర్వహణ, జీవన నైపుణ్యాలపై సెషన్లు నిర్వహించాలి.

✦ పాఠశాల ప్రాంగణంలో నడక, తోట పనులు చేపట్టి, పిల్లల్లో ప్రశాంతత, ఏకాగ్రత పెంచాలి.

✦ విద్యార్థులు తమ బలాబలాలు అర్థం చేసుకునేలా చూడాలి. వారి తల్లిదండ్రులకు వాస్తవ పరిస్థితులను వివరించాలి.

✦ పరీక్షలకు సిద్ధమయ్యే వేళ స్క్రీన్ టైం నియంత్రించాలి. కౌమార దశలో కనిపించే మూడ్ స్వింగ్స్ వంటి భావోద్వేగ మార్పులపై సున్నితంగా మార్గనిర్దేశం చేయాలి.

అవినీతిలో పీహెచ్‌డీ ఉంటే జగన్‌కే మొదటి ర్యాంక్

రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్

ఈనాడు, అమరావతి: అవినీతిపై పుస్తకం రాయాలంటే జగన్‌తో మొదలు పెట్టాలి.. రాజకీయ అవినీతిపై పీహెచ్‌డీ ఉంటే జగన్‌కే మొదటి ర్యాంకు వస్తుందని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ వ్యాఖ్యానించారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'బెయిల్‌పై వచ్చి రాజకీయాలు చేస్తున్న జగన్‌కు పరకామణిలో చోరీ కేసు చిన్నతప్పుగా కనిపిస్తోంది. పరకామణిలో దొంగతనాన్ని సమర్థించిన జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. మత విశ్వాసాలు ఉన్నవారెవరైనా దీన్ని చిన్నతప్పుగా భావిస్తారా..? దేవుడి సొమ్ము దోచి లోక్ అదాలత్‌లో సెటిల్‌మెంట్ చేసుకుంటారా..? వైకాపా అధికారంలో ఉన్నా లేకున్నా హిందూ మతంపై దాడి చేయడమే వారి ఏకైక ఎజెండా' అని రాంప్రసాద్ మండిపడ్డారు.

బ్రాహ్మణులకు అండగా కూటమి ప్రభుత్వం

బ్రాహ్మణులకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని బుచ్చి రాంప్రసాద్ తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో తెదేపా బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణ కార్పొరేషన్, బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని ఆయన పేర్కొన్నారు.